
దత్తపదుల సమాహారం

అసి, కసి, నుసి, రసి - పదాలను అన్యార్థంలో ఉపయోగించి పల్లె పడుచు అందాలను వర్ణిస్తూ దత్తపది



తే.గీ. అసిక మందునఁ గాలక మంద మొలుక,
కసిడి నడుమున చెలువముఁ గానుపించ,
పల్లె సీమను నునుసిగ్గె వల్లెవాటు,
వెరసి నాయుడు బావకు వెంకిఁ బొండమె.

గెడ్డానికి క్రింది పెదవికి మధ్యన ఉన్న పుట్టుమచ్చ అంద మొలుకగా, పిసరంత నడుములో సౌందర్యము కనిపించగా, పల్లె సీమలో నునుసిగ్గు మాత్రమే వల్లెవాటు. అంతా కలిపి, నాయుడు బావకి వెంకి కనిపించింది.

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాధం

దత్తపదుల సమాహారం

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాథం

దత్తపదుల సమాహారం

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

Dattapadula Samaahaaram (Free E-Book)

Author: M. V. S. Ranganadham

ISBN 978-93-343-7490-2

ప్రచురణ (Publishing): 12 – 08 – 2025

Contact details of author:

M. V. S. Ranganadham

H. No. 5-12-78/46,

Laxmipuri Colony Phase – 2,

Sainikpuri, Hyderabad – 500 094.

Telangana State.

Mob: +91 9818878155

E-Mail: mvsranganadham@hotmail.com

అంకితం

నా తల్లిదండ్రుల దివ్యస్మృతికి



కీ.శే. శ్రీ మద్దాలి సత్య మాధవశర్మ (1934 - 1998)

కీ.శే. శ్రీమతి మద్దాలి విజయలక్ష్మి (1941 - 2011)

ముందుమాట

దత్తపది అంటే పరస్పరం సంబంధం లేని నాలుగు పదాల నిచ్చి, వాటిని నాలుగు పాదాలలో వాడుతూ, కోరిన అంశం మీద, కోరిన ఛందస్సులో పద్యం చెప్పమని అడగడం. అప్పుడప్పుడు, ఈ పరిమితుల్లో (restrictions) కొన్ని సడలింపులు (relaxations) చేయబడడం చూస్తాము. ఉదాహరణకి ఛందస్సు గురించి పేర్కొనకుండా స్వేచ్ఛా ఛందస్సులో పద్యం చెప్పమని అడగడం, లేదా, అంశం పేర్కొనకుండా ఏ అంశంలోనైనా పద్యం చెప్పమని అడగడం మనం చూస్తాము. ఇంకో అడుగు ముందుకు వేస్తే, ఇచ్చిన పదాలను వాటి సహజమైన (రూఢియైన) అర్థంలో కాకుండా వేరే అర్థంలో ప్రయోగిస్తూ పద్యం చెప్పమని అడగడం. ఈ వైవిధ్యాలతో (variations) దత్తపది అన్న అంశం అవధానాలలో తెలుగు నాట చాలా ప్రాచుర్యం పొందిన సాహిత్య క్రీడ. ఈ "దత్తపది" అన్న క్రీడలో మన కవులు, పండితులు, అవధానులు సాధించిన విన్యాసాలు ఒకటా రెండా, అసంఖ్యాకం.

దత్తపదిలో ఉన్న మాటల గారడీ లాంటి గారడీకి మనం చిన్నప్పటి నుండి అలవాటు పడ్డామనుకుంటా. పద్యాల్లో కాకపోయినా మాటల్లో ఈ గారడీ తెలుగు వాళ్ళ రక్తంలో జీర్ణించుకుపోయింది. చిన్నప్పుడు నేను పెరిగిన వాతావరణంలో ఇంట్లోనూ చుట్టుపక్కలా చమత్కార / హాస్య సంభాషణలు ఎక్కువగా వినబడుతుండేవి. కవుల గురించిన కబుర్లు, హరికథలు, నాటకాలు, నృత్య కార్యక్రమాలు, మంచి కథాబలం ఉన్న సినిమాలు, కవిత్వం వంటి విషయాల గురించి సామాన్య జనం నోళ్ళలో నానే సంగతులు ఏదో ఒక సందర్భంలో నేనున్న వాతావరణంలో తగిలేవి. చదువుల్లో ఏ భాష ఐనా నేర్చుకునే క్రమంలో ఒక పదాన్ని గానీ ఒక పదబంధాన్ని గానీ ఒక వాక్య భాగాన్ని గానీ ఏదైన వాక్యంలో ఉపయోగించడం (usage in sentence) ఉపాధ్యాయులు చెప్పి కొన్ని అలాంటివి అభ్యాసానికి ఇచ్చేవారు. దత్తపది అంటే ఇచ్చిన పదాలని వాక్యంలో కాకుండా పద్యంలో అర్థవంతంగా ఉపయోగించడం. తెలుగు భాషలో ఒక పదానికి ఒకటి కన్నా ఎక్కువ అర్థాలు ఉండడం, ఒక్కోసారి ఇచ్చిన పదాన్ని విడదీస్తే ఆ ముక్కలు అలాగే గానీ వేరే పదాలతో కలిస్తే గానీ వేరే అర్థాన్ని ఇవ్వడం మనం చాలా సార్లు చూసియో, చేసియో, వినియో ఉంటాము. దత్తపది అన్న క్రీడకి ఈ భావనయే / అవకాశమే

మూలం అని నా నమ్మకం. ఈ ప్రక్రియ నాకు తేలికగా అర్థం అవ్వడానికి దోహదపడే పరిస్థితులు నా చిన్నప్పుడు కలిపించిన నా తల్లిదండ్రులకు ఈ పుస్తకం అంకితం ఇస్తున్నాను.

ఉదాహరణకి దేశభక్తిని ప్రేరేపించే "వందే మాతరం" అన్న నినాదం (slogan) గురించి చిన్నప్పుడు ఒక తమాషా కథ విన్నాను. బ్రిటీషు వారి పాలనలో ఒకానొక సమయంలో ఈ నినాదం ఎవరి నోట విన్నా వాళ్ళని జైలులో పెట్టేవారట. ఒకసారి ఏమయిందంటే, ఒకాయన కూరగాయల మార్కెట్లో ఉన్న జనాలను పోగేసి వందే మాతరం ఉద్యమం చేద్దామని అనుకుంటూ ఉంటే అక్కడ ఆకస్మికంగా పోలీసులు ప్రత్యక్ష మయ్యారట. వాళ్ళని చూసిన వెంటనే ఆయన ఉద్యమస్ఫూర్తి చెడకుండా అక్కడి కూరగాయల వ్యాపారి దగ్గరకు వెళ్ళి మామిడికాయలు చూపించి "వందేమాత్రం" అంటే "వంద ఏ మాత్రం" అని అడిగాడట. ఆ వ్యాపారి రేటు చెప్పి ఎన్ని కావాలండీ అని అడిగాడట. దానికి అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన "వందే మా తరం" అంటే "మా వల్ల వంద కొనడమే సాధ్యము" అనే అర్థం వచ్చేటట్లుగా జవాబిచ్చాడట. భాషని అంత అర్థవంతంగా ఉపయోగకరంగా వాడిన ఆ దేశభక్తుని సమయస్ఫూర్తి లాంటిదే దత్తపది అన్న క్రీడలో ఆధారభూతమైన అంశం అని నా నమ్మకం.

దత్తపదిలో ఇచ్చే అంశాలు ప్రాశ్నికులు అడిగినప్పుడు ఒక్కోసారి బోడిగుండుకి మోకాలికి ముడి వేసినట్లు కనపడతాయి కానీ తీరా పద్యం చెప్పిన తరువాత చాలా అర్థవంతంగా కనిపిస్తాయి. ఉదాహరణలుగా, క్రింద ఇచ్చిన విన్యాసాలను గురించిన పద్యాలను ఈ పుస్తకంలో చూడవచ్చు:

- మహాభారతంలో (రామాయణంలో) ఉన్న పదాలో పేర్లో ఇచ్చి రామాయణార్థం (భారతార్థం) వచ్చేటట్లు పద్యం చెప్పమనడం
- ఇచ్చిన పదాలను వాటికున్న సహజమైన (రూఢియైన) అర్థంలో కాకుండా వేరే అర్థంలో వాడి ఇచ్చిన అంశం గురించి పద్యం చెప్పమనడం
- ఏ మాత్రం ఊహల్లో కూడా ఇచ్చిన పదాలకి అంశానికి సంబంధము లేకుండా చూసి అలాంటి వాటికి దత్తపది పద్యం చెప్పమనడం

- నిత్య వ్యవహారాల్లో తగిలే పదాలు ఇచ్చి వేరే నేపథ్యానికి సంబంధించిన (పౌరాణిక, రాజకీయ, లాంటివి) అంశం మీద పద్యం చెప్పమనడం
- ఒక దృగ్విషయంలో ఉపయోగించే పదాలతో వేరే దృగ్విషయం / వ్యవస్థ లోని ఏదేని అంశం గురించి పద్యం చెప్పమనడం
- అశుభకరమైన / అశ్లీలాన్ని సూచించే పదాలు ఇచ్చి ఒక శుభకార్యానికి సంబంధించిన అంశం మీద పద్యం చెప్పమనడం
- పరభాషా పదాలు లేక పేర్లు, ప్రముఖ నటీనటుల పేర్లు, కంపెనీల పేర్లు, ఆటగాళ్ళ పేర్లు, ఇతర ప్రముఖుల పేర్లు - లాంటివి ఇచ్చి వాళ్ళకి సంబంధించిన రంగం కాకుండా వేరే రంగానికి సంబంధించిన అంశం మీద పద్యం చెప్పమనడం

ఈ పుస్తకంలోని దత్తపదులలో పైన చెప్పిన వర్గీకరణ లోకి వచ్చే వాటిని పాఠకులు సులభంగా గుర్తించగలరు. వాటిని ప్రత్యేకంగా ఎత్తి చూపాల్సిన అవసరం ఉందని నేను అనుకోను. ఈ "దత్తపదుల సమాహారం" లో 291 దత్తపదులకు వ్రాసిన 320 పద్యాలు ఇవ్వబడ్డాయి. అంటే, ఒక దత్తపదికి ఒకటి కన్నా ఎక్కువ పద్యాలు ఒక్కోసారి వ్రాయడం వల్ల అలా జరిగింది. ఈ పుస్తకం లోవి అన్నీ దత్తపదుల వర్గం లోకి రావు. కొన్ని, మరీ ఎక్కువ కాదనుకోండి, న్యస్తాక్షరుల లాంటివి, ప్రసిద్ధ పద్యాలకి సమానార్థకాలు, వర్ణనాంశాలు కూడా ఉన్నాయి. ఈ దత్తపదులకి ఇతరాలకి సంబంధించిన అంశాలు కొన్ని బ్లాగుల (blogs) నుంచి, రేడియో (Radio) / యూట్యూబు (YouTube) ప్రసారాల నుంచి, అంతర్జాలం (Interet) నుంచి గ్రహించబడినవి. ఆ అంశాలకు నాకు తోచిన రీతిలో పద్యాలు వ్రాశాను.

ఈ పుస్తకంలోని దత్తపదులు నిఘంటువు క్రమంలో (dictionary order) ఇవ్వబడ్డాయి. పద్యాలకి క్రమ సంఖ్యను ఒక ప్రత్యేక పద్ధతిలో కేటాయించడం జరిగింది. ఉదాహరణకి 291.319 అంటే, 291వ దత్తపదికి చెప్పబడిన పద్యాలలో క్రమ సంఖ్య 319 కేటాయించబడిన పద్యం అని అర్థం. అదే దత్తపదికి ఇంకో పద్యం కూడా చెప్పబడితే దాని క్రమ సంఖ్య 320 అవుతుంది. అంటే, అది 291.320 అవుతుంది.

ఈ పద్యాలు వ్రాసే క్రమంలో నేను తెలుగు భాషకి సంబంధించిన విషయాలు చాలా నేర్చుకున్నాను. ముఖ్యంగా ఏ భాష పదాన్నైనా తనలో ఇముడ్చుకునే వెసులుబాటు (flexibility) తెలుగు భాషకు కల్పించిన నన్నయ గారి అనువాద విధానం / పథకం (translation scheme) గురించి ఎంత చెప్పినా తక్కువే. అదే, దత్తపదులకి ఎక్కువ ఊత (support) నిచ్చింది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, సంబంధం లేని వాటికి సంబంధం కలిగించే ఈ దత్తపదుల క్రీడలో ఎక్కువగా మెదడుకి పదును పెట్టే అవకాశం ఉండడం, ఆ క్రమంలో అప్పుడప్పుడు నిగూఢంగా ఉన్న విషయాలు వెలికి తీసుకొచ్చే అవకాశం కలగడం, అవి ప్రగతిపథానికి మార్గదర్శకంగా ఉండడం అన్నవి ఆకర్షనీయమైన అంశాలు.

నేను కొద్దో గొప్పో కృషి చేసినది సాంఖ్యక శాస్త్రంలో (Statistics) ఐనా కూడా తెలుగు భాష అంటే నాకు చిన్నప్పటి నుండి ఉన్న అభిరుచి (passion) వల్ల ఏదో కొద్దిగా నేర్చుకుని ఆ వచ్చిన కాస్త జ్ఞానంతో ఇటువంటి చిన్న చిన్న ప్రయత్నాలు చేస్తూ ఉంటాను. ఈ సందర్భంలో తాను వ్రాసిన "కన్యాశుల్కం" నాటకాన్ని గురజాడ అప్పారావుగారు విజయనగరం మహారాజావారికి అంకితం ఇస్తూ చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి.

> "It is fabled that when the ancient demigod of your noble race was making a causeway across the sea to rescue his consort from captivity, the faithful squirrel brought at the end of its tail a few grains of sand, not indeed hoping to advance the high enterprise in any appreciable degree, but to show an inclination to serve."

గురజాడ వారు "కన్యాశుల్కం" నాటకంలో వాడిన వ్యావహారిక / పాత్రౌచిత భాషలో పైన ఉటంకించిన దానిలోని " not indeed hoping to advance the high enterprise in any appreciable degree" అన్న వాక్యభాగాన్ని అనువాదం చేస్తే "ఏదో ఊడబొడుద్దామని కాదు" అన్న అర్థం వస్తుంది. నేను వ్రాసిన ఈ పుస్తకం కూడా అలాంటి ప్రయత్నమే. ఉడతాభక్తిగా సాహిత్య సేవ చేయడం లాంటిది.

ఈ పుస్తకంలోని దత్తపదులు అదివరకే నా బ్లాగు " https://mvsranganadham.in/ "లో పెట్టడం వలన, కొంత మందికి తెలిసినవే. చదవడానికి ఎక్కువ సౌలభ్యమని ఎక్కువ మందికి అందించడానికి వీలవుతుందనీ ఈ ఫ్రీ ఈ-బుక్ (free E-Book) విడుదల చేస్తున్నాను. ఇది నా రెండవ ఈ-బుక్. ఇందులో ఏమన్నా దోషాలు కనపడితే పాఠకులు నాకు తప్పక తెలియఁజెయ్యాలని ప్రార్థన.

సైనిక్ పురి, హైదరాబాదు,
ది: 12 - 08 - 2025.

భవదీయుడు,
మద్దాలి వేంకట సత్య రంగనాధం

దత్తపదుల సమాహారం

విషయ సూచిక

క్రమ సంఖ్య	దత్తపది	పద్యము మొదలు	పుట
1.1	అంగీ, లుంగీ, చుంగీ, పుంగీ- పదాలతో అభిసారికను గురించి శార్దూలం	అంగీకారమె ముఖ్యమంచు	31
2.2	అంచిత, కుంచిత, వంచిత, సంచిత - పదాలతో భాగవతార్థంలో	వంచిత మనస్కు	31
3.3	అక్క, అన్న, అమ్మ, అయ్య పదాలను (అర్థాలను మార్చి) ఉపయోగిస్తూ నేటి బడి చదువులు విషయంగా	అక్కజమే కదా	32
4.4	అక్క, అన్న, వదిన, మామ - పదాలను ఉపయోగించి రావణునకు మండోదరి చేసిన హితబోధను తెలుపుతూ	అక్కజ మందు నిగ్రహము	32
5.5	అట్ట, కట్ట, చుట్ట, తట్ట - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	అట్టహాసముగా	33
6.6	అన్నము, కూర, పప్పు, చారు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	సోలక మున్నె	33
7.7	అన్నము, జావ, గంజి, తోప - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	ద్యూత సభాంతరాళమున	34
8.8	అప్పు, నిప్పు, మెప్పు, చెప్పు - పదాలను వేరే అర్థంలో వాడుతూ రామాయణ పరంగా	అప్పురి లంకకు	34
9.9	అమ్మ, కొమ్మ, నిమ్మ, బొమ్మ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	అమ్మకచెల్ల	35
10.10	అర, చెర, తెర, మర - పదాలను ఉపయోగిస్తూ ఎన్నికల కోలాహలం గురించి	అరయస్ యెన్నిక	35
11.11	అర, చెర, ధర, ముర - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	ధరణీ రాజ్యము	36

12.12	అరి, ఉరి, కరి, గిరి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	ఉరికొలుపగ కర్ణుడు	36
13.13	అరి, కరి, గురి, సరి - పదాలను ఉపయోగిస్తూ కర్ణుని దాతృత్వాన్ని గురించి	వలదను యర్చిష్మంతుని	36
14.14	అరిసె, గారె, పూరి, వడ - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో	అరిసెము పొంద వద్దు	37
15.15	అర్భ, దర్భ, నిర్భ, గర్భ - పదాలు పాదాదిన వచ్చునట్లుగా పద్యం	అర్భకము	37
16.16	అల, కల, తల, వల - పదాలను ఉపయోగిస్తూ రావణుని చెరలో సీత మనోగతాన్ని తెలుపుతూ	అలఘుస్ లక్ష్మణు తిట్ట	38
17.17	అల, కల, వల, నెల - పదాలను ఉపయోగించి రామాయణార్థంలో	అలఘుడు శ్రీరాముని	38
18.18	అల్లము, బెల్లము, ఉల్లి, చల్ల - పదాలతో భారతార్థంలో	అల్ల ముసల్యులైరి	39
19.19	అవ్వ, తాత, అత్త, మామ - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	అవ్వల సూర్యుని	39
20.20	అవ్వ, తాతా, డంకానగారా, రారాపోరా, మేనాసవారీ - పదాలతో అర్జున తిరస్కృతయైన ఊర్వశి విరహ బాధ	మీ పార్థుస్ దరి	40
21.21	అసి, కసి, నుసి, మసి - పదాలను ఉపయోగించి సూర్యోదయాన్ని వర్ణిస్తూ	అసిధారావ్రత మంచు	40
22.22	అసి, కసి, నుసి, రసి - పదాలను అన్యార్థంలో ఉపయోగించి పల్లె పడుచు అందాలను వర్ణిస్తూ	అసిక మందున	41
23.23	ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వంలో తిక్కన గారి "ఒకటిఁ గొని, రెంటి ..... వివేకధనుఁడు" అన్న తేటగీతి పద్యానికి సమానార్థకమైన కంద పద్యము	ఒకటిస్ గొని	42
23.24	ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వంలో తిక్కన గారి "ఒకటిఁ గొని, రెంటి ..... వివేకధనుఁడు" అన్న తేటగీతి పద్యానికి సమానార్థకమైన కంద పద్యము	వ్యసనములు వదలి	42
24.25	ఆది, సోమ, మంగళ, బుధ - పదాలతో అవధాన విద్యా వికాసం	స్ఫురణయా	43

25.26	ఆది, సోమ, మంగళ, బుధ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	ఆది భిక్షువు బోయగా	43
26.27	ఆభరణము, అలంకారము, శ్మశానము, కపాలము - పదాలను ఉపయోగిస్తూ పెద్దనోట్ల రద్దు వల్ల సమస్యలను తెలుపుతూ	మోరక మయ్యె నాభరణముల్	44
27.28	ఆరే ఆ, తూరే తూ, పీరే పీ, జారే జా - పదాలతో భారతార్థంలో	ఆ రే యాపద రాక మున్నెరుగ	44
28.29	ఆలము, కాలము, గాలము, మేలము - పదాలను ఉపయోగించి వాతావరణ కాలుష్యంపై	ఆలము చేయకుండ	45
29.30	ఆలము, కాలము, జాలము, వాలము - పదాలను ఉపయోగించి రామాయణార్థంలో	ఆలము చేయు చుండ	46
30.31	ఆవు, మేక, కుక్క, పిల్లి - పదాలను ఉపయోగించి భారతార్థంలో	భీముడన్న యావున్నది	46
31.32	ఇంతలు కన్నులుండ - మనుచరిత్ర లోని పద్యానికి ప్రతి కందపద్యము	జవరా లొంటరి దన	47
32.33	ఈగ, దోమ, నల్లి, పేను - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	సీత కులుపేను	47
33.34	ఈగ, దోమ, పేను, నల్లి - పదాలను ఉపయోగించి పాలకుల, అధికారుల అవినీతిపై	ఈసు కవినీతికి	48
34.35	ఈగ, దోమ, పేను, నల్లి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	నల్లికుట్లతనంబుంచి	48
35.36	ఈశ, హర, శివ, భవ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దుర్గాదేవిని స్తుతిస్తూ	మోక్షదాయీ శరణు	49
36.37	ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలము - పదాలతో ఛందస్సౌందర్యాన్ని తెలుపుతూ	లయగా నుత్పలమాల	49
37.38	ఉబ్బసం, మసూచి, క్షయ, కలరా - పదాలతో అందమైన, ఆరోగ్యవతి అయిన అమ్మాయిని వర్ణన	ససికి నవ్వుటె	50
38.39	ఎండ, మండ, కొండ, కండ - పదాలతో అధ్యాపక మనఃస్థితి	ఎండకన్నెఱుఁగని	50

39.40	ఏక్, దస్, సౌ, హజార్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	సౌమ్యముగ చెప్పె	51
40.41	ఏరు, పారు, ఊరు, మారు - పదాలను ఉపయోగిస్తూ పల్లీయ సౌందర్యాన్ని వర్ణిస్తూ	ధారుణి దున్న కర్షకులు	51
41.42	ఒజ్జ, వెజ్జు, బొజ్జ, గుజ్జు - పదాలతో వినాయక చవితి	ఒజ్జవు చదువుకు	52
42.43	కంది, పెసర, సెనగ, మినుము - పదాలను ఉపయోగిస్తూ పార్వతీ కళ్యాణము గురించి	మరుడు పరాస్కందిగ	52
43.44	కందు, సందు, మందు, విందు - పదాలతో భాగవతార్థంలో	సందుకొన విషము	53
44.45	కక, గగ, తత, నన - పదాలను ఉపయోగిస్తూ కర్ణుని దానశీలాన్ని గురించి	గగనమణి మాట	53
45.46	కటి, కిటి, తటి, నటి - పదాలను ఉపయోగిస్తూ సూర్యోదయాన్ని వర్ణిస్తూ	కటికచీకటి జనుల	54
46.47	కట్టు, గట్టు, పట్టు, రట్టు - పదాలతో ద్రౌపది మాతృహృదయం	కట్టుబాట్ల నశ్వత్థామ	54
47.48	కట్టె, నిప్పు, బూది, మసి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ పచ్చని ప్రకృతిని వర్ణిస్తూ	కట్టెదుట సరోవరము	54
48.49	కడ, జడ, దడ, వడ - పదాలను ప్రయోగిస్తూ ఎన్నికల ఫలితాలకై ఎదురుచూసే అభ్యర్థుల ఉత్కంఠస్థితిని వర్ణిస్తూ	కడగండ్లు పడుచు	55
49.50	కత్తి, బాకు, డాలు, విల్లు - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	అందకత్తియ! వీ భీము	55
50.51	కదనము, రదనము, వదనము, సదనము - పదాలతో వర్తమాన సాంఘిక సమస్యల గురించి	కదనము వంటి	56
51.52	కన్ను, చెన్ను, పన్ను, దన్ను - పదాలను ఉపయోగిస్తూ హనుమంతుని వర్ణిస్తూ / స్తుతిస్తూ	పుట్టెస్ యెక్కుడుకన్నువాని	56
52.53	కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	ఏల కలిగెనో రుష	57
53.54	కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ దీపావళి సంబరాలను వర్ణిస్తూ	సాత ముక్కుమిగుల	57

54.55	కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో	తాటకన్నుజిమెను	58
55.56	కమ్, సిట్, గో, రన్ (లోకము - ఈసిటుల (ఈసు+ఇటుల) - గోవు - కోరను... ఈ విధంగా) - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో	ఆకస్మికమ్ముగ	58
56.57	కర - తో నాలుగు పాదాలను ప్రారంభిస్తూ మకర సంక్రమణాన్ని వర్ణిస్తూ	కర సంస్పర్శలు	59
57.58	కరము - అను పదము నాలుగు పాదముల వచ్చునట్లు స్త్రీ వర్ణన మహాస్రగ్ధర	పురుషాహంకార లోకంబున	59
58.59	కరము, కారము, కోరము, కీరము - పదాలతో	చాకోరము చంద్రద్యుతి	60
59.60	కరము, తరము, వరము, హరము - పదాలను ఉపయోగించి రాయబారానికి పోనున్న కృష్ణుని ముందు ద్రౌపది వ్యక్తపరచిన ఆవేదనను గూర్చి	కరమును ద్రుంచగా	60
60.61	కరము, వరము, సరము, తరము - పాదాదిన వచ్చునట్లుగా ఉగాది పరంగా	కరముల్ మోడిచి	61
61.62	కరి, గిరి, దరి, సిరి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దేశభక్తిని ప్రబోధిస్తూ స్వేచ్ఛాచ్ఛందంలో	ముఖ్యము సమాజ	61
62.63	కరోమి, కవయామి, వయామి, యామి - అను పదములు వచ్చునట్లు విష్ణుస్తవము	కాసువు వంకరో	62
63.64	కల, తల, మర, వస - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ పెండ్లి విందును వర్ణిస్తూ	కలహింతురు	62
63.65	కల, తల, మర, వస - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ పెండ్లి విందును వర్ణిస్తూ	కలగలుపు పప్పు	63
64.66	కల, తల, వల, వెల - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ సంక్రాంతి సంబరాలపై	కోవెలల రుతములు	63
65.67	కలము, చలము, తలము, బలము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	ఏకలమును వేటాడిన	63
66.68	కలము, బలము, హలము, పొలము - పదాలతో స్వేచ్ఛావృత్తంలో ఆత్మహత్యలు చేసుకొనవద్దని రైతులకు ధైర్యం చెప్తూ	కలకల మాత్మ హత్య	64

67.69	కలి, చలి, చెలి, బలి - పదాలను ఉపయోగిస్తూ కుచేలుని గురించి	చెలికాడు సహాధ్యాయని	64
68.70	కలి, పులి, బలి, వెలి - పదాలను ఉపయోగిస్తూ వెన్నెల రేయిని వర్ణిస్తూ	కలసి యుంట బలీయము	65
69.71	కల్లు, నీరా, సారా, సుర - పదాలను ఉపయోగిస్తూ మద్యపాన నిషేధం గురించి	కల్లువడె	65
70.72	కసి, పసి, మసి, రసి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో	రూపసి యగు రాము సతిని	66
71.73	కసి, వసి, పసి, నిసి - పాదాదిన వచ్చునట్లుగా సత్యభామ వామ పాదకృత శ్రీకృష్ణ శిరస్తాడన ప్రసంగమును గూర్చి	కసి హెచ్చెన్	66
72.74	కాక, తాత, పాప, మామ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	శూర్పణఖ కాకయయ్యె	67
73.75	కాకి, కోయిల, నెమలి, కోడి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	పాండవుల కోడి	67
74.76	కాకి, కోయిల, బాతు, నెమలి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	వినుము కురురాజ	68
75.77	కాకి, జాజి, పాపి, వావి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	మరతువా విప్రశాప	68
76.78	కాకి, దాది, పాపి, వావి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	కీచకా! కినుకేలని	69
77.79	కాపీ, టోపీ, హ్యాపీ, కూపీ - పదాలను అన్యార్థంలో వాడుతూ భారత సైన్యం యుద్ధంలో పాకిస్థానుకు గుణపాఠం చెప్పిన తీరు	కాపీనంబున మాటిమాటి	69
78.80	కాయము, గాయము, న్యాయము, మాయము - పదాలను ఉపయోగిస్తూ పెరిగిన ధరలపై	పౌర నికాయమున్	70
79.81	కారు, లారి, జీపు, వ్యాను - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	అంగనాకారుడౌ క్రీడి	70
80.82	కారు, లారీ, జీపు, వ్యాను - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో	కారుకాలము వెళ్ళె	71

81.83	కారు, వాచి, టీవి, సెల్లు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో	క్వాచిత్కమైన	71
82.84	కార్, జార్, బార్, పార్ - పదాలతో రామాయణ పరంగా	రాము దర్బారున	72
83.85	కిక్, కుక్, చిక్, చెక్ - పదాలను ప్రయోగిస్తూ తెలుగు భాషా వైభవాన్ని గురించి	చెక్కును మధుర	72
84.86	కీర, వైర, హార, భార - పదాలతో విరహ వర్ణన ఉత్పలమాలలో	దక్కెను జానకీ రమణి	73
85.87	కుంటి, మెల్ల, మూగ, గూని - పదాలను ప్రయోగిస్తూ స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడం	మేన సొబగూని	73
86.88	కుండ, దండ, బండ, బెండ - పదాలను అన్యార్థంలో ఉపయోగించి గొడుగును గురించి	కోపము తనపై	74
87.89	కుండ, దుత్త, చెంబు, గరిటె - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	పొందుకు రాకుండనిచో	74
87.90	కుండ, దుత్త, చెంబు, గరిటె - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	దండడి కుండగ	74
88.91	కూర, నార, కార, చార - యువశక్తిని గూర్చి	జయములు చేకూర	75
89.92	కైపు, టైపు, పైపు, రైపు - పదాల నుపయోగించి ఏ వేల్పునైన స్తుతిస్తూ	అరువరై పులకాలయు	75
90.93	కొట్టము, గొట్టము, చుట్టము, మట్టము - పదాలతో రాయబారానికి వెళ్ళుచున్న కృష్ణునితో ధర్మరాజు పలుకులు	చుట్టము పెద్దతండ్రిని	76
91.94	కొమ్మ, ఆకు, కాయ, పండు - పదాలను ఆయా అర్థాలలో కాకుండా ఉపయోగించి మహాభారతార్థంలో	ఆదుకొమ్మని పాండవు	76
92.95	కోపము, చాపము, తాపము, పాపము - పదాలను ఉపయోగిస్తూ ఉత్తరుని ప్రగల్భములను గురించి	కోపము నందుత్తరు	77
93.96	కోపము, తాపము, పాపము, శాపము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	కోపము నొంది భార్గవుడు	77
94.97	క్రికెట్టు, హాకీ, టెన్నిసు, చెస్ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	వక్రి కెట్టు నీతులు బోధ	77
95.98	క్రీస్తు, ఏసు, మేరి, సిలువ - పదాలతో భాగవతార్థంలో	ఓ చక్రీ! స్తుతమతి	78

96.99	క్రోధి ఉగాది శోభను గురించి	ఆశలను రేపి, తొలగించి	78
97.100	ఖగము, భగము, నగము, సగము- పదాలతో పార్వతీవర నిశ్చయం గురించి ఉత్పలమాల	విరిఖగముల్	79
98.101	గంగ, గంగ, గంగ, గంగ - నాలుగు పాదాలలో 'గంగ'ను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	రాజ్యభాగము నడుగంగ	79
99.102	గంగ, గంగ, గంగ, గంగ - పదాలతో ఎక్కడా 'నీరు' అనే అర్థం రాకుండా గంగావతరణ వర్ణన	తాతల పదడు మునుగంగ	80
100.103	గగగ, ననన, మమమ, లలల - పదాలతో స్వేచ్ఛాంశం	గాగగ గాగగా గగగ గాగగ	80
101.104	గణపతి, గణపతి, గణపతి, గణపతి అనే నాలుగు పదాలతో వినాయకుడి మీద చంపకమాల	గణపతి రూపమున్	81
102.105	గలగల, జలజల, వలవల, మలమల - పదాలతో భారతార్థంలో	గలగలమను వాహిని	81
103.106	గవాస్కర్, కిర్మాని, పటౌడి, కపిలదేవ్ - పదాలతో రాయలసీమ క్షామ పరిస్థితి గురించి	కరవాయెస్ ఫలసాయముల్	82
104.107	గాజులు, జాజులు, వోజులు, మోజులు - పదాలతో వరూధిని విరహవేదనా వర్ణన	గాజులు ఘల్లు	82
105.108	గాలి, నీరు, నిప్పు, నేల - పదాలను ఉపయోగిస్తూ ఆకాశాన్ని వర్ణిస్తూ	గాలిచూలికి	83
106.109	గు, రు, వా, రం అన్న అక్షరాలు పాదం ప్రారంభంలో వచ్చేటట్లుగా పద్యం	గురు కటాక్షము	83
107.110	గు, రు, వు, లు - అక్షరాలు పదాదిన వచ్చేటట్లుగా	గురువులు బహుముఖ	84
108.111	గుణము, తృణము, పణము, రణము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	గుణముల లోన పాండవుల	84
109.112	గుమ్మము, గోడ, తలుపు, అరుగు - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	ముద్దుగుమ్మ	85
110.113	గురువు, లఘువు, గణము, యతి - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో	గురువు నేర్పిన	85
111.114	గువ్వ, అవ్వ, బువ్వ, రవ్వ పదాలతో భారతార్థంలో	గువ్వకరి గొనుచు	86
112.115	గోలకొండ, తానీష, జుల్మాన, భద్రాచలం - పదాలతో భాగవతార్థంలో	శ్రవణీయమ్మగు గోల కొండ	86

113.116	గోలకొండ, పూలదండ, కొత్తకుండ, మాలముండ అను పదములు వచ్చునట్లు రామాయణ కథ	శూర్పణఖ గోల	87
114.117	ఘనము, ధనము, మనము, వనము - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ స్వేచ్ఛాఛందంలో రామాయణార్థంలో	ఏ నుల్లంఘున మెట్లు సేతు	87
115.118	ఘనరాగ పంచకమైన నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ - అన్న పదాలతో పద్యం	జగదానందము నాట	88
116.119	చారు, దారు, సారు, పారు - పదాలతో సుందరకాండ వృత్తాంతము	గూఢచారుని బోలె	88
117.120	చారు, సాంబారు, రసము, పులుసు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో	వీడ నాచారు డగు	89
118.121	చింత, నిమ్మ, మామిడి, వెలగ - పదాలను ఉపయోగిస్తూ ద్రౌపది కీచకుని అధిక్షేపించడాన్ని	అనుచింతస్ యెద నింపి	89
119.122	చితి, భూమి, శోక, చారు - పదాలతో హనుమంతుడు సీతమ్మ గురించి రామునితో చెప్పే సన్నివేశం ఉత్పలమాలలో	చూచితి నబ్ధి దాటి యొక	90
120.123	చిలువ, కలువ, నలువ, పలువ - పదాలతో పౌరాణికార్థంలో	చిలువతాలుపు తపమును	90
121.124	చీమ, దోమ, నల్లి, పేను - పదాలను ఉపయోగిస్తూ గోపికావస్త్రాపహరణం గురించి	వెన్నుడు పతియౌ	91
122.125	చెక్కు, సైను, మనీ, డ్రా - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	అన్న కక్కసై నులుమునో	91
123.126	చెప్పు, చేట, చీపురు, పేడ - పదాలతో శ్రీకృష్ణదేవరాయలు అల్లసాని పెద్దనకు సన్మానము చేయడం	రేపగ మక్కువస్	91
124.127	చెప్పు, రప్పు, ఉప్పు, ముప్పు - పదాలతో	చెప్పుచు నుంటి గద	92
125.128	చేప, రొయ్య, నత్త, పీత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	వీర్యశుల్కను చేపట్ట	92
126.129	చేమ, కంద, వంగ, చిక్కుడు - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దేశభక్తి పరంగా	త్యాగముచే మహామహులు	93

127.130	చేరు, కూరు, తీరు, ఊరు - పదాలతో రామాయణార్థంలో	చేరు నయోధ్య రాము	93
128.131	చైనా, జపాన్, ఇరాక్, ఇరాన్ - పదాలతో భారతార్థంలో	బిలమును తొలిచైనా	94
129.132	ఛందం ఉత్పలమాల; మొదటి పాదం పదో అక్షరం ష్వ; పదకొండో అక్షరం క్ష; రెండో పాదంలో రెండో అక్షరం గ్ర; పద్దెనిమిదో అక్షరం క్లే; మూడో పాదం మొదటి అక్షరం భీ; ఎనిమిదో అక్షరం శ్ల; నాలుగో పాదం పదో అక్షరం ధా; ఇరవైయో అక్షరం గో. మురార్జీ దేశాయ్ ప్రధాని కావటం గురించి	జాగృతితో స్వదేశమున	94
130.133	జ, డ - నిషేధిస్తూ “జడ” మీద పద్యం	పరిభాసిల్లును మేన	95
131.134	జడేజా, ద్రావిడ్, కుంబ్లే, కాంబ్లీ అనే పదాలు ఒక్కొక్క పాదంలో వచ్చేటట్లుగా హనుమ సముద్ర లంఘన వృత్తాంతం	పెను నీడన్ హనుమంతు	96
132.135	జనవరి, మార్చి, మే, జులై - పదాలతో భారతార్థంలో చంపకమాల	స్వజన వరీయు	97
133.136	జనవరి, మార్చ్, మే, జులై - పదాలతో గురువు నందు శిష్యుడి కృతజ్ఞతా భావం	దరిచేరగ లేజులై	97
134.137	జరదా, సరదా, దురదా, వరదా - పదాలతో పద్యం	జర దాక్షిణ్యము మాంస	98
135.138	జలగ, కప్ప, చేప, నత్త - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	వచ్చె విదర్భజ	98
136.139	జలుబు, దగ్గు, నొప్పి, నలత - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో	ప్రజలు బుసకొట్టి	99
137.140	జుట్టు, కన్ను, ముక్కు, చెవి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	పట్టగ నిను వాలి	99
138.141	టమాట, పుటాటొ, కాబేజి, కారెట్ - పదాలతో భారతార్థంలో	బాసట మాట మార్చి	100
139.142	టమాట, వంగ, బీర, చిక్కుడు - పదాలతో భారతార్థంలో	సంవి దట, మాటకు	100
140.143	టాకి, హాకి, జాకి, బాకి - పదాలతో భారతార్థంలో	ద్యూతము కసటా	101
141.144	టీవీ, వీడియో, కారు, రేడియో - రామాయణార్థంలో	నీ భృకుటీ విలాసమును	101
141.145	టీవీ, వీడియో, కారు, రేడియో - రామాయణార్థంలో	టీవిన్ రాముడు జెప్పె	102

142.146	డైనోర, బుష్, యల్‌జి, డెల్ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	వినయశీలుడై నోరార	102
143.147	తండా, గ్రామం, ఊరు, నగరము – భాగవతార్థములో	ఈతం డాశ్రిత పక్షపాతి	103
143.148	తండా, గ్రామం, ఊరు, నగరము – భాగవతార్థములో	ఈతండా నరకుండటంచు	103
143.149	తండా, గ్రామం, ఊరు, నగరము – భాగవతార్థములో	కృష్ణుడనగ నీతండా	103
144.150	తట్ట, గుట్ట, చుట్ట, పుట్ట - పదాలను ప్రయోగిస్తూ స్వచ్ఛభారత్ లక్ష్యాల గురించి	గుట్టలుగ చెత్త	104
145.151	తమన్నా, కాజల్, సమంతా, త్రిష - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	అడవిని పలు పోరులు	104
146.152	తమన్నా, సమంతా, త్రిష, కాజల్ అనే పదాలు ఒక్కొక్క పాదంలో వచ్చేటట్లుగా	విడచె తమన్నా	105
147.153	తమ్ముు - శబ్దాన్ని ప్రతి పాదాదిలో నిల్పుతూ భారతార్థంలో	తమ్ముు పరాభవింప	105
148.154	తమ్ములు - శబ్దాన్ని ప్రతి పాదాదిలో నిల్పుతూ భారతార్థంలో కందపద్యాన్ని కాని, ఉత్పలమాలను కాని వ్రాయండి	తమ్ములు శవములవస్	106
148.155	తమ్ములు - శబ్దాన్ని ప్రతి పాదాదిలో నిల్పుతూ భారతార్థంలో కందపద్యాన్ని కాని, ఉత్పలమాలను కాని వ్రాయండి	తమ్ములు పీన్గులైరి	106
149.156	తల - తో నాలుగు పాదాలను ప్రారంభిస్తూ పతికై నిరీక్షిస్తున్న నాయిక స్వగతాన్ని తెలుపుతూ	తలలోనాలుకయై	107
149.157	తల - తో నాలుగు పాదాలను ప్రారంభిస్తూ పతికై నిరీక్షిస్తున్న నాయిక స్వగతాన్ని తెలుపుతూ	తలమించిన బాధ్యతలను	107
150.158	తల - ను నాలుగు పాదాల ప్రారంభంలో అన్యార్థంలో ప్రయోగిస్తూ ఇష్టదైవాన్ని స్తుతిస్తూ	తలమే నెవ్వరికైన	107
150.159	తల - ను నాలుగు పాదాల ప్రారంభంలో అన్యార్థంలో ప్రయోగిస్తూ ఇష్టదైవాన్ని స్తుతిస్తూ	తలపుల సద్యస్ఫూర్తిని	108
151.160	తల - ను నాలుగుపాదాలలో ఉపయోగిస్తూ పూలతోటను వర్ణిస్తూ	మము గని కేరింతలతో	108

152.161	తల - శబ్దాన్ని శిరస్సు అనే అర్థంలో కాకుండా నాలుగు పాదాలలో ప్రయోగిస్తూ మీకు నచ్చిన ఛందస్సులో భారతార్థంలో	కోతల రాయ డుత్తరుడు	109
152.162	తల - శబ్దాన్ని శిరస్సు అనే అర్థంలో కాకుండా నాలుగు పాదాలలో ప్రయోగిస్తూ భారతార్థంలో	ద్యూతమాడి పాండవులకు	109
153.163	తల, కల, వల, అల - పాదాదిన వచ్చునట్లుగా సీతారామ కల్యాణార్థములో	తలపుల్ జానకి	110
154.164	తల, మెడ, కడుపు, నడుము - పదాలతో శ్రీవేంకటేశ్వర స్తుతి	తలసరి యప్పు హెచ్చినను	110
155.165	తల, వల, జల, కల - పదాలతో గురుశిష్య సంబంధం	పలువురి పూజల నందుచు	111
156.166	తాపము, పాపము, కోపము, లోపము - పదాలతో స్త్రీలు లోకకళ్యాణ కారకులు	ఝాన్సి లక్ష్మి ప్రతాపము	111
157.167	తార్చి, కూర్చి, మిర్చి, ఆర్చి - ద్రౌపదీ వస్త్రాపహరణం గురించి	ద్యూత గృహంబునందు	112
158.168	తీపు, కారము, పులుపు, చేదు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	తలపులు పురారిపైననె	112
159.169	తుప్పు, మెప్పు, ఉప్పు, కప్పు - పదాలను అన్యార్థంలో వాడుతూ విజయదశమి వైభవాన్ని స్వేచ్ఛాఛందంలో	తుప్పుండును మహిషుగ	113
159.170	తుప్పు, మెప్పు, ఉప్పు, కప్పు - పదాలను అన్యార్థంలో వాడుతూ విజయదశమి వైభవాన్ని స్వేచ్ఛాఛందంలో	మాదు వంతుప్పుగుందము	113
160.171	దయ్యము, బియ్యము, కయ్యము, నెయ్యము - పాదాదిన వచ్చునట్లుగా	దయ్యము పట్టె	113
161.172	దర్భ, తిల, పిండ, శ్రాద్ధ - పదాలతో రుక్మిణీ కళ్యాణ వృత్తాంతాన్ని గురించి	సాత్వతి సుతుతో	114
162.173	దిన, వార, పక్ష, మాస - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో	అది నరనారాయణుల	114
163.174	దెస, నస, పస, వెస - పదాలను స్వార్థంలో కాకుండా ఉపయోగిస్తూ రామాయణార్థంలో	రత్న సంస్థానములు	115
164.175	దేవకి, యశోద, సుభద్ర, రాధ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	వనమందుస్ యవమాన	115

165.176	దేశము, కోశము, పాశము, నాశము - పదాలను ఉపయోగిస్తూ దేశభక్తిని ప్రబోధిస్తూ	కంఠపాశములు వరించి	116
166.177	దొర, డబ్బు, అప్పు, వడ్డీ - పదాలను ఉపయోగిస్తూ ఋణగ్రస్తుని బాధను వర్ణిస్తూ	దొరతన మింక లేదు	116
167.178	దోసె, వడ, పూరీ, సాంబారు పదాలతో గిరిజా కళ్యాణం	కలదో సెకకంటి	117
168.179	దోస్తీ, షోలే, డాన్, బాబీ - పదాలతో పద్మవ్యూహంలో అభిమన్యుని స్వైరవిహారం గురించి	ద్రోణుం డేర్చిన	117
169.180	ద్రౌపది, గాంధారి, కుంతి, కృష్ణ- పదాలతో రామాయణార్థంలో ఉత్పలమాల	ఆరని మంటలం	118
170.181	ధర్మజ, భీమ, దుర్యోధన, నకుల అనే పదాలతో రామాయణార్థంలో పద్యం	వాలిది యధర్మ జనిత	119
171.182	ధాత, ఈశ్వర, దుర్మతి, దుందుభి - అన్న సంవత్సరాల పేర్లతో రావణ పాత్ర చిత్రణ	ధాత వరంబు లివ్వ	120
172.183	నంది, భృంగి, శృంగ, అంబ - శివ శివాని భక్తి	గిరిశృంగమ్మున	120
173.184	నగరు, తగరు, తొగరు, వగరు - పదాలతో రామాయణ, భారత, భాగవతార్థాలలో	నగరున కొచ్చి	121
173.185	నగరు, తగరు, తొగరు, వగరు - పదాలతో రామాయణ, భారత, భాగవతార్థాలలో	నగరున కేగుదెంచ	121
173.186	నగరు, తగరు, తొగరు, వగరు - పదాలతో రామాయణ, భారత, భాగవతార్థాలలో	నగరు బకాసురుండను	122
174.187	నది, మది, పది, గది - పదాలతో గురుశిష్య సంబంధం	జీవనమందు నేర్చినది	122
175.188	నన, నీనీ, నును, నేనే - శబ్దాలను ఉపయోగిస్తూ మీకు నచ్చిన ఛందస్సులో భారతార్థంలో	మానినీ! నీ మనోరథ మేను	123
176.189	నవ్య, భవ్య, దివ్య, సవ్య - పదాలను ఉపయోగించి వైద్యవృత్తిని గురించి	నవ్యత శోధనస్ బడసి	123
177.190	నాగలి, మొరకు, గిలక, వల్లకాడు; వీటితో అమెరికాలో తెలుగు భాష భవిష్యత్తు గురించి పద్యం	సాగు సాంకేతిక	124
178.191	నిండుగ, పండుగ, మెండుగ, దండిగ - పదాలను ఉపయోగిస్తూ అవధాన వైభవాన్ని వివరిస్తూ	సాహిత్యంబున క్రీడగా	124

179.192	నిక్కరు, లిక్కరు, కుక్కరు, చక్కరు - పదాలతో భారతార్ధంలో	నీదరి నేనె యుంటి	125
179.193	నిక్కరు, లిక్కరు, కుక్కరు, చక్కరు - పదాలతో భారతార్ధంలో	నిక్కము నాదె యంచు	125
180.194	నిధనము, శవము, పాడె, చితి - పదాలను అన్యార్ధంలో ఉపయోగిస్తూ పెండ్లి వేడుకలను వర్ణిస్తూ	పాడెను పాట లెన్నొ	126
181.195	నీతి, జాతి, భాతి, రీతి - పదాలతో ఎన్నికల ప్రచారంపై	జాతి మత భేద మండగ	126
182.196	నీరు, మీరు, బారు, బీరు - పదాలతో పద్మావతీ స్తుతి	మహిని ఫలము లిడు	127
183.197	నీవు, రావు, కావు, లేవు - పదాలతో స్వతంత్ర భారత ప్రగతిని నదీగమనంతో పోలుస్తూ స్వేచ్ఛావృత్తంలో దత్తపది	స్వాతంత్ర్యం బొక జన్మహక్కనెడి	127
183.198	నీవు, రావు, కావు, లేవు - పదాలతో స్వతంత్ర భారత ప్రగతిని నదీగమనంతో పోలుస్తూ స్వేచ్ఛావృత్తంలో దత్తపది	సాగస్ భారతమాత	127
184.199	నేల, నీరు, అగ్గి, గాలి - పదాలను అన్యార్ధంలో ఉపయోగిస్తూ మహాభారతార్ధంలో	రానేల యీా మయసభకు	128
185.200	నేల, నీరు, నిప్పు, నింగిచూలి - పదాలను అన్యార్ధంలో ప్రయోగిస్తూ రామయణార్ధంలో	అవనిజ జాడ జెప్పుమనె	128
186.201	నేల, మన్ను, పుడమి, మట్టి - పదాలను అన్యార్ధంలో ప్రయోగిస్తూ భారతార్ధంలో	చింత నేల యసురు	129
187.202	పంది, కిరి, కిటి, సూకరము - పదాలను అన్యార్ధంలో ప్రయోగిస్తూ గోమాతను స్తుతిస్తూ	ఆమతిం పంది	129
188.203	పంది, చేప, కప్ప, కోడి పదాలతో బ్రాహ్మణుల ఇంట్లో విందు	చీచీలు పంది	130
188.204	పంది, చేప, కప్ప, కోడి పదాలతో బ్రాహ్మణుల ఇంట్లో విందు	అందెను మా కప్ప	130
189.205	పంది, నంది, కంది, మంది - పదాలు పాదాదిన వచ్చేటట్లుగా సి.పి.బ్రౌన్ గురించి ఉత్పలమాల పద్యం	పంది ధరిత్రి నెత్తినటు	131
190.206	పగలు, వగలు, సెగలు, రగులు - పదాలతో	పగలు ప్రతీకారంబులు	131

191.207	పద్యము, గద్యము, మద్యము, హృద్యము - పదాలను ఉపయోగిస్తూ కవిత్వం యొక్క ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ	పద్యము నందు నున్న	132
192.208	పసిడి, వెండి, రాగి, మట్టి - పదాలు వేరే అర్థంలో వాడుతూ ఆదిశక్తి ప్రాభవాన్ని స్వేచ్ఛా వృత్తంలో	త్రప సిడిముడు	132
193.209	పాకు, బేకు, హాకు, సాకు - అన్న కన్నడ పదాలతో పద్యం	పాకువు విటపి	133
194.210	పాప, రూప, దీప, తాప - పదాలను ఉపయోగిస్తూ దీపావళి పర్వదిన ప్రాశస్త్యాన్ని తెలుపుతూ	పాపాత్ముండగు నరకుడు	133
195.211	పాపి, ఖలుఁడు, హీనుడు, ద్రోహి - పదాలను ప్రయోగిస్తూ విష్ణుస్తుతి	పాపి రావణు	134
196.212	పాపి, తులువ, పలువ, పంద - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ధర్మరాజు సుగుణాలను వర్ణిస్తూ	జ్ఞాతులు వల్వ లూడ్చి	134
197.213	పాలు, పెరుగు, చల్ల, వెన్న - పదాలను పాడి సంబంధమైన అర్థంలో కాకుండా ఉపయోగించి మహాభారతార్థంలో	వ్యాసు భవిష్యవాణి	135
197.214	పాలు, పెరుగు, చల్ల, వెన్న - పదాలను పాడి సంబంధమైన అర్థంలో కాకుండా ఉపయోగించి మహాభారతార్థంలో	శిశుపాలుండు గతింప	135
198.215	పాలు, పెరుగు, నేయి, నూనె - పదాలను వేరే అర్థాలలో వాడుతూ శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి చెప్పినట్లుగా	వచ్చితిని కృష్ణుడ	136
199.216	పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలతో కురు పాండవుల ఆస్తి పంపకాలు	వైరము పెరుగునని	136
200.217	పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	చావెన్నకు దుర్యోధన	136
201.218	పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ	ఇక్కట్ల పాలు చేయక	137
202.219	పిక్చరు, స్ట్రక్చరు, ఫ్రాక్చరు, లెక్చరు - పదాలతో పద్యం	పిక్చరు గీసి	137
202.220	పిక్చర్, స్ట్రక్చర్, ఫ్రాక్చర్, లెక్చర్ - పదాలతో	పిక్చరు యెన్నికందు	138
202.221	పిక్చర్, స్ట్రక్చర్, ఫ్రాక్చర్, లెక్చర్ - పదాలతో	పిక్చరు యస్పష్టము	138

203.222	పూరి, వడ, దోశ, అట్టు - పదాలను ఉపయోగిస్తూ మహాభారతార్థంలో	మోసపూరితమగు	139
204.223	పూరీ, లారీ, గోరీ, మోరీ - పదాలతో గౌరీకల్యాణం	మదన రిపూ	139
205.224	పెస్, గస్, డస్, రస్ - పదాలను ఉపయోగిస్తూ "నేటి సినిమాలు" విషయంగా	మాపెస్ నాటకరంగ	140
206.225	పేపరు, పెన్ను, టైపు, మెమో - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	నెగపే పరుషత్వంబై	140
207.226	పేపర్, బుక్, పెన్, ఇంక్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	బారిసము నరుని కింకువ	141
208.227	పోతన - అన్న పదం నాలుగు పాదాలలో అన్యార్థంలో పెట్టి పోతనపై పద్యం	తేనె రంగరింపో	141
209.228	ప్రవరుడు, వరూధిని, స్వరోచి, మనోరమ - పదాలతో రామాయణార్థంలో	భువనమునస్ స్వరోచి	141
210.229	బండి, రథము, ఓడ, విమానము - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఒక అదృష్టహీనుని దీనావస్థను వర్ణిస్తూ	తెలివి మానము లన్నవి	142
211.230	బడి, ఒడి, గుడి, మడి - పదాలతో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ	పాఠశాలలు యుమ్మడి భాగ్య	142
212.231	బల్లి, చెల్లి, పిల్లి, గిల్లి - పదాలతో రామాయణార్థంలో	బల్లిదుడైన వాలి	143
213.232	బహ్వ, గహ్వ, ప్రహ్వ, జిహ్వ - పదాలతో అమ్మవారిని స్తుతిస్తూ కంద పద్యం	బహ్వాక్కుల సారం	143
214.233	బాల్, రన్, వికెట్, విన్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	పలుకుచు డంబాల్	144
215.234	బీర, బెండ, కాకర, దొండ - పదాలను పరార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	పాండవ యగ్ర పూజ	144
216.235	భార, కార, ధీర, మార పదాలతో - ధర్మరాజు మనో విచారము	భారత యుద్ధమందు	145
217.236	భారము, తోరము, నీరము, ఘోరము - పాదాదిన వచ్చునట్లుగా భారతార్థముతో	భారము కృష్ణుపై	145
218.237	మగ, పగ, వగ, పొగ - పదాలతో భారతార్థంలో	వగదెగు సమస్య యనుచు	146

219.238	మతము - అన్న పదాన్ని నాలుగు సార్లు వాడుతూ రాజ్యంగ గరిమను గురించి	సర్వమతముల	146
220.239	మద, పద, ముద, నద - పదాలతో గజేంద్రమోక్షం	మదగజమున కొచ్చెను	147
221.240	మనము, ధనము, వనము, క్షణము - పదాలతో రామాయణార్థంలో	గమనము మేఘమార్గమున	147
222.241	మనము, వినము, కనము, తినము - పదాలతో అయోధ్యనగర శోభ	ఖచరు వంశజు రాము	148
223.242	మబ్బు, వాన, జల్లు, వరద - పదాలను ఉపయోగించి భారతార్థంలో	బల మబ్బుస్ రణమందు	148
223.243	మబ్బు, వాన, నది, వరద - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	నిజ మనునది	149
224.244	మబ్బు, వాన, ముసురు, వరద - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఖాండవ దహన వృత్తాంతాన్ని	పార్థు సామర్థ్య	149
225.245	మమత, సమత, నవత, ఘనత - పదాలతో దేశాభివృద్ధిలో మహిళ పాత్ర	మమతకు నెలవై	150
226.246	మాత, పిత, తాత, దుహిత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ నీతిని బోధిస్తూ	వలదు హితమని చెప్పి	150
227.247	మాద్రి, కైక, రాధ, రుద్రమ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దుర్గాదేవిని స్తుతిస్తూ	ఇంద్రకీల ధరాధర	151
228.248	మామ, అత్త, బావ, వదిన - పదాలను స్వార్థంలో ఉపయోగించకుండా భారతార్థంలో	మా మగలకు నీ పిత	151
229.249	మాయాతి, నాయాతి, నయాతి, యాతి - అను పదములు నాల్గు చరణములలో నిమిడ్చి కృష్ణ పరముగా	ఏమి? మాయా? తికమకా	152
230.250	మూడు, ఆరు, ఏడు, పది - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	కొంపలారును	152
231.251	మూడు, ఆరు, ఏడు, పది - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	చేటుమూడును	152
232.252	మూర, బార, చేర, మేర - పదాలతో రామాయణార్థంలో	మేఱమీఱగ సీతను	153

233.253	మేరీ, ఏసు, సిలువ, చర్చి - పదాలను వేరే అర్థంలో వాడుతూ భారతార్థంలో	విడువగ మమత్వ	153
233.254	మేరీ, ఏసు, సిలువ, చర్చి - పదాలను వేరే అర్థంలో వాడుతూ భారతార్థంలో	చందన చర్చిత	154
233.255	మేరీ, ఏసు, సిలువ, చర్చి - పదాలను వేరే అర్థంలో వాడుతూ భారతార్థంలో	ఏ సుదతి నూర్గురు	154
234.256	మేరీ, యేసు, సిలువ, చర్చి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మతసామరస్యం గురించి	భేద భావము చర్చించి	155
235.257	మేరీ, యేసు, సిలువ, చర్చి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ	త్యాగ మేరీతి యమృతత్వ	155
236.258	మొల్ల, ఎల్ల, కల్ల, చల్ల - పదాలతో రామాయణార్థంలో	మొల్లల తావి సీత కడ	156
237.259	మోది, రాహుల్, జగస్, చంద్ర - పదాలతో ప్రత్యేక హోదాపై	జగను కదే	156
238.260	యతి చెడె, గతి చెడె, మతి చెడె, స్మృతి చెడె చంపకమాల	యతి చెడె మూషికంబు	156
239.261	రండ, ముండ, దండ, బండ - పాదాదిన వచ్చునట్లుగా వరకట్న సమస్యను గూర్చి	రండని పిల్చి	157
240.262	రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ - పదాలను ప్రయోగిస్తూ ఉత్పలమాలలో దేవీమాహాత్మ్యాన్ని, బ్రహ్మచర్యం గూర్చి వర్ణించడం	అంభము జీవకోటి కిడు	158
240.263	రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ - పదాలను ప్రయోగిస్తూ ఉత్పలమాలలో దేవీమాహాత్మ్యాన్ని, బ్రహ్మచర్యం గూర్చి వర్ణించడం	బ్రహ్మచర్యమే నకనకబడు	158
241.264	రక్తి, శక్తి, భక్తి, ముక్తి - పదాలతో దేవీపరంగా, భారతార్థంలో	నీవే రక్తికి యూతము	159
241.265	రక్తి, శక్తి, భక్తి, ముక్తి - పదాలతో దేవీపరంగా, భారతార్థంలో	భక్తిని జీవనముగ	159
242.266	రణము, చరణము, కరణము, తరణము - పదాలను పాదాదిని ఉపయోగిస్తూ శ్రీరాముని స్తుతిస్తూ	శరణము! ప్రోవుమన్న	160

243.267	రయము, భయము, జయము, నయము - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో	రయమున మానవాస్త్రమును	160
244.268	రాకు, పోకు, తేకు, మేకు - పదాలను ఉపయోగించి భారతార్థంలో	నీ సుతుల గనమే	161
245.269	రాగము, రోగము, యోగము, భోగము - పదాలతో వేసవి ఎండల వర్ణనము	ఎసకొలుపును	161
246.270	రామ - శబ్దాన్ని అన్యార్థంలో నాలుగు సార్లు ప్రయోగిస్తూ రాధా శ్యామసుందరుల సంభాషణ మత్తకోకిల పద్యంలో	బాగు పెంచుటలో వరా	162
247.271	రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న - పదాలతో భారతార్థంలో	ఏ విరామ మెరుంగక	162
248.272	రామసేతు గురించి	వారిధి మువ్వన్నెలలో	163
249.273	రామా - 4 పాదాలలో పాదాదిన వచ్చేటట్లుగా అన్యార్థంలో వాడుతూ రామ పరంగా	రా! మాటిమ్ము	163
250.274	రామా - 4 పాదాలలో విభిన్నార్థాలతో హరి ప్రార్థన	రారా మా వెత దీర్చగ	164
251.275	రామా, కామా, రోమా, కోమా - చిన్న పిల్లలకు ఆశీర్వాదం	రామాయణమును	164
252.276	రారా, పోరా, తేరా, సారా - పదాలను అన్యార్థంలో ఉపయోగించి భారతార్థంలో	రారాజు మొండి	165
253.277	లంగా, చీర, రవిక, పయట - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	ద్వారకకు యలంగామీను	165
254.278	లంగా, లుంగీ, చీర, దోవతి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో	శ్రీలం గాంతుడు జూదమందు	165
255.279	లండన్, అమెరికా, జపాన్, ఇటలీ వీటితో వరూధినీ ప్రవరుల కథ	ప్రజలండన్ యిలు జేరగా	166
256.280	లడ్డు, బూరె, అరిసె, కాజా - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో	అర్థపతి వన రక్షకు	166
257.281	లవరు, కవరు, పవరు, ఎవరు - పదాలతో దాంపత్య జీవనం	అలవరుచుకున్న మర్యాద	167
258.282	లాడెన్, ఊడెన్, వీడెన్, వాడెన్ - పదాలను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్థితిగతులపై	ఓడన్ పీఠము యూడెన్	167

258.283	లాడెస్, ఊడెస్, వీడెస్, వాడెస్ - పదాలను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్థితిగతులపై	ఓడస్ పదవులు యూడెస్	168
259.284	వంక, జింక, లెంక, శంక - శంకరాచార్య వర్ణన	నలువంకల నద్వైతము	168
260.285	వంద, వేయి, లక్ష, కోటి - పదాలను అన్యార్థంలో ఉపయోగించి భారతార్థంలో	ధర్మజుడు వందనము	169
261.286	వన, జన, ధన, మన - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో	భావనలో శ్రీరాముడె	169
262.287	వనిత, లలిత, అనిత, మమత - పదాలతో రామాయణార్థంలో	ఇవ్వని తళుకుల మృగమా	170
263.288	వాన, ముసురు, జల్లు, జడి - పదాలతో వేసవిలో జనుల స్థితి	వేసవి కాహ్వానంబా	170
264.289	వారేవా, తూరేతూ, పీరేపీ, జారేజా - పదాలతో రామాయణార్థంలో	వారే వానర యోధు	170
265.290	వాలీబాలు, క్రికెట్, కోకో, కబాడీ - పదాలతో రామాయణార్థంలో	వాలీ! బాలుని వంటి	171
266.291	విత్తి, హత్తి, మెత్తి, సత్తి - భారతార్థములో	ఏకచక్రపురిని బిచ్చ	172
267.292	విల్లు, అమ్ము, కత్తి, గద - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో	ఉద్భవిల్లు విమోహము	172
268.293	వీరమో, సారమో, భారమో, హారమో - పాదాదిన వచ్చునట్లుగా	వీరమో కరుణామూర్తి	172
269.294	శంకర, ఈశ్వర, రుద్ర, కపాలి అను పదాలతో తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం మామూలు క్యూలో నిలబడ్డ ఒక వ్యక్తి వీ. ఐ. పీ. క్యూలో జనాలు తొందరగా దర్శనం చేసుకోవడం చూసి ఒక పక్క బాధగా ఉన్నా దాన్ని అనుకూలంగా తీసుకుని అది వారి పూర్వజన్మ పుణ్యం వల్ల, స్వామివారి సంకల్పం వల్ల అని అనుకోవడం	తిరుపతి వేంకటేశ్వరుని	173
270.295	శవము, పాడె, కాడు, చితి - పదాలతో జన్మదినోత్సవాన్ని వర్ణిస్తూ	శైశవమున జన్మదిన	173

271.296	శవము, పాడె, చితిమంట, తర్పణము - పదాలతో పెండ్లి వేడుక	ఆశవమున తలంబ్రాల	174
272.297	శివ, హర, భవ, రుద్ర - పదాలను ఉపయోగించి విష్ణువును స్తుతిస్తూ	క్షీర వారాశి వడి జిల్క	174
273.298	శివ, హర, భవ, రుద్ర - పదాలను ఉపయోగించి శ్రీకృష్ణుని స్తుతిస్తూ	అపదేశి వంచు	175
274.299	శివరాత్రి - లోని నాలుగు అక్షరములు నాలుగు పాదములలో మొదటి అక్షరముగా వచ్చునటుల శివుని స్తుతిస్తూ	శిఖరిని సురాసురులు	175
274.300	శివరాత్రి - లోని నాలుగు అక్షరములు నాలుగు పాదములలో మొదటి అక్షరముగా వచ్చునటుల శివుని స్తుతిస్తూ	శిష్ట కార్యము సాధింప	176
274.301	శివరాత్రి - లోని నాలుగు అక్షరములు నాలుగు పాదములలో మొదటి అక్షరముగా వచ్చునటుల శివుని స్తుతిస్తూ	శివుడొక సగముగ	176
275.302	సంజీవకరణి, విశల్యకరణి, సంధానకరణి, సౌవర్ణ్యకరణి, వీటితో పద్యం	జీవి చావును మలపు	177
276.303	సభ, బిల్లు, ప్రతినిధి, తగవు - పదాలను ఉపయోగిస్తూ కౌరవసభలో శ్రీకృష్ణుని హితబోధపై	శాంతికి ప్రతినిధి	177
277.304	సమంత, తమన్నా, ఇలియానా, ప్రియాంక - పదాలతో సరస్వతీదేవి స్తోత్రం	వీస మంత తెలివి	177
278.305	సరి, గమ, పద, నిస - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో	ముక్తసరిగ సామీరి	178
279.306	సరి, గమ, పద, నిస - యుద్ధ ఘట్టము - దత్తపది వర్ణన	సరి జేతు భీష్మ	178
280.307	సినిమా, నటి, తెర, రంగము - పదాలతో ప్రేయసి వర్ణన	భావన లందు నా	179
281.308	సీత, కైక, సుమిత్ర, తార - పదాలను ఉపయోగిస్తూ మహాభారతార్థంలో	ఒంటరిని యిసీ	179
281.309	సీత, కైక, సుమిత్ర, తార - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	కృష్ణు డవతార	180

282.310	సుయోధనుఁడు, దుశ్శాసనుఁడు, కర్ణుఁడు, శకుని - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో సీసపద్యం	దిగ్విజయము జేసి	180
283.311	హంకార, నంధకార, శ్రీకార, సత్కార అనే పదాలు ఒక్కొక్క పాదంలో	ఈసు నహంకారములకు	181
284.312	హర, గణేశ, నంది, కుమార - పదాలతో విష్ణుస్తుతి	అహరహ మనుభవము	182
285.313	హర, శివ, భవ, కపాలి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ	సంకటహర కృష్ణా	182
286.314	హరి, చక్రి, విష్ణు, రామ - పదాలను ఉపయోగించి శివస్తుతిని చేస్తూ	తపమున విరామ	183
287.315	హరి, మాధవ, కేశవ, అచ్యుత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శివుని స్తుతిస్తూ	విష్ణుపది లహరి	183
288.316	హరిహరి, గిరిగిరి, సరిసరి, సిరిసిరి - పదాలతో పద్యం	హరి! హరి! యంచు	184
289.317	హస్త, చిత్త, స్వాతి, మూల - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ షడ్రసోపేత భోజనాన్ని వర్ణిస్తూ	స్వస్థత కభయ	184
290.318	హాయ్, హలో, గుడ్, బై - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో	తెమ్ము! సౌగంధికము	185
291.319	హేమ, కాంచన, అపరంజి, స్వర్ణ - పదాలను బంగారం అనే అర్థంలో కాకుండా ప్రయోగిస్తూ సంక్రాంతి నాటి ఉషోదయంలో సూర్యకిరణ శోభ వర్ణన	తపనుం డొచ్చుట దెల్పె లోకమున	185
291.320	హేమ, కాంచన, అపరంజి, స్వర్ణ - పదాలను బంగారం అనే అర్థంలో కాకుండా ప్రయోగిస్తూ సంక్రాంతి నాటి ఉషోదయంలో సూర్యకిరణ శోభ వర్ణన	కాంచ నవలలు కైసేయు	186

దత్తపదుల సమాహారం

(లఘుటీకావ్యాఖ్యాన సహితము)

1. అంగీ, లుంగీ, చుంగీ, పుంగీ- పదాలతో అభిసారికను గురించి శార్దూలం

1.1 శా. అంగీకారమె ముఖ్య మంచు ప్రియులన్ యానంద మందుంచఁ, జా
లుం గీళ్ళంచును మారు వేషములుఁ దాల్చున్, తోచ కభ్రంబుఁ జూ
చుం, గీరున్ క్షితి చేష్ట లాపి, కనుచున్ శోభించు రేయెండ పెం
పుం, గీముల్ యభిసారికల్ విడచు చొప్పుల్ బట్ట గమ్యంబుకై.

(ప్రియుడు = ఇష్టుడు, కీలు = ఉపాయము, తాల్చు = ధరించు, తోచు = స్ఫురించు, అభ్రము = ఆకాశము, గీరు = గీకు, క్షితి = భూమి, చేష్ట = పని, కను = చూచు, శోభించు = ప్రకాశించు, రేయెండ = వెన్నెల, పెంపు = అధిక్యము, గీము = ఇల్లు, అభిసారిక = ప్రియుని గూర్చి సంకేత స్థలమునకు పోయెడి నాయిక, చొప్పు = దారి చల్లు)

మదన తాపంతో ప్రియుణ్ణి తన వద్దకు రప్పించుకొనేది గాని, లేక వెన్నెల రాత్రులలో గానీ చీకటి రాత్రులలో గానీ తనని ఇతరులు గుర్తించని విధంగా మారు వేషం ధరించి గుట్టుగా ప్రియుని కలవడం కోసం సంకేతస్థలానికి పోయేదాన్ని గాని, అభిసారిక అంటారు. రెండవ భావంలో ఈ పద్యం ఉంది. ఇష్టమైన వాళ్ళని సంతోషంలో ఉంచడానికి సమ్మతియే ముఖ్యమని, చాలు ఉపాయాలు అంటూ మారువేషాలు వేస్తారు, ఏం చెయ్యాలో స్ఫురించక ఆకాశం వంక చూస్తారు, చేష్ట లుడిగి నేల మీద గీరతారు. ప్రియుల కోసం సంకేత స్థలాలకు పోయే నాయికలు ప్రకాశించే వెన్నెల అతిశయాన్ని చూస్తూ గమ్యం బాట పట్టడానికి ఇళ్ళు వదలిపెడతారు.

2. అంచిత, కుంచిత, వంచిత, సంచిత - పదాలతో భాగవతార్థంలో

2.2 కం. వంచిత మనస్కు వగపును,
కుంచితమగు దైత్య మదము, కోర్కెల పరుగుల్,
సంచిత కర్మఫలంబను
యంచితమగు భాగవతము నంతయు బోధే.

(వంచిత మనస్కుడు = మోసగింపబడిన మనస్సు కలవాడు, వగపు = శోకము, కుంచితము = వక్రము, దైత్య = రాక్షసుడు, మదము = గర్వము, సంచిత కర్మఫలము = పూర్వ జన్మలో కూడబెట్టగా వెంట వచ్చే పాపపుణ్యాల ఫలితం, అంచితము = సమ్మానితము, బోధ = జ్ఞానము)

మోసగింపబడిన మనస్సు కలవాని శోకము, వక్రముగా ఉండే రాక్షసుల గర్వము, కోరికలు పెట్టించే పరుగులు, పూర్వ జన్మలో కూడబెట్టగా వెంట వచ్చే పాపపుణ్యాల ఫలితం అని చెప్పే సమ్మానితమైన భాగవతంలో అంతా జ్ఞానమే.

3. అక్క, అన్న, అమ్మ, అయ్య - పదాలను అర్థాలను మార్చి ఉపయోగిస్తూ నేటి బడి చదువులు విషయంగా

3.3 ఉ. అక్కజమే కదా! తలపు లన్నియు నేర్పిన మాతృభాషనే
తక్కువ యన్న పాలకులు దారుణ చేష్టల పాఠశాల లం
దెక్కువ జేసి రాంగ్లమును, యీ తర మేమగు? యమ్మహత్తులో
స్రుక్కక మున్నె బిడ్డలనుఁ బ్రోచెడి యయ్యతనమ్ము లేమగున్?

(అక్కజము = ఆశ్చర్యము, తలపు = ఆలోచనము, దారుణ = మనస్సు కదలించునది, చేష్ట = ప్రవర్తన, మహత్తు = బుద్ధితత్వము, స్రుక్కు = చిక్కు, మున్ను = ముందు, ప్రోచు = రక్షించు, యతనము = ప్రయత్నము)

పాలకులు ఆలోచనలు నేర్పిన మాతృభాషనే తక్కువ చేసి తమ దారుణ చేష్టల ద్వారా పాఠశాలలో ఆంగ్లభాషను ఎక్కువ చేశారు. ఈ తరం ఏమవుతుంది? ఆ తత్వంలో చిక్కుకోక మునుపే పిల్లలను రక్షించే ఆ ప్రయత్నాలు ఏమవుతాయో?

4. అక్క, అన్న, వదిన, మామ - పదాలను ఉపయోగించి రావణునకు మండోదరి చేసిన హితబోధను తెలుపుతూ

4.4 ఉ. అక్కజ మందు నిగ్రహము నర్చన లందునఁ జూపు నీ పయిన్
యక్కసుఁ బొందె నింద్రియము లన్నియు యన్నటు స్త్రీ సుఖంబునే
చక్కగ మార్చినావు దినచర్యగ, ముప్పు గ్రహించి సీతపై
దృక్కు మరల్చి, మామక హృదిన్ శమమున్ నిలుపంగ వేడెదన్.

(అక్కజము = ఆశ్చర్యము, నిగ్రహము = సంయమము, అర్చన = ఆరాధన, అక్కసు = కోపము, ఇంద్రియములు = కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు, ముప్పు = ఆపద, గ్రహించు = గమనించు, దృక్కు = చూపు, మరల్చు = మళ్ళించు, మామక = నాకు సంబంధించిన, హృది = మనస్సు, శమము = శాంతి, నిలుపు = ప్రతిష్ఠించు, వేడు = ప్రార్థించు)

ఆశ్చర్యకరంగా పూజలలో నిగ్రహము చూపే నీ పైన ఇంద్రియాలన్నీ కోపం వహించాయి అన్నట్లుగా స్త్రీ సౌఖ్యాన్నే చక్కగా నీ దినచర్యగా మార్చావా. ఆపదను గ్రహించి సీత మీద చూపు మరల్చి నా మనస్సులో శాంతిని నిలపాలని ప్రార్థిస్తాను.

5. అట్ట, కట్ట, చుట్ట, తట్ట - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

5.5 తే.గీ. అట్టహాసముగా ఘోషయాత్ర సలుప
కట్టగట్టుకొని, జనిరి కానకు, తమ
చుట్టరికము మరచి పాండు సుతుల కచట
తట్టములు పెట్ట, కౌరవ తత్వ మిదియె.

(అట్టహాసము = ఆడంబరము, సలుపు = చేయు, కట్టగట్టుకొను = అందఱు ఏకమగు, చను = వెళ్ళు, కాన = అడవి, చుట్టరికము = బంధుత్వము, సుతుడు = పుత్రుడు, తట్టములుపెట్టు = బాధలుపెట్టు, తత్వము = స్వభావము)

ఆడంబరంగా ఘోషయాత్ర చేయడానికి, తమ బంధుత్వము మరిచిపోయి పాండుపుత్రులకు అక్కడ బాధలు పెట్టడానికి, అందరూ ఏకమై అడవికి వెళ్ళారు. కౌరవుల స్వభావము ఇదే.

6. అన్నము, కూర, పప్పు, చారు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

6.6 ఉ. సోలక మున్నె, యన్నముచిసూదన పుత్రుడు ఖాండవమ్మునన్,
జ్వాలల నుండిఁ గాచి మయు సంశ్రయమున్ సమకూరఁ జేయగా,
మేలొనఁ గూర్ప నా మయుడు, మిత్రునిగా తల పప్పు డొట్టగా
శాలనుఁ జేసి యిచ్చె పరిచారుల తోడుగ, పాండు సూనుకున్.

(నోలు = సౌమ్మసిలు, మున్ను = ముందు, నముచిసూదన = ఇంద్రుడు, ఖాండవము = ఇంద్రునియొక్క ఒకానొక వనము, జ్వాల = మంట, కాచు = రక్షించు, సంశ్రయము = శరణము, సమకూరఁజేయు = లభింప జేయు, మేలు = ఉపకారము, కూర్చు = కూడబెట్టు, తలపు = ఆలోచనము, అప్పుడు = ఆ సమయము, ఒట్టు = కలుగు, శాల = సభ, పరిచారుడు = సేవకుడు, సూనుడు = పుత్రుడు)

సౌమ్మసిలక ముందే ఆ ఇంద్ర పుత్రుడైన అర్జునుడు ఖాండవ వనంలో మంటల నుండి మయుని రక్షించి ఆశ్రయము లభింప జేయగా, ఉపకారము చేయడం కోసం ఆ మయుడు స్నేహితుడుగా ఆలోచన అప్పుడు కలుగగా సేవకులతో సహా సభను నిర్మించి ఆ పాండు పుత్రుడైన అర్జునునికి ఇచ్చాడు.

7. అన్నము, జావ, గంజి, తోప - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

7.7 ఉ. ద్యూత సభాంతరాళమున ద్రోవది దాసియె యన్న మూకపై,
వాతసుతుండుఁ గంది సలుపం బ్రతినల్, యనుజా! వగేల యం
చాతని ధర్మరా జడచె శాంతునిగం జిఱు సూచనస్, భయో
త్పాతముఁ బెంచి కౌరవులు ద్రౌపదితో పరిహాస మాడగస్.

(ద్యూత = జూదము, అంతరాళము = మధ్యము, ద్రోవది = ద్రౌపది, వాతసుతుడు = భీముడు, కందు = కోపించు, సలుపు = చేయు, ప్రతిన = ప్రతిజ్ఞ, అనుజుడు = తమ్ముడు, వగ = విచారము, అడచు = క్రుంగచేయు, చిఱు = చిన్న, సూచన = సలహా, ఉత్పాతము = ఉపద్రవము, పరిహాసము = అపహాస్యము)

జూదము జరుగుతున్న సభ మధ్యలో ద్రౌపదిని దాసి అని అన్న మూక మీద భీముడు కోపించి ప్రతిజ్ఞలు చేయగా, భయంతో కూడిన ఉపద్రవం పెంచిన కౌరవులు ద్రౌపదిని గేలి చెయ్యగా, తమ్ముడా! విచారం ఎందుకు? అని ధర్మరాజు అతడిని చిన్న సలహాతో శాంతింపఁ జేశాడు.

8. అప్పు, నిప్పు, మెప్పు, చెప్పు - పదాలను వేరే అర్థంలో వాడుతూ రామాయణ పరంగా

8.8 కం. అప్పురి లంకకుఁ జని, నే
నిప్పుడుఁ గావించు ధ్వంస మిచ్చటి ప్రజ తా
మెప్పుడును చూడఁబోరని
చెప్పుచు, మారుతి దహించె చిప్పున లంకస్.

(పురి = పట్టణము, చని = వెళ్ళి, కావించు = చేయు, ధ్వంసము = నాశము, మారుతి = ఆంజనేయుడు, దహించు = కాల్చు, చివ్వున = శీఘ్రముగ)

ఆ లంకా పట్టణానికి వెళ్ళి, నేను ఇప్పుడు చేసే నాశనము ఇక్కడి జనాలు ఎప్పుడూ చూడబోరని చెబుతూ, ఆంజనేయుడు వెంటనే లంకను దహించాడు.

9. అమ్మ, కొమ్మ, నిమ్మ, బొమ్మ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

9.9 కం. అమ్మకచెల్ల! నరుని చే
కొమ్మన యూర్వశి, వడిఁ గడకొత్తి యతడు, రా
నిమ్మని శాపము, విధి నోఁ
బొమ్మనె, యజ్ఞాతవాస పూర్తి కనువుగన్.

(అమ్మకచెల్ల = ఔరా! నరుడు = అర్జునుడు, చేకొను = పరిగ్రహించు, వడి = వేగముగా, కడకొత్తు = తిరస్కరించు, విధి = పరిస్థితి, ఔఁబొమ్ము = అంగీకారార్థకము, అనువు = అనుకూలము)

ఔరా! ఊర్వశి అర్జునుణ్ణి పరిగ్రహించమని అడుగగా, వేగముగా అతడు తిరస్కరించి శాపము రానివ్వమని అజ్ఞాతవాసము పూర్తి చేయడానికి అనుకూలంగా పరిస్థితిని సరే అన్నాడు.

10. అర, చెర, తెర, మర - పదాలను ఉపయోగిస్తూ ఎన్నికల కోలాహలం గురించి

10.10 కం. అరయన్ యెన్నిక లందున,
తెరకువ గల నేత లెన్నొ తీరుల ప్రజ నే
మరచు కలకల మెరిగి, యది
చెరలాడు నటుల మసలుట, చేటగుఁ గాదా?

(అరయు = ఆలోచించు, తెరకువ = ఉపాయము, తీరు = విధము, ప్రజ = జనాభా, ఏమరచు = భ్రమింపఁజేయు, కలకలము = కోలాహలము, ఎరుగు = గ్రహించు, చెరలాడు = వ్యాపించు, మసలు = ఉండు, చేటు = కీడు)

ఆలోచిస్తే, ఎన్నికలలో ఉపాయం ఉన్న నాయకులు ఎన్నో విధాల ప్రజలను భ్రమింపఁజేసే కోలాహలము తెలిసి, అది వ్యాపించే విధంగా ఉండటం చేటు చేస్తుంది కాదా.

11. అర, చెర, ధర, ముర - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

11.11 కం. ధరణీ రాజ్యము ధర్మజు
కర భాగము యిమ్మటంచు యభ్యర్థించన్,
ముర రిపు బంధించి సభన్
చెర నిడుమని రాజరాజు చేష్టలఁ దెలిపెన్.

(ధరణి = భూమి, రాజ్యము = పరిపాలనము, ధర్మజుడు = ధర్మరాజు, అర = సగము, అభ్యర్థించు = కోరు, మురరిపు = మురాసురుని శత్రువైన శ్రీకృష్ణుడు, చెర = కారాగృహము, ఇడు = ఉంచు, రాజరాజు = దుర్యోధనుడు, చేష్ట = ప్రవర్తన, తెలుపు = తెలియజేయు)

రాజ్యం చేసే భూభాగంలో సగభాగము ధర్మరాజు కిమ్మని కోరగా, శ్రీకృష్ణుని సభలో బంధించి కారాగృహంలో ఉంచమని దుర్యోధనుడు ప్రవర్తన ద్వారా తెలియజేశాడు.

12. అరి, ఉరి, కరి, గిరి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

12.12 కం. ఉరికొలుపగ కర్ణుడు, కరి
కరిపడి దుశ్శాసను డురుకఁ, గనిన కృష్ణ
గిరికము వలె తగవు కొరకు
తిరుగుచు, యరికట్టఁ జూచె తిగియు నటంచున్.

(ఉరికొలుపు = ప్రేరేపించు, కరికరిపడు = కోపపడు, ఉరుకు = దూకు, కను = చూచు, కృష్ణ = ద్రౌపది, గిరికము = బొంగరము, తగవు = న్యాయము, అరికట్టు = వారించు, తిగియు = ఈడ్చు)

కర్ణుడు ప్రేరేపించగా కోపపడుతూ దుశ్శాసనుడు దూకడం చూసిన ద్రౌపది న్యాయం కోసం బొంగరం లాగా తిరుగుతూ ఈడుస్తాడేమోనని వారించాలని చూసింది.

13. అరి, కరి, గురి, సరి - పదాలను ఉపయోగిస్తూ కర్ణుని దాతృత్వాన్ని గురించి

13.13 కం. వలదను యర్చిష్మంతుని
పలుకులఁ గాదని, తనుకరి పాకారికి కుం

డల కవచము లిడి, గుఱియై
యలజడికి, సరియని కర్ణు డడిగెను శక్తిన్.

(అర్చిష్మంతుడు = సూర్యుడు, తసుకరి = మోసగాడు, పాకారి = ఇంద్రుడు, ఇడు = ఇచ్చు, గుఱియగు = లక్ష్యమగు, అలజడి = గందరగోళము, సరి = యుక్తము)

వద్దన్న సూర్యుని మాటలు కాదని మోసగాడైన ఇంద్రునికి కవచకుండలములు ఇచ్చి గందరగోళానికి గుఱియై యుక్తమని కర్ణుడు శక్తిని కోరాడు.

14. అరిసె, గారె, పూరి, వడ - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో

14.14 చం. అరిసెము వొంద వద్దు, యిది యాసుర మాయయె, తాటకేయు డీ
హరిణము, ముద్దుగాఱె తన హాటక వర్ణముతో నటించి, తా
నరచెను రాము కంఠమున యంతము నం, దది మోసపూరితం,
బరయు మటంచు లక్ష్మణుడు యార్తినిఁ జెప్పె, వడంకు సీతకున్.

(అరిసెము = సంతోషము, ఆసుర = రాక్షసప్రవృత్తి, తాటకేయుడు = మారీచుడు, హరిణము = లేడి, ముద్దుగాఱు = ముద్దులొలుకు, హాటక = బంగారు, వర్ణము = రంగు, నటించు = కపటముగా వర్తించు, అరచు = కేకపెట్టు, అంతము = చావు, మోసపూరితము = మోసంతో నిండినది, అరయు = తెలిసికొను, ఆర్తి = బాధ, వడంకు = కంపించు)

హర్షించవద్దు, ఇది రాక్షస మాయే, మారీచుడే ఈ లేడి, తన బంగారు రంగుతో ముద్దులొలికాడు, తాను అవసాన సమయంలో రాముని కంఠము అనుసరించి అరిచాడు, అది మోసంతో కూడుకున్నది, తెలుసుకో అని లక్ష్మణుడు బాధతో వణుకుతున్న సీతకు చెప్పాడు.

15. అర్భ, దర్భ, నిర్భ, గర్భ - పదాలు పాదాదిన వచ్చునట్లుగా పద్యం

15.15 కం. అర్భకము "ఊ" యనెడి సం
దర్భముఁ గని, నారదుండు దైత్యారి కథల్
నిర్భటముగ వినిపించగ,
గర్భము ప్రహ్లాదుడయ్యెఁ గమలాక్షు కృపన్.

(అర్భకము = గర్భమునందలి శిశువు, సందర్భము = సమయము, కను = చూచు, దైత్యారి = విష్ణువు, కథ = చరితము, నిర్భటము = దృఢము, గర్భము = కడుపులోని పిండము, కమలాక్షుడు = విష్ణువు, కృప = దయ)

గర్భము లోని శిశువు ఊకొట్టే సమయం చూసి నారదుడు విష్ణు కథలు దృఢంగా వినిపించగా ఆ శిశువు విష్ణువు దయ వలన ప్రహ్లాదు డయ్యాడు.

16. అల, కల, తల, వల - పదాలను ఉపయోగిస్తూ రావణుని చెరలో సీత మనోగతాన్ని తెలుపుతూ

16.16 మ. అలఘుస్ లక్ష్మణుఁ దిట్ట యీ ధరణిజస్ యా తప్పు వేధించె, యా
కలనం బిట్లొనరించె, రావణుని లంకస్ జేర్చి బంధించి యు
త్తల మందస్ ననుఁ జేసి రక్కసుల మధ్యస్, నన్ను చూడంగనే
వలకాకస్ యెసరేగు రావణునిఁ జంపస్ రాము డేతెంచునా.

(అలఘుడు = ఉత్తముడు, ధరణిజ = సీత, వేధించు = బాధించు, ఆకలనము = అవగాహనము, ఒనరించు = చేయు, ఉత్తలము = పరితాపము, రక్కసి = రాక్షస స్త్రీ, వలకాక = మన్మథతాపము, ఎసరేగు = చెలరేగు, ఏతెంచు = వచ్చు)

ఉత్తముడైన లక్ష్మణుని తిట్టడం వల్ల ఈ సీతను ఆ తప్పు బాధించింది. రావణుని లంకలో బంధించి నన్ను రాక్షస స్త్రీల మధ్య పరితాపము చెందగా చేసి ఈ విధంగా అవగాహన కలిగించింది. నన్ను చూడగానే మన్మథతాపముతో చెలరేగే రావణుణ్ణి చంపడానికి రాముడు వస్తాడా.

17. అల, కల, వల, నెల - పదాలను ఉపయోగించి రామాయణార్థంలో

17.17 కం. అలఘుడు శ్రీరాముని కా
కలనంబు సలిపె, మహీజ కల దంబుధి కా
వల యని, హనుమ యను యడవి
నెలవరి, సుగ్రీవు నాజ్ఞ నిర్వర్తింపస్.

(అలఘుడు = గొప్పవాడు, ఆకలనము = అవగాహనము, సలుపు = చేయు, మహీజ = సీత, అంబుధి = సముద్రము, ఆవల = అవతల, అడవినెలవరి = వానరము, నిర్వర్తించు = నెరవేర్చు)

సుగ్రీవుని ఆజ్ఞ నెరవేర్చడానికి సీత సముద్రానికి అవతల ఉన్నదని ఘనుడైన శ్రీరామునికి హనుమ అనే వానరము అవగాహనము చేశాడు.

18. అల్లము, బెల్లము, ఉల్లి, చల్ల - పదాలతో భారతార్థంలో

18.18 ఉ. అల్ల ముసల్యులైరి యదు యగ్రగు లందరు, శాప కారణం
బెల్ల మురారికిన్ దెలియు, యింకొక మార్గము లేది దంతయున్
యుల్లిఖితంబు, సౌబలియు నోర్చకఁ గోరెను సర్వనాశమున్,
జల్లగ దారుకుం డిటుల జాలినిఁ బల్కెను సవ్యసాచితో.

(అల్ల = క్రమక్రమముగా, ముసల్యుడు = ముసలముచేత చంపదగినవాడు, అగ్రగుడు = వీరుడు, ఎల్ల = సర్వము, మురారి = కృష్ణుడు, ఉల్లిఖితము = వ్రాయబడినది, సౌబలి = గాంధారి, ఓర్చు = సహించు, చల్లగ = మెల్లగా, ఇటుల = ఈ ప్రకారముగా, జాలి = విచారము, సవ్యసాచి = అర్జునుడు)

క్రమక్రమంగా యదువీరులందరూ ముసలముచేత చంపదగిన వారయ్యారు. శాపానికి కారణము సర్వమూ కృష్ణుడికి తెలుసు. ఇంకో దారి లేదు. ఇదంతా జరగాల్సిందే. గాంధారి కూడా సహనం కోల్పోయి సర్వనాశనం కోరుకుంది. మెల్లగా కృష్ణుని రథసారథియైన దారుకుడు ఈ విధంగా అర్జునుడితో విచారిస్తూ చెప్పాడు.

19. అవ్వ, తాత, అత్త, మామ - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

19.19 కం. అవ్వల సూర్యుని తోడ్కొని,
జవ్వనమున తా తనరెడి స్వజుడు, మురారీ!
యివ్వేళ యత్తమిలె నని,
కవ్వ డడలి యనిని మామక యనియము యనెన్.

(అవ్వల = ఆ ప్రక్క, తోడ్కొను = వెంటబెట్టుకొను, జవ్వనము = యౌవనము, తా = తాను, తనరు = అతిశయించు, స్వజుడు = పుత్రుడు, మురారి = శ్రీకృష్ణుడు, అత్తమిలు = అస్తమించు, కవ్వడి = అర్జునుడు, అడలు = ఏడ్చు, అని = యుద్ధము, మామక = నా యొక్క, అనియము = దురదృష్టము)

ఓ, శ్రీకృష్ణా! ఆ ప్రక్క సూర్యుడితో పాటుగా యౌవనంతో ప్రకాశించే నా పుత్రుడైన అభిమన్యుడు ఈ వేళ అస్తమించాడని అర్జునుడు శోకించి, యుద్ధంలో నా యొక్క దురదృష్టము అన్నాడు.

20. అవ్వ, తాతా, డంకానగారా, రారావోరా, మేనాసవారీ - పదాలతో అర్జున తిరస్కృతయైన ఊర్వశి విరహ బాధ

20.20 శా. మీ పార్థుఁ దరిఁ జేరి తీర్చు మనగన్ మేనాస, వారీ విధిన్
యాపేక్షన్ కురిపించి యో హృదయజుం డంకాన గారాముతో
యాపాతమ్మగు వేళఁ బిల్చి నటులే "యవ్వా" యనెన్, యో, స్మరా!
రావో రాత్రిది గాదు, యూర్వశిని, విల్తా! తాపమున్ మాపుమా!

(పార్థుడు = అర్జునుడు, దరి = సమీపము, మేను = శరీరము, ఆస = కోరిక, విధి = విధము, ఆపేక్ష = ప్రేమ, కురిపించు = వర్షించు, హృదయజుడు = కుమారుడు, అంకము = ఒడి, గారాము = గారాబము, ఆపాతము = పడుట, వేళ = సమయము, అటులు = ఆప్రకారము, అవ్వ = తల్లి, నన్ = స్మర = మన్మథుడు, రాపు = ఘర్షణము, ఓరాత్రి = ఒకరాత్రి, విల్తుడు = విలుకాడు, తాపము = బాధ, మాపు = పోగొట్టు)

మీ అర్జునుని చెంత చేరి నా మేని కోరికని తీర్చమని అనగా, వారు ఈ ప్రకారంగా ఆపేక్ష కురిపిస్తూ ఒక కుమారుడు గారాబంతో ఒళ్ళో పడే వేళ పిలిచి నట్లుగా నన్ను "అమ్మా" అని అన్నాడు. ఓ మన్మథా! ఈ రాపు ఒక రాత్రిది కాదు, నేను ఊర్వశిని, ఓ విలుకాడా! నా తాపాన్ని పోగొట్టవా!

21. అసి, కసి, నుసి, మసి - పదాలను ఉపయోగించి సూర్యోదయాన్ని వర్ణిస్తూ

21.21 మ. అసిధారావ్రత మంచు క్షత్రియులకున్ యస్రుక్కు చిందించి, య
క్కసి నృక్షుండు పరిగ్రహించి ధరణిన్ గైసేసి నట్లుండ, యౌ
షసి యందున్ నునుసిగ్గు దొంతరల యోజస్సుల్ దువాళించి, తా
మసిఁ బోగొట్టగ నిల్చెఁ దూరుపు దిశన్, మార్తాండు డుద్యుక్తుడై.

(అసిధారావ్రతము = కత్తివాదర మీద నిలుచుటవలె దుష్కరమైన వ్రతము, అస్రుక్కు = రక్తము, కసి = కోపము, నృక్షుడు = పరశురాముడు, పరిగ్రహించు = స్వీకరించు, ధరణి = భూమి, కైసేయు = అలంకరించు, ఔషసి = ప్రభాతము, నునుసిగ్గు = కొంచెముసిగ్గు, దొంతర = పరంపర, ఓజస్సు = కిరణము, దువాళించు = ప్రసరింప జేయు, తామసి = చీకటి, మార్తాండుడు = సూర్యుడు, ఉద్యుక్తుడు = సంసిద్ధుడు)

చాలా కష్టమైన వ్రతమని క్షత్రియులకు రక్తాన్ని చిందించి, ఆ కోపము పరశురాముడు స్వీకరించి భూమిని అలంకరించి నట్లుండగా, ప్రభాతమున నునుసిగ్గు దొంతరలనే కిరణాలను ప్రసరింప జేసి చీకటిని పోగొట్టడానికి తూర్పు దిక్కున సూర్యుడు సంసిద్ధుడై నిలిచాడు.

22. అసి, కసి, నుసి, రసి - పదాలను అన్యార్థంలో ఉపయోగించి పల్లె పడుచు అందాలను వర్ణిస్తూ

22.22 తే.గీ. అసిక మందునఁ గాలక మంద మొలుక,
కసిడి నడుమున చెలువముఁ గానుపించ,
పల్లె సీమను నునుసిగ్గె వల్లెవాటు,
పెరసి నాయుడు బావకు వెంకిఁ బొడమె.

(అసికము = గడ్డమునకును క్రింది పెదవికిని నడిమిచోటు, కాలకము = పుట్టుమచ్చ, ఒలుకు = తొలకరించు, కసిడి = అల్పము, చెలువము = సౌందర్యము, కానుపించు = కనపడు, పల్లె = చిన్న గ్రామము, సీమ = ప్రదేశము, నునుసిగ్గు = కొంచెము సిగ్గు, వల్లెవాటు = ఒక చంక క్రిందనుండి తీసి ఎదుట భుజముల పైకి లాగి కప్పుకొను అంగవస్త్రము, పెరసి = మొత్తముచేసి, పొడము = కానవచ్చు)

గెడ్డానికి క్రింది పెదవికి మధ్యన ఉన్న పుట్టుమచ్చ అంద మొలుకగా, పిసరంత నడుములో సౌందర్యము కనిపించగా, పల్లె సీమలో నునుసిగ్గు మాత్రమే వల్లెవాటు. అంతా కలిపి, నాయుడు బావకి వెంకి కనిపించింది.

23. ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వంలో తిక్కన గారి "ఒకటిఁ గొని, రెంటి ..... వివేకధనుఁడు" అన్న తేటగీతి పద్యానికి సమానార్థకమైన కంద పద్యము.

భారతం ఉద్యోగపర్వం (2-37)లో తిక్కన్నగారి క్రింది పద్యానికి సమానార్థకం వ్రాయాలని చెప్పబడింది:

"ఒకటిఁ గొని, రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి,
మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,
యేనిటిని గెల్చి, యాఱింటి నెఱిఁగి, యేడు
విడిచి వర్తించువాఁడు వివేకఘనుఁడు."

ఒకటిస్ కొని, అంటే రాచరికాన్ని చేపట్టి, మంత్రశక్తి ఉత్సాహశక్తి అన్న రెండిటిని నమ్ముకొని, మిత్రులు శత్రువులు తటస్థులు అన్న మూడు వర్గాల వారిని సామ దాన భేద దండములనే నాలుగు ఉపాయాలతో వశపరచుకొని,

త్వక్ (చర్మము) చక్షువు (కన్ను) శ్రోత్రము (చెవి) జిహ్వ (నాలుక) ఘ్రాణము (ముక్కు) అనే అయిదు ఇంద్రియాల ఆకర్షణలకు లోను గాక వాటి ప్రభావాన్ని జయించి, సంధి (బలవంతుడైన శత్రువుతో పొందు) విగ్రహము (పోరు) యానము (దండయాత్ర) ఆసనము (దేశ కాల పరిస్థితులను బట్టి ఉపేక్ష వహించి ఉండటం) ద్వైధము (బలవంతులైన ఇద్దరు శత్రువులను ఎదుర్కొనవలసి వచ్చినపుడు ఒకరికి తెలియకుండా ఒకరితో సంధిచేసుకొని వారిలో వారికి వైషమ్యాన్ని కల్పించటం) ఆశ్రయము (శక్తి లేనప్పుడు బలవంతుని తోడుచేసుకోవటం) అన్న రాజులకు అవసరమైన విధానాలు ఆరింటిలో ఎప్పుడు దేనిని ప్రయోగించాలో చక్కగా గుర్తెరిగి, వేట జూదం మద్యపానం స్త్రీ వాక్పారుష్యం దండపారుష్యం అర్థదూషణం అన్న ఏడు వ్యసనాలను విడిచి ప్రవర్తించేవాడు యుక్తాయుక్తాలు తెలిసినవాడని అర్థం. “ఒకటిఁ గొని, రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి, మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి” మొదలైనవి సంకేతార్థాలు. “ఒకటి”కి “ప్రభుత్వము” అని అర్థాన్ని చెప్పినట్లే, వేరే అర్థాలను కూడా చెప్పవచ్చును. కానీ, ఇక్కడ ఇచ్చిన సంకేతార్థాలకి సమనార్థకంగా వ్రాసినవి క్రింద ఇచ్చిన పద్యాలు.

23.23 కం. ఒకటిస్ గొని, రెంటిని న
మ్ముకొని సతము, నాల్గు పైనముల చేతను మూ
డు కొలవుల వశపరచి, యా
రు కని, యయిదు గెలిచి, యేడు త్రోయుదు రధిపుల్.

[ఒకటిస్ = ప్రభుత్వాన్ని, కొని = స్వీకరించి, రెంటి = మంత్రము, ఉత్సాహము అనే రెండింటిని, సతము = ఎల్లప్పుడు, నాల్గు = నాలుగు, పైనములు = ఉపాయములు (సామ దాన భేద దండములు), మూడు కొలవులు = మూడు శక్తులు (మిత్రులు, శత్రువులు, తటస్థులు అనే మూడు వర్గాలు), ఆరు = సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధము, ఆశ్రయము అనబడే ప్రభుషాడ్గుణ్యం, కని = తెలుసుకొని, అయిదు = ఐదు జ్ఞానేంద్రియాలు, ఏడు = సప్త వ్యసనాలు (వేట, జూదం, మద్యపానం, స్త్రీ, వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థదూషణం), త్రోయు = త్యజించు, అధిపుడు = రాజు]

రాజ్యభారాన్ని చేపట్టి రాజులు ఆలోచన, ప్రయత్నము అనే రెండు శక్తులనూ ఎల్లప్పుడూ నమ్ముకొని, సామ దాన భేద దండోపాయాలతో మిత్రులను, శత్రువులను, రెండూ కాని తటస్థులనూ వశంలో ఉంచుకొని, ఐదు జ్ఞానేంద్రియాలనూ (చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు) జయించి, ప్రభుషాడ్గుణ్యాన్ని గుర్తెరిగి, సప్త వ్యసనాలనూ త్యజిస్తారు.

23.24 కం. వ్యసనములు వదలి, యోచన
వసియును నమ్మి, ప్రజ నుంచి వశమున కీళ్ళస్,
పస నణచి కరణముల, యా

రసి షడ్గుణములు, మనుటయె రాజుకు ననువౌ.

(వ్యసనములు = వేట, జూదం, మద్యపానం, స్త్రీ, వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థదూషణం అనబడే సప్త వ్యసనాలు, యోచన = ఆలోచన, వసి = ఉత్సాహము, ప్రజ = ప్రజలు, కీలు = ఉపాయము, పస = చాతుర్యము, అణచు = లొంగతీయు, కరణములు = ఇంద్రియములు, షడ్గుణములు = సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధము, ఆశ్రయము అనబడే ప్రభుషాడ్గుణ్యం, ఆరయు = తెలిసికొను, మనుట = జీవించుట, అనువు = యుక్తము)

సప్త వ్యసనాలను వదిలిపెట్టి, ఆలోచన ఉత్సాహములను నమ్ముకొని, ఉపాయాలతో (సామ దాన భేద దండములు) ప్రజలను వశంలో ఉంచి ఇంద్రియాలను చాతుర్యంతో లొంగతీసి, ప్రభుషాడ్గుణ్యాన్ని తెలుసుకొని జీవించుటయే రాజుకు యోగ్యము.

24. ఆది, సోమ, మంగళ, బుధ - పదాలతో అవధాన విద్యా వికాసం

24.25 తే.గీ. స్ఫురణయా, దివ్య కవితయా, భువన విజయ
సాహితీ భద్రసోమయా, సంస్కృతాంధ్ర
పద్యవిద్యకు మంగళ వాద్యమా, వ
ధాన మంచు విబుధులు సంస్తవముఁ జేసె.

(స్ఫురణ = తోచుట, దివ్య = స్వర్గమునకు సంబంధించిన, భువన విజయము = శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో జరిగే మహా కవి సమ్మేళనం, సాహితి = వాఙ్మయము, భద్రసోమ = ఆకాశగంగ, మంగళ వాద్యము = శుభకార్యములలో వాయించు సంగీతము, వధానము = అవధానము, విబుధుడు = విద్వాంసుడు, సంస్తవము = చక్కనిస్తుతి)

అవధానమంటే స్ఫురణా, దివ్య కవిత్వమా, భువన విజయ సాహిత్య గంగయా, సంస్కృత ఆంధ్ర మిళితమైన పద్య విద్యకు మంగళ వాద్యమా అంటూ పండితవర్గము చక్కనిస్తుతి చేశారు.

25. ఆది, సోమ, మంగళ, బుధ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

25.26 తే.గీ. ఆది భిక్షువు బోయగా నడరి యొరసె
క్రీడి దీనో మగటిమియో, తోడు నిలిచి

సర్వమంగళ యిప్పించె, స్వామి మన్న
నలను, పాశుపతంబు, ధనంజయునికి.

(ఆది భిక్షువు = పరమ శివుడు, బోయ = కిరాతుడు, అడరు = శోభించు, ఒరయు = పరీక్షించు, క్రీడి = అర్జునుడు, ఈసు = ఈర్ష్య, మగటిమి = శౌర్యము, సర్వమంగళ = పార్వతి, స్వామి = భర్త, మన్నన = మన్నింపు, ధనంజయుడు = అర్జునుడు)

పరమశివుడు కిరాతుడుగా మెరిసి అర్జునుడి కున్నది ఈర్ష్యయా శౌర్యమా అన్నది పరీక్షించాడు. వెంట నిలిచి పార్వతీదేవి భర్త మన్నింపులను పాశుపతాస్త్రాన్ని అర్జునునికి ఇప్పించింది.

26. ఆభరణము, అలంకారము, శ్మశానము, కపాలము - పదాలను ఉపయోగిస్తూ పెద్దనోట్ల రద్దు వల్ల సమస్యలను తెలుపుతూ

26.27 ఉ. మోరక మయ్యె నాభరణముల్ గొనుటన్న ధనంబుతో, యలం
కారములన్న మాట మరిఁ గాసులు లేక వినంగ రాదు, స్వీ
కారముఁ గావు ప్రేతములు క్షత్రము లేక శ్మశాన మందు, యీ
వారడు లన్ని రద్దయిన పైకము నాడిక పాల ముంచవే.

(మోరకము = మూర్ఖత్వము, ఆభరణము = నగ, అలంకారము = సింగారము, కాసు = ధనము, స్వీకారము = అంగీకారము, ప్రేతము = శవము, క్షత్రము = ధనము, శ్మశానము = వల్లకాడు, వారడి = లోపము, పైకము = ధనము, ఆడిక = నింద)

డబ్బుతో నగలు కొనడం అంటే మూర్ఖత్వము అయ్యింది. ధనం లేకుండా సింగారాలన్న మాట వినబడదు. రూకలు లేకపోతే వల్లకాటిలో శవాలు తీసుకోరు. ఈ లోపాలన్నీ రద్దయిన నగదును నిందల పాల ముంచవా?

27. ఆరే ఆ, తూరే తూ, పీరే పీ, జారే జా - పదాలతో భారతార్థంలో

27.28 శా. ఆ రే యాపద రాక మున్నెరుగ భీమాదుల్ నిదర్శించి, యీ
తూరే తూ రిటు మమ్ము కౌరవు లిటస్ ద్రుంచస్ ప్రయత్నించ, రే
పీ రే పీడ కలంచ కుండ మనమే ప్రేరించి లక్కింటి న
బ్జారే జారక మున్నెఁ గాల్చి వనిపజ్జస్ బోవుటే మేలనెస్.

(ఆరేయాపద = ఆ + రేయి + ఆపద, రేయి = రాత్రి, ఆపద = విపత్తు, రాక = వచ్చుట, మున్ను = ముందు, ఎరుగు = తెలియు, నిదర్శించు = ఆలోచించు, యీతూరేతూరిటు = యీ తూరి + ఏ + తూరి + ఇటు, తూరి = పర్యాయము, ఇటు = ఇట్లు, ఇట = ఇక్కడ, త్రుంచు = చంపు, రేపీరేపీడ = రేపు + ఈ + రే + పీడ, రేపు = తరువాతి దినము, రే = రాత్రి, పీడ = ఆపద, కలంచు = క్షోభపెట్టు, ప్రేరించు = ఉసిగొల్పు, అబ్జారేజారక = అబ్జారి + యే + జారక, అబ్జారి = చంద్రుడు, జారు = కిందికి దిగు, కాల్చు = దహించు, వని = అడవి, పజ్జ = దారి, మేలు = క్షేమము)

ఆ రాత్రి ఆపద వస్తుంది అన్న విషయం ముందే తెలియడం వల్ల, భీముడు మొదలైన వారు ఆలోచించి, ఈ విధంగా కౌరవులు మమ్మల్ని ఇక్కడ చంపడానికి ప్రయత్నించడం అన్న ఈ పర్యాయము ఎన్నో పర్యాయము (అంటే, అదివరకు చాలా సార్లు చేశారని), రేపటి రోజున ఈ రాత్రి వచ్చే విపత్తు అన్నది క్షోభపెట్టకుండా మనమే ఉసిగొల్పి చంద్రుడు క్రిందికి దిగక మునుపే లక్క ఇంటిని దహించి అడవి దారిని పోవడమే క్షేమము అని అన్నారు.

28. ఆలము, కాలము, గాలము, మేలము - పదాలను ఉపయోగించి వాతావరణ కాలుష్యంపై

28.29 ఉ. ఆలము చేయకుండ ధర కంతము వచ్చున టన్న సుంతయున్
మేలము లేదు, కశ్మలము మెండుగ నుండగ యన్ని చోట్ల పోఁ
గాలము దాపురించె నన ఘర్మ జలంబులు నిండు, నీ విప
త్కాలము నందు యేమరక ధాత్రిని రక్షణ చేయగావలెన్.

(ఆలముచేయు = యుద్ధముచేయు, ధర = భూమి, అంతము = నాశము, సుంత = కొంచెము, మేలము = పరిహాసము, కశ్మలము = మాలిన్యము, మెండు = అధికము, పోఁగాలము = వినాశ కాలము, దాపురించు = ప్రాప్తించు, ఘర్మజలము = చెమట, విపత్కాలము = ఆపద కలిగిన కాలము, ఏమరు = జాగరూకత లేకుండు, ధాత్రి = భూమి)

యుద్ధం చేయకుండా భూమికి వినాశం వస్తుంది అనడంలో కొంచెం కూడా పరిహాసం లేదు. మాలిన్యము ఎక్కువగా అన్ని చోట్ల ఉండగా వినాశకాలము దాపురించింది అంటే చెమటలు పడతాయే. ఈ విపత్కాలములో జాగ్రత్తగా భూమిని రక్షించుకోవాలి.

29. ఆలము, కాలము, జాలము, వాలము - పదాలను ఉపయోగించి రామాయణార్థంలో

29.30 ఉ. ఆలముఁ జేయు చుండ నొక యమ్మును చాటున నుండి వేయుచున్
జాలము పన్ని వాలి నిటఁ జంపెను రాముడు యార్కిఁ గావ, యా
జ్వాలము యార రేదనుచు, జానకి జాడ కనుంగొనన్ శర
త్కాలము వచ్చె నంచనుచు, తారనుఁ గాంచిన లక్ష్మణుం డనెన్.

(ఆలము = యుద్ధము, అమ్ము = బాణము, చాటు = మరుగు, జాలము = వల, పన్ను = ఏర్పరుచు, ఆర్కి = సుగ్రీవుడు, కాచు = రక్షించు, జ్వాలము = అగ్నిశిఖ, ఆరు = చల్లారు, జానకి = సీత, జాడ = ఆచూకి, కనుంగొను = కనుగొను, శరత్కాలము = వర్షకాలము వెళ్ళిన తర్వాత వచ్చే శరదృతువు, తార = వాలి భార్య, కాంచు = చూచు, లక్ష్మణుడు = రాముని తమ్ముడు)

యుద్ధం చేస్తూ ఉండగా చాటున ఉండి ఒక బాణం వేస్తూ వల పన్ని, ఇక్కడ సుగ్రీవుణ్ణి రక్షించడానికి రాముడు వాలిని చంపాడు. ఆ అగ్నిశిఖ చల్లార లేదు అంటూ, సీత ఆచూకీ తెలుసుకోవడానికి శరదృతువు వచ్చింది అంటూ తారను చూసి లక్ష్మణుడు అన్నాడు.

30. ఆవు, మేక, కుక్క, పిల్లి - పదాలను ఉపయోగించి భారతార్థంలో

30.31 తే.గీ. భీముడన్న యావున్నది, నా మన సిపు
డతని తోడ మమేకము, కుంతి మాత!
యనుచు, బ్రతు కుక్కరి వృకోదరునికి యంకి
త మిడి దురపిల్లిన, హిడింబ తగులుఁ దీరె.

(యావ = ఆసక్తి, మమేకము = మిక్కిలి ప్రేమతో అన్యోన్యముగ నుండుట, ఉక్కరి = శౌర్యవంతుడు, వృకోదరుడు = భీముడు, అంకితము = సమర్పణము, ఇడు = ఇచ్చు, దురపిల్లు = శోకించు, తగులు = అభిలాష)

ఓ, కుంతీ మాతా! భీముడంటే ఆసక్తి ఉంది, నా మనస్సు ఇప్పుడు అతనితో మమేకము అయ్యింది, అని అంటూ జీవితాన్ని శూరుడైన భీమునికి అంకిత మిచ్చి శోకించిన హిడింబ అభిలాష తీరింది.

31. ఇంతలు కన్నులుండ - మనుచరిత్ర లోని పద్యానికి ప్రతిగా కందపద్యము

మనుచరిత్ర లోని పద్యం క్రింద ఇవ్వబడింది:

"ఇంతలు కన్ను లుండ తెరు వెవ్వరి వేడెదు భూసురేంద్ర యే
కాంతము నందు నున్న జవరాండ్ర నెపం బిడి పల్కరించు లా
గింతియ కాక నీవెరుగవే మును వచ్చిన త్రోవచొప్పు నీ
కింత భయంబులే కడుగ నెల్లిద మైతిమె మాట లేటికిన్"

మనుచరిత్ర లోని పద్యానికి సమానార్థకం క్రింద ఇవ్వబడింది:

31.32 కం. జవరా లొంటరి దన లో
కువెగా! కను లుండియు యడుగుదువే త్రోవన్
యవనీసుర! మునుఁ జనిన తె
రు వెరుగుట నెపమ్మె యంచు రూఢిగఁ దెలిసెన్.

(జవరాలు = యౌవనస్త్రీ, ఒంటరి = ఏకాకి, లోకువ = చులకన, అవనీసురుడు = బ్రాహ్మణుడు, మును = పూర్వము,, తెరువు = మార్గము, నెపము = వంక, రూఢి = నిశ్చయము)

పడుచు పిల్ల ఒంటరిగా ఉందంటే లోకువేగా! ఓ బ్రాహ్మణోత్తమా! కళ్ళుండీ త్రోవ అడుగుతావా? అదివరకు వెళ్ళిన త్రోవ తెలుసుకోవడం అన్నది ఒక వంక మాత్రమే అని రూఢిగా తెలిసింది.

32. ఈగ, దోమ, నల్లి, పేను - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

32.33 తే.గీ. సీత కులు పేను యిత్తు నీ జింక ననగ,
లక్ష్మణు డనె, యీా గడ్డి గర్వాడ దేల?
మాయ యేదో మనకు తెల్ల మాయె, రామ!
వెరవు నల్లి మారీచు డీ దరికి వచ్చె.

(ఉలుప = కానుక, ఏను = నేను, గర్వాడు = మేయు, తెల్లము = స్పష్టము, వెరవు = ఉపాయము, అల్లు = రచించు, దరి = సమీపము)

నేను సీతకు ఈ జింకను కానుకగా ఇస్తాను అని అనగా లక్ష్మణు డన్నాడు, రామా! ఈ గడ్డి మేయదు ఎందుకని? మాయ ఏదో మనకి స్పష్ట మయ్యింది, ఉపాయము అల్లి మారీచుడనే రాక్షసుడు ఈ సమీపానికి వచ్చాడు.

33. ఈగ, దోమ, పేను, నల్లి - పదాలను ఉపయోగించి పాలకుల, అధికారుల అవినీతిపై

33.34 తే.గీ. ఈసు కవినీతికి దురాశ కీగడగుచు
సత్య మేదో మదిని దాచి నిత్య నటన
ను విశదముఁ జేయ పట్టపేనుగు లభించు
నను విడంబన నల్లింతు రర్థపతులు.

(ఈసు = ఈర్ష్య, అవినీతి = అన్యాయము, దురాశ = వ్యర్థమైన ఆశ, ఈగడ = ఆచూకి, మది = మనస్సు, నటన = కపటప్రవర్తనము, విశదము = స్పష్టము, పట్టపేనుగు = రాజగజము, విడంబన = మోసము, అల్లించు = అల్లునట్లుచేయు, అర్థపతి = పాలకుడు)

ఈర్ష్యకి, అవినీతికి, దురాశకి జాడగా నిలిచి, నిజమేదో మనస్సులోనే దాచి, ఎప్పుడూ కపట ప్రవర్తనాన్ని బయటకు కనపరిస్తే రాజ్యాధికారము లభిస్తుంది అనే మోసాన్ని పాలకులు రచింప జేస్తారు.

34. ఈగ, దోమ, పేను, నల్లి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

34.35 తే.గీ. నల్లికుట్లతనం బుంచి యుల్ల మందు,
పై కెదో మక్కువ వెలార్చి పాండవులకు,
యీ గల సగము రాజ్యము నీయ కుండ,
కంటితుడుపే నుచిత మనె కౌరవ పతి.

(నల్లికుట్లతనం = బయటపడనితనం లేదా నంగనాచితనం, ఉల్లము = మనస్సు, మక్కువ = ప్రేమ, వెలార్చు = ప్రకటించు, కంటితుడుపు = క్రియలేని సానుభూతి, ఉచితము = తగినది, పతి = రాజు)

నంగనాచితనం మనస్సులో పెట్టుకొని పైకి ప్రేమ ప్రకటించి పాండవులకు ఇవ్వగలిగిన సగము రాజ్యాన్ని ఇవ్వకుండా క్రియలేని సానుభూతే తగునని కౌరవరాజు అన్నాడు.

35. ఈశ, హర, శివ, భవ - పదాలను అన్వార్థంలో ప్రయోగిస్తూ దుర్గాదేవిని స్తుతిస్తూ

35.36 తే.గీ. మోక్షదాయీ శరణు! నాదు మోహ మణఁచి,
యహరహము నా మమత్వము నడ్డుకొనుచు,
శశివదన! నాకుఁ జూపుమా సత్యపథము,
ప్రాభవము లన్ని నీ ముందు పరక, దుర్గ!

(మోక్షదాయి = మోక్ష మిచ్చునది, శరణు = నమస్కారము, మోహము = అజ్ఞానము, అణచు = నశింపచేయు, అహరహము = ప్రతిదినము, మమత్వము = 'నాది' అను భావము, శశివదన = చంద్రుని వంటి ముఖము గలది, పథము = మార్గము, ప్రాభవము = శ్రేష్ఠత్వము, పరక = గడ్డిపోచ)

ఓ! మోక్షదాయీ! శశివదనా! శరణు, నా అజ్ఞానము నశింపచేసి ప్రతిరోజు నా మమత్వాన్ని అడ్డుకుంటూ, నాకు సత్యమార్గము చూపించమ్మా శశివదనా! ప్రాభవాలన్నీ, దుర్గా! నీ ముందు గడ్డిపోచ.

36. ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలము - పదాలతో ఛందస్సౌందర్యాన్ని తెలుపుతూ

36.37 మ. లయగా నుత్పలమాల శబ్దముల హారమ్మై ప్రవర్తిల్లగా,
ప్రియమౌ చంపకమాల నిక్వణము యోంహ్రీంశ్రీంల యావృత్తిగా,
త్రయ ధర్మంబులు చెప్పు పద్య మిడు సౌందర్యంబు శార్దూలమై
హొయ లొల్కన్, గమనంబు పాఠకుల కాహూతమ్ము, మత్తేభమే.

(లయ = సంగీత పరంగా హెచ్చుతగ్గులు లేకుండా గానం సాగడానికి తోడ్పడే ఒక క్రమం, ఉత్పలమాల = కలువల దండ, శబ్దము = వ్యాకరణ శిక్షితమయిన పదము, హారము = దండ, ప్రవర్తిల్లు = వ్యవహరించు, ప్రియము = ఇష్టము, చంపకమాల = సంపెంగ పూల దండ, నిక్వణము = ధ్వని, ఓం హ్రీం శ్రీం = బీజాక్షరాలు, ఆవృత్తి = వల్లెవేయుట, త్రయధర్మములు = ధర్మ, అర్థ, కామములు అనబడే మూడు ధర్మములు, ఇడు = ఇచ్చు, సౌందర్యము = అందము, శార్దూలము = పులి లేక శ్రేష్ఠము, హొయలు = సొగసు, ఒల్కు = చిందు, గమనము = నడక, పాఠకుడు = చదువరి, ఆహూతము = ఆహ్వానము, మత్తేభము = మదించిన ఏనుగు)

ఉత్పలమాల (కలువల దండ) వృత్తము వ్యాకరణ శిక్షితమయిన పదముల దండయై లయబద్ధంగా వ్యవహరించగా, ఇష్టమైన చంపకమాల (సంపెంగ పూలదండ) వృత్తధ్వని బీజాక్షర మంత్రావృత్తిగా,

ధర్మార్థకామములు అనే మూడు ధర్మాలు చెప్పే పద్యం ఇచ్చే అందము శ్రేష్ఠమై (శార్దూల వృత్తమై) సొగసులు చిందగా, నడక చదువరులకు ఆహ్వానము, అది మత్తేభ వృత్తమే (సొగసుగా ఉండే నడక గజగమనమే కదా).

37. ఉబ్బసం, మసూచి, క్షయ, కలరా - పదాలతో అందమైన, ఆరోగ్యవతి అయిన అమ్మాయిని వర్ణన

37.38 తే.గీ. ససికి నవ్వుటె కడుపుబ్బ సంజ్ఞ, యటులె
యాననం బనునది యంతరాత్మ సూచి
క్షయణ మవ నివి, వనితల చక్కదనము
కెలయు, చుక్కలరాయనిఁ గేరు నటుల.

(ససి = ఆరోగ్యము, కడుపుబ్బ = పొట్ట ఉబ్బేటట్లుగా, సంజ్ఞ = చిహ్నము, అటుల = అదే విధముగా, ఆననము = ముఖము, అంతరాత్మ = మనస్సు, సూచి = తెలియజేయునది, క్షయణము = ఆధారము, అవ = అవ్వగా, వనిత = స్త్రీ, చక్కదనము = అందము, కెలయు = విజృంభించు, చుక్కలరాయడు = చంద్రుడు, కేరు = పరిహసించు)

"పక్కల నిలబడి కొలిచే ముచ్చట బాగ తెల్పగ రాదా" అన్న త్యాగరాజు కీర్తనలో ఉన్న ఒక చరణంలో "చుక్కలరాయనిఁ గేరు మోముగల సుదతి సీతమ్మ ..." అని వస్తుంది. ఆ "చుక్కలరాయనిఁ గేరు మోము గల సుదతి సీతమ్మ" లో ఉన్న భావం ఆధారంగా ఈ పద్యం వ్రాశాను. పద్య భావం ఈ విధంగా ఉంది. కడుపుబ్బ నవ్వడమే అరోగ్యానికి చిహ్నము. అదే విధంగా, ముఖము మనస్సుకి సూచి. ఇవి ఆధారం అవ్వగా, స్త్రీల అందము చంద్రుణ్ణి పరిహసించే విధంగా విజృంభిస్తుంది.

38. ఎండ, మండ, కొండ, కండ - పదాలతో అధ్యాపక మనఃస్థితి

38.39 తే.గీ. ఎండకన్నెఱుఁగని వారి కిత్వరులకు
వినయము గలట్టి విద్య మండన మటంచు
చదువు నేర్పుచు కొండంత శ్రయము నిచ్చు
శిక్షకుల కండగ నిలుచు శిష్టు లెవరు?

(ఎండకన్నెఱుఁగని = బయటికి రానట్టి భోగులు, ఇత్వరుడు = దరిద్రుడు, మండనము = భూషణము, కొండంత = గొప్పనైన, శ్రయము = ఊతము, శిక్షకుడు = అధ్యాపకుడు, అండ = ఆసరా, శిష్టుడు = సదాచార సంపన్నుడు)

బయటికి రానట్టి భోగులకి, దరిద్రులకి వినయం ఉన్న విద్య అలంకారమని చదువు చెబుతూ ఊతం ఇచ్చే అధ్యాపకులకి అండగా నిలిచే శిష్టు లెవరు?

39. ఏక్, దస్, సౌ, హజార్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో

39.40 తే.గీ. సౌమ్యముగఁ జెప్పె నిటు చక్రి శాంతనుఁ గని,
యీ సదస్సున శాంతికి యియ్యకొనగ,
యే కురుకుల భాస్వంతుడు యిష్ట పడును,
కురు పితామహ! జారు యభిరతి మిగిలె.

(సౌమ్యము = మృదువు, ఇటు = ఈప్రకారము, చక్రి = శ్రీకృష్ణుడు, శాంతను = భీష్ముడు, కను = చూచు, సదస్సు = సభ, ఇయ్యకొను = సమ్మతించు, భాస్వంతుడు = శూరుడు, పితామహుడు = తాత, జారు = సడలు, అభిరతి = అపేక్ష)

భీష్ముణ్ణి చూసి కృష్ణుడు మృదువుగా ఈ విధంగా చెప్పాడు. ఈ సభలో శాంతికి సమ్మతించడానికి ఏ కురువంశ శూరుడు ఇష్టపడతాడు. కురు పితామహ! సడలే అపేక్ష మిగిలింది.

40. ఏరు, పారు, ఊరు, మారు - పదాలను ఉపయోగిస్తూ పల్లీయ సౌందర్యాన్ని వర్ణిస్తూ

40.41 ఉ. ధారుణి దున్న కర్షకులుఁ దారగ, వచ్చెను యేరువాక, సొం
పారు సుగంధముల్ నెఱయ పల్లెల తొల్కరి వాన వల్ల, గో
చారకు పూజ లందగ విషాణులు, పొంగలి యూరుగాయ క
ర్మారుల యేరు లంది యినమారు మహోత్సవ మందు పంచగస్.

(ధారుణి = నేల, దున్ను = దుక్కిచేయు, కర్షకుడు = రైతు, తారు = బయలువెడలు, ఏరువాక = జ్యేష్ఠ శుద్ధపూర్ణిమ(ఏరువాక పున్నమ)నాడు చేసే పండగ, సొంపారు = ఉల్లాసముగానుండు, సుగంధము = పరిమళము, నెఱపు = వ్యాపింప జేయు, తొల్కరి వాన = ఎండాకాలం తరవాత నేల పదునుకావటానికి కురిసే వాన, వల్ల = వలన, గోచారకుడు = గొల్లవాడు, విషాణి = ఎద్దు, పొంగలి = పాలుచేర్చి పొంగించునట్టి అన్నము లేక చక్కెరపొంగలి, ఊరుగాయ = ఉప్పులో ఊరవేయఁబడిన మామిడికాయ మొదలైనవి, కర్మారుడు = కమ్మరవాడు, ఏరు = నాగలి, ఇనమారు = పొలమును అడ్డముగా నిలువుగాను రెండుమార్లు దున్నుట, మహోత్సవము = గొప్ప పండుగ)

నేలను దున్నడానికి రైతులు బయలుదేరగా, పల్లెలలో తొలకరి వాన కురవడం వలన ఉల్లాసమైన పరిమళాలు వ్యాపించగా, ఎద్దులు గొల్లవారి పూజలు అందుకోగా, కమ్మరులు చేసిన నాగళ్ళు అందుకొని పొలాన్ని రెండుమార్లు దున్నే పండుగలో పొంగలి, ఊరుగాయ పంచడానికి ఏరువాక వచ్చింది.

41. ఒజ్జ, వెజ్జు, బొజ్జ, గుజ్జు - పదాలతో వినాయక చవితి

41.42 కం. ఒజ్జవు చదువుకు, పరతురు
వెజ్జుగ నినుఁ గొల్వ యేక వింశతి దళముల్,
బొజ్జను సృష్టి నిముడు మరు
గుజ్జువు, గణనాయకా! సుగుణ సంకాశా!

(ఒజ్జ = గురువు, వెజ్జు = వైద్యుడు, ఏకవింశతి = ఇరవై ఒకటి, దళములు = ఆకులు, బొజ్జ = ఉదరము, మరుగుజ్జు = మిక్కిలి పొట్టివాడు, సంకాశా = సదృశుడా)

మరుగుజ్జు రూపంలో ఉన్న సుగుణాల రాశివైన గణనాథా! చదువుకు గురువువు. వైద్యుడవని నిన్ను పూజించుటకు ఇరవై ఒక్క రకాల ఆకులని (ఈ ఆకులు ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు) పరుస్తారు. సృష్టిని ఉదరంలో ఇముడ్చుకున్న వాడవు.

42. కంది, పెసర, సెనగ, మినుము - పదాలను ఉపయోగిస్తూ పార్వతీ కళ్యాణము గురించి

42.43 కం. మరుడు పరాస్కందిగఁ గను
మరుగైఁ జొనిపె సరముల సుమము లీశునిపై,
మురిసె నగజ, మెచ్చ సురలు
కరగ్రహము జరిగె, వేడుకలు మినుముట్టన్.

(మరుడు = మన్మథుడు, పరాస్కంది = దొంగ, కనుమరుగు = చూపుకు తగులకుండా పోవు, చొనుపు = గుచ్చు, సరము = బాణము, సుమము = పుష్పము, ఈశుడు = శివుడు, మురియు = సంతోషించు, నగజ = పార్వతి, మెచ్చు = పొగడు, సురలు = దేవతలు, కరగ్రహము = వివాహము, వేడుక = సంబరము, మినుముట్టు = ఆకాశాన్ని అంటు)

మన్మథుడు దొంగలాగా కనపడకుండా శివునిపై శరపుష్పాలు గుచ్చాడు. పార్వతి సంతోషించింది. దేవతలు స్తుతించగా సంబరాలు మిన్ను ముట్టగా వివాహం జరిగింది.

43. కందు, సందు, మందు, విందు - పదాలతో భాగవతార్థంలో

43.44 కం. సందుకొన విషము నీటను
కందుకమును విసరి నాగుఁ గనుగొను మిషఁ, గా
ళింది హ్రదమం దుఱికి, గో
విందుడు కాళీయు దర్విఁ బ్రేంఖణ మాడెన్.

(సందుకొను = వ్యాపించు, కందుకము = బంతి, నాగు = పాము, మిష = నెపము, హ్రదము = లోతుమడుగు, ఉఱుకు = దూకు, గోవిందుడు = శ్రీకృష్ణుడు, దర్వి = పాముయొక్క పడగ, ప్రేంఖణము = నృత్యవిశేషము)

నీటిలో విషం వ్యాపించగా, బంతిని విసిరి పామును కనుగొనే వంకతో కాళింది మడుగులో దూకి శ్రీకృష్ణుడు కాళీయుని పడగపై నృత్యమాడాడు.

44. కక, గగ, తత, నన - పదాలను ఉపయోగిస్తూ కర్ణుని దానశీలాన్ని గురించి

44.45 తే.గీ. గగనమణి మాట జవదాటి, కర్ణు డొసగె
వాసవుకు తతరతి మ్రొక్కి, వపువుఁ గోసి
కవచకుండలములు, మేన నవక మలరెఁ
గాని, దాన మాశలఁ జేసె కకవికలుగ.

(గగనమణి = సూర్యుడు, జవదాటు = అతిక్రమించు, ఒసగు = ఇచ్చు, వాసవుడు = ఇంద్రుడు, తతరతి = మిక్కిలి సంతోషంతో, మ్రొక్కు = నమస్కరించు, వపువు = శరీరము, మేను = శరీరము, నవకము = మృదుత్వము, అలరు = కలుగు, కకవికలు = చెల్లాచెదరు)

సూర్యుని మాట జవదాటి, కర్ణుడు ఇంద్రునికి ఆనందంతో నమస్కరించి శరీరం కోసి కవచకుండలాలు ఇచ్చాడు. శరీరంలో మృదుత్వము కలిగింది కానీ, దానము ఆశలను చెల్లాచెదరు చేసింది.

45. కటి, కిటి, తటి, నటి - పదాలను ఉపయోగిస్తూ సూర్యోదయాన్ని వర్ణిస్తూ

45.46 తే.గీ. కటికచీకటి నోర్చి యూరటను పొంద,
వెలుగు రేఖలు కిటికీల బెలము లందుఁ
జొరబడి తటిత్తుఁ వోలె ప్రస్ఫురము నింప,
యెన్నటి వలె పూర్వాచల మెక్కె నినుడు.

(కటికచీకటి = చిమ్మచీకటి, ఓర్చు = సహించు, ఊరట = ఉపశమనం, రేఖ = దొంతర, బెలము = రంధ్రము, చొరబడు = ప్రవేశించు, తటిత్తు = మెరుపు, వోలె = వలె, ప్రస్ఫురము = తేజస్సు, ఎన్నటివలె = వెనుకటి మాదిరిగా, పూర్వాచలము = తూర్పుకొండ, ఎక్కు = అధిరోహించు, ఇనుడు = సూర్యుడు)

చిమ్మచీకటిని సహించి ఉపశమనం పొందడానికి, వెలుగు దొంతరలు కిటికీల రంధ్రాలలో దూరి మెరుపు లాగా తేజస్సు నింపగా, ఎప్పటి లాగానే సూర్యుడు తూర్పు కొండను ఎక్కాడు.

46. కట్టు, గట్టు, పట్టు, రట్టు - పదాలతో ద్రౌపది మాతృహృదయం

46.47 తే.గీ. కట్టుబాట్ల నశ్వత్థామఁ గడచి మూటఁ
గట్టుకొనె నా సుతులఁ జంపి ఖలము, వాని
పట్టుకొని వధింపఁ గలమె, వాని మాత
రట్టుఁసేయదే, యని కృష్ణఁ గ్రందె మిగుల.

(కట్టుబాటు = నియమము, కడచు = అతిక్రమించు, మూటగట్టుకొను = ఆర్జించుకొను, సుతుడు = కుమారుడు, ఖలము = పాపము, వధించు = చంపు, మాత = తల్లి, రట్టుసేయు = నిందసేయు, కృష్ణ = ద్రౌపది, క్రందు = విలపించు, మిగుల = మిక్కిలి)

అశ్వత్థామ నియమము అతిక్రమించి నా కుమారులను చంపి పాపము మూట గట్టుకున్నాడు. వానిని పట్టుకొని చంపగలమా? వాని మాతయైన కృపి నిందించదా? అని ద్రౌపది మిక్కిలి దుఃఖించింది.

47. కట్టె, నిప్పు, బూది, మసి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ పచ్చని ప్రకృతిని వర్ణిస్తూ

47.48 తే.గీ. కట్టెదుట సరోవరము, చెంగలువల విరి

హారములు, యంచకొదమ సింగార, మంశు
వడర నిప్పుడమికి యదనంచుఁ, గోళ్ళు
సుస్వరం బూది హరిత వసుధను లేపె.

(కట్టెదుట = సరిగ్గా ఎదురుగా, సరోవరము = దివ్యమైన కొలను, చెంగలువ = ఎఱ్ఱకలువ, విరి = పువ్వు, అంచకొదమ = చిన్న హంస, సింగారము = అందము, అంశువు = కాంతి, అడరు = శోభించు, పుడమి = భూమి, అదను = తగిన సమయము, సుస్వరం = మంచి కంఠధ్వని, ఊదు = నోటితో వేగముగా గాలిని విడుచు, హరిత = ఆకుపచ్చ వర్ణము, వసుధ = భూమి, లేపు = లేవఁజేయు)

సరిగ్గా ఎదురుగా సరస్సు, ఎఱ్ఱకలువ పూల హారాలు, చిన్న హంస అందము, కాంతి వ్యాపించగా ఈ భూమికి సరియైన సమయం అని కోళ్ళు మంచి కంఠధ్వని ఊది పచ్చని నేలను నిద్ర లేపాయి.

48. కడ, జడ, దడ, వడ - పదాలను ప్రయోగిస్తూ ఎన్నికల ఫలితాలకై ఎదురుచూసే అభ్యర్థుల ఉత్కంఠస్థితిని వర్ణిస్తూ

48.49 కం. కడగండ్లఁ బడుచు, యెన్నిక
జడధి నెగసి, ఫలితములు విశదమగు వేళస్,
దడ పుట్టు నేల నీకన,
వడకెడు నేతకుఁ దెలియును, పౌరుల తీర్పుల్.

(కడగండ్లు = కష్టములు, జడధి = సముద్రము, ఎగయు = దాటు, విశదము = స్పష్టము, వేళ = సమయము, దడ = వణకు, వడకు = కంపించు, పౌరుడు = నాగరికుడు, తీర్పు = న్యాయము)

కష్టాలు పడుతూ ఎన్నిక అనే సముద్రాన్ని దాటి ఫలితాలు బయటపడే సమయంలో నీకు వణకు ఎందుకు వస్తుంది అంటే కంపించే నాయకుడికి నాగరికుల తీర్పులు తెలుస్తాయి.

49. కత్తి, బాకు, డాలు, విల్లు - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

49.50 తే.గీ. అందకత్తియ! వీ భీము ముందు నిలచి
తివి, హిడింబా! కుపితుడ నైతిని, విను మిక,
నీదు జ్యేష్ఠుడా లుల్లిగాని మద మణచ,

సంభవిల్లును శాంతి, యీ సమజ మందు.

(అందకత్తియ = సౌందర్యవతి, కుపితుడు = కోపించినవాడు, జ్యేష్ఠుడు = అన్న, ఉల్లిగాడు = నీచుడు, మదము = గర్వము, అణచు = నశింపచేయు, సంభవిల్లు = కలుగు, సమజము = అడవి)

సౌందర్యవతివి ఈ భీమసేనుని ముందు నిలిచావు, హిడింబా! కోపంతో ఉన్నాను, ఇక వినుము, నీ అన్న ఆ నీచుడి గర్వము పోగొడితే ఈ అడవిలో శాంతి లభిస్తుంది.

50. కదనము, రదనము, వదనము, సదనము - పదాలతో వర్తమాన సాంఘిక సమస్యల గురించి

50.51 చం. కదనము వంటి యెన్నికలు, కల్లును మానని కష్టజీవులుస్,
రదనము లూడినస్ తమ స్వలాభమెఁ జూచెడి పౌరులుస్, దురా
సదనము లాశలై బ్రతుకు సంతుకు యూరక వచ్చునట్టి యా
స్వదనము లందు వాపిరియు, సాంఘిక న్యాయము ధిక్కరించవే?

(కదనము = యుద్ధము, రదనము = దంతము, దురాసదనము = పొందరానిది, సంతు = సంతానము, ఊరక = ఉచితంగా, ఆస్వదనము = అనుభవించుట, వాపిరి = అధికమైన కోరిక, సాంఘిక న్యాయము = సమాజంలోని అసమానతలను తొలగించే విధంగా ప్రజలందరకూ కల్పించే సంక్షేమం, ధిక్కరించు = ప్రతిఘటించు)

యుద్ధము లాటి ఎన్నికలు, కల్లు త్రాగడం మానని కష్టజీవులు, పళ్ళు ఊడినా కూడా తమ స్వార్థమే చూసుకొనే పౌరులు, పొందరానివి ఆశలుగా బ్రతికే సంతానానికి ఉచితంగా వచ్చే అనుభవాల మీద అధికమైన కోరిక, సాంఘిక న్యాయాన్ని ప్రతిఘటించవా?

51. కన్ను, చెన్ను, పన్ను, దన్ను - పదాలను ఉపయోగిస్తూ హనుమంతుని వర్ణిస్తూ / స్తుతిస్తూ

51.52 శా. పుట్టెన్ యెక్కుడుకన్నువానిఁ గరుణన్, భోజ్యంబుగా సూర్యుఁ జే
పట్టెన్ చెన్నుగ బాల్య చాపలమునన్, బ్రాయంబునన్ స్నేహమున్
కట్టెన్ వానర రాజుతో, వనమునన్ కంజాక్షు నాపన్ను క
న్పెట్టన్ రాముగ దన్నుగా నిలచె, వానిన్ బావనిన్ వేడెదన్.

(ఎక్కుడుకన్నువాడు = మూడోకన్ను ఉన్న శివుడు, కరుణ = దయ, భోజ్యము = భుజింపదగినది, చేపట్టు = గ్రహించు, చెన్నుగ = విలాసంగా, చాపలము = చాంచల్యము, ప్రాయము = వయస్సు, వనము = అడవి, కంజాక్షుడు = తామర పువ్వు వంటి కనులు కలవాడు, ఆపన్నుడు = ఆపదనొందినవాడు, కన్పెట్టు = కనుగొను, దన్ను = అండ, పావని = హనుమంతుడు, వేడు = ప్రార్థించు)

శివుని దయతో జన్మించాడు. బాల్యచాపల్యంతో సూర్యుణ్ణి భుజింపదగినదిగా విలాసంగా గ్రహించాడు. వయసు మీరిన తరువాత వానర రాజైన సుగ్రీవుడితో స్నేహము కట్టాడు. అడవిలో తామరనేత్రుని ఆపదలో ఉన్నవాణ్ణి రాముడిగా కనిపెట్టగా అండగా నిలిచాడు. అట్టి వాడైన హనుమంతుని ప్రార్థిస్తాను.

52. కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

52.53 తే.గీ. ఏలఁ గలిగెనో రుష యని యెంచఁ దెలియు
రాజ్య మొక ముక్కుచితముగ లభ్య మవగ,
పెంచె విజయుడు వైరులఁ ద్రుంచి యనుచు,
కన్నుకుట్టెను రారాజు కన్నఁ జూచి.

(రుష = కోపము, ఎంచు = విచారించు, ముక్క = ఖండము, ఉచితము = ఊరకే వచ్చునది, లభ్యము = సంప్రాప్తి, పెంచు = వృద్ధిచేయు, విజయుడు = అర్జునుడు, వైరి = శత్రువు, త్రుంచు = చంపు, కన్నుకుట్టు = అసూయపడు, రారాజు = దుర్యోధనుడు)

ఎందుకు కోపం వచ్చిందో అని విచారిస్తే తెలుస్తుంది, రాజ్యంలో ఒక ఖండము తేరగా దొరకగా అర్జునుడు శత్రువులని చంపి దాన్ని విస్తరించాడని దుర్యోధనుడికి తన అన్నయైన ధర్మరాజుని చూసి అసూయ కలిగింది.

53. కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ దీపావళి సంబరాలను వర్ణిస్తూ

53.54 తే.గీ. సాత ముక్కుమిగుల బాణసంచు కాల్చి
కన్నుచెదఱు కాంతులతో జగతిని నింపి
పరిసరముల పెడచెవిఁబెట్టు రటితమ్ము
ఏలనో రుచిరంబయ్యె నీ విధాన?

(సొతము = సంతోషము, ఉక్కుమిగులు = అతిశయించు, బాణసంచు = దీపావళి నాటి రాత్రి తుపాకి మందు చేర్చి కాల్చెడు మతాబులు పూలవత్తులు మొదలగునవి, కన్నుచెదఱు = మిఱుమిట్లు గొలుపు, జగతి = లోకము, పరిసరములు = పర్యావరణము, పెడచెవిఁబెట్టు = అలక్ష్యముసేయు, రటితము = అగ్నిజ్వాలాధ్వని, రుచిరము = మనోరంజనము)

సంతోషము అతిశయించేటట్లుగా బాణసంచా కాల్చి మిఱుమిట్లు గొలిపే కాంతులతో లోకాన్ని నింపి పర్యావరణాన్ని అలక్ష్యము చేసే అగ్నిజ్వాలాధ్వని ఎందు చేత ఈ విధంగా మనోరంజన మయింది?

54. కన్ను, ముక్కు, చెవి, నోరు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో

54.55 తే.గీ. దాగి వార్ముక్కు మాటున దాడిచేసి
తాటకన్నుఱిమెను భరతాగ్రజుండుఁ
గాచె విపినంబు, వెన్నుసఱచెను యామె
సుతుల నోరువమిని, గాధిజుండు మెచ్చ.

(దాగు = మరుగుపడు, వార్ముక్కు = మేఘము, మాటు = మరుగు, దాడిచేయు = దండెత్తు, నుఱుము = చంపు, భరతాగ్రజుడు = శ్రీరాముడు, కాచు = రక్షించు, విపినము = అడవి, వెన్నుసఱచు = పారద్రోలు, సుతుడు = కుమారుడు, ఓరువమి = అసహనం, గాధిజుడు = విశ్వామిత్రుడు, మెచ్చు = శ్లాఘించు)

విశ్వామిత్రుడు మెచ్చుకొనగా, మేఘము చాటున దాక్కుని దాడిచేసి తాటక అను రాక్షసిని శ్రీరాముడు చంపాడు, అడవిని కాపాడాడు, అసహనంతో ఆమె పుత్రులైన మారీచ సుబాహులను పారద్రోలాడు.

55. కమ్, సిట్, గో, రస్ (లోకము - ఈసిటుల (ఈసు+ఇటుల) - గోవు - కోరను... ఈ విధంగా) - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో

55.56 కం. ఆకస్మికమ్ముగ మృగము
తేకువ గని, రక్క సిటులె తిరుగును రామా!
పోకుము గోప్యము తెలిసి ప
రాకునఁ, గోరస్ సతి యని, లక్ష్మణు డనియెస్.

(ఆకస్మికము = హఠాత్తు, మృగము = లేడి, తేకువ = ఉత్సాహము, కను = చూచు, రక్కసి = రాక్షసుడు, ఇటుల = ఈ ప్రకారముగ, గోప్యము = రహస్యము, పరాకు = ఏమఱుపాటు, సతి = భార్య)

హఠాత్తుగా లేడి ఉత్సాహాన్ని చూసి రాక్షసుడు ఇలాగే తిరుగుతాడు, రామా! భార్య కోరిందని రహస్యము తెలిసి కూడా ఏమఱుపాటుగా వెళ్ళకు అని లక్ష్మణుడు అన్నాడు.

56. 'కర' తో నాలుగు పాదాలను ప్రారంభిస్తూ మకర సంక్రమణాన్ని వర్ణిస్తూ

56.57 మ. కర సంస్పర్శలు, కోడి పందియములున్, గంగెద్దు యాటల్, యలం
కరణంబుల్ బలు రంగవల్లుల, యసంఖ్యాకమ్ముగా భక్ష్యముల్,
కరణీయమ్మగు దానముల్, మకర సంక్రాంతిన్ గనన్ దక్కు నే
కరణిన్ జేతురొ యన్ని గ్రామములలో క్ష్మాజుల్ విశేషమ్ముగన్.

(సంస్పర్శ = బాగా కలుపుట, పందియము = పందెము, గంగెద్దు = గంగిరెద్దు, అలంకరణము = అలంకరించుట, పలు = అనేక, రంగవల్లి = ముగ్గు, అసంఖ్యాకము = అపరిమితమైన, భక్ష్యము = తినుబండారము, కరణీయము = చేయదగిన, కనన్ = చూచుటకు, దక్కును = లభించును, కరణి = విధము, క్ష్మాజుడు = కర్షకుడు, విశేషము = అతిశయము)

కరచాలనాలు, కోడి పందెములు, గంగిరెద్దు ఆటలు, అనేకమైన ముగ్గులతో అలంకరించడాలు, లెక్క లేనన్ని తినుబండారాలు, చేయదగిన దానాలు అన్ని గ్రామాలలో రైతులు విశేషంగా ఏ విధంగా చేస్తారో మకర సంక్రాంతి నాడు చూడగలుగుతాము.

57. 'కరము' అను పదము నాలుగు పాదముల వచ్చునట్లు స్త్రీ వర్ణన మహాస్రగ్ధరలో

57.58 పరుధుల్ లేకుండ యెన్నో వ్యతికరములు పైఁబడ్డ ధైర్యంబుగన్ ని
ల్చిరటంచున్, ప్రేమమున్ పంచి మృదుకరములన్ జిన్ని పాపాయిలన్ బెం
చి రటంచున్, విద్య నేర్పించిన యకరము లే క్షేత్ర మందుండ వంచున్
పురుషాహంకార లోకంబున, సుకరముగా పూజలందెన్ లతాంగుల్.

(పరిధి = హద్దు, వ్యతికరము = క్షోభము, పైబడు = ప్రాప్తించు, కరములు = చేతులు, అకరము = పనిచేయనిది, క్షేత్రము = విషయ క్షేత్రము, అహంకార = గర్వము, సుకరము = సులభమైన, పూజ = అర్చన, లతాంగి = స్త్రీ)

హద్దులు లేకుండా ఎన్నో సంక్షోభాలు ఎదురైనా ధైర్యంగా నిలబడ్డారనీ, తమ మెత్తటి చేతుల్లో చిన్ని పాపాయిలను ప్రేమను పంచి పెంచారనీ, విద్య నేర్పిస్తే ఏ క్షేత్రంలో కూడా చేయలేనిది ఉండదనీ, పురుషాహంకార లోకంలో స్త్రీలు సులభంగా పూజ లందుకున్నారు.

58. కరము, కారము, కోరము, కీరము - పదాలతో

58.59 కం. చాకోరము చంద్రద్యుతి
నేకోరి నటుల వరింపకీ రము, నేలా
యాకరము, కీచకుడన తృ
ణీకారము, ద్రౌపదీ! యని యతండడిగెన్.

(చాకోరము = చకోరపక్షుల గుంపు, చంద్రద్యుతి = చంద్రకాంతి, ఏకోరు = మిక్కిలిగా కోరు, వరించు = కోరు, రముడు = మన్మథుడు, ఆకరము = ఆగ్రహము, తృణీకారము = అలక్ష్యము, కృష్ణ = ద్రౌపది)

చకోరపక్షుల గుంపు చంద్రకాంతిని మిక్కిలిగా కోరినట్లుగా, ఈ మన్మథుని వరింపక ఏల ఆగ్రహము, కీచకు డంటే అలక్ష్యము అని అతడు అడిగాడు.

59. కరము, తరము, వరము, హరము - పదాలను ఉపయోగించి రాయబారానికి పోనున్న కృష్ణుని ముందు ద్రౌపది వ్యక్తపరచిన ఆవేదనను గూర్చి

59.60 చం. కరమునుఁ ద్రుంచగా వలయు కయ్యము నందున దుస్సేను కా
వరము నడంచ, యూరువుల భంగ మొనర్చగ వాని యన్న మో
హరమునఁ గూలగా వలయు, హస్తినకున్ జని, శౌరి! సంధి వి
స్తరముగ చర్చఁ సేయు తరి, జ్ఞప్తికి రావలె నీ సఖీ వ్యథల్.

(కరము = చేయి, త్రుంచు = ముక్కలుచేయు, వలయు = ఆవశ్యకమగు, కయ్యము = యుద్ధము, దుస్సేనుడు = దుశ్శాసనుడు, కావరము = గర్వము, అడంచు = అణచు, ఊరువు = తొడ, భంగము = చీలుట, ఒనర్చు = చేయు, మోహరము = యుద్ధము, కూలు = కూలబడు, చను = వెళ్ళు, శౌరి = కృష్ణుడు, విస్తరము = వివరములతో కూడినది, తరి = సమయము, జ్ఞప్తి = జ్ఞాపకము, సఖి = స్నేహితురాలు, వ్యథ = బాధ)

యుద్ధంలో దుశ్శాసనుడి గర్వం అణచడానికి చేయి ముక్కలు చెయ్యాలి, తొడలు పగలగొట్టడం వలన వాని అన్నయైన దుర్యోధనుడు యుద్ధంలో కూలి పడిపోవాలి, కృష్ణా! హస్తినాపురం వెళ్ళి సంధి గురించి వివరంగా చర్చించే సమయంలో నీ సఖియైన ద్రౌపది బాధలు గుర్తుకు రావాలి.

60. కరము, వరము, సరము, తరము - పాదాదిన వచ్చునట్లుగా ఉగాది పరంగా

60.61 మ. కరముల్ మోడిచి బంధు మిత్రులకు సత్కారంబుఁ గావించి, య
ధ్వరముస్ బోలెడు పుణ్య కార్యములలో పాల్గొంచు, రానున్న వ
త్సర మూహించి, యుగాది సంబరము నాస్వాదించి, వర్జింతు మం
తరముల్, రాశి ఫలంబులస్ వినుచు ద్వంద్వంబన్న జ్ఞానంబుతో.

(కరము = చెయ్యి, మోడుచు = జోడించు, సత్కారము = సన్మానము, కావించు = చేయు, అధ్వరము = యజ్ఞము, వోలు = సరితూగు, పాల్గొను = పాలుపంచుకొను, వత్సరము = సంవత్సరము, ఊహించు = అంచనావేయు, సంబరము = సంతోషము, ఆస్వాదించు = అనుభవించు, వర్జించు = విడిచిపెట్టు, అంతరము = భేదము, ద్వంద్వము = శీతోష్ణాదులు, జ్ఞానము = తెలివి)

చేతులు జోడించి బంధు మిత్రులకు సన్మానం చేసి, యజ్ఞం లాంటి పుణ్య కార్యాలలో పాలుపంచుకొని, వచ్చే సంవత్సరం గురించి అంచనాలు వేసి, ఉగాది సంతోషాన్ని అనుభవించి, రాశి ఫలాలు వింటూ సుఖదుఃఖాలు, శీతోష్ణాలు వంటి ద్వంద్వాల గురించిన జ్ఞానంతో, అంతరాలని విడిచిపెట్టేస్తాము.

61. కరి, గిరి, దరి, సిరి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దేశభక్తిని ప్రబోధిస్తూ స్వేచ్ఛాచ్ఛందంలో

61.62 తే.గీ. స్వీకరించి దీక్షను దేశ సేవ సలుప
స్వంతలాభము నిగిరించి సాయపడుచు
నాదరించి మంచిని చెడు నడ్డుకొనుచు
యంకితముఁ జేసిరి బ్రతు కే జంకు లేక.

(స్వీకరించు = అంగీకరించు, దీక్ష = పట్టుదల, సలుపు = చేయు, ఇగిరించు = ఇగిరిపోవునట్లు చేయు, ఆదరించు = సంభావించు, అడ్డుకొను = అభ్యంతరపెట్టు, అంకితము = సమర్పణము, జంకు = భయము)

దేశ సేవను చేయడానికి దీక్షను స్వీకరించి, స్వంతలాభము నశింపజేసుకొని సాయం చేస్తూ, మంచిని ఆదరించి చెడును నివారిస్తూ బ్రతుకును ఏ భయము లేకుండా అంకితం చేశారు.

62. కరోమి, కవయామి, వయామి, యామి - అను పదములు వచ్చునట్లు విష్ణుస్తవము

62.63 ఉ. కాసువు వంకరో మితముగాఁ బలుకుస్ సుతు డంచు విష్ణుపై
ధ్యాసకు వాడు చేరికవ యా మిడుకుస్ సమయింపఁ, జూప మం
చీసున కశ్యపాత్మజుడు యిచ్చట కంటివ యా మిసస్ యటం
చా సుకుమారుఁ గోర యట యా మిష దీపిలు చక్రిఁ గొల్చెదస్.

(కాసువు = బుద్ధి, వంకర = దోషము, మితము = తక్కువగా, ధ్యాస = ఆలోచన, చేరిక = సమీపము, అవ = అవ్వగా, మిడుకు = బ్రతుకు, సమయించు = నాశముచేయు, ఈసు = కోపము, కశ్యపాత్మజుడు = కశ్యపుని పుత్రుడైన హిరణ్యకశిపుడు, కంటివ = చూచితివా, మిస = కాంతి, సుకుమారుడు = కోమలమైనవాడు, మిష = నెపము, దీపిలు = ప్రకాశించు, చక్రి = విష్ణువు, కొల్చు = ఆరాధించు)

తక్కువగా మాట్లాడతాడు నా పుత్రుడు, ఏమన్నా బుద్ధి దోషమా అని అనుకుంటూ, విష్ణువు మీద ధ్యాసకు వాడు దగ్గర అవ్వగా, యా జీవితం నాశనం చెయ్యడానికి, హిరణ్యకశిపుడు కోపంతో చూపించు, ఇక్కడ చూశావా ఆ వెలుగుని అని ఆ సుకుమారుణ్ణి కోరగా అక్కడ ఆ వంకతో ప్రకాశించిన విష్ణువును ఆరాధిస్తాను.

63. కల, తల, మర, వస - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ పెండ్లి విందును వర్ణిస్తూ

63.64 కం. వలను మరచి వధువు నిడెడు
కులపెద్దల వసతి తెగడిఁ గోర్కెలు పెంచస్
కలహింతురు విడిదింటను
తలపోయుచు పెండ్లి విందుఁ దక్కువచేయస్.

(వలను = పెద్దఱికము, ఇడు = ఇచ్చు, వసతి = సౌకర్యం, తెగడు = నిందించు, కలహించు = జగడమాడు, విడిదిల్లు = విడిది గృహం, తలపోయు = ఆలోచించు, తక్కువచేయు = కించపఱచు)

పెద్దఱికము మర్చిపోయి పిల్ల నిచ్చే కులపెద్దల సౌకర్యాన్ని నిందిస్తూ కోర్కెలు పెంచడానికి, పెళ్ళి విందును తక్కువచేయడానికి ఆలోచిస్తూ విడిది గృహంలో జగడమాడుతారు.

63.65 కం. కలగలుపు పప్పు, కూరలు,
విలముల గారెలు, మిఠాయి, వింతల రుచులున్,
యిలువిందుల కమర సుఖము
కలిగించ వసతికి లోటుఁ గలదే పెండ్లిన్?

(కలగలుపు = అన్నీ కలిపిన, విలము = రంధ్రము, ఇలువిందు = అతిథి, అమరసుఖము = స్వర్గసుఖము, వసతి = సౌకర్యం, లోటు = లోపము)

కలగలుపు పప్పు, కూరలు, చిల్లిగారెలు, తీపి పదార్థములు, వింతైన రుచులు అతిథులకు స్వర్గసుఖము కలిగించగా పెళ్ళిలో సౌకర్యానికి లోపము ఉందా?

64. కల, తల, వల, వెల - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ సంక్రాంతి సంబరాలపై

64.66 తే.గీ. కోవెలల రుతములు మ్రోగ కోవె లందు,
కుతల మంతయు మ్రుగ్గుల కుదురుకొలిపి
సతులు వలకట్ట, సంక్రాంతి సంబరములు
సకల సృష్టికి నూత నోత్సాహ మొసగె.

(కోవెల = కోయిల లేదా గుడి, రుతము = ధ్వని, కుతలము = భూమి, కుదురుకొలుపు = నెలకొలుపు, సతి = స్త్రీ, వలకట్టు = అనుకూలపఱచు, సంబరము = ఉత్సవము, సకల = సమస్త, సృష్టి = జగత్తు, నూతన = క్రొత్త, ఉత్సాహము = సంతోషము, ఒసగు = ఇచ్చు)

కోయిలల కూతలు గుడిలో ధ్వనించగా, భూమి యంతటా మ్రుగ్గులు నెలకొల్పి స్త్రీలు అనుకూలపరచగా, సంక్రాంతి ఉత్సవాలు జగతికి క్రొత్త ఆనందం ఇచ్చాయి.

65. కలము, చలము, తలము, బలము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

65.67 తే.గీ. ఏకలమును వేటాడిన యింద్ర తనయుఁ
గనిన హరు డచ్చలముఁ జూపె, కనలి నరుడు
యుత్తలమునఁ బోరుకు దిగి యోడిపోయి,

బలముఱి భవు వేడిఁ బడసె పాశుపతము.

(ఏకలము = అడవిపంది, ఇంద్రతనయుడు = అర్జునుడు, కను = చూచు, హరుడు = శివుడు, అచ్చలము = ఆగ్రహము, కనలు = కోపించు, నరుడు = అర్జునుడు, ఉత్తలము = తొందరపాటు, పోరు = యుద్ధము, బలముఱి = బలము కలవాడు, భవుడు = శివుడు, వేడు = ప్రార్థించు, పడయు = పొందు)

అడవిపందిని వేటాడిన అర్జునుణ్ణి చూసిన శివుడు ఆగ్రహము చూపించాడు. కోపించి అర్జునుడు తొందరపాటున యుద్ధానికి దిగి ఓడిపోయి బలవంతుడైన శివుణ్ణి ప్రార్థించి పాశుపతాస్త్రం పొందాడు.

66. కలము, బలము, హలము, పొలము - పదాలతో స్వేచ్ఛావృత్తంలో ఆత్మహత్యలు చేసుకొనవద్దని రైతులకు ధైర్యం చెప్తూ

66.68 చం. కలకల మాత్మహత్య లిక కర్షకు లార! యతీతమే, యుపో
ద్బలమును గిట్టుబాటు ధర పంటలకుస్ యిడి, కర్షణస్ కుతూ
హలమును రేపుచుస్ ఋణ సహాయము నిచ్చి, యనేక చర్యలస్
పొలముల సాగు కండయి, యపోహలు తీర్చు ప్రభుత్వ ముండగస్.

(కలకలము = రొద, ఇక = ఇకమీద, కర్షకుడు = రైతు, అతీతము = గతమైనది, ఉపోద్బలము = ప్రోత్సాహము, గిట్టుబాటు = అమ్మకపు లాభము, ధర = వెల, ఇడు = ఇచ్చు, కర్షణ = సేద్యము, కుతూహలము = ఆసక్తి, రేపు = పురికొలుపు, ఋణ = అప్పు, చర్య = ఆచరణ, పొలము = చేను, సాగు = వ్యవసాయము, అండ = ఆసరా, అపోహ = అనుమానము, తీర్చు = తొలగించు)

ఓ, రైతులారా! ప్రోత్సాహాన్నీ పంటలకు గిట్టుబాటు ధరనీ ఇచ్చి, సేద్యంలో ఆసక్తిని రేపుతూ ఋణ సహాయము ఇచ్చి, అనేక చర్యల ద్వారా పొలాల సాగుకు ఆసరా అయ్యి అనుమానాలు తీర్చే ప్రభుత్వము ఉండగా, ఇక మీద రొద ఆత్మహత్యలూ గతమే.

67. కలి, చలి, చెలి, బలి - పదాలను ఉపయోగిస్తూ కుచేలుని గురించి

67.69 కం. చెలికాడు సహాధ్యాయని
కలిసి కుచేలు డటుకు లిడఁ, గడు లేమిఁ గనస్
యలఁతి చలించిన కృష్ణుడు

కలిమి యతని కబ్బ, లిప్స కాట్పడఁ, జేసెస్.

(చెలికాడు = స్నేహితుడు, సహాధ్యాయి = సహపాఠి, ఇడు = ఇచ్చు, కడు = మిక్కిలి, లేమి = బీదరికము, కను = చూచు, అలఁతి = కొలది, చలించు = కదలు, కలిమి = సంపద, అబ్బు = ప్రాప్తించు, లిప్స = కోరిక, కాట్పడు = నశించు)

స్నేహితుడు తనతో కలిసి చదువుకున్న వాడు అని కలుసుకొని కుచేలుడు అటుకులు ఇవ్వగా, మిక్కిలి బీదరికం చూసి కొద్దిగా చలించిన కృష్ణుడు సంపద వానికి ప్రాప్తించేటట్లుగా కోరిక నశించేటట్లుగా చేశాడు.

68. కలి, పులి, బలి, వెలి - పదాలను ఉపయోగిస్తూ వెన్నెల రేయిని వర్ణిస్తూ

68.70 తే.గీ. కలసి యుంట బలీయము, కలదు సుఖము,
నాయకత్వపు లిప్సను నదులుఁ గూడ,
జలధిపై యక్కలి యెగయు వెలుగు దిశను,
వెన్నెల నిశీథిని ఛవికి వెలితిఁ గలదె?

(బలీయము = మిక్కిలి బలము కలది, లిప్స = కోరిక, కూడు = చేరు, జలధి = సముద్రము, అక్కలి = కెరటము, ఎగయు = పైకిలేచు, దిశ = దిక్కు, నిశీథిని = రాత్రి, ఛవి = కాంతి, వెలితి = లోటు)

కలిసి యుండటం మిక్కిలి బలము. సుఖము ఉంది. నదులు చేరగానే నాయకత్వపు కోరికతో సముద్రంపై కెరటం వెలుగు దిశలో పైకి లేస్తుంది. వెన్నెల రాత్రి వెలుగుకి లోటుందా?

69. కల్లు, నీరా, సారా, సుర - పదాలను ఉపయోగిస్తూ మద్యపాన నిషేధం గురించి

69.71 కం. కల్లువడె నడ్డగింపులు,
యెల్లరు నీరాజన మిడ యెదురా? యెరియస్
యిల్ల సుమీ! సారాంశము
కల్లానుట కసుర వేళ కద్దుగ నిలిచెస్.

(కల్లువడు = స్తంభించు, అడ్డగింపు = నిషేధము, ఎల్లరు = అందఱు, నీరాజనము = హారతి, ఇడు = ఇచ్చు, ఎదురు = ప్రతిఘటన, ఎరియు = పరితపించు, ఇల్ల = లేదు, సారాంశము = నికరముగా తేలినది, కల్లు = మద్యము, ఆను = త్రాగు, అసుర వేళ = రాత్రి వేళ, కద్దు = సబబు, నిలుచు = ప్రతిష్ఠితమగు)

నిషేధాలు స్తంభించాయి. అందరూ హారతి పట్టగా ప్రతిఘటనా? పరితపించడానికి లేదు సుమా. నికరంగా తేలింది ఏమంటే, మద్యము త్రాగడానికి రాత్రి వేళ సబబై నిలిచింది.

70. కసి, పసి, మసి, రసి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో

70.72 తే.గీ. రూపసి యగు రాము సతిని రూపుమాపఁ
జూచు, రక్కసి పౌలస్తి జుట్టుఁ బట్టి,
కర్మసిద్ధిని యందించ, కర్ణ నాసి
కలను ఖండించె సౌమిత్రి, కలహ మరసి.

(రూపసి = సౌందర్యవతి, సతి = భార్య, రూపుమాపు = చంపు, రక్కసి = రాక్షసి, పౌలస్తి = శూర్పణఖ, కర్మసిద్ధి = కర్మఫలము, కర్ణ = చెవి, నాసిక = ముక్కు, ఖండించు = తెగగోయు, సౌమిత్రి = లక్ష్మణుడు, కలహము = జగడము, అరయు = ఊహించు)

సౌందర్యవతి, శ్రీరాముని భార్యయైన సీతను చంపడానికి చూసే రాక్షసి శూర్పణఖ జుట్టు పట్టుకొని కర్మఫలము అందించడానికి లక్ష్మణుడు కలహము ఊహించి ఆమె ముక్కు చెవులు కోశాడు.

71. కసి, వసి, పసి, నిసి - పాదాదిన వచ్చునట్లుగా సత్యభామ వామ పాదకృత శ్రీకృష్ణ శిరస్తాడన ప్రసంగమును గూర్చి

71.73 మ. కసి హెచ్చెన్ గన దివ్యపుష్ప మొసగన్ కంసారి వైదర్భికిన్,
వసివాడెన్ సతి సత్య మోము, తన దౌర్భాగ్యంబు నిందించుటల్
పసిగట్టన్ శకటారి సత్య పదముల్ బట్టంగ, యా లంకె మా
నిసి చూడాలముఁ దన్నె సత్య, సవతిన్ నిందించుచున్ యీసునన్.

(కసి = కోపము, హెచ్చు = అధికమగు, కను = చూచు, దివ్య = స్వర్గమునకు సంబంధించినది, పుష్పము = పువ్వు, ఒసగు = ఇచ్చు, కంసారి = శ్రీకృష్ణుడు, వైదర్భి = రుక్మిణి, వసివాడు = మిక్కిలి వాడు, సతి = భార్య,

మోము = ముఖము, పసిగట్టు = గ్రహించు, శకటారి = శకటాసురుని శత్రువైన శ్రీకృష్ణుడు, పదము = పాదము, లంకెమానిసి = దాసుడు, చూడాలము = శిరస్సు, సవతి = సపత్ని, ఈసు = ఈర్ష్య)

భర్త ఒక దివ్యపుష్పాన్ని రుక్మిణికి ఇవ్వడం చూడగా ఎక్కువైన కోపంతో భార్యయైన సత్యభామ ముఖం వసివాడిపోయింది. తన దురదృష్టాన్ని నిందించడం పసిగట్టిన శ్రీకృష్ణుడు సత్యభామ పాదాలు పట్టుకోగా, సత్యభామ తన సవతిని ఈర్ష్యతో నిందిస్తూ ఆ దాసుని శిరస్సు తన్నింది.

72. కాక, తాత, పాప, మామ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

72.74 తే.గీ. శూర్పణఖ కాక యయ్యె, భూసుతకు త్రాత
యయ్యె, శీతవాతాతప వ్యధల నోర్చె
తనదు భామామణిని మదిఁ దలపకుండ
రామునికి కంటిపాపయై లక్ష్మణుండు.

(ఆక = అడ్డగింత, భూసుత = సీత, త్రాత = సంరక్షకుడు, శీత = చలి, వాత = వాయువు, ఆతప = ఎండ, వ్యధ = బాధ, ఓర్చు = సహించు, తనదు = తన యొక్క, భామామణి = స్త్రీరత్నము, మది = మనస్సు, తలచు = స్మరించు, కంటిపాప = కంటి వెలుగు లోపలికి వచ్చే ద్వారము)

శూర్పణఖకు అడ్డంకి అయ్యాడు, సీతకు సంరక్షకు డయ్యాడు, వాతావరణంలో వచ్చే మార్పులైన చలి, గాలి, ఎండల వచ్చే బాధలని, తన భార్యామణిని స్మరించకుండా, శ్రీరామునికి అడవులలో కంటిపాపయై, లక్ష్మణుడు సహించాడు.

73. కాకి, కోయిల, నెమలి, కోడి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

73.75 తే.గీ. పాండవుల కోడి రారాజు బవర మందు,
వొంచ నేలకో యిల వీడి వెంచ మందు,
యంజికా? కినుకా? మన మన్న యనుచు
తెచ్చుకొనె మలికితము, యుధిష్ఠిరుండు.

(రారాజు = దుర్యోధనుడు, బవరము = యుద్ధము, పొంచు = ఏదేని నుద్దేశించి మఱుగుపడి కనుపెట్టి యుండుట, ఏలకో = ఏ కారణం చేతనో, ఇల = నేల, వీడి = విడిచి, పెంచము = మడుగు, అంజిక = భయము, కినుక = కోపము, మలికితము = సందేహము, యుధిష్ఠిరుడు = ధర్మరాజు)

యుద్ధంలో పాండవులకి ఓడిపోయి దుర్యోధనుడు ఏ కారణం చేతనో నేల విడిచి మడుగులో దాగగా మనం అంటే భయమా, కోపమా అంటూ ధర్మరాజు సందేహము తెచ్చుకున్నాడు.

74. కాకి, కోయిల, బాతు, నెమలి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

74.76 తే.గీ. వినుము కురురాజ! యేకాకిని, ననుఁ బట్టి
యిటను బంధించు టేలకో? యిలను ప్రజ ల
నంత సుఖములం బాతుకొన, తగ వుడుపు
సంధి యనె, మలిడత చక్రి సభకు వచ్చి.

(కురురాజు = కౌరవుల రాజైన దుర్యోధనుడు, ఏకాకి = ఒంటరి, ఇల = భూమి, అనంత = అంతులేని, పాతుకొను = స్థిరపడు, తగవు = కలహము, ఉడుపు = నశింపజేయు, మలిడత = రెండవమారు, చక్రి = శ్రీకృష్ణుడు)

శ్రీకృష్ణుడు రెండవ సారి సభకు వచ్చి, ఓ దుర్యోధనా! వినుము, ఒంటరిగా నన్ను పట్టుకుని ఇక్కడ ఎందుకు బంధించడం? లోకంలో ప్రజలు అంతులేని సౌఖ్యములలో స్థిరపడేటట్లుగా, సంధి కలహాన్ని నాశనం చేస్తుంది అని అన్నాడు.

75. కాకి, జాజి, పాపి, వావి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

75.77 తే.గీ. మరతువా విప్రశాప? మీ మద్రపతి య
నంగ గునుపా? పినాకికి డింగరి యత
డంగరాజా! జినుండు నిషంగది యట,
స్ఫురణ కా కిరీటికి యధికరణ మగుచు.

(మరచు = మరిచిపోవు, విప్రుడు = బ్రాహ్మణుడు, మద్రపతి = శల్యుడు, కునుపు = కోపము, పినాకి = శివుడు, డింగరి = భక్తుడు, అంగరాజు = కర్ణుడు, జినుడు = విష్ణువు, నిషంగది = సారథి, స్ఫురణ = చైతన్యము, కిరీటి = అర్జునుడు, అధికరణము = ఆధారము)

బ్రాహ్మణుని శాపం మరిచిపోతావా? ఈ శల్యుడంటే కోపమా? శివునికి భక్తుడతడు, కర్ణా! చైతన్యానికి (అంటే మరిచిపోకుండా ఉండడానికి) అర్జునునికి ఆధారమవుతూ విష్ణువు అక్కడ సారథి.

76. కాకి, దాది, పాపి, వావి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

76.78 తే.గీ. కీచకా! కినుకేలని కృష్ణ యిట్లుఁ
జెప్పె, చూచిన దాదిగ యొప్పితి నిను,
వాపిరినిఁ దీర్చ నా వలపా, పిదపను
వావిరిగ నాట్యశాలను ప్రాప్త మగును.

(కినుక = కోపము, ఏల = ఎందుకు, కృష్ణ = ద్రౌపది, ఆది = మొదలు, ఒప్పు = సమ్మతించు, నిను = నిన్ను, వాపిరి = అధికమైన కోరిక, తీర్చు = సిద్ధింపఁజేయు, వలపు = ప్రేమ, పిదప = తరువాత, వావిరి = అధికము, ప్రాప్తము = లభ్యము)

ఓ, కీచకా! కోపం ఎందుకు? అని ద్రౌపది, చూసింది మొదలు నిన్ను సమ్మతించాను, వాంఛ తీర్చడానికి నా ప్రేమా, తరువాత అధికంగా నర్తనశాలలో లభిస్తుంది అని చెప్పింది.

77. కాపీ, టోపీ, హ్యాపీ, కూపీ - పదాలను అన్యార్థంలో వాడుతూ భారత సైన్యం యుద్ధంలో పాకిస్థానుకు గుణపాఠం చెప్పిన తీరు

77.79 శా. కాపీనంబున మాటిమాటి కెరియస్ కాశ్మీరు మాదన్న యా
టోపీ! సంగర మందుఁ జేయు నొడబాటుల్ మీరుటస్ నీతి బా
హ్యా! పీడించుచు తూర్పు వంగమున నీ హంకారముస్ జూపు డా
కూ! పీనమ్మగు హిందు సేన నిను పాకూ! యోర్చె బంగ్లా నిడస్.

(కాపీనం = మితిమీరిన ఆశ, మాటిమాటికి = అనేక పర్యాయములు, ఎరియు = పరితపించు, ఆటోపి = వేగిరపాటు కలది, సంగరము = యుద్ధము, ఒడబాటు = ఒడంబడిక, మీరు = అతిక్రమించు, బాహ్యుడు = దురాచారుడు, పీడించు = బాధించు, వంగము = వంగదేశము లేక బెంగాల్, హంకారము = అహంకారము, డాకూ = బందిపోటు, పీనము = బలిసిన, హిందు సేన = భారత సైన్యము, పాకూ = ఓ, పాకిస్థానూ, ఓర్చు = జయించు, బంగ్లా = బంగ్లాదేశ్, ఇడు = ఇచ్చు)

ఓ, పాకిస్థానూ! అత్యాశతో అనేక పర్యాయములు పరితపించడం చేత కాశ్మీరు మాదే అన్నటువంటి వేగిరపాటు కలదానా! యుద్ధములో చేసుకున్న ఒడంబడికలని అతిక్రమించడంలో దురాచారీ! తూర్పు బెంగాల్ని బాధిస్తూ నీ అహంకారాన్ని చూపించిన బందిపోటా! బంగ్లాదేశ్ ఇవ్వడానికి బలమైన భారత సైన్యం నిన్ను జయించింది.

78. కాయము, గాయము, న్యాయము, మాయము - పదాలను ఉపయోగిస్తూ పెరిగిన ధరలపై

78.80 ఉ. పౌర నికాయముస్ వగల పాలొనరించెను వస్తుమూల్యముల్
మాఱని గాయముల్ సలిపి, మారునె యీ స్థితి యెట్టకేలకుస్?
నేరుగ న్యాయ మూత మిడునే హలికుల్ వినియోగదార్లకుస్?
బేరములస్ దళారు లగుపించెడి మాయము లుండు తావులస్.

(నికాయము = సమూహము, వగ = దుఃఖము, పాలు = వశము, ఒనరించు = చేయు, మూల్యము = ధర, మాఱు = నశించు, గాయము = దెబ్బ, ఎట్టకేలకుస్ = చివరకు, నేరుగ = తిన్నగా, ఊతము = అండ, ఇడు = ఇచ్చు, హలికుడు = రైతు, వినియోగదారులు = వస్తువులను ఉపయోగించువారు, బేరము = వర్తక వ్యాపారము, దళారి = బేరగాడు, అగుపించు = కనిపించు, మాయము = మోసము, తావు = ప్రదేశము)

పౌరసంఘాలను వస్తువుల ధరలు మారని గాయం చేసి దుఃఖాల పాలు చేశాయి. ఈ స్థితి చివరకు మారుతుందా? బేరాల్లో దళారులు కనిపించే మోసం ఉండే ప్రదేశాల్లో రైతులకి వినియోగదారులకీ తిన్నగా న్యాయం అండ నిస్తుందా?

79. కారు, లారి, జీపు, వ్యాను - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

79.81 తే.గీ. అంగనాకారుడౌ క్రీడి నరసి, మీర
లారితేరిన ధన్విగా, ధీరమతిని
యేలు రాజీ పుడమి నని యెంచితేను
యనుచు విరటుడు పొందె దివ్యానుభూతి.

(అంగనాకారుడు = నపుంసకుడు, క్రీడి = అర్జునుడు, అరయు = విచారించు, ఆరితేరు = సమర్థుడగు, ధన్వి = విలుకాడు, ధీరమతి = ధైర్యము గల మనస్సు, ఏలు = పాలించు, పుడమి = భూమి, ఎంచు = ఊహించు, ఏను = నేను, దివ్య = స్వర్గమునకు సంబంధించిన, అనుభూతి = అనుభవము)

నపుంసకుడైన అర్జునుణ్ణి విచారించి, తమరు సమర్థుడైన విలుకాడిగా ధైర్యము గల మనస్సుతో భూమి నేలే రాజుగా నేను ఊహించాను అని అంటూ విరాటరాజు గొప్ప అనుభూతిని పొందాడు.

80. కారు, లారీ, జీపు, వ్యాను - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో

80.82 తే.గీ. కారుకాలము వెళ్ళె, నైకర్తనునికి
సంబరమ్ములా? రీఢయా? సఖ్యమందు,
యేల రాజీ పులుగు నేలచూలి దరయ?
యనుచు రాము డంకించె భవ్యానుభూతి.

(కారుకాలము = వర్షాకాలము, నైకర్తనుడు = సుగ్రీవుడు, సంబరము = వేడుక, రీఢ = తిరస్కారము, సఖ్యము = స్నేహము, రాజీ = సమాధానము, పులుగు = ఆచూకి, నేలచూలి = సీత, అరయు = తెలిసికొను, అంకించు = కలిగించు, భవ్య = యోగ్యమైన, అనుభూతి = ప్రత్యక్షాది ప్రమాణముల వలన కలుగు జ్ఞానము)

వర్షాకాలము వెళ్ళిపోయింది, సుగ్రీవునికి వేడుకలా? తిరస్కరమా? స్నేహములో, ఎందుకని సీత ఆచూకీ తెలుసుకోవడంలో రాజీ? అంటూ రాముడు యోగ్యమైన అనుభూతిని కలిగించాడు.

81. కారు, వాచి, టీవి, సెల్లు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

81.83 కం. క్వాచిత్కమైన దృశ్యము
చూచితి కర్ణా! శతమఖుసుతు టీవి, నదే
పీచ మడచు లయకారుని
సూచక మనె సెల్లుడు రథచోదకుడు యనిస్.

(క్వాచిత్కము = అప్పుడప్పుడు సంభవించునది, శతమఖుడు = ఇంద్రుడు, సుతుడు = కుమారుడు, టీవి = విలాసము, పీచము = గర్వము, అడచు = అణచు, లయకారుడు = నాశనం చేయువాడు, సూచకము = తెలుపునది, సెల్లుడు = శల్యుడు, రథచోదకుడు = సారథి, అని = యుద్ధము)

కర్ణా! ఇంద్రుని కుమారుడైన అర్జునుని విలాసములో అపురూపమైన దృశ్యము చూశాను, అదే గర్వము నణచే లయకారుని (శివుని) సూచిస్తుంది అని యుద్ధంలో సారథియైన శల్యుడు అన్నాడు.

82. కార్, జార్, బార్, పార్ - పదాలతో రామాయణ పరంగా

82.84 తే.గీ. రాము దర్బారున జనులు రాజుఁ సేయఁ
గోర, దశరథుం డంత యింపారుచు సరి
యనె, పుకారు వినిన కైక యనె వలదని,
పరువు దిగజారు చుండగ వగచె రాజు.

(దర్బారు = కొలువుకూటము, అంత = అప్పుడు, ఇంపారు = సంతోషించు, సరి = యుక్తము, పుకారు = వదంతి, పరువు = గౌరవము, దిగజారు = తగ్గి హీనుడైపోవు, వగచు = శోకించు)

కొలువుకూటంలో ప్రజలు రాముణ్ణి రాజు చేయమని కోరగా, అప్పుడు దశరథుడు సంతోషంతో సరే అన్నాడు. వదంతులు విన్న కైకేయి వద్దని అంది. పరువు పోతోందని రాజు శోకించాడు.

83. కిక్, కుక్, చిక్, చెక్ - పదాలను ప్రయోగిస్తూ తెలుగు భాషా వైభవాన్ని గురించి

83.85 తే.గీ. చెక్కును మధుర కవితలు యక్కరముల,
చిక్కు లేకఁ బలు నుడులఁ జెలిమిసేయు,
పెక్కు లొలయ చెడదు తన కిక్కు వనగ
కుక్కు డవకుండ చక్కగ కుదురు తెలుగు.

(చెక్కు = తీర్చు, మధుర = ఇంపైన, అక్కరము = అక్షరము, చిక్కు = సంకటము, పలు = అనేకము, నుడి = మాట, చెలిమిసేయు = స్నేహముచేయు, పెక్కులు = అనేకము, ఒలయు = కలియు, చెడు = కోలుపోవు, ఇక్కువ = ఉనికి, కుక్కుడు = అదుముడు, కుదురు = స్థిరమగు)

అక్షరాలతో ఇంపైన కవితలని తీర్చిదిద్దుతుంది, సంకటము అనేది లేకుండా పలు మాటలతో (ఏ భాషయినా సరే) స్నేహం చేస్తుంది, పెక్కులు కలిసినా తన ఉనికి చెడదు అనేటట్లుగా కుక్కుడు అవకుండా చక్కగా తెలుగు భాష స్థిరపడింది.

84. కీర, వైర, హార, భార - పదాలతో విరహ వర్ణన ఉత్పలమాలలో

84.86 ఉ. దక్కెను జానకీ రమణి దర్శన మిందుని పైని యచ్చటన్
దృక్కులు యేకమవ్వ, ననుఁ దిప్పలు పెట్టగ వైర మబ్జుతో
యెక్కడి దంచు రాము డిటు, యీ వ్యవహారముఁ జెప్పెఁ దమ్ముకున్
వెక్కుచు లంకలో, విరహ వేదన భారము తా వహించుచున్.

(రమణి = సుందరమైన స్త్రీ, ఇందుడు = చంద్రుడు, దృక్కు = చూపు, ఏకమగు = ఐక్యమగు, వైరము = విరోధము, అబ్జుడు = చంద్రుడు, ఇటు = ఈప్రకారము, వెక్కు = ఏడ్చు, తా = తాను, వహించు = మోయు)

చంద్రుడిపై చూపులు ఏకమవడం వల్ల అక్కడ సీతా దర్శనం లభించింది, నన్ను తిప్పలు పెట్టడానికి చంద్రుడికి నాతో విరోధము ఎక్కడిది అంటూ లంకలో విరహ వేదన భారాన్ని తాను మోస్తూ శ్రీరాముడు ఈ విధంగా ఈ వ్యవహారాన్ని తమ్ముడైన లక్ష్మణుడితో ఏడుస్తూ చెప్పాడు.

85. కుంటి, మెల్ల, మూగ, గూని - పదాలను ప్రయోగిస్తూ స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడం

85.87 తే.గీ. మేన సొబగూని, మనమున మేధఁ గలిగి,
స్నేహ మెల్ల వారికిఁ బంచు చెలువ, సంఘ
మున సమానత్వమను సిడ మూగ మెలగ,
వన్నె వేరేమిఁ గలదని మిన్నకుంటి.

(మేను = శరీరము, సొబగు = సౌందర్యము, ఊను = కలుగు, మనము = మనస్సు, మేధ = చక్కగా జ్ఞాపకముంచుకొను శక్తి, ఎల్ల = సమస్తము, చెలువ = అందగత్తె, సంఘము = సమాజము, సిడము = ధ్వజము, ఊగు = ఆందోళించు, మెలగు = వర్తించు, వన్నె = అందము, వేరు = అన్యము, మిన్నకుండు = పట్టించుకొనకపోవు)

శరీరంలో సౌందర్యం కలిగి, మనస్సులో చక్కగా జ్ఞాపకముంచుకొనే శక్తి ఉండి, అందరికీ స్నేహాన్ని పంచే అందగత్తె, సమాజములో సమానత్వమనే జెండా ఎగిరేటట్లుగా ప్రవర్తించగా, వేరే అందం ఏముంది అని ఊరుకున్నాను.

86. కుండ, దండ, బండ, బెండ - పదాలను అన్యార్థంలో ఉపయోగించి గొడుగును గురించి

86.88 తే.గీ. కోపము తనపై జమదగ్ని కుండకుండ,
యాతపము నందు వానలం దండ నొసగు
గొడుగు నిడ రవి తాఁ బండబడెను తపసి
దానిఁ గనఁ బెండరము వంటి దనుచు మురిసి.

(ఆతపము = ఎండ, అండ = ఆధారం, ఒసగు = ఇచ్చు, ఇడు = ఇచ్చు, రవి = సూర్యుడు, పండబడు = శయనించు, తపసి = ముని, కను = చూచు, పెండరము = గండపెండేరము, మురియు = సంతోషించు)

తన మీద జమదగ్నికి కోపము ఉండకుండా, ఎండలోనూ వానలందూ అండ నిచ్చే గొడుగుని సూర్యుడు ఇవ్వగానే, దాన్ని చూస్తే గండపెండేరము వంటిదని సంతోషించి తాను శయనించాడు ముని.

87. కుండ, దుత్త, చెంబు, గరిటె - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

87.89 కం. పొందుకు రాకుండనిచో,
యొందెడి దుత్తలమని, నరు కూర్వశిఁ బలుకన్,
యెందుల కొచ్చెం బులమని,
డిందించెను యింద్రనగరి టెక్కువ సితకున్.

(పొందు = సంగమము, ఒందు = కలుగు, ఉత్తలము = పరితాపము, నరుడు = అర్జునుడు, పలుకు = అను, పులము = గగుర్పాటు, డిందించు = రూపుమాపు, ఇంద్రనగరి = ఇంద్రుని పట్టణమైన అమరావతి, టెక్కువ = ఒయారము, సిత = స్త్రీ)

సంగమానికి రాకుండా ఉంటే కలిగేది పరితాపమని అర్జునునికి ఊర్వశి చెప్పగా, గగుర్పాటు ఎందుకు వచ్చిందని ఆమె అమరావతి టెక్కుని రూపుమాపాడు.

87.90 కం. దందడి కుండగ సాయము,
నందసుతుని దుత్తమ క్షయణమనిఁ దలచుచున్,
ముందుగ మెచ్చెం బులమున
డెందము, నరు కబ్ధినగరి టెక్కెముఁ జూడన్.

(దండడి = యుద్ధము, నందసుతుడు = శ్రీకృష్ణుడు, ఉత్తమ = శ్రేష్ఠమైన, క్షయణము = ఆధారము, తలచు = ఆలోచించు, ముందు = ఎదురు, మెచ్చు = సంతోషించు, పులము = గగుర్పాటు, డెందము = మనసు, నరుడు = అర్జునుడు, అబ్ధినగరి = ద్వారక, టెక్కెము = ధ్వజము)

యుద్ధానికి సాయం ఉండడానికి శ్రీకృష్ణునిది శ్రేష్ఠమైన ఆధారమని అనుకుంటూ ఎదురుగా ద్వారక ధ్వజం చూడంగానే అర్జునుని మనసు గగుర్పాతో సంతోషించింది.

88. కూర, నార, కార, చార - యువశక్తిని గూర్చి

88.91 కం. జయములుఁ జేకూర, యువత
భయమును విడనాడినార! భ్రష్టుల వోలెన్
దయ మాలి యహంకారపు
హయమున సంచారము బహు హానియె జగతిన్

(చేకూర = లభింప, విడనాడు = వదలిపెట్టు, భ్రష్టులు = దిగజారినవారు, మాలి = నశించి, హయము = గుర్రము)

విజయాలను హస్తగతం చేసుకోవడం కోసం యువకులు భయాన్ని వదిలి పెట్టారా! దిగజారినవారి వలె జాలి నశింపగా గర్వమనే గుర్రం మీద సంచారం లోకంలో ఎక్కువ కీడే.

89. క్రైపు, ట్రైపు, ప్రైపు, ర్రైపు - పదాల నుపయోగించి ఏ వేల్పునైన స్తుతిస్తూ

89.92 తే.గీ. అరువరై పులకాలయు యప్పుఁ దీర్చ
వేలుపై పుంజికొన వేనవేల ముడుపు
లక్కటై పుడమికి నీవు దక్కినావు,
విశ్వమునకై పునాదియౌ వేంకటేశ!

(అరువరి = అప్పుపుచ్చుకున్నవాడు, పులకాలయుడు = కుబేరుడు, వేలుపు = దైవము, పుంజికొను = రాబట్టుకొను, వేనవేలు = అసంఖ్యము, ముడుపు = ధనము ముడిచిన మూట, అక్కటి = దయాళువు, పుడమి = భూమి, దక్కు = లభించు, విశ్వము = జగత్తు, పునాది = మూలబంధము)

జగత్తుకు మూలాధారమైన వేంకటేశా! అప్పు పుచ్చుకున్న వాడిపై కుబేరుని అప్పు తీర్చడం కోసం దైవమై అసంఖ్యాకంగా ముడుపులు రాఁబట్టుకొనడానికి, దయాళువుపై భూలోకానికి నువ్వు లభించావు.

90. కొట్టము, గొట్టము, చుట్టము, మట్టము - పదాలతో రాయబారానికి వెళ్ళుచున్న కృష్ణునితో ధర్మరాజు పలుకులు

90.93 ఉ. చుట్టము పెద్దతండ్రిని విశుద్ధ మనస్కుఁడటంచు నమ్మి యూఁ
కొట్టము, రాజ్యభాగమునుఁ గోరమటంచని యున్న హక్కు పోఁ
గొట్టము, యైదు యూళ్ళిడినఁ గోరిన శాంతి లభించుఁ, గానిచో
మట్టముఁ సేతుమంచు, తన మైవడిఁ గంకుడుఁ జెప్పె చక్రికిన్.

(చుట్టము = బంధువు, విశుద్ధ = స్వచ్ఛమైన, మనస్కుడు = మనస్సు కలవాడు, ఊకొట్టు = ఊఊ అనుచు విను, హక్కు = అధికారము, పోగొట్టు = పోవునట్లు చేయు, ఇడు = ఇచ్చు, మట్టముసేయు = నాశనముచేయు, మైవడి = విధానము, కంకుడు = యుధిష్ఠిరుడు, చక్రి = శ్రీకృష్ణుడు)

బంధువైన పెద్దతండ్రి ధృతరాష్ట్రుడు స్వచ్ఛమైన మనస్సు కలవాడు అని అనుకొని ఊకొట్టము, రాజ్యంలో వంతు కోరము అని ఉన్న హక్కు పోయేటట్లు చేసుకోము, ఐదు ఊళ్ళు ఇస్తే అనుకున్న శాంతి లభిస్తుంది, కాకుంటే నాశనం చేస్తాము అని తన విధానము శ్రీకృష్ణుడికి యుధిష్ఠిరుడు చెప్పాడు.

91. కొమ్మ, ఆకు, కాయ, పండు - పదాలను ఆయా అర్థాలలో కాకుండా ఉపయోగించి మహాభారతార్థంలో

91.94 తే.గీ. ఆదుకొమ్మని పాండవు లైదుగురును
తన్ను వేడ, యా కుట్టారధరుడు కృష్ణు
డనియె, నేను యకాయకి నరిగి సంధి
పనుప కౌరవులకు మీకు పండు గగును.

(ఆదుకొను = రక్షించు, తన్ను = తనను, వేడు = ప్రార్థించు, కుట్టారము = కొండ, యకాయకి = వెంటనే, అరుగు = వెళ్ళు, పనుపు = నియోగించు, పండుగ = సంబరము)

తనను రక్షించమని పాండవులు ఐదుగురూ ప్రార్థించగా, ఆ నగధరుడైన శ్రీకృష్ణుడు, నేను వెంటనే వెళ్ళి సంధి చేస్తే కౌరవులకీ మీకూ సంబరమవుతుంది, అని అన్నాడు.

92. కోపము, చాపము, తాపము, పాపము - పదాలను ఉపయోగిస్తూ ఉత్తరుని ప్రగల్భములను గురించి

92.95 కం. కోపము నందుత్తరు డన,
చాపము నెక్కిడ కిరీటి సాటి యనంగా,
తాపము పడ కురు వీరుల
పాపమునకు తగిన శిక్ష వైతునుఁ గనుడీ!

(చాపము = ధనుస్సు, ఎక్కిడు = ఎక్కుపెట్టు, కిరీటి = అర్జునుడు, సాటి = సమానము, తాపము = బాధ, పడు = అనుభవించు, వైచు = వేయు, కను = చూచు)

కోపంలో ఉత్తరుడు అనేటట్లుగా, ధనుస్సు ఎక్కుపెట్టడంలో అర్జునుడే సమానుడు అనేటట్లుగా, కురువీరులు బాధపడే విధంగా పాపానికి తగిన శిక్ష వేస్తాను, చూడండి.

93. కోపము, తాపము, పాపము, శాపము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

93.96 ఉ. కోపము నొంది భార్గవుడు, కుట్రను కర్ణుడు విద్య నేర్చి యా
పాపము తగ్గ వానికి యుపాయము వేరిక లేదటన్న సం
తాపముతో క్షమాపణము తత్క్షణమే తన నుండిఁ గోరగా,
శాపము నిచ్చె తీవ్రముగ జ్ఞానము వమ్మగు నంచుఁ బోరునన్.

(ఒందు = పొందు, భార్గవుడు = పరశురాముడు, కుట్ర = మోసము, తగ్గు = తక్కువగు, వేరు = అన్యము, సంతాపము = విచారము, క్షమాపణము = మన్నన, తత్క్షణము = అప్పుడు, తీవ్రము = భయంకరము, జ్ఞానము = విద్య, వమ్ము = వ్యర్థము, పోరు = యుద్ధము)

మోసంతో విద్య నేర్చుకున్న పాపం శమించడానికి వేరే ఉపాయం లేక, కర్ణుడు విచారంతో అప్పుడు తన నుండి క్షమ యాచించగా, పరశురాముడు కోపగించి, యుద్ధంలో విద్య వ్యర్థ మవుతుందని తీవ్రంగా శాపం ఇచ్చాడు.

94. క్రికెట్టు, హాకీ, టెన్నిసు, చెస్ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

94.97 తే.గీ. వక్రి కెట్టు నీతులు బోధఁ బడును, భీమ!

నీ విడిన సలహా కీర్తనీయముఁ గద!
నీదు బాస టెన్ని, సుధేష్ణ సోదరు నట
గృహమునఁ బిలిచె, సుదతి నీ కృష్ణ, ధృతిని.

(వక్రి = నీచుడు, ఎట్టు = ఏ విధముగా, నీతి = న్యాయము, బోధపడు = తెలియడము, ఇడు = ఇచ్చు, సలహా = ఆలోచన, కీర్తనీయము = పొగడ దగినది, నీదు = నీ యొక్క, బాసట = సహాయము, ఎన్ను = ఎంచు, నటగృహము = నర్తనశాల, సుదతి = స్త్రీ, కృష్ణ = ద్రౌపది, ధృతి = ధైర్యము)

భీమా! నీచుడికి నీతులు ఎట్లా బోధపడతాయి? నీ విచ్చిన సలహా స్తుతింపతగినది కదా. స్త్రీయైన నీ ద్రౌపది ధైర్యముతో నీ యొక్క సాయం ఎంచి సుధేష్ణ సోదరుడైన కీచకుణ్ణి నర్తనశాలకు పిలిచింది.

95. క్రీస్తు, ఏసు, మేరి, సిలువ - పదాలతో భాగవతార్థంలో

95.98 కం. ఓ చక్రీ! స్తుతమతి యగు
నీ చరి తమ్మేరి కైన నేర్పు సుగుణముల్
దాచినవి యే సుచేలక
లీ చోటున? భాసిలు వర! యిమ్మని ప్రేతల్.

(చక్రి = శ్రీకృష్ణుడు, స్తుతమతి = పొగడదగిన మనస్సు కలవాడు, చరితము = నడవడి, ఏరికి = ఎవరికి, సుగుణములు = మంచి లక్షణాలు, సుచేలక = సన్నకోక, భాసిలు = ప్రకాశించు, వరుడు = శ్రేష్ఠుడు, ప్రేత = గోపిక)

ఓ, శ్రీకృష్ణా! పొగడదగిన మనస్సు కలవాడివైన నీ నడవడి ఎవరికైనా మంచి లక్షణాలు నేర్పుతుంది. భాసమానుడవైన శ్రేష్ఠుడా! దాచినవి ఈ ప్రదేశంలో ఏ సన్నకోకలు. ఇమ్మని గోపికలు అడిగారు.

96. క్రోధి ఉగాది శోభను గురించి

96.99 తే.గీ. ఆశలను రేపి, తొలగించి క్లేశములను,
దేశమందున క్రొత్త సందేశ మిడగ,
షడ్రుచుల పచ్చడియె, జ్యోతిషంబుఁ దోడ,
క్రోధి వత్సర ననకారుఁ బ్రోది ప్రజకు.

(రేపు = ప్రేరేపించు; క్లేశము = దుఃఖము; ఇడు = ఇచ్చు; షడ్రుచులు = ఒగరు, తీపి, ఉప్పు, కారము, చేదు, పులుసు అన్న ఆరు రుచులు; జ్యోతిషము = జ్యోతిశ్శాస్త్రము; క్రోధి వత్సర = క్రోధి అన్న పేరున్న సంవత్సరము; ననకారు = వసంతఋతువు; ప్రోది = వైభవము; ప్రజ = ప్రజలు)

ఆశలను రేకెత్తించి, దుఃఖాలను తొలగించి, దేశంలో నూత్న సందేశము ఇవ్వడానికి, జ్యోతిశ్శాస్త్రముతో పాటుగా షడ్రుచుల ఉగాది పచ్చడియే ప్రజలకు క్రోధి నామ సంవత్సరపు వసంత ఋతు వైభవము.

97. ఖగము, భగము, నగము, సగము- పదాలతో పార్వతీవర నిశ్చయం గురించి ఉత్పలమాల

97.100 చం. విరిఖగముల్ మనోభవుడు వేయ, త్రినేత్రుని దృష్టి సోకె నా
గఱిచిలుకుల్ స్పృశింప సుభగమ్ముగఁ బార్వతిపై, మునీశ్వరుల్
యురవనిఁ జెప్ప శీతనగ ముద్వహఁ గోర్కెను బెండ్లిఁ జేయగన్,
చెఱిసగముండు తత్త్వమును జీవుల కిచ్చిరి యాది దంపతుల్.

(విరి = పువ్వు, ఖగము = బాణము, మనోభవుడు = మన్మథుడు, త్రినేత్రుడు = శివుడు, దృష్టి = చూపు, సోకు = తాకు, గఱిచిలుకు = బాణము, స్పృశించు = తగులు, సుభగము = మనోహరము, ఉరవు = ఔచిత్యము, శీతనగము = మంచుకొండయైన హిమవంతుడు, ఉద్వహ = కుమార్తె, చెఱిసగము = సగమొకరు సగమొకరు, తత్త్వము = ప్రవృత్తి)

మన్మథుడు పుష్పబాణాలు వేయగా ఆ బాణాలు తాకగా శివుని చూపు మనోహరంగా పార్వతి మీద పడింది. మునీశ్వరులు ఉచితమేనని చెప్పగా హిమవంతుడు కుమార్తె కోరడం వల్ల పెళ్ళి చేయగా, ఆ ఆది దంపతులు అర్ధనారీశ్వర తత్త్వాన్ని జీవుల కిచ్చారు.

98. గంగ, గంగ, గంగ, గంగ - నాలుగు పాదాలలో 'గంగ'ను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

98.101 తే.గీ. రాజ్యభాగము నడుగంగ, రాజరాజు
యివ్వనన, యని నిలుగంగ నెల్ల, రతడుఁ
గూడ వీఁగంగ, భీముడు జాడఁ దెలిసి
వచ్చి మడుగున దాగంగ వానిఁ గనెను.

(రాజరాజు = దుర్యోధనుడు, అని = యుద్ధము, ఇలుగు = చచ్చు, ఎల్లరు = అందఱు, వీగు = యుద్ధమునుండి పాఱు, జాడ = ఆచూకి, మడుగు = కొలను, కను = చూచు)

రాజ్యభాగము అడిగినపుడు దుర్యోధనుడు ఇవ్వనని అనగా, యుద్ధంలో అందరూ మరణించగా, దుర్యోధనుడు కూడా యుద్ధము నుండి పారిపోగా భీముడు ఆచూకి తెలిసి వచ్చి కొలనులో దాగిన అతనిని చూచాడు.

99. గంగ, గంగ, గంగ, గంగ - పదాలతో ఎక్కడా 'నీరు' అనే అర్థం రాకుండా గంగావతరణ వర్ణన

99.102 తే.గీ. తాతలఁ బదడు మునుగంగ తరలు మనుచుఁ
దపమున భగీరథుఁ డడుగంగ, పయనమయి
యడ్డు లన్నియుఁ దొలగంగ యవనిఁ జేరి,
జాహ్నవిగఁ గొనసాగంగ జగతి యెఱఁగె.

(పదడు = భస్మము, తరలు = ప్రయాణమగు, అడ్డు = అవరోధము, అవని = భూమి, జాహ్నవి = జహ్ను మహాముని పుత్రియైన గంగ, కొనసాగు = ప్రవహించు, జగతి = లోకము, ఎఱఁగు = నమస్కరించు)

తాతల భస్మము మునగడానికి ప్రయాణం అవ్వమని తపస్సులో భగీరథుఁడు అడుగగా, బయలుదేరి అవరోధాలన్నీ తొలగిపోగా భూలోకానికి చేరి జాహ్నవిగా ప్రవహించడం వలన లోకం నమస్కరించింది.

100. గగగ, ననన, మమమ, లలల - పదాలతో స్వేచ్ఛాంశం

100.103 ఉ. “గాగగ గాగగా గగగ గాగగ గాగగ” యంచుఁ గొందరుస్
సాగ, “ననాన నాననన” సవ్వడిఁ జేయుదు మంచుఁ గొందరుస్
లాగగ, “మామమా మమ” గ “లాలల లాలల” యంచుఁ గొందరుస్
యూగిరి, రాగమాలికగ యుత్పలమాలనుఁ బాడు స్పర్ధతో.

(సాగు = మొదలుపెట్టు, సవ్వడి = ధ్వని, లాగు = తీయు, ఊగు = వెనుకకు ముందుకు చలించు, రాగమాలిక = రాగముల యొక్క హారము, ఉత్పలమాల = ఉత్పలమాల అనబడే ఛందస్సులోనే ఒక వృత్తము, స్పర్ధ = పోటీ)

ఉత్పలమాల పద్యాన్ని రాగమాలికగా పాడే పోటీతో, కొందరు "గాగగ గాగగా గగగ గాగగ గాగగ" అంటూ మొదలుపెట్టగా, "ననాన నాననన" అనే ధ్వని చేస్తామంటూ కొందరు లాగగా, "మామమా మమ" అంటూనూ "లాలల లాలల" అంటూనూ కొందరు ఊగారు.

101. గణపతి, గణపతి, గణపతి, గణపతి అనే నాలుగు పదాల్తో వినాయకుడి మీద చంపకమాల

101.104 చం. గణపతి రూపమున్ మనముఁ గాంతుము "ఓం" యను యక్షరమ్ముగా,
గణపతి యేకదంతమునఁ గాంతుము త్యాగము కార్యదక్షతల్,
గణపతి వాహనమ్మెలుకఁ గాంచగఁ గల్గు సమత్వ దృష్టియే,
గణపతి జ్ఞాన యోగముల కందువయైఁ గనుపట్టు నెప్పుడున్.

(కందువ = ప్రతిష్ఠానము)

గణపతి రూపాన్ని మనము "ఓం" అను అక్షరంగా చూస్తాము. గణపతికి ఉన్న ఒకే దంతంలో త్యాగము, కార్యదక్షత చూస్తాము. ఎందుకంటే, రెండవ దంతం పీకి అద్భుతంగా వ్యాసుడు చెబుతుంటే భారతాన్ని వ్రాశాడు. దంతాన్ని త్యాగం చేశాడు. భారతం వ్రాయడంలో దక్షత చూపించాడు. గణపతి వాహనమైన ఎలుకను చూస్తే సమత్వ దృష్టి కలుగుతుంది. గణపతి జ్ఞానానికి యోగానికి ప్రతిష్ఠానముగా ఎప్పుడూ కనబడతాడు.

102. గలగల, జలజల, వలవల, మలమల - పదాలతో భారతార్థంలో

102.105 తే.గీ. గలగల మను వాహిని కడ గంగనుఁ గని
జలజల మని ప్రేమఁ గురియ, శంతన నృపు,
డవ్వల వలరాజు మదిని యాశ నింప,
యా కమల మలకలఁ బడి, యాలిఁ జేసె.

(గలగలమను = కదిలే చప్పుడు, వాహిని = నది, కడ = సమీపము, కను = చూచు, జలజల = ప్రవహించుటను పోలు ధ్వన్యనుకరణము, కురియు = వర్షించు, నృపుడు = రాజు, అవ్వల = ఆపైన, వలరాజు = మన్మథుడు, మది = మనస్సు, కమల = ఉత్తమురాలు, మలక = మెలిక, పడు = పడిపోవు, ఆలి = భార్య)

గలగల మని పారే నది సమీపంలో గంగని చూసి జలజలమంటూ ప్రేమ వర్షించగా, శంతన మహారాజు, ఆపైన మన్మథుడు మనస్సులో ఆశని నింపగా, ఆ ఉత్తమురాలు పెట్టిన మెలికలకి పడిపోయి భార్యగా చేసుకున్నాడు.

103. గవాస్కర్, కిర్మాని, పటౌడి, కపిలదేవ్ - పదాలతో రాయలసీమ క్షామ పరిస్థితి గురించి

103.106 మ. కరవాయెన్ ఫలసాయముల్, కనుగవాస్కర్ గ్రమ్మె రైతన్నకున్,
కెరటమ్మై వలసొచ్చి రాయల నెలన్ కిర్మాని, చేటయ్యె పా
టిరముల్, వానలు లేకయే కడపటౌడిన్ మాకొనెన్ రైతులే,
కఱవీ రీతిని నెక్కొనన్, కపిల, దేవ్, కావంగ లేరెక్కడన్.

(కరవగు = లోపించు, ఫలసాయము = పంట, కనుగవ = కనులజంట, అస్కర్ = అంధకారం, క్రమ్ము = ముసరుకొను, కెరటము = అల, వలస = అధిక సంఖ్యలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలి వెళ్ళటం, రాయల నెల = రాయల సీమ, కిర్మ్ = పురుగు, ఆను = క్రమ్ము, చేటు = నాశము, పాటిరము = వరిమడి, కడపట = తుదకు, ఔడిన్ = పెదవి క్రిందిచోటును, మాకొను = కఱచు, కఱవు = క్షామము, రీతి = విధము, నెక్కొను = పాదుకొను, కపిల = మోట, అనగా, ఎద్దులను కట్టి నీరుతోడే ఏర్పాటు, దేవ్ = బలవంతుడైన మనిషి, కావంగ = రక్షించుటకు)

పంటలు లేకపోవడం వల్ల రైతన్నకు కళ్ళలో చీకటి ముసురుకుంది. అల లాగా రాయల సీమ వలస వచ్చిన పురుగు పట్టడం వల్ల వరిమళ్ళు నాశనమయ్యాయి. వానలు లేక రైతులు చివరకు పెదవి కరచారు. క్షామము ఈ విధంగా పాదుకొని పోగా, రక్షించడానికి మోట, బలమైన మనిషి ఎక్కడా లేరు.

104. గాజులు, జాజులు, పోజులు, మోజులు - పదాలతో వరూధిని విరహవేదనా వర్ణన

104.107 ఉ. గాజులు ఘుల్లు ఘల్లుమన కట్టెదుటన్ విహరించుచున్, సిగన్
జాజులు దండగా, మెయిని సౌరభమున్ వెదజల్లు యత్తరుల్,
మోజులు యెంత పెంచినను మోహము చెంద డదేల? చూపి యో
ర్పో జులుమో వెలార్తు ప్రవరున్ వశవర్తిగ, నే వరూధినిన్.

(కట్టెదురు = ఎదురుగా, విహరించు = వేడుకగా తిరుగు, సిగ = కొప్పు, మెయి = శరీరము, సౌరభము = పరిమళము, వెదజల్లు = వ్యాపింప జేయు, అత్తరు = సుగంధ తైలము, మోజు = అభిలాష, మోహము = చిత్తవైకల్యము, ఓర్పు = సహనము, జులుము = బలాత్కారము, వెలార్చు = ప్రకటించు, వశవర్తి = విధేయుడు)

గాజులు ఘల్లుఘల్లు మనిపించుకుంటూ ఎదురుగా విహరిస్తూ, కొప్పులో జాజిపూలు దండగా, మేన పరిమళం వెదజల్లే అత్తరులు, కోరికలు ఎంత పెంచినా కూడా చిత్త వైకల్యం చెంద డెందుకు? నేను వరూధినిని, సహనమో బలాత్కారమో చూపించి ప్రవరుణ్ణి విధేయుడిగా ప్రకటిస్తాను.

105. గాలి, నీరు, నిప్పు, నేల - పదాలను ఉపయోగిస్తూ ఆకాశాన్ని వర్ణిస్తూ

105.108 తే.గీ. గాలిచూలికి బాటయై నేలచూలి
వెతుక, మున్నీరు బాష్పమై వెడలు త్రోవ
గా, గొడుగు నిప్పుడమి కిచ్చు గగన సీమ
యే, యనన్వయమై కావ్య మేల నేల?

(గాలిచూలి = ఆంజనేయుడు, బాట = రాజమార్గము, నేలచూలి = సీత, వెతుకు = అన్వేషించు, మున్నీరు = సముద్రము, బాష్పము = ఆవిరి, వెడలు = బయల్పడు, త్రోవ = మార్గము, పుడమి = భూమి, గగన = ఆకాశ, సీమ = ప్రదేశము, అనన్వయము = ఉపమానము లేక యుండుట, కావ్యము = ప్రబంధము, ఏలు = శాసించు, ఏల = ఎందుకు)

సీతను అన్వేషించడంలో ఆంజనేయునికి రాజమార్గముగా, సముద్రము ఆవిరిగా బయల్పడే త్రోవగా, ఈ భూమికి గొడుగు నిచ్చు ఆకాశప్రదేశమే ఉపమానము లేకుండా ఉండి, అంటే అనన్వయాలంకారంగా, కావ్యాన్ని శాసించనేల?

106. గు, రు, వా, రం అన్న అక్షరాలు పాదం ప్రారంభంలో వచ్చేటట్లుగా పద్యం

106.109 తే.గీ. గురు కటాక్షము నాపైనఁ గురిసె నీశ్వ
రుని కరుణ, నొనగూడె నరుదయిన యప
వాద మెరుగని నిండు జీవనము, యంత
రంగ మానంద నిలయమై యంగగొనెను.

(కటాక్షము = దయ, ఒనగూడె = సిద్ధించె, అరుదు = అపురూపమైనది, అపవాదము = నింద, నిండు = పూర్ణమగు, అంతరంగము = మనస్సు, అంగగొను = ముందుకు నడుచు)

ఈశ్వరుని దయ వలన, గురువుగారి కటాక్ష వీక్షణాలు నాపైన కురిశాయి. అరుదైన, నింద లెరుగని సంపూర్ణ జీవనము సిద్ధించింది. మనస్సు ఆనంద నిలయమై ముందడుగేసింది.

107. గు, రు, వు, లు - అక్షరాలు పదాదిన వచ్చేటట్లుగా

107.110 ఆ.వె. గురువులు బహుముఖ సుగుణ జ్ఞాన కల్పత
రువులు, నిధులు కోరరు, మనవిసన
వులకు, నాజ్ఞలకు, వెతలకు, వార లతీతు
లు, యెటు లగును? వారి రుణము తీర్ప.

(బహుముఖ = ఎక్కువ దృక్కోణము లున్న, కల్పతరువు = కోరిన వస్తువులిచ్చెడు కల్పవృక్షము, మనవిసనవులు = విన్నపములు, ఆజ్ఞ = ఆదేశము, వెత = దుఃఖము, అతీతుడు = దాటినవాడు)

గురువులు (నిజమైన) బహుముఖమైన సుగుణాలకీ జ్ఞానానికీ కల్పవృక్షము వంటివారు. అంటే, అడిగిన వెంటనే, అవి పంచిపెడతారు. ఏ రకమైన ధనాలు కోరరు. విన్నపాలకీ, ఆదేశాలకీ, దుఃఖాలకీ అతీతులు. వారి రుణం ఎలా తీర్చుకోగలం?

108. గుణము, తృణము, పణము, రణము - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

108.111 చం. గుణముల లోన పాండవుల గొప్పకు కారణ మర్జునుండు, తా
తృణమునుఁ గాల్చి నట్లు మన తిట్టనుఁ గాల్చ సమర్థుడౌట, నే
పణమున వారి నోర్చి వనవాసముఁ జేయగ పంపుదుస్ ప్రతా
రణమున, యాజ్ఞ యిమ్ము పితరా! యిదె లెస్సని రాజరాజనెస్.

(గుణము = త్యాగ శౌర్యాది లక్షణములు, గొప్ప = ఆధిక్యము, తా = తాను, తృణము = గడ్డిపోచ, కాల్చు = దహించు, తిట్ట = సైన్యము, సమర్థుడు = దక్షుడు, పణము = జూదము, ఓర్చు = ఓడించు, వనవాసము = అరణ్యవాసము, ప్రతారణము = మోసము, పితరుడు = తండ్రి, లెస్స = శ్రేష్ఠము, రాజరాజు = దుర్యోధనుడు)

త్యాగ శౌర్యాది లక్షణములలో పాండవుల ఆధిక్యానికి కారణము తాను గడ్డిని దహించినట్లు మన సైన్యాన్ని దహించి వేయడానికి దక్షత కలిగిన అర్జునుడే. నేను జూదంలో మోసపూరితంగా వారిని ఓడించి అరణ్యవాసం చేయడానికి పంపుతాను. తండ్రీ! ఆజ్ఞ ఇవ్వు, ఇదే మంచిది అని దుర్యోధనుడు అన్నాడు.

109. గుమ్మము, గోడ, తలుపు, అరుగు - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో

109.112 తే.గీ. ముద్దుగుమ్మ ముసిమి యని మోహ పడడు
నన్ను, గోడసలు వినడు నరు డటంచు,
చింతలు పురణించగ నూర్వశి యిడె శాప
మపుడు, దివికి నరు యరుగు డట్లుఁ గడిచె.

(ముద్దుగుమ్మ = అందమైన స్త్రీ, ముసిమి = ప్రేమానుబంధము, మోహము = వలపు, నాదు = నా యొక్క, గోడు = వేదన, నరుడు = అర్జునుడు, చింత = తలపు, పురణించు = చెలరేగు, ఇడు = ఇచ్చు, దివి = స్వర్గము, అరుగుడు = ప్రయాణము, అట్లు = ఆప్రకారము, గడుచు = జరుగు)

అందమైన స్త్రీ ప్రేమానుబంధము అని నన్ను మోహించడు, వేదన అసలు వినిపించుకోడు అర్జునుడు అన్న తలపులు చెలరేగగా అప్పుడు ఊర్వశి శాపము ఇచ్చింది. స్వర్గానికి అర్జునుని ప్రయాణం ఆ ప్రకారంగా గడిచింది.

110. గురువు, లఘువు, గణము, యతి - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో

110.113 తే.గీ. గురువు నేర్పిన యస్త్రము లరుదు గాన,
రాము శౌర్యము యలఘువు రావణాఖ్య,
రాక్షస గణము నిలువదు రాము నెదుట,
వ్యతికరము వీడు మనిఁ జెప్పె వాయుసుతుడు.

(అరుదు = దుర్లభమైనది, శౌర్యము = పరాక్రమము, అలఘువు = గొప్పది, ఆఖ్య = పేరు, గణము = సమూహము, నిలుచు = పాటిపోకుండు, వ్యతికరము = వ్యసనము, వీడు = వదలు, వాయుసుతుడు = హనుమంతుడు)

రావణుడను పేరున్న వాడా! గురువు గారు నేర్పిన అస్త్రాలు దుర్లభమైనవి కనుక రాముని పరాక్రమము గొప్పది, రాక్షస సమూహము రాముని ఎదుట పాటిపోకుండా ఉండదు, వ్యసనము (స్త్రీ) వదిలి పెట్టు అని హనుమంతుడు చెప్పాడు.

111. గువ్వ, అవ్వ, బువ్వ, రవ్వ పదాలతో భారతార్థంలో

111.114 కం. గువ్వకరిగొనుచు భీముడు,
యవ్వను సోదరులఁ గావ, యడవిని తమనే
బువ్వగఁ గోరిన రాక్షసు,
రవ్వంతయు జడుపు లేక, రాయిడిఁ జేసెన్.

(గువ్వకరిగొను = విజృంభించు, అవ్వ = తల్లి, కావ = రక్షించుటకు, బువ్వ = భోజనము, రవ్వంత = కొంచెము, జడుపు = భయము, రాయిడి చేయు = వేధించు)

తల్లియైన కుంతీదేవిని, సోదరులను రక్షించడం కోసం భీముడు విజృంభిస్తూ అడవిలో తమనే ఆహారంగా కోరిన రాక్షసుణ్ణి కొంచెం కూడా భయం లేకుండా వేధించాడు.

112. గోలకొండ, తానీష, జుల్మాన, భద్రాచలం - పదాలతో భాగవతార్థంలో

112.115 మ. శ్రవణీయమ్మగు గోల కొండ పయి మాసం బుండు, నుద్వాహమం
దెవరిన్ గోరితి వా సుభద్ర యిట తా నీషత్కరం బొచ్చె న
చ్చువడన్, యా లలిఁ గాంచి చక్రి, యిక మోజుల్మానవా యర్జునా!
భవదీ యేచ్ఛ ఫలింప రైవతకమే భద్రాచలం బంచనెన్.

(శ్రవణీయము = వినదగినది, గోల = కలకలము, మాసము = నెల, ఉద్వాహము = వివాహము, ఈషత్కరము = కొంచెము, అచ్చువడు = అంకితమగు, లలి = ప్రేమ, కాంచు = చూచు, చక్రి = కృష్ణుడు, అంజు = సందేహము, మాను = విడుచు, భవదీయ = నీది, ఇచ్ఛ = కోరిక, ఫలించు = నెరవేరు, రైవతకము = ద్వారకకు సమీపమున ఉన్న కొండ, భద్ర = పదిలము, అచలము = పర్వతము)

వినదగిన కలకలం కొండ మీద ఒక నెల ఉంటుంది. వివాహంలో ఎవరిని కావాలని అనుకున్నావో ఆ సుభద్ర ఇక్కడికి తాను అంకితమవడానికి కొంచెం సేపు వచ్చింది. ఆ ప్రేమని గుర్తించి కృష్ణుడు, ఇంక నీ సందేహాలు వదిలిపెట్టవా, అర్జునా! నీ కోరిక ఫలించడానికి రైవతకాద్రియే సరియైన పర్వతమని అన్నాడు.

113. గోలకొండ, పూలదండ, కొత్తకుండ, మాలముండ అను పదములు వచ్చునట్లు రామాయణ కథ

113.116 తే.గీ. శూర్పణఖ గోల కొండగుచుఁ గనె సీత,
పూలదండ చేజార, కపోల మెర్ర
గుండ సౌమిత్రి వణ కొత్తకుండ కుజనుఁ
గాచె, కసుమాల ముండ రక్కసి మనమున.

(గోల = కలకలము, ఒండగు = వేరేవిధమగు, కను = చూచు, చేజారు = చేతినుండి జారిపోవు, కపోలము = చెక్కిలి, సౌమిత్రి = లక్ష్మణుడు, వణకు = కంపము, ఒత్తు = ఆక్రమించు, కుజ = సీత, కాచు = రక్షించు, కసుమాలము = జుగుప్స, రక్కసి = రాక్షసి)

శూర్పణఖ చేసిన గోలకి వేరే విధంగా అయిపోయి, పూలదండ చేతిలో నుండి జారిపోగా సీత చూసింది. ఆ రాక్షసి మనస్సులో జుగుప్స ఉండడం వల్ల, చెక్కిలి ఎర్రగా ఉండగా లక్ష్మణుడు వణుకు ఆక్రమించకుండా సీతను రక్షించాడు.

114. ఘనము, ధనము, మనము, వనము - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ స్వేచ్ఛాఛందంలో రామాయణార్థంలో

114.117 శా. ఏ నుల్లంఘున మెట్లుఁ జేతుఁ, బితరుస్ యిచ్చించ కైకేయి నన్
గానన్ బంపు నిబంధనమ్ముఁ, భరతా! గాదంచు వాదింతుమా?
కానిమ్మీ గమనమ్ముఁ గానలకు, యాకాంక్షించిఁ గైకొంటినా
నే నిక్కట్లను? సాంత్వనమ్ము దరి రానీ కంచు రాముం డనెన్.

(ఏను = నేను, ఉల్లంఘునము = అతిక్రమణము, పితరుఁడు = తండ్రి, ఇచ్ఛించు = కోరు, కాన = అడవి, నిబంధనము = కట్టుపాటు, గమనము = ప్రయాణము, ఆకాంక్షించు = కోరు, కైకొను = గ్రహించు, ఇక్కట్లు = కష్టము, సాంత్వనము = ఓదార్పు, దరి = సమీపము)

కైకేయి నన్ను అడవికి పంపే నిబంధన తండ్రిని కోరగా నేను ఎట్లా అతిక్రమిస్తాను, భరతా! కాదని వాదిస్తామా? అవనీ అడవులకు ఈ ప్రయాణం. కష్టాన్ని కోరి తెచ్చుకున్నానా? ఓదార్పు దగ్గరకు రానీకు అని రాముడు అన్నాడు.

115. ఘనరాగ పంచకమైన నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ - అన్న పదాలతో పద్యం

115.118 కం. జగదానందము నాట య
భిగతం బగుచు, మనసార భిల్లుని కృతియే
తగు కీర్తన లిడి, శ్రీకర
మగు గౌళంబై, స్వరాళి కనుగుణ మయ్యెన్.

(నాటు = పాదుకొను, అభిగతము = పొంద బడినది, మనసు + ఆర = హృదయము నిండగా, భిల్లుడు = బోయవాడు, కృతి = కావ్యము, ఇడు = ఇచ్చు, శ్రీకరము = శుభము కల్గించునది, కౌళం = కులాచారము, స్వర = సంగీతంలో సప్త స్వరాలు, ఆళి = సమూహము, అనుగుణము = అర్హము)

లోకంలో ఆనందము పాదుకొనడానికి పొందబడినది అవుతూ బోయవాని కావ్యమైన రామాయణము హృదయము నిండేటట్లుగా సరియైన కీర్తనలను ఇచ్చి శుభప్రదమైన కులాచారమై సంగీతం లోని సప్త స్వరసమూహానికి అనుగుణ మయ్యింది.

116. చారు, దారు, సారు, పారు - పదాలతో సుందరకాండ వృత్తాంతము

116.119 తే.గీ. గూఢచారునిఁ బోలె నిగూఢ కరణి,
రాము కభిసారుడు, హనుమ, రావణు పురిఁ
జేరి, దారుణమగు రక్కసి గుమి నడుమ,
పారు వస్తమింప, కుజను తేఱిచూచె.

(గూఢచారుడు = వేగు, పోలె = వలె, నిగూఢ = రహస్యమైన, కరణి = విధము, అభిసారుడు = సేవకుడు, దారుణ = భయంకరమైన, రక్కసి = రాక్షస స్త్రీ, గుమి = గుంపు, పారువు = సూర్యుడు, కుజ = సీత, తేఱిచూచు = పరికించు)

గూఢచారుని వలె రహస్యమైన పద్ధతిలో రాముని సేవకుడైన హనుమంతుడు రావణుని పట్టణము చేరి భయంకరమైన రాక్షస స్త్రీల నడుమ, సూర్యుడు అస్తమించగా, సీతను పరికించాడు.

117. చారు, సాంబారు, రసము, పులుసు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

117.120 తే.గీ. వీ డనాచారు డగు సైంధవుండు, యొసగె
యంగలార్పులు సుచరిత్ర యాజ్ఞసేని
కనుచు, విరసముఁ జూపు భీమునికి యలిగి,
యతడు "సాంబా!" రుతమ్మున యభవుఁ గొలిచె.

(అనాచారుడు = సదాచారము లేనివాడు, ఒసగు = కలుగచేయు, అంగలార్పు = మనోవ్యధ, సుచరిత్ర = పతివ్రత, యాజ్ఞసేని = ద్రౌపది, విరసము = ద్వేషము, అలుగు = కోపముచేయు, సాంబుడు = శివుడు, రుతము = ధ్వని, అభవుడు = శివుడు, కొలుచు = ఆరాధించు)

ఇతడు సదాచారము లేనివాడైన సైంధవుడు, పతివ్రతయైన ద్రౌపదికి మనోవ్యధ కలుగ చేశాడు అని ద్వేషము చూపించే భీముడికి అలిగి "సాంబా!" అనే ధ్వనితో శివుణ్ణి ఆరాధించాడు.

118. చింత, నిమ్మ, మామిడి, వెలగ - పదాలను ఉపయోగిస్తూ ద్రౌపది కీచకుని అధిక్షేపించడాన్ని

118.121 మ. అనుచింతన్ యెద నింపి, మోహమున తన్నశ్లీల బంధంబునన్
యనుసంధింపగఁ జూడ, నిమ్మళముగా యర్థించి పాంచాలి, వా
రణఁ జేయన్ విడుమా మిడిన్ యనుచు, యారాటమ్ముతో కీచకున్
నినుఁ గూడన్, యిటఁ జూపె లగ్నమిది కానే కాదు, పొమ్మంచనెన్.

(అనుచింత = ఎడతెగని దుఃఖము, ఎద = మనస్సు, మోహము = కామము, అశ్లీల = అసభ్యమైన, బంధము = సంయోగము, అనుసంధించు = కూర్చు, నిమ్మళము = నెమ్మది, అర్థించు = వేడుకొను, పాంచాలి = ద్రౌపది, వారణ = నివారించుట, విడు = విడుచు, మిడి = గర్వము, ఆరాటము = సంతాపము, కూడు = చేరు, చూపె = చూడుము, లగ్నము = ముహూర్తము)

ఎడతెగని దుఃఖాన్ని మనస్సులో నింపుకొని, కామంతో తనను అశ్లీల బంధంతో కూర్చడానికి చూడగా, నెమ్మదిగా వేడుకొని ద్రౌపది, నివారించడానికి గర్వం విడిచి పెట్టుమా అని అంటూ, సంతాపంతో కీచకుణ్ణి, నిన్ను చేరడానికి ఇక్కడ చూడు, ఇది ముహూర్తము కానే కాదు పొమ్మ, అని అంది.

119. చితి, భూమి, శోక, చారు - పదాలతో హనుమంతుడు సీతమ్మ గురించి రామునితో చెప్పే సన్నివేశం ఉత్పలమాలలో

119.122 ఉ. చూచితి నబ్ధి దాటి యొక సుందర వాటిక యందు రక్కసుల్
వేచగ శోకతప్త యగు భీరువు దైన్యము, యామె నచ్చటన్
దాచెను రావణుం డనుచుఁ దల్చితి చారుఁని వోలె, రాఘవా!
యా చల భూమిజే యనుచు యానిలిఁ జెప్పెను యంజలించుచున్.

(అబ్ధి = సముద్రము, దాటు = లంఘించు, సుందర = మనోహరమైన, వాటిక = ఉద్యానవనము, రక్కసి = రాక్షస స్త్రీ, వేచు = బాధించు, శోకతప్త = మనోదుఃఖముతో తపింప జేయబడినది, భీరువు = భయపడు స్త్రీ, దైన్యము = దురవస్థ, దాచు = మఱుగుపఱచు, తల్చు = భావించు, చారుడు = వేగువాడు, వోలె = వలె, రాఘవుడు = శ్రీరాముడు, చల = వణఁకు గలది, భూమిజ = సీత, ఆనిలి = హనుమంతుడు, అంజలించు = నమస్కరించు)

ఓ, శ్రీరామా! సముద్రము దాటి ఒక అందమైన ఉద్యానవనంలో రాక్షస స్త్రీలు బాధించగా మనోదుఃఖముతో తపిస్తూ భయపడే స్త్రీ యొక్క దురవస్థ చూశాను, ఆమెని అక్కడ రావణుడు దాచాడని వేగులాగ అనుకున్నాను. ఆ వణఁకుతున్న స్త్రీ సీతయే యని హనుమంతుడు నమస్కరిస్తూ చెప్పాడు.

120. చిలువ, కలువ, నలువ, పలువ - పదాలతో పౌరాణికార్థంలో

120.123 తే.గీ. చిలువతాలుపు తపమును చెఱుపుఁ జేయ
కలువవిల్తుడు నాళీకములుఁ జిలుకగ
నలువతమ్ముని భస్మం బొనర్చె శివుడు
పలువఁ గాదను పార్వతి పలుకు వినక.

(చిలువతాలుపు = శివుడు, చెఱుపు = చెడగొట్టు, కలువవిల్తుడు = మన్మథుడు, నాళీకము = బాణము, చిలుకు = చల్లు, నలువతమ్ముడు = మన్మథుడు, భస్మము = బూడిద, ఒనర్చు = చేయు, పలువ = దుష్టుడు, పలుకు = మాట)

శివుని తపస్సు చెడగొట్టడానికి మన్మథుడు బాణాలు వేయగా, అతడు దుష్టుడు కాదని పార్వతి చెబుతున్నా వినకుండా శివుడు మన్మథుణ్ణి బూడిద చేశాడు.

121. చీమ, దోమ, నల్లి, పేను - పదాలను ఉపయోగిస్తూ గోపికావస్త్రాపహరణం గురించి

121.124 తే.గీ. వెన్నుఁడు పతియౌ నను తలపే నుసుమగ,
ప్రేతలు వ్రతమెదో మందలించి మునిగి
బిత్తలలుగ, నల్లిందపై వృష్ణిఁ గాంచి,
వలదు పేచీ మన కనుచు వలువ లడిగె.

(వెన్నుఁడు = కృష్ణుడు, పతి = భర్త, తలపు = కోరిక, నుసుము = ఆకర్షించు, ప్రేత = గోపిక, వ్రతము = నోము, మందలించు = తలచు, మునుగు = స్నానము చేయు, బిత్తల = దిసమొల, నల్లింద = వృక్షము, వృష్ణి = కృష్ణుడు, కాంచు = చూచు, పేచీ = వివాదంతో కూడిన తగాదా, వలువ = వస్త్రము)

కృష్ణుడు భర్త ఔతాడనే కోరిక ఆకర్షించగా, గోపికలు ఏదో నోము ఆలోచించి దిసమొలలుగా స్నానం చేసి వృక్షం మీద కృష్ణుణ్ణి చూసి మనకి పేచీ వద్దు అంటూ వస్త్రాలు అడిగారు.

122. చెక్క, సైను, మనీ, డ్రా - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

122.125 తే.గీ. అన్న కక్కసై నులుమునో యన హిడింబ
చెక్కుచెదర నివ్వను నీకు, చెలువ! యనుచు
పోరు బండ్రాళ్ళ తోడ సామీరి సలిపె,
నీచు డగు హిడింబు దునుమ, నీతి నిలుప.

(అక్కసు = ఆగ్రహము, నులుము = చంపు, చెక్కుచెదరనివ్వక = ఎట్టిమార్పు లేక యథాస్థితి యందుండు నటుల, చెలువ = అందముగల ఆడుది, పోరు = యుద్ధము, బండ్రాయి = వెడల్పైన రాయి, తోడ = తో, సామీరి = భీముడు, చలుపు = చేయు, నీచుడు = అధముడు, దునుము = చంపు, నీతి = న్యాయము)

తన అన్నయైన హిడింబుడు కోపంతో చంపుతాడేమో అని హిడింబ అనగా, ఓ సుందరీ! నీకు చెక్కుచెదర నివ్వను అంటూ భీముడు, న్యాయం నిలబెట్టడానికి, నీచుడైన హిడింబుణ్ణి చంపడానికి, బండ్రాళ్ళతో యుద్ధం చేశాడు.

123. చెప్పు, చేట, చీపురు, పేడ - పదాలతో శ్రీకృష్ణదేవరాయలు అల్లసాని పెద్దనకు సన్మానము చేయడం

123.126 ఉ. రేపగ మక్కువన్ మనుచరిత్రను చెప్పు కళన్, జగత్తు బా

కీపడ, సంస్కృతాంధ్రముల కేల్గల పేడ యనంగ లేక పే
చీ, పురుహూతుడౌ కవిగ చెప్పగ మాలిక, కృష్ణరాయలే
చాపి కరమ్ము, పెద్దనకు సత్కృతిగా ధన మిచ్చె చేటలన్.

(రేపు = ఉసికొలుపు, మక్కువ = ఆసక్తి, కళ = విద్య, జగత్తు = ప్రపంచము, బాకీపడు = ఋణపడు, కేల్గలపు = చేతులుకలుపు, ఏడ = ఎక్కడ, అనంగ = అనడానికి, పేచీ = తంటా, పురుహూతుడు = ఇంద్రుడు, మాలిక = పద్యమాలిక, కరము = చెయ్యి, సత్కృతి = సత్కారము, చేట = చెరిగెడి సాధనము)

మనుచరిత్రను చెప్పే విద్యలో ఆసక్తిని రేపగా, ప్రపంచము ఋణపడేటట్లుగా సంస్కృతము తెలుగు భాషలు చేతులు కలపడం ఎక్కడ అనడానికి పేచీ లేకుండా, కవీంద్రుడుగా పద్యమాలిక చెప్పగా కృష్ణరాయలు స్వయంగా చెయ్యి చాపి పెద్దనకు సన్మానంగా చేటలతో ధనము ఇచ్చాడు.

124. చెప్పు, రప్పు, ఉప్పు, ముప్పు - పదాలతో

124.127 కం. చెప్పుచు నుంటి గద, పెసర
పప్పును దోరగను వేపి బాణలి యందున్,
యుప్పుఁ గలిపి తినగ, ముదిసి
ముప్పుండదు, రుచిగ నుండు, ముచ్చట తీరున్.

(దోరగ = ఎఱ్ఱబారినదిగా, వేపు = వేపుడు, బాణలి = వేచుట లోనగువానికి ఉపయుక్తమగు లోహపాత్ర, ముదిసిముప్పు = ముసలితనము, ముచ్చట = కోరిక)

చెపుతూనే ఉన్నాను కదా. పెసర పప్పును దోరగా పెనంలో వేగించి ఉప్పు కలిపి తింటే ముసలితనము ఉండదు. రుచిగా ఉంటుంది. కోరిక తీరుతుంది.

125. చేప, రొయ్య, నత్త, పీత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

125.128 తే.గీ. వీర్యశుల్కను చేపట్ట వీలుఁ గాక,
పోయి రొయ్యన నృపుఁలని పొక్కిసడి మ
హీజ నత్తఱిఁ గాంచి యనెన్, జనకుడు
కౌశిక జపీ! తగు వెరవు కాశఁ గలదె?

(వీర్య = పరాక్రమము, శుల్క = వధువునకై ఇచ్చేది, చేపట్టు = పెండ్లియాడు, ఒయ్యన = మెల్లన, నృపుడు = రాజు, వొక్కిసడు = దుఃఖించు, మహీజ = సీత, అత్తఱి = ఆ సమయంలో, కాంచు = చూచు, కౌశికుడు = విశ్వామిత్రుడు, జపి = ముని, తగు = యుక్తమగు, వెరవు = ఉపాయము)

వీర్యశుల్కగా ప్రకటించిన వనితను పెళ్ళి చేసుకోవడానికి వీలు కాక రాజులు వెళ్ళిపోయారని సీతను ఆ సమయంలో చూచి దుఃఖించి విశ్వామిత్ర మునీ! సరియైన ఉపాయానికి ఆశ ఉందా? అని జనకుడు అన్నాడు.

126. చేమ, కంద, వంగ, చిక్కుడు - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దేశభక్తి పరంగా

126.129 ఉ. త్యాగముచే మహామహులు యార్జనఁ జేసి స్వతంత్ర మివ్వగా,
భాగము చేసి పంచుకొను వారల కంద, సమర్థులం దను
ద్యోగము హెచ్చవం, గడు యయోమయ మైన పరిస్థితన్న వ్యా
యోగపు మాట, లెన్నికల వ్యూహపు చిక్కుడుకాఱఁ జేయవే.

(త్యాగము = త్యజనము, మహామహుడు = గొప్ప తేజస్సు కలవాడు, ఆర్జన = సంపాదనము, స్వతంత్రము = స్వేచ్ఛ, భాగము = వాటా, అందు = లభించు, సమర్థుడు = ప్రాజ్ఞుడు, అనుద్యోగము = ప్రయత్నములేమి, కడు = మిక్కిలి, అయోమయము = గందరగోళము, పరిస్థితి = సందర్భము, వ్యాయోగము = నాటకము, వ్యూహము = మిక్కిలి ఊహ, చిక్కు = సంకటము, ఉడుకాఱు = చల్లాఱు)

తేజస్వంతులు తమ త్యాగంతో సంపాదించి స్వతంత్రము ఇవ్వగా అది వాటాలు వేసుకుని పంచుకునే వాళ్ళకి లభించగా ప్రాజ్ఞుల ప్రయత్నలోపం ఎక్కువ అవడం వలన పరిస్థితి గందరగోళం అయ్యింది అనే నాటకం డైలాగులు ఎన్నికల వ్యూహంలో ఉన్న సంకటాన్ని చల్లాఱఁ జేయవా!

127. చేరు, కూరు, తీరు, ఊరు - పదాలతో రామాయణార్థంలో

127.130 ఉ. చేరు నయోధ్య రాము డిటఁ జేకొను రాజ్యము, కాక యున్నఁ జే
కూరును నాకు చావనుచు గోడును కైక సుతుండుఁ గ్రక్క, యా
తీరునుఁ గాంచి యానిలి, ప్రతీక్షణమా, భరతా! ముగించి మీ
యూరున స్వాగతమ్మిడగ యుద్యతిఁ జేయుము రాము కంచనెస్.

(చేరు = సమీపించు, ఇట = ఇక్కడ, చేకొను = స్వీకరించు, కాక = అన్యథా, చేకూరు = లభించు, గోడు = దుఃఖము, క్రక్కు = వెడల చేయు, తీరు = విధము, కాంచు = చూచు, ఆనిలి = ఆంజనేయుడు, ప్రతీక్షణము = ఎదురుచూచుట, ముగించు = సమాప్తముచేయు, ఊరు = దేశము, ఇడు = ఇచ్చు, ఉద్యతి = యత్నము)

రాముడు అయోధ్య చేరుకుంటాడు, ఇక్కడ రాజ్యాన్ని స్వీకరిస్తాడు, అట్లా కాకపోతే నాకు మృత్యువు దక్కుతుంది అంటూ కైక కుమారుడైన భరతుడు దుఃఖాన్ని వెళ్ళగ్రక్కగా ఆ తీరుని చూసి ఆంజనేయుడు, భరతా! ఎదురుచూడడం ఆపేసి మీ దేశంలో రాముడికి స్వాగతం ఇవ్వడానికి ప్రయత్నం చెయ్యి అని చెప్పాడు.

128. చైనా, జపాన్, ఇరాక్, ఇరాన్ - పదాలతో భారతార్థంలో

128.131 తే.గీ. బిలమును తొలిచైనా లక్క నిలయ మందు,
ధర్మరాజ! పానుకొని పథము నెరుగుము,
పెకలు మొక రేయి రాకుడు రాక మున్నె,
యనెను బాబాయి, రానున్న దాకళించి.

(బిలము = సొరంగము, తొలుచు = రంధ్రముచేయు, నిలయము = ఇల్లు, పానుకొను = యత్నించు, పథము = మార్గము, ఎరుగు = తెలిసికొను, పెకలు = ప్రయాణమగు, రేయి = రాత్రి, రాకుడు = సూర్యుడు, మున్ను = ముందు, బాబాయి = పినతండ్రియైన విదురుడు, ఆకళించు = అవగాహనము చేసికొను)

ధర్మరాజా! లక్క ఇంటిలో సొరంగము తొలిచియైనా ప్రయత్నించి మార్గము తెలుసుకో, ఒక రాత్రి సూర్యుడు రాక మునుపే ప్రయాణం అవ్వండి, అని జరగబోయేదాని మీద అవగాహనము చేసుకున్న పినతండ్రియైన విదురుడు అన్నాడు.

129. ఛందం ఉత్పలమాల; మొదటి పాదం పదో అక్షరం ష్వ; పదకొండో అక్షరం క్ష; రెండో పాదంలో రెండో అక్షరం గ్ర; పద్దెనిమిదో అక్షరం క్లే; మూడో పాదం మొదటి అక్షరం భీ; ఎనిమిదో అక్షరం శ్ల; నాలుగో పాదం పదో అక్షరం ధా; ఇరవైయో అక్షరం గో. మురార్జీ దేశాయ్ ప్రధాని కావటం గురించి.

129.132 ఉ. జాగృతితో స్వదేశమున, ష్వక్షకమౌ జనతా సమాఖ్యతో,
నిగ్రహ మొప్ప యెన్నికలు, నేత మురార్జి జయించి, క్లేశముస్,
భీ గ్రహణమ్ముఁ జేయ, శ్లథ బింకము కాంగ్రెసు పక్షమందు, య
త్యగ్ర విదేశముల్ గన, ప్రధానిగ నిల్చె ప్రసిద్ధిగస్, యిగో.

(జాగృతి = జాగరూకత, షు = కని లేక సృష్టించి; అక్షకము = నేమి అనగా చక్రమును తీసుకెళ్లునది, సమాఖ్య = కూటమి, నిగ్రహము = సంయమనము, క్లేశము = దుఃఖము, భీ = భయము, గ్రహణము చేయు = గ్రహించు, శ్లథ = శిథిలమైనది, బింకము = గర్వము, అతి = ఎక్కువ, అగ్ర = ప్రధానమైనది, కన = చూడగా, ప్రసిద్ధి = ఖ్యాతి, ఇగో = ఇదిగో)

మెలకువతో స్వదేశంలో, సృష్టించిన బండి టైరు లాంటి జనతా కూటమితో నాయకుడైన మురార్జీ ఎన్నికలు సంయమనంతో గెలిచి, దుఃఖాన్ని, భయాన్ని స్వీకరించగా, కాంగ్రెసు పక్షములో గర్వము శిథిల మవగా, ఎక్కువ ముఖ్యమైన విదేశాలు చూస్తూ ఉండగా, కీర్తితో, ఇదిగో, ప్రధానిగా నిలిచాడు.

130. జ, డ - నిషేధిస్తూ “జడ” మీద పద్యం

130.133 మ. పరిభాసిల్లును మేన యున్న, వదలన్ వ్యర్థం బగున్, యట్టి యీ
మురిపెమ్ముల్ గురిపించు వెంట్రుకలచే ముక్కంటి యాపెన్ సుధన్,
కురు నందాన్వయముల్ గతించె సిగ నెక్కొల్పన్ పగన్, కేకటన్
తరుణుల్ వేణిని పేర్మి కయ్యముల శస్త్రం బంచు మన్నింతురే.

(పరిభాసిల్లు = ప్రకాశించు, మేను = శరీరము, వదలు = వదలిపెట్టు, వ్యర్థము = ప్రయోజనములేనిది, అట్టి = అటువంటి, మురిపెము = సంతోషము, కురిపించు = వర్షించు, ముక్కంటి = శివుడు, ఆపు = ఆగునట్లు చేయు, సుధ = గంగానది, అన్వయము = వంశము, గతించు = చచ్చు, సిగ = జుట్టు, నెక్కొల్పు = ప్రతిష్ఠించు, పగ = ద్వేషము, కేకట = పరిహాసము, తరుణి = స్త్రీ, వేణి = జడ, పేర్మి = ప్రేమ, కయ్యము = కలహము, శస్త్రము = ఆయుధము, మన్నించు = ఆదరించు)

శరీరానికి ఉంటే ప్రకాశించి, శరీరము వదిలిపెట్టితే ఎందుకూ పనికిరానటువంటి ఈ ఆనందాలు వర్షించే వెంట్రుకలతో శివుడు గంగానదిని ఆగేటట్లు చేశాడు. కురు (ద్రౌపది వల్ల) నంద (చాణక్యుని వల్ల) వంశాలు జుట్టు ప్రతిష్ఠించిన ద్వేషము వల్ల గతించాయి. పరిహాసంలో భాగంగా స్త్రీలు జడను ప్రణయ కలహాలలో ఆయుధంగా ఆదరిస్తారు.

131. జడేజా, ద్రావిడ్, కుంబ్లే, కాంబ్లీ అనే పదాలు ఒక్కొక్క పాదంలో వచ్చేటట్లుగా హనుమ సముద్ర లంఘన వృత్తాంతం.

131.134 మ. పెను నీడన్, హనుమంతు సింహిక హుకుం బ్లేష్కంబునన్, యంబుధిన్
గని నోటన్ వడి గుంజ, యానిలి తిమిన్ గాంచెన్ జడే జాణదౌ,
దునుమన్ మారుతి దాని దూరుచు ననన్ 'దుష్టాత్మకాంబ్లింగమా'
'గుణసాంద్రా' విడు మంచు పావనికిఁ దా ఘోషించె నా రక్కసే.

(పెను = పెద్ద, నీడలో = ఛాయలో, హుకుం = ఆజ్ఞ, బ్లేష్కము = పాశము, అంబుధిన్ = సముద్రంలో, కని = చూచి, నోటన్ = నోటితో, వడి గుంజ = వేగంగా లాగగా, ఆనిలి = హనుమంతుడు, తిమిన్ = సుముద్రంలో, కాంచెన్ = చూచెను, జడే = పెండ్రుకల యల్లికే, జాణదౌ = నేర్పరిది అయినట్టి ఆ సింహిక యొక్క, దునుమన్ = సంహరించుట కొరకు, మారుతి = హనుమంతుడు, దూరుచు = నిందించుచూ, దుష్టాత్మకం = చెడు స్వభావము గల, అబ్లింగమా = జల లింగమా, గుణసాంద్రా = గుణములు చిక్కగాకలవాడా, పావని = హనుమంతుడు, ఘోషించు = బిగ్గరగా అరుచు, రక్కసి = రాక్షసి)

హనుమంతుడు రామకార్యం మీద సముద్రం లంఘించినప్పుడు కలిగిన ఆటంకాల్లో సింహిక అన్న రాక్షసి ఒకటి. సింహికకు ఉన్న శక్తి ఏమంటే ఆకాశంలో ఎగురుతున్న వాటిని నేల మీద పడ్డ వాటి నీడను పట్టి క్రిందికి లాగి తినడం. అందువల్ల, పైన ఎగురుతున్న హనుమంతుని నీడను పట్టుకుంది. ఎవరో తనని పట్టి లాగుతున్నట్లు అనిపించి హనుమ క్రిందికి చూడగా సింహిక కనిపించింది. హనుమ మొదట శరీరాన్ని పెంచి తర్వాత చిన్నగా చేసి సింహిక నోట్లో దూరి, దాన్ని చీల్చి చంపాడు.

ఇక పద్యంలో ఊహ ఏమిటంటే, సింహిక తన నీడను పట్టి తనను లాగుతున్నప్పుడు, హనుమకి నీళ్ళలో దాని జడ తేలుతూ కనబడి అది ఒక జలలింగం లాగా అగుపించింది. అప్పుడు దాన్ని చంపదలచి హనుమ తిట్టాడు. అది విడిచి పెట్టమని ఏడ్చింది.

పెద్దగా ఉన్న నీడలో హనుమంతుని తన ఆజ్ఞాపాశంతో సింహిక చూసి నోటితో వేగంగా లాగగా, సముద్రంలో ఆ నేర్పరి జడను చూసిన హనుమ, చంపాలనే ఉద్దేశ్యంతో దాన్ని తిడుతూ 'చెడు స్వభావము గల జల లింగమా' అని అనగా, 'గుణసాంద్రా నన్ను విడిచిపెట్టు' అని ఆ రాక్షసి అరిచింది.

132. జనవరి, మార్చి, మే, జులై - పదాలతో భారతార్థంలో చంపకమాల

132.135 చం. స్వజన వరీయు డర్జునుడు సైంధవుఁ జంప ప్రతిజ్ఞఁ బూనగన్
స్వజుఁ బరిమార్చి కౌరవులు సంతస మంది రటం చెరుంగ, కుం
భజు తలమే ధనంజయుని వంటి శుటీరుని యడ్డుటంచు సూ
ర్యజుడు తలంచుటే, కులజులైన వరేణ్యుల కిచ్చె ధైర్యమున్.

(స్వజన = తన వాడు, వరీయుడు = శ్రేష్ఠుడు, ప్రతిజ్ఞ = శపథము, పూను = వహించు, స్వజుడు = కుమారుడైన అభిమన్యుడు, పరిమార్చు = చంపు, సంతసము = సంతోషము, ఎరుంగు = తెలియు, కుంభజుడు = ద్రోణుడు, తలము = శక్యము, సూర్యజుడు = కర్ణుడు, శుటీరుడు = శూరుడు, అడ్డు = నిరోధించు, ధర్మజుడు = ధర్మరాజు, తలంచు = యోచించు, కులజుడు = మంచి పుట్టుక కలవాడు, వరేణ్యుడు = ముఖ్యుడు)

తన కుమారుడైన అభిమన్యుని చంపి కౌరవులు సంతోషం పొందారని తెలియడంతో, తన వాళ్ళలో శ్రేష్ఠుడైన అర్జునుడు సైంధవుని చంపడానికి శపథము పట్టగా, అర్జునుని వంటి శూరుని నిరోధించడం ద్రోణునికి సాధ్యమా అని కర్ణుడు అనుకోవడమే కులీనులైన ముఖ్యులకి ధైర్యాన్ని ఇచ్చింది.

133. జనవరి, మార్చ్, మే, జూలై - పదాలతో గురువు నందు శిష్యుడి కృతజ్ఞతా భావం

133.136 కం. దరిచేరగ లేజూలై,
గురువర! బుధజన వరిష్ఠ! గొప్పగ విద్యన్
గరపిన మేలును మరతునె?
చరితను మార్చినది తమదు సన్నిధిఁ గాదా.

(దరిచేరు = దగ్గఱచేరు, లేజూలు = పసిబిడ్డ, గురువర = గురుశ్రేష్ఠా, బుధజన = పండితుడు, వరిష్ఠుడు = మిక్కిలి శ్రేష్ఠుడు, కరపు = బోధించు, మేలు = ఉపకారము, మరచు = విస్మరించు, చరిత = నడవడి, సన్నిధి = సామీప్యము)

ఓ గురుశ్రేష్ఠా! పండితోత్తమా! పసిబిడ్డగా దగ్గఱచేరగా గొప్పగా విద్యను బోధించిన ఉపకారాన్ని మరచిపోతానా? నడవడిని మార్చింది మీ సాన్నిధ్యం కాదా.

134. జరదా, సరదా, దురదా, వరదా - పదాలతో పద్యం

134.137 మ. జర దాక్షిణ్యము మాంస కండల జరాసంధుండుగాఁ గూర్చ, వీ
సర దార్ఢ్యంబుగ మారి, రాజుల బలిన్ శైవార్పితం బంచు ద
ర్దుర దాసుండుగ చేయుచుండుటఁ గనన్, ప్రోత్సాహనం బిచ్చు య
ధ్వర దాహార్తినిఁ బాపె, భీముడు భుజౌద్ధత్యంబునన్ బోరునన్.

(జర = జర అను రాక్షసి, దాక్షిణ్యము = దయ, కూర్చు = కలుపు, వీసర = లోపము, దార్ఢ్యము = బలము, బలి = దేవతలయెదుట చంపుట, దర్దుర = పార్వతి, దాసుడు = సేవకుడు, కను = చూచు, ప్రోత్సాహనము = ఉత్సాహము, అధ్వర = యజ్ఞము, దాహము = ఆశ, ఆర్తి = పీడ, పాపు = తొలగించు, భుజౌద్ధత్యము = పొగరుబోతుతనము, పోరు = యుద్ధము)

జర అనే రాక్షసి మాంస కండలను జరాసంధుడిగా కలపగా లోపం బలంగా మారి పార్వతీ మాత దాసుడిగా శివునికి నైవేద్యం అంటూ రాజులను బలి ఇవ్వడం చూసిన మీదట, ప్రోత్సాహము ఇచ్చే యజ్ఞ దాహార్తిని భీముడు యుద్ధంలో తన భుజగర్వంతో పోగొట్టాడు.

135. జలగ, కప్ప, చేప, నత్త - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

135.138 కం. వచ్చె విదర్భజ లగనము,
విచ్చేసెను కన్నుకప్ప వెన్నుడు యటకున్
తెచ్చె చెలిని చేపట్టగ,
వ్రచ్చెను మేనత్తమిల యరాతుల బోరన్.

(విదర్భజ = రుక్మిణి, లగనము = ముహూర్తము, విచ్చేయు = వచ్చు, కన్నుకప్పు = ఎదుటివారిని వారికి తెలియకుండా మోసగించు, వెన్నుడు = శ్రీకృష్ణుడు, తెచ్చు = తీసుకొని వచ్చు, చెలి = స్నేహితురాలు, చేపట్టు = పెండ్లియాడు, వ్రచ్చు = హింసించు, మేను = శరీరము, అత్తమిలు = క్రుంకు, అరాతి = శత్రువు, పోరు = యుద్ధము)

రుక్మిణి వివాహ ముహూర్తం వచ్చింది. అక్కడికి ఎదుటివారిని వారికి తెలియకుండా మోసగించడానికి శ్రీకృష్ణుడు వచ్చాడు. చెలిని పెళ్ళాడడానికి తెచ్చాడు. యుద్ధంలో శత్రువుల శరీరము క్రుంగే విధంగా హింసించాడు.

136. జలుబు, దగ్గు, నొప్పి, నలత - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ రామాయణార్థంలో

136.139 తే.గీ. ప్రజలు బుసకొట్టి, రాముని పథము నడ్డి,
పలుక దగ్గుత్తికలను, మరలు మటంచు,
జనకు మాట నొప్పితినని, వనము కేగ,
లాలనల తట్టి యాతడు ప్రజకు తెలిపె.

(బుసకొట్టు = కోపపడు, పథము = మార్గము, అడ్డు = అడ్డగించు, దగ్గుత్తిక = గద్గదస్వరము, మరలు = వెనుకకు తిరుగు, జనకుడు = తండ్రి, ఒప్పు = సమ్మతించు, వనము = అడవి, ఏగు = వెళ్ళు, లాలన = బుజ్జగింపు, తట్టు = చరచు)

ప్రజలు కోపంతో శ్రీరాముని మార్గాన్ని అడ్డగించి గద్గదస్వరాలతో వెనక్కి రమ్మని పలుకగా, అడవికి వెళ్ళాలను తండ్రి మాటను సమ్మతించానని, బుజ్జగింపులతో తట్టి అతడు ప్రజలకు తెలియజేశాడు.

137. జుట్టు, కన్ను, ముక్కు, చెవి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

137.140 తే.గీ. పట్టగ నిను వాలి ధరణిఁ జుట్టు, ఋష్య
మూక మన బెదరును, రాడు ముక్కుకొయ్య,
పెడచెవినిబెట్టడు ముని సాపె నని హనుమ,
యెండకన్నెరుగక నార్కి నుండు మనియె.

(పట్టు = నిర్బంధముచేసి గ్రహించు, ధరణి = భూమి, చుట్టు = తిరుగాడు, ఋష్యమూకము = సుగ్రీవుడు నివసించే ఋష్యమూక పర్వతము, బెదరు = భయపడు, ముక్కుకొయ్య = బాధాకరుఁడు, పెడచెవినిబెట్టు = నిర్లక్ష్యముచేయు, సాపెన = శాపము, ఎండకన్ను = కష్టములు, ఎరుగు = తెలియు, ఆర్కి = సుగ్రీవుడు, ఉండు = వసించు)

నిన్ను పట్టుకోవడానికి వాలి భూమి అంతా తిరుగుతాడు, ఋష్యమూకము అంటే భయపడతాడు, రాడు బాధాకరుఁడు, ముని (మతంగుడు) శాపాన్ని నిర్లక్ష్యము చేయడనీ, హనుమంతుడు, కష్టాలు తెలియకుండా జీవించమని సుగ్రీవునికి చెప్పాడు.

138. టమాట, పుటాటొ, కాబేజి, కారెట్ - పదాలతో భారతార్థంలో

138.141 ఉ. బాసట మాట మార్చి తన బావగు క్రీడికి భాగమివ్వగా,
వేసరి రాజరాజుఁ బడు వేదన మాన్పగ, పంపు టాటొ, య
త్యాసలు నింపుటో తెలుప, కాబె జిగీషనుఁ గాయ మానముస్
గాసె వరూధినిస్ యిడి, పుకారెటు కృష్ణుని భావ మెంచినస్.

(బాసట = సహాయము, మార్చు = తారుమారుచేయు, క్రీడి = అర్జునుడు, వేసరు = విసుగుకొను, రాజరాజు = దుర్యోధనుడు, వేదన = బాధ, మాన్పు = మానిపించు, పంపుట = పంపకము, ఆట = క్రీడ, అత్యాస = మితిమీరిన ఆశ, నింపు = నిండ జేయు, తెలుపు = ఎరిగించు, ఆబ = అత్యాశ, జిగీష = జయేచ్ఛ, కాయు = రక్షించు, మానము = గౌరవము, వరూధిని = సేన, ఇడు = ఇచ్చు, పుకారు = వదంతి, ఎటు = ఎట్లు, భావము = అభిప్రాయము, ఎంచు = తలఁచు)

సాయం మాట మార్చేసి తన బావయైన అర్జునునికి భాగం ఇవ్వగా, విసుగు చెంది దుర్యోధనుడు పడే బాధని మాన్పడానికి, పంపకం అన్నది ఆటో లేక అత్యాసలు నింపటమో ఎరిగించక, ఆబ అంటే అత్యాశే జయేచ్ఛను కాపాడగా, వదంతి ఎట్లా కృష్ణుని అభిప్రాయం గురించి తలచినా సైన్యాన్ని ఇచ్చి గౌరవాన్ని కాపాడాడు.

139. టమాట, వంగ, బీర, చిక్కుడు - పదాలతో భారతార్థంలో

139.142 తే.గీ. సంవిదట, మాటకు విలు వా సభనుఁ గలదె,
తన కభిష్వంగము సమర మనుచు రాజ
రాజుఁ దెలుప, బీరమె ధర్మ రాజు కున్న
సృతి యటంచు, చిక్కుడుకాఱ కృష్ణు డనియె.

(సంవిద = సంధి, అభిష్వంగము = అత్యాసక్తి, సమరము = యుద్ధము, రాజరాజు = దుర్యోధనుడు, బీరము = పరాక్రమము, సృతి = మార్గము, చిక్కు = సంకటము, ఉడుకాఱు = చల్లబడు)

తనకి యుద్ధము అత్యాసక్తికరం అని దుర్యోధనుడు తెలియజెయ్యగా, సంధా, ఆ (కురు) సభలో మాటకి విలువుందా? పరాక్రమమే ధర్మరాజుకి ఉన్న మార్గమని సంకటము చల్లబడేటట్లుగా శ్రీకృష్ణుడు చెప్పాడు.

140. టాకి, హాకి, జాకి, బాకి - పదాలతో భారతార్థంలో

140.143 తే.గీ. ద్యూతము కసటా? కితవుల యోధన మది
యను శకుని సలహా కిటు కవగఁ, బిలిచె
రాజది యయబా కీడాఁ దలపక, నమ్మి
ధర్మరా జాకిడ డని, సోదరునిఁ బంపి.

(ద్యూతము = జూదము, కసటు = పాపము, కితవుడు = జూదరి, యోధనము = యుద్ధము, కిటుకు = పన్నాగము, అయబు = లోపము, కీడు = ఆపద, తలచు = భావించు, ఆకిడు = అడ్డుపెట్టు)

జూదము పాపమా, జూదరులకు అది యుద్ధము అనే శకుని సలహా పన్నాగం కాగా, రాజు (ధృతరాష్ట్రుడు) అది లోపమా లేక ఆపదా అని అలోచించకుండా, ధర్మరాజు అడ్డుపెట్టడని నమ్మి తమ్ముడైన విదురుణ్ణి పంపి అహ్వానించాడు.

141. టీవీ, వీడియో, కారు, రేడియో - రామాయణార్థంలో

రామాయణంలో శూర్పణఖ పర్ణశాలకి వచ్చినప్పుడు రాముడు ఆమెతో హాస్యంగా మాట్లాడుతూ, నాకు భార్య ఉంది, మా లక్ష్మణుడు బ్రహ్మచారి, అతని వద్దకు వెళ్ళు అని చెప్పినట్లుగా ఉంది. లక్ష్మణుడు ఆమె ముక్కూ చెవులూ కోశాడు. ఆ ఘట్టాన్ని ఇక్కడ తీసుకోవడం జరిగింది. మొదటగా ఉత్పలమాల పద్యము, తరువాత శార్దూల పద్యము క్రింద ఇవ్వబడినాయి.

141.144 ఉ. నీ భృకుటీ విలాసమును, నీ వెసరేగుటఁ జూచి నంత, నీ
శోభ కుదించె లక్ష్మణుడు, శూర్పణఖా! త్రప వీడి యోషితా
ప్రాభవ మేల? కారున జపమ్ములుఁ జేసెడి మాకి టేల యీ
క్షోభ? సరేడి యోధుఁ డిటఁ, జూపు మటంచనె రాము డామెతో.

(భృకుటి = కనుబొమ్మలు విరువడము, విలాసము = సొగసు, ఎసరేగు = విజృంభించు, అంత = అప్పుడు, శోభ = సౌందర్యము, కుదించు = తగ్గించు, త్రప = సిగ్గు, వీడి = వదలి, యోషిత = వనిత, ప్రాభవము = పెత్తనము, కారు = అడవి, ఇట = ఇక్కడ, క్షోభ = కలత, సరి = సమానము, ఏడి = ఎక్కడనున్నాడు, యోధుఁడు = వీరుఁడు)

శూర్పణఖా! నువ్వు కనుబొమ్మలు విరిచిన పద్ధతి, నువ్వు విజృంభించడం చూసినంతనే, నీ అందాన్ని లక్ష్మణుడు తగ్గించాడు. సిగ్గు వదిలి ఆడపెత్తనం ఎందుకు? అడవిలో జపాలు చేసుకునే మాకు, ఇక్కడ ఈ కలత ఎందుకు? మాకు సమానమైన వీరుఁ డెక్కడున్నాడో చూపించు అని రాముడు ఆమెతో అన్నాడు.

141.145 శా. ఠీవిన్, రాముడుఁ జెప్పె, లక్ష్మణుడె పోటీ, వీడు మీ రామునిన్,
నీవీ స్తబ్ధిని వీడి, యో లలన! యా నిష్ణాతునిన్ గూడుమా,
నీ వాచాలత డాచి, వద్దనగ వానిన్ సుందరాకారునిన్
నీ వాశింప మరేడి యోధుడిట, పోనీ కంచు పౌలస్తికిన్.

(ఠీవిన్ = అందములో, పోటీ = స్పర్ధ, వీడు = వదలు, స్తబ్ధి = మొండితనము, లలన = విలాసవతియగు స్త్రీ, నిష్ణాతుడు = నేర్పరి, కూడు = రమించు, వాచాలత = వదరుఁబోతుతనము, డాచి = కట్టిపెట్టి, ఆశించు = కోరు, పోనీకు = పోనీయవద్దు, అంచు = అనుచు, పౌలస్తి = శూర్పణఖ)

అందంలో లక్ష్మణుడే పోటీ, ఈ రాముణ్ణి వదిలి పెట్టు. ఓ, విలాసవతీ! నీవు, ఈ మొండితనాన్ని వదిలి, ఆ నేర్పరితో రమించుము. అతణ్ణి సుందరాకారుణ్ణి వద్దనడానికి ఇక్కడ వేరే నీవు కోరడానికి యోధుడేడీ? నీ వాచాలత కట్టిపెట్టి, వాణ్ణి పోనీయద్దు అని శూర్పణఖకి రాముడు చెప్పాడు.

142. డైనోర, బుష్, యల్‌జి, డెల్ - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

142.146 తే.గీ. వినయశీలుడై నోరార వినుతిఁ జేసి,
భీముఁ బట్టి 'బుష్ష'ను పెనుఁబాము మెచ్చు
కైవడి, చదువయ్యల్ జిన్నవోవు నటు, జ
వాబు లిడెను ధర్మజు డెల్ల ప్రశ్నములకు.

(వినయశీలుడు = విధేయుడు, నోరార = భక్తితో, వినుతిసేయు = పొగడు, పట్టు = నిర్బంధముచేసి గ్రహించు, పెనుఁబాము = కొండచిలువ, మెచ్చు = శ్లాఘించు, కైవడి = విధము, చదువయ్య = పండితుడు, చిన్నవోవు = ఖిన్నుడగు, అటు = ఆప్రకారము, ఇడు = ఇచ్చు, ధర్మజుడు = ధర్మరాజు, ఎల్ల = అన్ని)

విధేయుడై భక్తితో స్తుతించి, భీముని నిర్బంధించి బుస్సుమనే కొండచిలువ మెచ్చుకునే విధంగా, పండితులు ఖిన్నులయే రీతిని, ధర్మరాజు అన్ని ప్రశ్నలకు జవాబు లిచ్చాడు. అవే నహుష ప్రశ్నలు.

143.   తండా, గ్రామం, ఊరు, నగరము – భాగవతార్థములో

143.147   శా. ఈతం డాశ్రిత పక్షపాతి యనగా, నీసున్న రారాజనెన్
రాతల్ మారవు, మౌనమే సబబు సాలగ్రామమున్ బోలగన్,
మాతో సంధికి నైదు యూరుల నిటన్ మండాడి, కృష్ణుం డెదో
భీతిన్ బంచుట, హస్తినా నగరమున్ వేధించు యత్నం బెలే.

(ఈసు = ఓర్వలేనితనము, సాలగ్రామము = శిల, మండాడు = దైన్యముతో యాచించు, వేధించు = బాధించు)

ఇతడు ఆశ్రితపక్షపాతి అనగా ఓర్వలేనితనమున్న దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు: రాతలు మారవు. శిల లాగా మౌనంగా ఉండడమే యుక్తము. మాతో సంధికోసం ఐదు ఊళ్ళని ఇక్కడ దీనంగా యాచించి కృష్ణుడు ఏదో భయాన్ని పెంచడం హస్తనాపురవాసులను బాధించే ప్రయత్నమే.

143.148   శా. ఈతండా నరకుం డటంచు, దునుమన్ యేతెంచి కృష్ణుం డనెన్,
రాతన్ మార్చగ లేను సూను, హరి సాలగ్రామ రూపంబుగా
చేతం బందున నన్ని యూరులను పూజింపన్ దపస్వుల్ గడున్
భీతిన్ జెందగ, దేవతల్ నగరమున్ వీడంగ, జేసెన్ గదా.

(దునుము = చంపు, సూను = పుత్రుని, సాలగ్రామము = విష్ణుమూర్తిచిహ్నిత శిలావిశేషము, చేతము = మనస్సు)

ఇతడేనా నరకాసురుడు, అంటూ, చంపడానికి వచ్చిన కృష్ణుడు ఇలా అన్నాడు: నా పుత్రుని రాత మార్చ లేను. విష్ణువును సాలగ్రామ (శిల) రూపంగా మనస్సులో అన్ని ఊళ్ళలో మునులు పూజ చేసుకోవడానికి భయపడేటట్లు, దేవతలు తమ నగరము (అమరావతి) వదలి పోయేటట్లు చేశాడు కదా.

143.149   తే.గీ. కృష్ణు డనగ నీతండా? పెరిగెను ముద్దు
గాఱు శిశువుగా రేపల్లె గ్రామ మందు,
యూరుగాయలు తినుచుండె, యురికి కంసుఁ
గడపెఁ గసిదీర మధురా నగరము నందు.

(ఉరుకు = దూకు, కడపు = చంపు)

కృష్ణుడంటే ఇతడేనా? రేపల్లె గ్రామంలో ముద్దు లొలికే శిశువుగా పెరిగాడు. ఊరగాయలు తింటూ ఉండేవాడు. దూకి పగ తీరే విధంగా మధురా నగరంలో కంసుణ్ణి చంపాడు.

144. తట్ట, గుట్ట, చుట్ట, పుట్ట - పదాలను ప్రయోగిస్తూ స్వచ్ఛభారత్ లక్ష్యాల గురించి

144.150 తే.గీ. గుట్టలుగ చెత్త నిండగ కొంప లోన
బయట, చుట్టపక్కాలకు భార మగుచు,
పుట్ట దభివృద్ధి పల్లెల పట్టణముల,
తట్ట దేల? స్వచ్ఛత యగత్య మని ప్రజకు.

(తట్టు = తోఁచు, స్వచ్ఛత = పరిశుభ్రత, అగత్యము = అవసరము)

చుట్టపక్కాలకి, అంటే బంధువులకి భారంగా, ఇంటి లోపలా బయటా గుట్టలుగా చెత్త నిండగా, పల్లెలలోనూ పట్టణాలలోనూ అభివృద్ధి పుట్టదు. పరిశుభ్రత అవసర మన్న విషయం ప్రజలకు తోఁచ దెందుకు?

145. తమన్నా, కాజల్, సమంతా, త్రిష - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

145.151 తే.గీ. అడవిని పలు పౌరులు తమన్నాశ్రయింప,
త్రిషవణము వారి కాకలిఁ దీర్చ పూచి
శ్రమముఁ బెంచగ యెందుకా జల్పన మనె
పాండవులు, సమంతాన్మంద ప్రాంతరమున.

(తమస్ = తమను, ఆశ్రయించు = ఆధారపడు, త్రిషవణము = మూడు కాలములు, పూచి = బాధ్యత, శ్రమము = అలసట, జల్పనము = ఉపయుక్తముకాని పెక్కుమాటలాడుట, సమంతాత్ = అంతట, మంద = దట్టము, ప్రాంతరము = అడవి, వ్యథ = క్లేశము)

అడవిలో అనేక మంది పౌరులు తమని ఆశ్రయించగా, ముప్పూటలా వారి ఆకలిని తీర్చే బాధ్యత అలసట పెంచగా అంతటా దట్టమైన అడవిలో పాండవులు ఎందుకా ఉపయుక్తము కాని పెక్కు మాటలాడడం అని అన్నారు.

146. తమన్నా, సమంతా, త్రిష, కాజల్ అనే పదాలు ఒక్కొక్క పాదంలో వచ్చేటట్లుగా

146.152 కం. విడచె తమన్నా లన్నిటి
గడుప త్రిషవణము జపముల, కాంతస్ సుతునిస్
విడచెను, సమంతభద్రుడు
కడివెడు కన్నీళ్ళ భార్య కాజల్ కరుగన్.

(తమన్నా = కోరిక, గడుపు = కాలం వెళ్ళబుచ్చు, త్రిషవణము = మూడు కాలములు, సమంత భద్రుడు = బుద్ధదేవుడు, కడవ = పెద్దకుండ, కాజల్ = కాటుక, కరుగు = ద్రవించు)

మూడు కాలములు జపములలో గడుపడం కోసం బుద్ధదేవుడు కోరిక లన్నిటినీ విడిచి పెట్టాడు. కడివెడు కన్నీళ్ళతో భార్య కాటుక కరుగగా ఆమెను, పుత్రుణ్ణీ కూడా విడిచిపెట్టాడు.

147. "తమ్ము" - శబ్దాన్ని ప్రతి పాదాదిలో నిల్పుతూ భారతార్థంలో

147.153 ఉ. తమ్ము పరాభవింపఁ జని, తల్కము నందున చిత్రసేనుచేఁ,
దమ్ములు ధార్తరాష్ట్రులు విదారముఁ జేయుచు నోడగా, యతీ
తమ్మును పూర్తిగా మరచి ధర్మ తనూజుడు బంధుపేర్మిచే
తమ్ములు భీము నర్జునుని తత్క్షణమే నట కంపె, రక్షకై.

(తమ్ము = తమను, పరాభవించు = అవమానించు, చను = బయలుదేరు, తల్కము = అడవి, ధార్తరాష్ట్రులు = ధృతరాష్ట్ర కుమారులైన దుర్యోధనాదులు, విదారము = యుద్ధము, అతీతము = కడచినది, ధర్మ తనూజుడు = ధర్మరాజు, పేర్మి = ప్రేమ, తత్క్షణము = వెంటనే, అటకు = అచ్చటకు, అంపు = పంపు, రక్ష = రక్షణము)

తమను (పాండవులను) అవమానించడానికి బయలుదేరి అడవిలో చిత్రసేనుడనే గంధర్వుడి చేతిలో తమ్ములైన దుర్యోధనాదులు యుద్ధము చేస్తూ ఓడిపోగా, గతాన్ని మరచి ధర్మరాజు బంధుప్రీతితో తమ్ములైన భీమార్జునులను వెంటనే రక్షణ కోసం అక్కడికి పంపాడు.

148. "తమ్ముులు" - శబ్దాన్ని ప్రతి పాదాదిలో నిల్పుతూ భారతార్థంలో కందపద్యాన్ని కాని, ఉత్పలమాలను కాని వ్రాయండి

148.154 కం. తమ్ములు శవము లవన్ పం
తమ్ములు విడువక యుదకముఁ ద్రావన్ బక నీ
తమ్ములు పాటింపక, నా
తమ్ములు మను టెట్టు లనుచు, ధర్మజు డవిసెన్.

శవము = పీనుగు, పంతము = పట్టుదల, ఉదకము = నీరు, త్రావు = త్రాగు, బక = కొంగ, నీతము = నియమము, పాటించు = విధిగా అనుసరించు, మను = జీవించు, ఎట్టులు = ఏ ప్రకారముగా, ధర్మజుడు = ధర్మరాజు, అవియు = బాధపడు)

తమ పట్టుదలలు వదిలిపెట్టక కొంగ (యక్షుడు) పెట్టిన నియమాలు పాటించక నీరు త్రాగడం వలన తమ్ముళ్ళు శవాలుగా అవగా, నా తమ్ముళ్ళు ఏ విధంగా జీవిస్తారు అని ధర్మరాజు బాధపడ్డాడు.

148.155 ఉ. తమ్ములు పీన్గు లైరి, తమ దప్పిక తీరగ నీరుఁ ద్రావు పం
తమ్ములు వీడకన్, వెసను తార్కొని కొంగ వచించి నట్టి నీ
తమ్ములు విస్మరించి, యిక దక్కునె శాంతి, యెటుల్ భరింతు నా
తమ్ములు లేని మన్కి, యని ధర్మ తనూజుడు చింతిలెన్ మదిన్.

(పీన్గు = శవము, దప్పిక = చింతిలు = దాహము, త్రావు = త్రాగు, పంతము = పట్టుదల, వీడు = వదలు, వెసను = శీఘ్రముగ, తార్కొను = ఎదిరించు, వచించు = చెప్పు, నీతము = నియమము, విస్మరించు = మఱచిపోవు, దక్కు = లభించు, ఎటులు = ఏ ప్రకారంగా, భరించు = మోయు, మన్కి = జీవనము, ధర్మ తనూజుడు = ధర్మరాజు, చింతించు, మది = మనస్సు)

తమ దాహము తీర్చుకోవడం కోసం పట్టుదలలు వదలక తొందరలో ఎదిరించి కొంగ (యక్షుడు) చెప్పిన నియమాలు మఱచిపోయి తమ్ముళ్ళు శవాలు అయ్యారు, ఇక శాంతి లభిస్తుందా, నా తమ్ముళ్ళు లేని జీవితము ఎట్లా భరిస్తాను అని ధర్మరాజు మనస్సులో చింతించాడు.

149. “తల” - తో నాలుగు పాదాలను ప్రారంభిస్తూ పతికై నిరీక్షిస్తున్న నాయిక స్వగతాన్ని తెలుపుతూ

149.156 కం. తలలో నాలుకయై భూ
తల స్వర్గముగా గృహంబు తనరించుచు చే
తల వాక్కుల మదిలో చిం
తలఁ బోగొట్టు పతి యాపతనము ముదంబే.

(తలలోనాలుక = ఆదరణీయుడు, భూతల = భూమి, తనరించు = నిర్వహించు, చేత = చేష్ట, వాక్కు = మాట, మది = మనస్సు, చింత = బాధ, పతి = భర్త, ఆపతనము = రాక, ముదము = సంతోషము)

ముఖ్యమైన వాడై ఇంటిని భువిలో స్వర్గంగా నిర్వహిస్తూ, చేతలతోనూ మాటలతోనూ మనస్సులో దిగులును పోగొట్టే భర్త రాక సంతోషమే.

149.157 కం. తలమించిన బాధ్యతలను
తల వంచక తెఱగుపఱచు ధవు డెపు డొచ్చున్,
తలపగ బిడియముఁ గల్గును,
తలలో గల మల్లె పూలు తావినిఁ జిమ్మన్.

(తలమించిన = శక్తికి మించిన, తల వంచక = ఓటమిని అంగీకరించక, తెఱగుపఱచు = నెఱవేర్చు, ధవుడు = భర్త, తలచు = ఆలోచించు, బిడియము = సిగ్గు, తావి = పరిమళము, జిమ్ము = చిమ్ము)

శక్తికి మించిన బాధ్యతలను తల వంచకుండా నెరవేరుస్తూ ఉండే భర్త ఎప్పుడు వస్తాడు, తలలోని మల్లెపూలు పరిమళాన్ని వెదజల్లుతూ ఉంటే అలోచించిన కొద్దీ సిగ్గేస్తోంది.

150. నాలుగు పాదాల ప్రారంభంలో 'తల'ను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఇష్టదైవాన్ని స్తుతిస్తూ

150.158 మ. తలమే నెవ్వరికైన విశ్వమును తత్త్వంబుఁ గ్రహింపన్ బొగ
డ్తల, చోద్యంబు నభేద తత్త్వ మది కర్తన్ చేష్టలన్ కర్మలన్
తలపన్ వేఱిమి లేదటం చనెడి, దృక్ ద్రష్టల్ మరిన్ దృశ్యముల్
తలరారన్ యొకటే యనంగ మను చైతన్యంబునే తల్చెదన్.

(తలము = శక్యము, విశ్వము = సకలము, తత్త్వము = స్వభావము, గ్రహించు = తెలిసికొను, పొగడ్త = స్తుతి, చోద్యము = వింత, అభేదము = ఏకీభావము, కర్త = చేయువాడు, చేష్ట = క్రియ, కర్మ = చేయుట, తలచు = ఆలోచించు, వేఱిమి = భేదము, దృక్ = చూపు, ద్రష్ట = చూచువాడు, మరి = మరియు, దృశ్యము = చూడదగినది, తలరారు = ఒప్పు, మను = ఉండు, చైతన్యము = చిచ్ఛక్తి, తల్చు = స్మరించు)

స్తుతుల ద్వారా విశ్వమనే తత్త్వాన్ని తెలుసుకోవడం ఎవరికైనా సాధ్యమా. ఆలోచిస్తే కర్త, క్రియ, కర్మలలో భేదం లేదని చెప్పే వింతయైన అద్వైతం అది. దృక్కు, ద్రష్ట, దృశ్యం ఒకటే అనేటట్లుగా ఉండే చిచ్ఛక్తిని స్మరిస్తాను.

150.159 కం. తలపుల సద్యస్స్ఫూర్తిని,
తలమానికమైన సప్త తత్త్వంబులపై
తలవని తలపుగ నల్లగ
తలమే పద్యంబు, దేవి దయ లేకున్నన్.

(తలపు = ఆలోచనము; సద్యస్స్ఫూర్తి = అప్పటికప్పుడు తోచడం; తలమానికము = శ్రేష్ఠము; సప్త తత్త్వములు = సత్యము, బ్రహ్మ, నృత్యాది విలంబిత మానము, చేతస్సు, వస్తువు, స్వభావము మరియు సత్త్వ రజస్తమో గుణములనే గుణత్రయము; తలవని తలపుగ = అనుకోకుండా; అల్లు = రచించు; తలము = సాధ్యము; దేవి = సరస్వతి)

సరస్వతీదేవి కృప లేకపోతే అప్పటికప్పుడు తోచే అలోచనలతో శ్రేష్ఠమైన సప్త తత్త్వములపై అనుకోకుండా పద్యం అల్లడం సాధ్యమా!

151. 'తల'ను నాలుగుపాదాలలో ఉపయోగిస్తూ పూలతోటను వర్ణిస్తూ

151.160 కం. మము గని కేరింతలతో
మమతల పూదోట పంచు మాపును రేపున్,
సుమములు వెతలను తరుమును,
తమ నెలవును వీడియు ముదితల మురిపించున్.

(కను = చూచు, కేరింత = నవ్వు, మమత = అభిమానము, పూదోట = పుష్పవనము, మాపు = సాయంకాలము, రేపు = ప్రాతఃకాలము, సుమము = పుష్పము, వెత = బాధ, తరుము = పారద్రోలు, నెలవు = వాసస్థానము, వీడు = వదలు, ముదిత = వనిత, మురిపించు = సంతోషపెట్టు)

మమ్మల్ని చూసి పొద్దునా సాయంకాలమూ నవ్వులతో పూలతోట అభిమానాలను పంచుతుంది. పూలు బాధలని తరిమేస్తాయి. తమ నివాసం వదిలిపెట్టినా కూడా, అంటే తమని కొమ్మ నుండి కోసి వేరుచేసినా కూడా, స్త్రీలని సంతోషపెడతాయి.

152. "తల" శబ్దాన్ని శిరస్సు అనే అర్థంలో కాకుండా నాలుగు పాదాలలో ప్రయోగిస్తూ భారతార్థంలో

152.161 ఉ. కోతల రాయ డుత్తరుడు కోణెను కాంతల మధ్య డంబముల్,
చాతురికుండె యున్నఁ గురు సైన్యము నుత్తల మందఁ జేతు, నీ
భూతల మందు లేడు ననుఁ బోలు శుటీరు డటంచుఁ బల్కి, ప్రా
ఘాతమునన్ తలంచె పరికంపముతో పరువెత్త మేలనిన్.

(కోతలరాయడు = అతిశయోక్తితో కూడిన మాటలు మాట్లాడువాడు, కోణె = అంతఃపురము, కాంత = స్త్రీ, డంబము = బడాయి, చాతురికుడు = రథసారథి, ఉత్తలమందు = కలత పొందు, భూతలము = భూమి, పోలు = సాటివచ్చు, శుటీరుడు = శూరుడు, పల్కు = చెప్పు, ప్రాఘాతము = యుద్ధము, తలంచు = యోచించు, పరికంపము = భయము, పరువెత్తు = పరుగుతీయు, మేలు = క్షేమము)

కోతలరాయడైన ఉత్తరుడు, అంతఃపురంలో స్త్రీల నడుమ రథసారథి ఉంటే కౌరవ సైన్యాన్ని చీకాకు పెడతాననీ ఈ భూమి మీద నాతో సాటివచ్చే శూరుడు లేడనీ బడాయిలు చెప్పి, యుద్ధంలో పారిపోవడం మేలని భయంతో అనుకున్నాడు.

152.162 తే.గీ. ద్యూతమాడి పాండవులకు వెతల నిచ్చి,
కారు కూతల కృష్ణను దూరు కతన,
రాజరాజు యుత్తల మొంద, రణము నందు
లయమయెను వంశము, యనంతలయుని లీల.

(ద్యూతము = జూదము, వెత = బాధ, కారుకూత = దుర్భాష, కృష్ణ = ద్రౌపది, దూరు = నిందించు, కతన = కారణము చేత, రాజరాజు = దుర్యోధనుడు, ఉత్తలమొందు = వ్యాకులపడు, రణము = యుద్ధము, లయము = నాశనము, వంశము = కురువంశము, అనంతలయుడు = శివుడు, లీల = విలాసము)

జూద మాడి పాండవులకి బాధల నిచ్చి దుర్భాషలతో ద్రౌపదిని నిందించిన కారణము చేత దుర్యోధనుడు వ్యాకులపడగా యుద్ధంలో శివుని మహిమ వలన కురువంశనాశనం అయ్యింది.

153. తల, కల, వల, అల - పాదాదిన వచ్చునట్లుగా సీతారామ కల్యాణార్థములో

153.163 మ. తలపుల్ జానకి పైన నిల్పి హరు కోదండంబు మోపెట్టుటా
కల యంచున్ పలు రాజు లొండొరుల ప్రాఖర్యంబుఁ బోగొట్టుచున్
వలకాకన్ విడనాడ, రాఘవుడు యిశ్వాసమ్ము నెత్తించగా
యలమెన్ సీతను సిగ్గుబంతి వరమాలాలంకృతున్ జేయగన్.

(తలపు = ఆలోచన, జానకి = జనకుని కుమార్తెయగు సీత, నిల్పు = ప్రతిష్ఠించు, హరు = శివుడు, కోదండము = విల్లు, మోపెట్టు = ఎక్కుపెట్టు, పలు = అనేకము, ఒండొరులు = ఒకరికొకరు, ప్రాఖర్యము = ఉత్సాహము, వలకాక = మన్మథతాపము, విడనాడు = వదలు, రాఘవుడు = శ్రీరాముడు, ఇశ్వాసము = విల్లు, ఎత్తించు = ఎక్కుపెట్టు, అలము = ఆక్రమించు, బంతి = దొంతర, వర = పెండ్లికొడుకు, మాల = పూదండ, అలంకృతుడు = అలంకరింపబడినవాడు)

ఆలోచనలు జనకుని కుమార్తె యైన సీత పైన నిలిపి శివుని విల్లు ఎక్కుపెట్టడమా! అది కలే! అంటూ అనేకమంది రాజులు ఒకళ్ళకొకళ్ళు ఉత్సాహము పోగొట్టుకుంటూ మన్మథతాపము వదలిపెట్టగా, శ్రీరాముడు విల్లు ఎక్కుపెట్టగానే ఆయన్ని వరమాలతో (పెండ్లికొడుకుకి వేసే పూదండ) అలంకరించబడినవాడిగా చేయడానికి సీతను సిగ్గుదొంతర ఆక్రమించింది.

154. తల, మెడ, కడుపు, నడుము - పదాలతో శ్రీవేంకటేశ్వర స్తుతి

154.164 చం. తలసరి యప్పు హెచ్చినను తగ్గవు కాన్కలు వేంకటేశ! వ్యా
కుల మెడమైన భార్య చవిగొన్న ప్రదేశమె నీ గుడన్న, ధూ
ర్తులు కడు పుంగవుల్ తమ శిరోజము లిచ్చిన కోర్కె తీరగా
యిలను ద్యులోకమై వెలసె, నెన్నఁడు ముక్తికి స్వాగతం బిడన్.

(తలసరి = ఒక్కొక్కరి, అప్పు = ఋణము, హెచ్చు = ఎక్కువగు, కాన్క = కానుక, వ్యాకులము = దుఃఖము, ఎడము = దూరము, చవిగొను = రుచి చూచు, గుడి = దేవాలయము, ధూర్తుడు = మోసకాడు, కడు = మిక్కిలి,

పుంగవుడు = శ్రేష్ఠుడు, శిరోజము = తలవెంట్రుక, ఇల = భూమి, ద్యులోకము = స్వర్గము, వెలయు = ప్రసిద్ధికెక్కు, ఎన్నఁడు = ఎల్లప్పుడు, ముక్తి = మోక్షము, ఇడు = ఇచ్చు)

ఓ, వేంకటేశా! తలసరి అప్పు (రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ) పెరుగుతున్నా గానీ నీ కానుకలు తగ్గవు. దుఃఖము రుచి చూచిన భార్యయైన అలమేలు మంగ దూరమైన ప్రదేశమే నీ ఆలయం అంటే, మోసగాళ్ళు మిక్కిలి శ్రేష్ఠులు తమ తలవెంట్రుకలు ఇస్తే కోరిక తీరుతూ ఉంటే మోక్షానికి స్వాగతం ఇవ్వడానికి భూమిని స్వర్గముగా ప్రసిద్ధికెక్కింది.

155. తల, వల, జల, కల - పదాలతో గురుశిష్య సంబంధం

155.165 కం. పలువురి పూజల నందుచు,
విలువల యాకలనఁ బెంచు విజ్ఞాపకులే,
తలచిన శిష్యుల మనమున,
వలసిన స్ఫురణంబు నిచ్చు బాధ్యత నెఱపున్.

(పలువురు = అనేకులు, విలువ = ప్రాముఖ్యము, ఆకలన = తెలిసికొనుట, పెంచు = అధికముచేయు, విజ్ఞాపకుడు = గురువు, తలచు = స్మరించు, మనము = మనస్సు, వలయు = ఆవశ్యకమగు, స్ఫురణము = స్ఫూర్తి, బాధ్యత = పూచీ, నెఱపు = నెఱవేర్చు)

అనేకుల పూజలను అందుకుంటూ విలువలపై అవగాహన పెంచే గురువులే తమని స్మరించే శిష్యుల మనసులో అవసరమైన స్ఫూర్తిని ఇచ్చే బాధ్యతని నెఱవేరుస్తారు.

156. తాపము, పాపము, కోపము, లోపము - పదాలతో స్త్రీలు లోకకళ్యాణ కారకులు

156.166 తే.గీ. ఝాన్సి లక్ష్మి ప్రతాపము జాగృతి నిడె,
పాపముక్తిఁ గల్గె థెరీస పథముఁ బట్ట,
సత్యభామ కోపము స్త్రీకి సత్వ మిచ్చె,
లోపముల నోర్వ నేర్పిరి ప్రోడ లెల్ల.

(ప్రతాపము = శౌర్యము, జాగృతి = జాగరూకత, ఇడు = ఇచ్చు, పథము = మార్గము, సత్వము = బలము, ఓర్చు = భరించు, ప్రోడ = ప్రౌఢస్త్రీ, ఎల్ల = అందరు)

ఝాన్సీ లక్ష్మీబాయి శౌర్యము జాగరూకతను ఇచ్చింది. మదర్ థెరీసా మార్గాన్ని అనుసరించడం వల్ల పాప విముక్తి కలిగింది. సత్యభామ కోపము స్త్రీకి బల మిచ్చింది. ప్రౌఢ స్త్రీ లందరూ లోపాల్ని భరించడం నేర్చారు.

157. తార్చి, కూర్చి, మిర్చి, ఆర్చి - ద్రౌపదీ వస్త్రాపహరణం గురించి

157.167 ఉ. ద్యూత గృహంబు నందు నను దోషిగ తార్చితి రేల? కౌరవుల్,
నాతికి వల్వ లూడ్వ పరిణామము కోపము కూర్చి భీష్ముడున్
భీతినిఁ గొల్పు భీముడును పేర్కొనె, శ్రీల నమిర్చికొన్న మీ
రీ తొగకంటిఁ గావుమని యేడ్చెను ద్రౌపది యార్చి జాలిగన్.

(ద్యూత = జూదము, దోషి = అపరాధి, తార్చు = చేర్చు, నాతి = స్త్రీ, వల్వ = వస్త్రము, ఊడ్చు = తొలగించు, పరిణామము = మార్పు, కూర్చి = జోడించి, భీతి = భయము, కొల్పు = ప్రయోగింప, పేర్కొను = చెప్పు, శ్రీలు = సంపదలు, అమిర్చికొను = దక్కించుకొను, తొగకంటి = చక్కని కన్నులు గల ఆడుది, కాయు = రక్షించు, ఆర్చు = ఘోషించు, జాలి = దయ)

జూదగృహం లోకి నన్ను దోషిగా కౌరవులు ఎందుకు చేర్చారు? స్త్రీకి వలువలు తొలగిస్తే జరిగే పరిణామము గురించి కోపంగా భీష్ముడు, భయం గొలుపుతూ భీముడు చెప్పారు. సంపదలని దక్కించుకొన్న మీరు ఈ స్త్రీని రక్షించండి అని ద్రౌపది ఘోషించి జాలిగా ఏడ్చింది.

158. తీపు, కారము, పులుపు, చేదు - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

158.168 తే.గీ. తలపులు పురారిపైననె నిలిపి, సింధు
రాజుపై ప్రతీకారము రాజుకొనగ,
పాశుపతముచే దునుమ నా పాటవికుని,
యడరె ననిని, కుంతీపుత్రు డర్జునుండు.

(తలపు = ధ్యానము, పురారి = శివుడు, నిలుపు = నిలుపు, సింధురాజు = సింధు దేశపు రాజైన సైంధవుడు, ప్రతీకారము = పగ తీర్చుకొనుట, రాజుకొను = మండు, పాశుపతము = శివుడు అధిదైవతముగా గల అస్త్రము, దునుము = చంపు, పాటవికుడు = దుష్టుడు, అడరు = పూను, అని = యుద్ధము)

ధ్యానము శివుని మీదనే నిలిపి, సైంధవునిపై ప్రతీకారము మండుతుండగా పాశుపతాస్త్రంతో ఆ దుష్టుణ్ణి చంపడానికి కుంతీ పుత్రుడైన అర్జునుడు యుద్ధంలో పూనుకొన్నాడు.

159. తుప్పు, మెప్పు, ఉప్పు, కప్పు - పదాలను అన్యార్థంలో వాడుతూ విజయదశమి వైభవాన్ని స్వేచ్ఛాఛందంలో

159.169 కం. తుప్పుండును మహిషుగ మే
మెప్పుడు దసరాకుఁ గాల్చ, యెల్గెత్తి యను
ష్టుప్పున దుర్గా మాతృక
కప్పుడు ప్రార్థన సలుపుట యాచార మయెస్.

(తుప్ప = చిన్న పొద, మహిషుడు = మహిషాసురుడు, ఎల్గెత్తు = గొంతెత్తు, అనుష్టుప్పు = పాదమున కెనిమిది వర్ణములు గల శ్లోకము, మాతృక = తల్లి, సలుపు చేయు)

మేము ఎప్పుడు దసరాకి కాల్చినా చిన్న పొద మహిషాసురుడిగా ఉంటుంది. అప్పుడు, గొంతెత్తి అనుష్టుప్పు ఛందస్సులో దుర్గా మాతను ప్రార్థించడం ఆచారం అయ్యింది.

159.170 తే. గీ. మాదు వంతుప్పుగుందము, మా గురువుల
వెంట మేమెప్పుడు దసరా వేడ్క సలుపు
యుప్పుఁబట్టె లనుచు, పిల్ల లుత్సహించ,
కప్పుటైదువ యనుకంపఁ గ్రమ్ము కొనెను.

(మాదు = మా యొక్క, వంతు = పాలు, ఉప్పుగుందము = బాలక్రీడావిశేషము, వేడ్క = వేడుక, ఉప్పుబట్టెలు = పిల్లల ఆట, ఉత్సహించు = ఉత్సాహపడు, కప్పుటైదువ = దుర్గ, అనుకంప = కరుణ, క్రమ్ము = వ్యాపించు)

మా వంతు బాలక్రీడలే, మా గురువుల వెంట మేము ఎప్పుడు దసరా వేడుక చేసే పిల్లల ఆటలంటూ బాలలు ఉత్సాహపడగా, దుర్గామాత కరుణ వ్యాపించింది.

160. దయ్యము, బియ్యము, కయ్యము, నెయ్యము - పాదాదిన వచ్చునట్లుగా దత్తపది

160.171 ఉ. దయ్యముఁ బట్టె నంచు, ధనదానికి లోటని, ముఖ్యమంత్రితో,

బియ్యము రెండు రూకలకు బీదల కివ్వ, విపక్ష నాయకుల్
కయ్యముఁ జేసి తీవ్రముగ గర్హణఁ జేయగ, నేలుకోటికిన్
నెయ్యముఁ గానవచ్చె, యపనిందలు దీవనలై తలిర్చగన్.

(ధనదాని = కోశాగారము, లోటు = నష్టము, రూక = రూపాయి, విపక్ష = ప్రతిపక్ష, కయ్యము = జగడము, తీవ్రము = అధికము, గర్హణ = నింద, ఏలుకోటి = ఏలుబడికి లోబడిన ప్రజలు, నెయ్యము = ప్రేమ, కానవచ్చు = కనబడు, అపనింద = ఊరక మోపిన నింద, దీవన = ఆశీర్వాదము, తలిర్చు = చిగురించు)

పేదవాళ్ళకి బియ్యము రెండు రూపాయిలకి ఇవ్వగా, దయ్యం పట్టిందనీ, ఖజానాకి గండి అనీ, ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రితో కలహించి తీవ్రంగా నిందించగా, ఆ అపనిందలు ఆశీర్వాదాలై చిగురించగా ప్రజలకి అది ప్రేమగా కనబడింది.

161. దర్భ, తిల, పిండ, శ్రాద్ధ - పదాలతో రుక్మిణీ కళ్యాణ వృత్తాంతాన్ని గురించి

161.172 తే.గీ. సాత్వతి సుతుతో నిర్బంధ శ్రాద్ధ మగును
మనువని, విదర్భజ కబురంపె నగధరుకు,
రమ్ము నాకు కళ్యాణ తిలకము దిద్ద,
ద్వేషుల నణచ నీ వుక్కుపిండ మనుచు.

(సాత్వతి సుతుడు = శిశుపాలుడు, నిర్బంధ = బలాత్కారము, శ్రాద్ధము = శ్రద్ధతో చేయునది, మనువు = వివాహము, విదర్భజ = రుక్మిణి, నగధరుడు = శ్రీకృష్ణుడు, కళ్యాణ = వివాహము, తిలకము = బొట్టు, దిద్దు = సింగారించు, ద్వేషి = శత్రువు, అణచు = నశింపచేయు, ఉక్కుపిండము = మిక్కిలి దృఢమైన వాడు)

సాత్వతి పుత్రుడైన శిశుపాలునితో వివాహం బలవంతపు శ్రాద్ధ మవుతుందని, రుక్మిణి శ్రీకృష్ణునికి, వచ్చి తనకు పెళ్ళిబొట్టు పెట్టమనీ, శత్రువులను నశింపజేసే మిక్కిలి దృఢమైన వాడివనీ, కబురు పంపింది.

162. దిన, వార, పక్ష, మాస - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

162.173 కం. అది నరనారాయణుల య
రదము, విపక్షముఁ గనగ దరదమగు, కర్ణా!
వదలడు యా మాసటి, నీ

మదవారణ సలుపు నంచు, మద్రపతి యనెస్.

(నరనారాయణులు = నరుడనగా అర్జునుడు నారాయణుడు నగా కృష్ణుడు, అరదము = రథము, విపక్షము = శత్రుపక్షము, కను = చూచు, దరదము = భయము, మాసటి = శూరుడు, మదము = గర్వము, వారణ = నివారించుట, చలుపు = చేయు, మద్రపతి = మద్రదేశాధిపతియన శల్యుడు)

అది కృష్ణార్జునుల రథము, శత్రుపక్షము చూస్తే భయమేస్తుంది కర్ణా! ఆ శూరుడు వదిలిపెట్టడు, నీ గర్వ నివారణ చేస్తాడంటూ శల్యుడు చెప్పాడు.

163. దెస, నస, పస, వెస - పదాలను స్వార్థంలో కాకుండా ఉపయోగిస్తూ రామాయణార్థంలో

163.174 తే.గీ. రత్న సంస్థానములు మేన రంగులీన,
చూడు మల్లదె సారంగ మాడు చుండె
ననగ సీత, వెసనుఁ దెత్తు ననుచు రాము
డరిగె, చంప సమకొను తోలనుచుఁ దలచి.

(రత్న = మణి, సంస్థానము = మచ్చ, మేను = శరీరము, రంగు = కాంతి, ఈను = వెలువరించు, అల్లదె = అల్లదిగో, సారంగము = లేడి, వెస = శీఘ్రముగ, అరుగు = పోవు, సమకొను = లభించు, తోలు = చర్మము, తలచు = అనుకొను)

రత్నాల మచ్చలు శరీరం మీద కాంతులు వెలువరించగా, అల్లదిగో చూడు లేడి ఆడుతున్నది అని సీత అనగా, చంపితే దాని చర్మం దక్కుతుంది అని అనుకొని, శీఘ్రంగా తీసుకొని వస్తానని రాముడు వెళ్ళాడు.

164. దేవకి, యశోద, సుభద్ర, రాధ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

164.175 మ. వనమందుస్ యవమాన మందు యువిదే వక్రీకరించెస్ సభస్
తన యన్నన్ గని, రాము శౌర్యము, యశోదంతంబు, సీతా విలా
సిని యందంబు, నరాసు భద్రము, సటస్ జేకొన్న యా భామ నీ
దని ప్రేరించి, వచించె తా నిరపరాధస్ యంచు, పౌలస్తియే.

(వనము = అడవి, ఉవిద = స్త్రీ, వక్రీకరించు = తప్పుగా చిత్రించు, యశము = కీర్తి, ఉదంతము = వృత్తాంతము, విలాసిని = విలాసవతియైన స్త్రీ, నరాసుడు = రాక్షసుడు, భద్రము = క్షేమము, సట = కపటము, చేకొను = స్వీకరించు, ప్రేరించు = ఉసిగొల్పు, వచించు = చెప్పు, నిరపరాధ = అపరాధము లేని, పౌలస్తి = శూర్పణఖ)

అడవిలో అవమానం పొందిన స్త్రీయే సభలో తన అన్నయైన రావణుణ్ణి చూసి రాముని పరాక్రమము, ఆయన కీర్తి వృత్తాంతము, సీత సౌందర్యము, రాక్షసుల క్షేమము తప్పుగా చిత్రించింది. మోసంతో స్వీకరిస్తే ఆ స్త్రీ నీదే అని ఉసిగొల్పి తాను నిరపరాధనని శూర్పణఖయే చెప్పింది.

165. దేశము, కోశము, పాశము, నాశము - పదాలను ఉపయోగిస్తూ దేశభక్తిని ప్రబోధిస్తూ

165.176 తే.గీ. కంఠపాశములు వరించి, కష్టములను
స్వాగతించి, నాశము లోర్చి, జగడ మాడి,
దేశమున స్వతంత్రత తెచ్చు, దివ్యజనుల
చరితలే జ్ఞాన కోశము, జగతి యందు.

(కంఠపాశము = ఉరి, వరించు = అభిలషించు, స్వాగతించు = ఆహ్వానించు, నాశము = నాశనము, ఓర్చు = సహించు, జగడమాడు = పోరాడు, స్వతంత్రత = స్వాతంత్ర్యము, చరిత = గాథ, జ్ఞాన = తెలుసుకొనుట, కోశము = బొక్కసము, జగతి = లోకము)

ఉరి శిక్షలను అభిలషించి, కష్టాలని ఆహ్వానించి, నాశనాలని సహించి, పోరాడి, దేశానికి స్వాతంత్ర్యము తెచ్చిన దివ్యజనుల గాథలే లోకంలో జ్ఞానభండారము.

166. దొర, డబ్బు, అప్పు, వడ్డీ - పదాలను ఉపయోగిస్తూ ఋణగ్రస్తుని బాధను వర్ణిస్తూ

166.177 చం. దొరతన మింక లేదు బహు దొడ్డ ప్రభుత్వము వచ్చె నన్న యా
మురిపెము స్వల్ప కాలమె, విముక్తికి డబ్బు ఋణంబులన్ వడిన్
దొరుకగ వీలవన్ పొలముదోకరు లప్పులుఁ జేసి మున్గిరే,
తిరిపెము లెత్తి వడ్డి యికఁ దీర్చగ లేమని, యశ్రు తోయధిన్.

(దొరతనము = రాజరికము, బహు = మిక్కిలి, దొడ్డ = గొప్ప, మురిపెము = సంతోషము, స్వల్ప = కొద్ది, విముక్తి = ఇబ్బందులనుండి బయటపడటం, వీలు = అనుకాలము, పొలముదోకరి = రైతు, మున్గు = మునుగు, తిరిపెము = ముష్టి, అశ్రు = కన్నీరు, తోయధి = సముద్రము)

రాజరికము ఇంకా లేదు, చాలా గొప్ప ప్రభుత్వము వచ్చింది అన్న ఆ సంతోషము కొద్ది కాలమే. ఇబ్బందుల నుండి బయటపడడానికి త్వరగా డబ్బు ఋణాలుగా దొరకడానికి వీలు అవగా, రైతులు అప్పులు చేసి బిచ్చాలు ఎత్తి వడ్డీ ఇంకా తీర్చ లేమని, కన్నీటి సముద్రంలో మునిగారు.

167. దోసె, వడ, పూరీ, సాంబారు పదాలతో గిరిజా కళ్యాణం

167.178 కం. కలదో, సెకకంటి మనువ
చలజకు, తపమున వడలెను జనని యని, దయస్,
వలదొర, పూరీతి శరం
బులు, సాంబా! రువ్వ, మీకు పెండిలి యయ్యెస్.

(సెకకంటి = శివుడు, మనువు = వివాహము, అచలజ = పర్వత రాజగు హిమవంతుని కుమార్తె యగు పార్వతి, వడలెను = స్రుక్కెను, వలదొర = మన్మథుడు, పూరీతి = పువ్వులవంటి, శరంబులు = బాణములు, సాంబా = శివా, రువ్వ = విసరగా)

ఓ శివా! తపస్సు చేయడం వలన చిక్కి శల్యమై పోయిన అమ్మవారిని చూచి, శివుని వివాహం పార్వతితో ఉందా, అని దయతో మన్మథుడు పుష్పబాణాలు విసరగా మీ పెళ్ళి అయింది.

168. దోస్తీ, షోలే, డాస్, బాబీ - పదాలతో పద్మవ్యూహంలో అభిమన్యుని స్వైరవిహారం గురించి

168.179 శా. ద్రోణుం డేర్చిన చక్ర మోహరమునస్, దోస్తీక్ష్ణ వైదగ్ధ్యమున్
సూనుం బోలిన దివ్యతేజము జిగీషో లేక శోకంబులే
ధేనంబో యన, వీరు భీరువులకుస్ తేడానుఁ జూపించగా
పీనుంగుల్ దొరలంగ శౌర్య మయబా బీభత్సు పుత్రుం డనస్.

(ఏర్చు = కూర్చు, చక్ర మోహరము = పద్మ వ్యూహము, దోః + తీక్ష్ణ = దోస్తీక్ష్ణ, దోః = భుజబలము యొక్క, తీక్ష్ణ = చురుకైన, వైదగ్ధ్యము = నేర్పు, సూనుడు = సూర్యుడు, పోలు = సాటివచ్చు, దివ్య = దివికి సంబంధించిన,

తేజము = ప్రకాశము, జిగీష = గెలువనిచ్ఛ, సోకాలు = సాగదీసిన ఏడుపులు, ధేనము = సముద్రము, భీరువు = పిరికివాడు, పీనుంగు = శవము, దొరలు = దొర్లు, శౌర్యము = పరాక్రమము, అయబు = లోపము, బీభత్సుడు = అర్జునుడు)

ద్రోణాచార్యుడు కూర్చిన పద్మవ్యూహంలో, భుజబలము యొక్క చురుకైన నేర్పు సూర్యునికి సాటివచ్చే దివ్య ప్రకాశము జయేచ్ఛో లేక శోకసముద్రమో అనగా వీరులకీ పిరికివారికీ తేడాను, చూపించగా శవాలు దొర్లుతూవుంటే అర్జునుడి కొడుకంటే పరాక్రమానికి లోపమా.

169. ద్రౌపది, గాంధారి, కుంతి, కృష్ణ- పదాలతో రామాయణార్థంలో ఉత్పలమాల

169.180 ఉ. ఆరని మంటలం దితని నంతము చేయగ కుంతిఁ గాల్చగాం,
ధారిణి సంతసించు, దుహితన్ జెరపట్టిన వాడటంచు, యా
క్రూరుని రావణున్ గనిన కోపన ద్రౌపది తోకఁ గాల, హం
కారియు కృష్ణ వర్ణు దశకంఠుని ముందు దహించె లంకనే.

(అంతము చేయు = చంపు, కుంతి = గుగ్గిలపు చెట్టు, ధారిణి = భూదేవి, సంతసించు = సంతోషించు, దుహిత = కూతురు, చెరపట్టు = నిర్బంధించు, క్రూరుడు = అన్యులను బాధించువాడు, కను = చూచు, కోపన = కోపము గలవాడు, ద్రౌపది = హనుమంతుడు, హంకారి = అహంకారి, కృష్ణవర్ణుడు = నల్లని రంగు కలవాడు, దశకంఠుడు = రావణుడు, ముందు = సమక్షములో, దహించు = కాల్చు)

ఉత్పలమాలలో వరుసగా రెండు గురువులు రావడానికి ఒకటే అవకాశం ఉంది. మొదటి గురువు పాదాంతంలో దాని తరువాతి గురువు తరువాతి పాదం మొదట్లో రావాలి. ఇచ్చిన పదాలలో "గాంధారి" అన్న పదం ఉంది. దానిలో వరుసగా రెండు గురువులు, ఒక లఘువు ఉన్నాయి. రెండు వరుస పాదాలలో, "గాం" అన్న అక్షరం మొదటి పాదం చివర్లో వస్తే, "ధారి" అన్న భాగం తరువాతి పాదం మొదట్లో వస్తుంది. అంటే, పద్యానికి రేఫము ప్రాస అవుతుంది.

ఈ దత్తపది ప్రసాదరాయ కులపతిగారు రచించిన "కవితా మహేంద్రజాలం"లో ఉదాహరింపబడింది. అది అష్టకాల నరసింహరామ శర్మగారు ఒక అవధానంలో ద్రౌపది, గాంధారి, కుంతి, కృష్ణ - శబ్దాలతో రామాయణార్థంలో ఉత్పలమాల కోరినప్పుడు చెప్పిన పద్యం. వారు "ప" ప్రాసలో పద్యం చెప్పినట్లుగా వ్రాశారు. అందులో "గాంధారి" అన్న పదం వచ్చే అవకాశం లేదు. వారి పద్యం రెండవ పాదంలో "దక్షుడు గా ధరియిత్రి" అన్న భాగం ఉంది. అందులో, "గాంధారి" కాస్తా, "గా ధరి" అయ్యింది. ఇది గాక, వారే పద్యంలో ఉపయోగించిన శబ్దాలకు అర్థాలను

సభలో చెప్పారట. "ద్రౌపది" అంటే ద్రుతగతిపదుడు అయిన ద్రుపదుడు లేక వాయువు కుమారుడు, అనగా వేగంగా వెళ్ళేవాడైన హనుమంతుడనీ, "కుంతి" అంటే కుంతాయుధధారి అనీ, "కృష్ణత" అంటే సంతోషం అనీ వారు అర్థాలు చెప్పారు. ఈ అర్థాల గురించి వ్యాఖ్యానించేటంత పాండిత్యం నాకు లేదు.

అయితే, నాకున్న పరిమిత జ్ఞానంలో కొన్ని కష్టాలు వచ్చాయి. రేఫము ప్రాసగా పద్యం వ్రాసేటప్పుడు, "ద్రౌపది" అన్న పదం వల్లనే కష్టం. ఆ పదానికి నరసింహరామ శర్మగారు చెప్పిన అర్థంలో కాకుండా, అసలు అర్థం తీసుకుని రామాయణ సందర్భానికి అన్వయించాలంటే, "క్షుద్రౌ పదియర్లజోదు" అని ప్రయోగించాలి. అంటే, క్షుద్రుడౌ రావణుడు అని అర్థం. అందులో "క్షుద్రౌ"లో రెండు గురువులు ఉన్నాయి కాబట్టి పద్యం మధ్యభాగంలో వచ్చే అవకాశం లేదు. రేఫము ప్రాస కాబట్టి వేరే విధంగానూ రాదు. "ద్రౌ" కి ముందు ఏ అక్షరం ఉన్నా అది గురువై కూచుంటుంది. అందుకని "ద్రౌపది"ని నరసింహరామ శర్మగారు చెప్పిన అర్థంలోనే తీసుకొని నేను పద్యం వ్రాయడానికి ప్రయత్నించాను. ఎంతవరకు సబబో, ఇంకా ఏమయినా దోషాలు ఉన్నాయేమో తెలియదు. నేను వ్రాసిన పద్యం యొక్క భావం క్రింది విధంగా ఉంది.

తన కూతుర్ని నిర్బంధించిన వాడని ఆరని మంటల్లో ఇతడిని అంతం చేయడం కోసం గుగ్గిలపు చెట్టు కాల్చడానికి భూదేవి సంతోషిస్తుంది. అటువంటి దయావిహీనుణ్ణి చూచిన కోపము కలవాడైన హనుమంతుడు తన తోక కాలగా, అహంకారి నల్లని వాడైన రావణుని సమక్షంలో లంకనే కాల్చాడు.

170. ధర్మజ, భీమ, దుర్యోధన, నకుల అనే పదాలతో రామాయణార్థంలో పద్యం

170.181 తే. గీ. వాలిది యధర్మ జనిత సంజ్వర, మతడు పు
లోమజిత్తు వరమున దుర్యోధన యని
యెంచి, సుగ్రీవునకు లబ్ధి నెసగ, దాగి,
రాముడు గభీమన యొక శరమునఁ ద్రుంచె.

(సంజ్వరము = కోపము, పులోమజిత్తు = ఇంద్రుడు, దుర్యోధన = వీనితో పోట్లాడుట కష్టము, ఎంచు = తలఁచు, లబ్ధి = హితము, ఎసగు = కలుగు, దాగు = మరుగుపడు, గభీమన = గమ్మున, త్రుంచు = చంపు)

వాలికి ఉన్నది అధర్మము నుండి పుట్టిన కోపమనీ, ఇంద్రుని వరమున అతడు నిర్జింప రాని వాడనీ తలచి, సుగ్రీవునికి హితము కలుగునట్లుగా, రాముడు మాటున ఉండి గమ్మున ఒక బాణంతో చంపాడు.

171. ధాత, ఈశ్వర, దుర్మతి, దుందుభి - అన్న సంవత్సరాల పేర్లతో రావణ పాత్ర చిత్రణ

171.182 ఉ. ధాత వరంబు లివ్వ బల దర్పముతో సురలన్ జయించు ప్ర
ఖ్యాతిని, "యీశ్వరా!" యనుచుఁ గ్రందనఁ జేసిన డింగరీఁడుగా,
సీతను గెబ్బు దుర్మతిగ, స్త్రీలనుఁ బట్టి బలాత్కరించుటన్
దోతు డనంగ, రక్కసుల దుందుభి మీటెను రావణుం డిలన్.

(ధాత = బ్రహ్మ, దర్పము = గర్వము, సురలు = దేవతలు, ప్రఖ్యాతి = మిక్కిలి ప్రసిద్ధి, ఈశ్వరుడు = శివుడు, క్రందన = యోధుల బొబ్బరింత, డింగరీడు = భక్తుడు, గెబ్బు = అపహరించు, దుర్మతి = దుర్బుద్ధి కలవాడు, బలాత్కరించు = బలవంతపెట్టు, దోతుడు = కుత్సితుడు, రక్కసుడు = రాక్షసుడు, దుందుభి = భేరి, మీటు = వాయించు, ఇల = నేల)

బ్రహ్మ వరాలు ఇవ్వగా బలగర్వంతో దేవతలని జయించిన కీర్తితోనూ, “శివా” అంటూ అరిచిన భక్తుడిగానూ, సీతను అపహరించిన దుర్బుద్ధి కలవాడిగానూ, స్త్రీలను పట్టి బలవంతం చేసే కుత్సితుడనేటట్లుగానూ, రావణుడు లోకంలో రాక్షసుల భేరి మ్రోగించాడు.

172. నంది, భృంగి, శృంగ, అంబ - శివ శివాని భక్తి

172.183 కం. గిరిశృంగమ్మున దీక్షను
పరులఁ గొలువ భక్తి నంది వాహనుఁ బొందన్,
మరుశరము భృంగినాథుని
వరుఁ జేసెను, యంబ కోర్కె ఫలియించుటకై.

(గిరిశృంగము = కొండకొమ్ము, దీక్ష = పట్టుదల, పరుల = పార్వతి, నందివాహనుడు = శివుడు, మరుశరము = మన్మథుని బాణము, భృంగినాథుడు = శివుడు, వరుడు = పెండ్లికొడుకు, అంబ = పార్వతి)

కొండకొమ్మున దీక్షతో పార్వతి శివుని పొందడానికి భక్తిగా పూజించగా, పార్వతి కోర్కె ఫలించడానికి మన్మథుని బాణము శివుణ్ణి పెళ్ళికొడుకుని చేసింది.

173. నగరు, తగరు, తొగరు, వగరు - పదాలతో రామాయణ, భారత, భాగవతార్థాలలో

రామాయణపరంగా పూరణ:

173.184 చం. నగరున కొచ్చి, యెక్కిడి పినాకి లసక్తిని, వీర్యశుల్క మీ
తగ రుచకమ్ము నందు దుహితన్ జనకుం డిడు, నిన్ గనంగ నెం
తొ గరువ మీ మహర్షి కని, తోపికఁ జెప్పిన కౌశి కాజ్ఞ య
వ్వగ, రుజువిచ్చె రాము డొక బద్దను వోలె ధనుస్సుఁ ద్రుంపుచున్.

(నగరు = రాజగృహము, ఎక్కిడు = ఎక్కుపెట్టు, పినాకి = శివుడు, లసక్తి = ధనుస్సు, వీర్యశుల్క = వీరత్వమును కన్యాశుల్కముగా ఇచ్చుట, ఈతగ = ఇచ్చే అర్హత ఉన్న, రుచకము = రాజగృహవిశేషము, దుహిత = కూతురు, ఇడు = ఇచ్చు, ఎంతొ = మిక్కిలి, గరువము = గర్వము, మహర్షి = గొప్ప ఋషి, తోపిక = తలపు, కౌశికుడు = విశ్వామిత్రుడు, ఆజ్ఞ = ఆదేశము, అవు = అగు, రుజువు = నిరూపణ, బద్ద = తాటి మొదలగువాటిని నిలువుకు చీల్చిన పొడవు కంబము, వోలు = సరివోలు, త్రుంపు = తునుగునట్లు చేయు)

రాజగృహానికి వచ్చి శివుని విల్లు ఎక్కుపెట్టి వీరత్వాన్ని కన్యాశుల్కంగా ఇచ్చే అర్హత ఉన్న రాజగృహంలో జనకుడు కూతురైన సీతను ఇస్తాడు, నిన్ను చూడగా ఈ మహర్షికి ఎంతో గర్వము అని ఆలోచన చెప్పిన విశ్వామిత్రుని ఆజ్ఞ అవ్వగా ఒక బద్ద లాగా ధనుస్సును త్రుంపుతూ రాముడు ఆ మాటను నిరూపించాడు.

భాగవతపరంగా పూరణ:

173.185 చం. నగరున కేగుదెంచ తన నాథుడుఁ గాదగు కృష్ణమూర్తి, విం
త గరుజుపట్ట, నాతనిని తానె యటన్ పిలిపించె నంచు, నెం
తొ గరువముం మదిం గొను వధూమణి రుక్మిణి కోర్కెఁ దీర్చిఁ బ్రో
వగ, రుచిరమ్ముగా నగు వివాహము చక్రి రచించె నత్తఱిన్.

(నగరు = దేవాలయము, ఏగుదెంచు = వచ్చు, నాథుడు = భర్త, వింత = ఆశ్చర్యము, గరుజుపట్టు = అగత్యమేర్పడు, గరువము = గర్వము, మది = మనస్సు, కొను = నాటు, వధువు = పెండ్లికూతురు, మణి = శ్రేష్ఠార్థసూచకము, ప్రోచు = రక్షించు, రుచిరము = మనోహరమైన, చక్రి = శ్రీకృష్ణుడు, రచించు = సమకూర్చు, అత్తఱి = ఆ సమయము)

తనకు కాదగిన భర్తయైన శ్రీకృష్ణుడు దేవాలయానికి రాగా, అతణ్ణి అక్కడికి తనే పిలిపించడం వల్ల ఆశ్చర్యకరమైన ఆవశ్యకత ఏర్పడగా ఎంతో గర్వాన్ని మనస్సులో నాటుకున్న వధూరత్నమైన రుక్మిణి కోరిక తీర్చి రక్షించడానికి శ్రీకృష్ణుడు ఆ సమయంలో మనోహరంగా అయ్యేటటువంటి వివాహాన్ని రచించాడు.

భారతపరంగా పూరణ:

173.186 చం. నగరు బకాసురుండను వినాశకరుస్ యెదిరించ లేక, యు
త్తగ రుదితమ్ముఁ జేయక, యుదాత్త యొడంబడికస్ యొనర్చె, యెం
తొ గరువ మిప్పు డాతనినిఁ ద్రుంచగ భీముని పంపుటంచు, తా
వగరుచు జెప్పెఁ గుంతి, నిరపాయమె యంచును ధర్మజుం డనస్.

(నగరు = రాజగృహము, అసురుడు = రాక్షసుడు, వినాశకరుడు = మిక్కిలి చెడుపు చేసేవాడు, ఎదిరించు = ఎదుర్కొను, ఉత్తగ = ఊరికినే, రుదితము = రోదనము, ఉదాత్త = గొప్ప, ఒడంబడిక = ఒప్పందం, ఒనర్చు = చేయు, గరువము = గర్వము, త్రుంచు = చంపు, తా = తాను, వగరుచు = నిట్టూర్చు, నిరపాయము = అపాయము లేనిది)

రాజగృహము బకుడు అనే రాక్షసుడిని ఎదుర్కోనూ లేక, ఊరికే ఏడవనూ చేయక, ఉదాత్తమైన ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు అతణ్ణి చంపడానికి భీముణ్ణి పంపడం చాలా గర్వంగా ఉంది అని, అది అపాయం లేనిదే అని ధర్మరాజు అనగా, కుంతి నిట్టూరుస్తూ చెప్పింది.

174. నది, మది, పది, గది - పదాలతో గురుశిష్య సంబంధం

174.187 ఉ. జీవన మందు నేర్చినది, చేతనఁ బెంచు నిగూఢ శాస్త్రముల్,
భావము చేత నెమ్మదినిఁ బంచు విశిష్టత యుండు నొజ్జకుస్,
సేవలుఁ జేసి, యైదు పదిసేసి, స్వశక్తిని పెంచు ధైర్యముస్,
దీవన తోడ చేకొనగ దిష్టము, పాత్రత యుండు శిష్యుకుస్.

(చేతన = తెలివి, నిగూఢ = రహస్యమైన, భావము = ప్రవర్తన, నెమ్మది = సుహృదయం, విశిష్టత = శ్రేష్ఠత, ఒజ్జ = గురువు, ఐదుపదిసేయు = నమస్కరించు, చేకొను = గ్రహించు, దిష్టము = అదృష్టము, పాత్రత = యోగ్యత)

జీవితంలో నేర్చుకున్నది, జ్ఞానాన్ని పెంచే నిగూఢమైన శాస్త్రాలు తన ప్రవర్తన చేత సుహృదయంతో పంచే శ్రేష్ఠత గురువుకి ఉంటుంది. సేవలు చేసి అంజలి ఘటించి స్వశక్తిని పెంచే ధైర్యాన్ని ఆశీర్వాదంతో గ్రహించే అదృష్టము, యోగ్యత శిష్యుడికి ఉంటుంది.

175. నన, నీనీ, నును, నేనే - శబ్దాలను ఉపయోగిస్తూ మీకు నచ్చిన ఛందస్సులో భారతార్థంలో

175.188 తే.గీ. మానినీ! నీ మనోరథ మేను తీర్తు
ను, నులిమెద నా యధము కీచకు నను, భీము
యాననమున కోపముఁ గని, యాజ్ఞసేని
పిలుతు నేనే నతని ననెఁ, బీచ మడచ.

(మానిని = ఆత్మాభిమానము గల స్త్రీ, మనోరథము = కోరిక, ఏను = నేను, తీర్తును = తీర్చెదను, నులుము = చంపు, అధముడు = నీచుడు, ఆననము = ముఖము, కను = చూచు, యాజ్ఞసేని = ద్రౌపది, పీచము = గర్వము, అడచు = అణచు)

ఓ, మానినీ! నీ కోరిక నేను తీరుస్తాను, ఆ నీచుడైన కీచకుణ్ణి చంపుతాను అనే భీముని ముఖంలో కోపం చూసి ద్రౌపది గర్వం అణచడానికి నేనే అతణ్ణి పిలుస్తాను అని అంది.

176. నవ్య, భవ్య, దివ్య, సవ్య - పదాలను ఉపయోగించి వైద్యవృత్తిని గురించి

176.189 ఉ. నవ్యత శోధనన్ బడసి నమ్మికఁ బెంచుచు వైద్యవృత్తులన్
భవ్య విధానముల్ నిలిపి వైద్యులు, రోగుల సేవకై తులా
దివ్యముఁ జేసి, సంఘమున తిమ్మనఁ గూర్చు ప్రధాన లక్ష్యమే
భావ్య మటంచు, యక్కస వ్యవాయములన్ సమకట్టి రిచ్ఛతో.

(నవ్యత = నవీనత, శోధన = పరిశోధనము, పడయు = పొందు, నమ్మిక = నమ్మకము, భవ్య = యోగ్యమైన, నిలుపు = ప్రతిష్ఠించు, తులాదివ్యము = మహా వ్యవహారములయందు చేసెడి బాస, తిమ్మన = స్వస్థత, కూర్చు = సరిచేయు, భావ్యము = అవశ్యము, అక్కస = కనికరము, వ్యవాయము = తేజము, సమకట్టు = సిద్ధపఱుచు, ఇచ్ఛ = కోరిక)

పరిశోధన ద్వారా కొత్తదనాన్ని పొంది నమ్మకాన్ని పెంచుతూ, వైద్యవృత్తులలో యోగ్యమైన విధానాలను ప్రవేశపెట్టి, వైద్యులు, రోగుల సేవ కోసం బాస చేసి, సమాజంలో ఆరోగ్యం కూర్చే ముఖ్యమైన లక్ష్యమే ఆవశ్యకమని, కోరి తమ దయ, తేజములను సిద్ధపఱచారు.

177. నాగలి, మొరకు, గిలక, వల్లకాడు - వీటితో అమెరికాలో తెలుగు భాష భవిష్యత్తు గురించి పద్యం

177.190 తే.గీ. సాగు సాంకేతిక ప్రగతి నాగలించి
నంత ప్రేగుల లెక్కించు వింత మొఱకు
తనము, గిలకరించు తెలుగు పెనుపు నమెరి
కాన, తెలుగు పలుకు వల్ల కాడు మొరకు.

(సాగు = వ్యాపించు, ఆగలించు = ఆవులించు, మొఱకుతనము = కాఠిన్యము, గిలకరించు = చల్లటం, పెనుపు = వృద్ధి, మొరకు = మూర్ఖుడు)

వ్యాపించే సాంకేతిక ప్రగతితో ఆవులించినంతనే ప్రేగులు లెక్కపెట్టే వింతయైన కాఠిన్యము తెలుగుతనము వృద్ధిని అమెరికాలో చల్లుతుంది. తెలుగు మాట వల్ల ఎవడూ మూర్ఖుడు కాడు.

178. నిండుగ, పండుగ, మెండుగ, దండిగ - పదాలను ఉపయోగిస్తూ అవధాన వైభవాన్ని వివరిస్తూ

178.191 శా. సాహిత్యంబున క్రీడగా, తెలుగు భాషాపాండితిన్ నిండుగా,
బాహాటమ్ముగ పండుగల్ సలుపు సద్వ్యాయోగమున్ జేసి, ది
వ్యోహాపోహములన్ వధానములలో యూరింపగన్ మెండుగా,
వ్యాహారమ్ములు పద్యరూపమున యుద్భాసిల్లెలే, దండిగన్.

(క్రీడ = వినోదము, మలచు = మళ్ళించు, పాండితి = పాండిత్యము, నిండుగా = సంపూర్ణంగా, బాహాటము = బహిరంగము, సలుపు = చేయు, సత్ = మంచి, వ్యాయోగము = నాటక విశేషము, దివ్య = అందమైన, ఊహాపోహములు = అనుకూల్య ప్రాతి కూల్యము లూహించుట, వధానము = అవధానము, ఊరించు = కలిగించు, మెండు = ఆధిక్యము, వ్యాహారము = వచనము, ఉద్భాసిల్లు = మిక్కిలి ప్రకాశించు, దండిగ = హెచ్చుగా)

సాహిత్యంలో వినోదంగా తెలుగు భాషాపాండిత్యాన్ని సంపూర్ణంగా బహిరంగంగా పండుగలు చేసే మంచి నాటక విశేషంగా చేసి దివ్యమైన ఊహాపోహములను అవధానములలో అధికంగా కలిగించగా మాటలు హెచ్చుగా పద్య రూపంలో ప్రకాశించాయిలే.

179. నిక్కరు, లిక్కరు, కుక్కరు, చక్కరు - పదాలతో భారతార్థంలో

179.192 ఉ. నీదరి నేనె యుంటి, తలనిక్క రుచించదు, స్వర్గ యాత్రలో
యేదిట రాజ్యకాంక్ష, తర లిక్కరువన్ తమ రేగు వేళ, నా
మేదిని రాక కుక్క రుతమే, యముడా గతి ధర్మరాజుకున్
బోధనఁ జేయగా, దివికిఁ బోయెను చక్క, రుజావు నమ్ముచున్.

(దరి = సమీపము, తలనిక్క = గర్వపడుట, రుచింపదు = ఇష్ట పడదు, తరలు = ప్రయాణమగు, ఇక్కరువన్ = ఈ కొండపై, మేదిని = భూమి, రుతము = రొద, బోధన = ఉపదేశము, దివి = స్వర్గము, బోయెను చక్క = ఏమీ మాట్లాడకుండా పోయెను, రుజావు = సాక్ష్యము)

నీ సమీపములో నేనే ఉన్నాను, గర్వపడటం మనసుకు నచ్చదు, స్వర్గ యాత్రలో ఇక్కడ రాజ్యకాంక్ష ఎక్కడుంది, మీరు బయలుదేరి ఈ కొండపై వెళ్ళే వేళ కుక్క మొరగడమే భూమి పైకి నా రాక, అంటూ ఆ విధంగా యముడు ధర్మరాజుకు ఉపదేశం చేయగా, ఆ సాక్ష్యము నమ్మి స్వర్గానికి చక్కపోయాడు.

179.193 ఉ. నిక్కము, నాదె యంచు తలనిక్క రుచించదు, స్వర్గ యాత్రలో
ఎక్కటి నంత వెన్క వద లిక్కరువన్ పయనింప, తోడయెన్
కుక్క, రుణంబు దీని కెటుఁ గూర్చెద నంచనె, ధర్మరాజు, యెం
చక్క రుతంబు లేక కొనసాగుచు వచ్చుట చేత, చెంగటన్.

(నిక్కము = సత్యము, తలనిక్క = గర్వపడుట, రుచింపదు = మనసుకు నచ్చదు, ఎక్కటిని = ఏకాకిగా, ఇక్కరువన్ = ఈ కొండపై, ఎటు = ఎట్లు, కూర్చెదను = తీర్చెదను, ఎంచక్క = ఎంచక్కగా, రుతము = రొద, చెంగటన్ = సమీపంలో)

నాదే నిజమంటూ గర్వపడుట మనసుకు నచ్చదు. స్వర్గ యాత్రలో ఏకాకిగా అంతా వెనకే వదిలి ఈ కొండ మీద ప్రయాణం చేస్తుంటే కుక్క తోడయింది. ఎంచక్కగా రొద చేయకుండా నా సమీపం లోనే ఆగకుండా కుక్క వస్తూ ఉండటం వల్ల, దాని రుణమెలా తీర్చుకోను అని ధర్మరాజు అన్నాడు.

180. నిధనము, శవము, పాడె, చితి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ పెండ్లి వేడుకలను వర్ణిస్తూ

180.194 ఉ. పాడెను పాట లెన్నొ తన పాటవ మందరు మెచ్చ, జూదముస్
యాడెను శైశవమ్ములుక నందరఁ గేరుచు, యాట మధ్యలో
నోడుచు నుండఁ బూని ధన మున్న వధూటిని చింత యేలనెస్
వేడుక యంచు యౌచితిని పెండ్లికుమార్తె వెలార్చె నివ్విధిస్.

(పాటవము = నైపుణ్యము, మెచ్చు = శ్లాఘించు, శైశవము = బాల్యము, ఉలుకు = అసూయపడు, కేరు = పరిహసించు, పూను = ప్రయత్నించు, వధూటి = కన్యక, చింత = దిగులు, ఏల = ఎందుకు, వేడుక = వినోదము, ఔచితి = ఉచితత్వము, వెలార్చు = బయలుపఱచు, విధి = విధము)

తన నైపుణ్యాన్ని అందరూ శ్లాఘించగా ఎన్నో పాటలు పాడింది. బాల్యం అసూయపడేటట్లు అందరినీ పరిహసిస్తూ జూదము ఆడింది. ఆట మధ్యలో ఓడిపోతూ ఉండాలని అనుకొని డబ్బున్న అమ్మాయిని దిగులెందుకు అంది. వినోదం అంటూ పెళ్ళికూతురు ఈ విధంగా ఔచిత్యాన్ని ప్రకటించింది.

181. నీతి, జాతి, భాతి, రీతి - పదాలతో ఎన్నికల ప్రచారంపై

181.195 కం. జాతి మత భేద మండగ
నీతి విడె విపక్ష, మనెడు నేతల పలుకుల్
పాఁతఁబడె, నోది భాతిగ,
ప్రీతిని యెన్నికలు జరుపు వీలిక లేదా?

(జాతి = కులము, అండ = ఆధారము, నీతి = న్యాయము, విడు = వదలిపెట్టు, విపక్షము = ప్రతిపక్షము, నేత = నాయకుడు, పలుకు = మాట, పాఁతఁబడు = పాఁతదియగు, నోది = అనవసరమైన విషయము, భాతి = విధము, ప్రీతి = సంతోషము, వీలు = ఆనుకూల్యము)

కులమత భేదము ఆధారంగా ప్రతిపక్షము నీతిని వదిలిపెట్టారనే నాయకుల మాటలు నోదిలాగా పాతబడ్డాయి. సంతోషంగా ఎన్నికలు జరిపే వీలు ఇంక లేదా?

182. నీరు, మీరు, బారు, బీరు - పదాలతో పద్మావతీ స్తుతి

182.196 తే.గీ. మహిని ఫలము లిడు యవనీరుహముఁ వోలె
తీరుగా యూపిరి నిడు సమీరుఁ వోలె
బీఱువోవదు పద్మమ్మ వారి కరుణ
బారుతీరిన తిరుమల భక్తులకును.

(మహి = భూమి, ఫలము = ప్రయోజనము, ఇడు = ఇచ్చు, అవనీరుహము = చెట్టు, వోలె = వలె, తీరుగా = సరియైన విధంగా, సమీరుడు = వాయువు, బీఱువోవు = వ్యర్థమగు, కరుణ = దయ, బారుతీరు = వరుసగా నేర్పడు)

భూమిపై అనేక ప్రయోజనాలు ఇచ్చే వృక్షము లాగా, సరిగ్గా శ్వాసను ఇచ్చే వాయుదేవుడి లాగా, తిరుమలలో బారు తీరిన భక్తులకి పద్మావతీ దేవి అమ్మవారి దయ వృథా అవదు.

183. నీవు, రావు, కావు, లేవు - పదాలతో స్వతంత్ర భారత ప్రగతిని నదీగమనంతో పోలుస్తూ స్వేచ్ఛావృత్తంలో

183.197 శా. స్వాతంత్ర్యం బొక జన్మహక్కనెడి నిస్వానంబుతో నీవు నీ
బ్రాతిన్ నీరుగ పంచకున్న ప్రజలన్ బర్యాప్తముల్ రావు, మా
జాతీయోద్యమ స్ఫూర్తి కడ్డెపుడు భాషాభేదముల్ కావు, యా
త్రాతత్వంబును నేర్వ నీ కడ, ధునీ! రాలేవు వైఫల్యముల్.

(నిస్వానము = ధ్వని, బ్రాతి = ప్రేమ, పర్యాప్తము = సామర్థ్యము, స్ఫూర్తి = పోరాటపటిమ, అడ్డు = నిరోధము, యాత్ర = ముందుకు పోవడం, తత్వము = స్వభావము, కడ = సమీపము, ధుని = నది, వైఫల్యము = నిరర్థకము)

స్వాతంత్ర్యము ఒక జన్మహక్కు అనే ధ్వనితో నీవు నీ ప్రేమను నీటి రూపంలో పంచకుంటే ప్రజలలో సామర్థ్యములు రావు. మా జాతీయ ఉద్యమ స్ఫూర్తికి భాషాభేదాలు ఎప్పుడూ అడ్డు కావు. ఓ నదీ! ముందుకు పోయే తత్వము నీ దగ్గర నేర్చుకోవడం వలన వైఫల్యాలు రావు.

183.198 శా. సాగన్ భారతమాత! నీవు తటినీ సంయానమున్ పోలగన్,
భాగంబౌ గణతంత్రమైన ధరణిన్ వ్యాకూతులే రావుగా,
రాగాతీతముగా వ్యవస్థలను తీర్చన్ కావు యన్యాయముల్,

భోగాసక్తత లేమి లేవు, జననీ! పూజార్హ! నీ సేవలన్.

(తటిని = నది, సంయానము = ప్రయాణము, వోలు = సాటివచ్చు, భాగము = భాజితము, ధరణి = భూమి, వ్యాకూతి = మోసము, రాగము = అనురాగము, అతీతము = అతిక్రమించినది, వ్యవస్థ = ఏర్పాటు, తీర్చు = చక్కబరుచు, భోగము = సుఖము, పూజర్హ = పూజకు యోగ్యమైన)

ఓ భారత మాతా! నీవు నదీ ప్రవాహం లాగా ముందుకు సాగుతుంటే విభజింపబడి గణతంత్రమైన ఈ భూమిలో మోసాలే ఉండవుగా. బంధాలకు అతీతంగా వ్యవస్థలని తీర్చితే అన్యాయాలు అవవుగా. ఓ తల్లీ! పూజ్యురాలా! నీ సేవలలో సుఖాలు ఆశించడాలు లేవు.

184. నేల, నీరు, అగ్గి, గాలి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

184.199 కం. రానేల యీ మయసభకు?
యేనీ రుషను తెరలించ నేమొనరింతున్?
నేనో యిరుగాలిపసినె?
రానీ యగ్గింపొ యగడొ రారాజునకున్.

(ఏను = నేను, రుష = కోపము, తెరలించు = పోగొట్టు, ఒనరించు = చేయు, ఇరుగాలిపసి = ద్విపాద పశువు వంటి అజ్ఞాని, అగ్గింపు = పొగడ్త, అగడు = అపవాదము, రారాజు = దుర్యోధనుడు)

ఈ మయసభకి నేను ఎందుకు రావాలి? నేను ఈ కోపాన్ని పోగొట్టుకోవడానికి ఏమి చేయాలి? నేను ఒక అజ్ఞానినా? ఈ దుర్యోధనునికి పొగడ్తో నిందో రానీ అని అన్నాడు.

185. నేల, నీరు, నిప్పు, నింగిచూలి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామయణార్థంలో

185.200 చం. అవనిజ జాడఁ జెప్పుమనె నంబరమున్, యవనీరుహంబులన్
వివరముఁ గోరనేల యనె విహ్వలుడై, వెతుకంగఁ జూడరే
నెవయుచు నింగిచూలికయి నేడ నయమ్మనె పక్షులం గనన్,
యవరజు నిప్పుడేమి గతి యంచనె, రోయుచు రాము డార్తుడై.

(అవనిజ = భూమి పుత్రికయైన సీత, జాడ = ఆచూకి, అంబరము = ఆకాశము, అవనీరుహము = వృక్షము, వివరము = విస్పష్టత, విహ్వలుడు = అధైర్యము పొందినవాఁడు, వెతుకు = అన్వేషించు, నెవయు = ఎగురు, నింగి = ఆకాశము, చూలి = సంతానము, అనయము = అవశ్యము, కను = చూచు, అవరజుడు = తమ్ముఁడు, గతి = ఉపాయము, రోయు = వెతుకు, ఆర్తుడు = దుఃఖితుడు)

రాముడు దుఃఖితుడై వెతుకుతూ, సీత ఆచూకీ చెప్పమని ఆకాశాన్ని అడిగాడు, ధైర్యము కోల్పోయి వివరాలు ఎందుకు అడుగుతున్నారు అని (అంటే, మీకు తెలియదా అన్నట్లు) వృక్షాలతో అన్నాడు, సంతానం కోసం వెతకడానికి ఆకాశంలో ఎగురుతూ చూడరా, ఈ రోజు అవసర మొచ్చింది అని పక్షులను చూసి అన్నాడు, ఇప్పుడు ఏమి ఉపాయము అని తమ్ముడైన లక్ష్మణుడితో అన్నాడు.

186. నేల, మన్ను, పుడమి, మట్టి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

186.201 తే.గీ. చింత నేల యసురు బకుఁ జెంతకుఁ జన,
కన్న సుతు నంపెద వినుము మన్నుడి యని,
కుంతి యపు డమితబలు వృకోదరు నని
చె, జను లలర సాహస మట్టి చేష్ట యనుచు.

(చింతన = విచారము, అసురుడు = రాక్షసుడు, చెంత = సమీపము, చను = వెళ్ళు, సుతుడు = కుమారుడు, అంపు = పంపు, మత్ = నా, నుడి = మాట, అమిత = అపారమైన, బలుడు = బలముగలవాడు, వృకోదరుడు = భీముడు, అనుచు = పోవుట కనుమతించు, అలరు = సంతోషించు, సాహసము = తెగువ, చేష్ట = చర్య)

బకాసురుడి చెంతకు వెళ్ళడానికి విచారం ఎందుకు? నేను కన్న కుమారుణ్ణి పంపుతాను, వినండి నా మాట అని అటువంటి చర్య సాహసం అని జనులు సంతోషించగా కుంతి అప్పుడు అమితబలశాలియైన భీముణ్ణి పంపడానికి అనుమతించింది.

187. పంది, కిరి, కిటి, సూకరము - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ గోమాతను స్తుతిస్తూ

187.202 తే.గీ. ఆమతిం పంది యరుదెంచి యర్చ లందు
నోరు లేని జీవి మహి, చాకిరికి మారు
ప్రవరము, ప్రజల వాకిటి లక్ష్మి దేవి,
వత్ససూ! కరములు మోడ్తు భక్తి నీకు.

(ఆమతింపు = ఆహ్వానం, అరుదెంచు = వచ్చు, అర్చ = పూజ, మహి = ఆవు, చాకిరి = సేవ, మారు = మరియొక, ప్రవరము = పేరు, వత్ససూ = ఆవు, కరములు మోడ్చు = నమస్కరించు)

ఆహ్వానం అందుకొని వచ్చి పూజ లందుకొనే నోరు లేని జీవి ఆవు. సేవకు మారు పేరు. ప్రజల వాకిట్లో వెలసిన లక్ష్మీ దేవి. ఓ, ధేనువా! భక్తితో నీకు నమస్కరిస్తాను.

188. పంది, చేప, కప్ప, కోడి పదాలతో బ్రాహ్మణుల ఇంట్లో విందు

188.203 కం. ఛీఛీలు పందిరంతయు,
మాచే పల్ద్విజు లలుగగ, మాకపు డిదియే
తోచె, వరు కప్పగింతల
పేచీ పంక్తుల పకోడి పెట్టగ యణగుస్.

(ఛీఛీలు = తిరస్కారపు మాటలు, పలు = అనేక, ద్విజులు = బ్రాహ్మణులు, అలుగు = కోపించు, వరుకు = పెళ్లికొడుకుకు, అప్పగింతలు = వివాహంలో పెండ్లికూతురును పెళ్లికొడుకు వైపు వారికి అప్పగించే తంతు, పేచీ = తంటా, పంక్తి = భోజనాల్లో వరుస, అణగు = తగ్గు)

పందిరంతా ఛీఛీలు వినబడుతున్నాయి. మా వల్ల చాలా మంది బ్రాహ్మణులు అలిగారు. మాకు అప్పుడు ఇదే తోచింది, వరుని అప్పగింతల పేచీ, భోజనాలలో పకోడి పెడితే తగ్గుతుందని.

188.204 కం. అందెను మా కప్పనముగ
పందిరిలో పెళ్ళి విందు బ్రాహ్మల యింటస్,
యందున పకోడిఁ బెట్టగ
యందని మాచే పరుషము లందరి కందెస్.

(అప్పనము = ఉచితము, పరుషము = నిష్ఠుర వాక్యము)

బ్రాహ్మణుల ఇంట్లో పందిరిలో పెళ్ళి విందు అప్పనంగా మాకు అందింది. అందులో పకోడి పెట్టగా అందని మా చేత నిష్ఠూరాలు అందరికీ అందినాయి.

189. పంది, నంది, కంది, మంది - పదాలు పాదాదిన వచ్చేటట్లుగా సి.పి.బ్రౌన్ గురించి ఉత్పలమాల పద్యం

189.205 ఉ. పంది ధరిత్రి నెత్తి నటు భాష నధోగతి నుండిఁ గాచి, దై
నందిన జీవితమ్ముఁన వినమ్రతతో బుధులన్ భరించి, నీ
కందిన కావ్యరాజముల నందముగా ప్రచురించి తీవు, మ
న్మందిర మందు నిల్పి నిను మన్ననఁ జేతుము, బ్రౌను శేఖరా!

(పంది = ఆదివరాహము, ధరిత్రి = భూమి, ఎత్తు = పైకెత్తు, అటు = ఆప్రకారము, అధోగతి = తక్కువస్థితి, కాచు = రక్షించు, దైనందిన = ప్రతి రోజు జరుగునది, వినమ్రత = విధేయత, బుధుడు = పండితుడు, భరించు = పోషించు, అందు = లభించు, ప్రచురించు = ముద్రించు, ఈవు = నీవు, మన్మందిరము = మనస్సు అనే ఆలయం, మన్నన = గౌరవము, శేఖర = శ్రేష్ఠుడు)

ఓ, శ్రేష్ఠుడవైన బ్రౌను దొరా! ఆదివరాహము భూమిని పైకెత్తినట్లు భాషను అధోగతి నుండి కాపాడి, నిత్యజీవితంలో వినయంతో పండితులను పోషించి నీకు లభించిన గొప్ప కావ్యాలను అందంగా ముద్రించావు నువ్వు. మనస్సనే ఆలయంలో నిలిపి నిన్ను గౌరవిస్తాము.

190. పగలు, వగలు, సెగలు, రగులు - పదాలతో

190.206 కం. పగలు, ప్రతీకారంబులు,
యగణితముగ పొరుగు దేశ మాడెడి వగలున్,
గగనము మాన్పంగ, సెగలు
రగులుట యెన్నాళ్ళనింక, రక్షణ లేదా?

(పగలు = శత్రుత్వములు, ప్రతీకారములు = పగతీర్చుకొనడాలు, అగణితముగ = లెక్కలేనన్ని సార్లు, వగలు = మాయలు, గగనము = అసాధ్యము, సెగలు = తాపములు, రగులు = మండు)

పగలూ, ప్రతీకారాలూ, లెక్కలేనన్ని సార్లు పొరుగు దేశం చేసే మాయలు మాన్పించడం అసాధ్యం. ఈ తాపాలు జ్వలించేది ఇంకెన్నాళ్ళు. రక్షణ లేదా?

191. పద్యము, గద్యము, మద్యము, హృద్యము - పదాలను ఉపయోగిస్తూ కవిత్వం యొక్క ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ

191.207 ఉ. పద్యము నందు నున్న లయ వాటము యూహల కంచుఁ గొందరుస్,
గద్యము కొంచెకాళ్ళకును గ్రాహ్యము శ్రేష్ఠ మటంచుఁ గొందరుస్,
మద్యముఁ బోలు మిశ్రమము మత్తని కొందరు చంపు రీతులస్,
హృద్యముగా కవిత్వమును పృథ్వికి నిచ్చిరి తీపి గుర్తుగా.

(పద్యము = గణయతిప్రాస నియమములు గలది, లయ = సంగీత పరంగా ఉండే ఒక క్రమం, వాటము = అనుకూలమైనది, ఊహ = భావనము, గద్యము = వచనము, కొంచెకాడు = సామాన్యుడు, గ్రాహ్యము = గ్రహింపదగినది, శ్రేష్ఠము = ఉత్తమము, మద్యము = సారాయి, పోలు = సాటివచ్చు, మిశ్రమము = కలిసినది, మత్తు = మైకము, చంపు రీతి = పద్యము గద్యము రెండూ ఉన్న పద్ధతి, హృద్యము = మనస్సున కింపైన, పృథ్వి = భూమి, గుర్తు = జ్ఞాపకం)

పద్యంలో ఉండే లయ భావనలకు అనుకూలము అని కొందరు, వచనము సామాన్యులకు కూడా అర్థము అవుతుంది ఉత్తమము అని కొందరు, మద్యం లాగా రెండూ కలసిన మిశ్రమమే మత్తని పద్యము గద్యము రెండూ ఉన్న చంపూ పద్ధతి లోను మనస్సున కింపుగా కవిత్వాన్ని తీపి జ్ఞాపకంగా లోకానికి ఇచ్చారు.

192. పసిడి, వెండి, రాగి, మట్టి - పదాలు వేరే అర్థంలో వాడుతూ ఆదిశక్తి ప్రాభవాన్ని స్వేచ్ఛా వృత్తంలో

192.208 తే.గీ. త్రప సిడిముడు లొక పరి, చంద్రాతప స్తప
ములకు యంతరు వెండి నటుల నొక పరి,
కాంతుని యనురాగించుటె గౌరి హేల,
సృష్టి కాధార మట్టి విశిష్ట శక్తి.

(త్రప = సిగ్గు, సిడిముడి = కోపము, పరి = తడవ, చంద్రాతపము = వెన్నెల, స్తపము = తాపము, అంతరువు = తారతమ్యము, ఎండు = శుష్కించు, కాంతుడు = భర్త, అనురాగించు = ప్రేమ చూపు, గౌరి = పార్వతి, హేల = శృంగారచేష్ట, విశిష్ట = గొప్పదైన)

సిగ్గు, కోపములు ఒక సారి, వెన్నెల తాపముల భేదము తగ్గిపోయినట్లుగా ఒక సారి భర్తను వలచుటయే పార్వతీ మాత శృంగారచేష్ట. అటువంటి గొప్ప శక్తి సృష్టికి మూలము.

193. పాకు, బేకు, హోకు, సాకు - అన్న కన్నడ పదాలతో పద్యం

193.209 కం. పాకువు విటపిఁ బెఱుక, సబ
బే? కులసతి కెగ్గు జరుగ, విరటు డొరిమ, నా
హా! కూపిఁ దీసిన యే
సా కురవని కంకుభట్టు సైగల నాపెస్.

(పాకువు = వంటవాడు, విటపి = చెట్టు, పెఱుకు = పెల్లగించు, సబబు = యుక్తము, కులసతి = మంచి కులమును శీలమును గల భార్య, ఎగ్గు = కీడు, ఒరిమ = స్నేహము, ఆహా = ఆశ్చర్యార్థకము, కూపి తీయు = ఆరా తీయు, సాకు = నెపము, ఉరవు = ఔచిత్యము, కంకుభట్టు = ధర్మరాజు, సైగ = సంజ్ఞ, ఆపు = వారించు)

ఆహా! కులసతికి కీడు జరిగిందని వలలుడు (వంటవాడిగా ఉన్న భీముడు) చెట్టు పెల్లగించడం యుక్తమా, విరాటరాజు ఆ స్నేహాన్ని గురించి ఆరా తీస్తే ఏ నెపము ఉచితంగా ఉంటుందని కంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజు సైగల ద్వారా వారించాడు.

194. పాప, రూప, దీప, తాప - పదాలను ఉపయోగిస్తూ దీపావళి పర్వదిన ప్రాశస్త్యాన్ని తెలుపుతూ

194.210 కం. పాపాత్ముండగు నరకుడు
రూపసుల చెరన్ విభావరులఁ గావించెన్,
తాపసులను పీడించెను,
దీపావళి నాడె శౌరి త్రెక్కొనె వానిన్.

(పాపాత్ముడు = పాపబుద్ధి గలవాడు, రూపసి = చక్కని స్త్రీ, చెర = నిర్బంధము, విభావరి = వేశ్య, కావించు = చేయు, తాపసి = ముని, పీడించు = బాధించు, శౌరి = కృష్ణుడు, త్రెక్కొను = చంపు)

పాపబుద్ధి గలవాడైన నరకాసురుడు అందమైన స్త్రీలని చెరలో వేశ్యలుగా చేశాడు, మునులను బాధపెట్టాడు. దీపావళి నాడే కృష్ణుడు వాణ్ణి చంపాడు.

195. పాపి, ఖలుఁడు, హీనుడు, ద్రోహి - పదాలను ప్రయోగిస్తూ విష్ణుస్తుతి

195.211 తే.గీ. పాపి రావణు దునుమాడు ప్రజ్ఞ గల్గి,
ఖలుఁడు శిశుపాలుఁ జంపిన ఘనత యున్న,
హీను డెవడైన కడతేరు హేతు వైన,
ద్రోహి కరి యగు, విష్ణుకు మ్రొక్కు కొందు.

(పాపి = పాపము గలవాడు, దునుమాడు = చంపు, ప్రజ్ఞ = సామర్థ్యము, కల్గు = కలిగియుండు, ఖలుడు = నీచుడు, ఘనత = గొప్పదనము, హీనుడు = అల్పుడు, కడతేరు = చచ్చు, హేతువు = కారణము, ద్రోహి = ద్రోహము చేయువాడు, అరి = శత్రువు, మ్రొక్కుకొను = ప్రార్థనచేసికొను)

పాపియైన రావణుణ్ణి చంపే సామర్థ్యము కలిగి యుండి, నీచుడైన శిశుపాలుణ్ణి చంపిన గొప్పదనం ఉన్నటువంటి, అల్పుడు ఎవడైనా చావడానికి కారణమైన, ద్రోహము చేసేవాడికి శత్రువైన, విష్ణుమూర్తికి మ్రొక్కుకుంటాను.

196. పాపి, తులువ, పలువ, పంద - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ధర్మరాజు సుగుణాలను వర్ణిస్తూ

196.212 ఉ. జ్ఞాతులు వల్వ లూడ్చ్వ యపచారముఁ జేయ క్షమించు దాంతుడై,
నీతికి నిల్చి స్పందనము నిత్యము సత్యము నందె యుంచుచున్,
భ్రాతలు కంద వారి కిను పాపి, నిరంతర శాంతి యజ్ఞమున్
బ్రీతిని సాకి, తిప్పలు వరించిన ధర్మజు డెంత సాధువో.

(జ్ఞాతి = దాయాదుడు, వల్వ = వస్త్రము, ఊడ్చు = లాగివైచు, అపచారము = పూజ్యుల యెడల చేసిన నేరము, క్షమించు = మన్నించు, దాంతుడు = నిగ్రహచిత్తుడు, స్పందనము = చైతన్యము, నిత్యము = ఎల్లప్పుడు, భ్రాత = సోదరుడు, కందు = కోపించు, కినుపు = కోపము, ఆపు = నివారించు, నిరంతర = ఎడతెగక, ప్రీతి = ఇష్టము, సాకు = పోషించు, తిప్పలు = కష్టములు, వరించు = చేపట్టు, సాధువు = మంచివాడు)

దాయాదులైన కౌరవులు వస్త్రములు లాగి నేరము చేయగా మన్నించి నిగ్రహమనస్కుడై, నీతికి నిలిచి ఎల్లప్పుడు చైతన్యము సత్యము నందే ఉంచుతూ, సోదరులు కోపగించ వారి కోపాన్ని నివారించి, వ్యవధానము లేకుండా శాంతి యజ్ఞాన్ని ఇష్టంగా పోషించి, కష్టాలని వరించిన ధర్మరాజు ఎంత మంచివాడో.

197. పాలు, పెరుగు, చల్ల, వెన్న - పదాలను పాడి సంబంధమైన అర్థంలో కాకుండా ఉపయోగించి మహాభారతార్థంలో

197.213 ఉ. వ్యాసు భవిష్యవాణి నను వ్యాకుల చిత్తము పాలుఁ జేసె, యు
ర్వీశుల వైరముల్ పెరుగు, విచ్చుతిఁ గల్గును నీ మిషన్ యనన్,
వాసరముల్ యికన్ స్వపర భావము చల్లక వెళ్ళబుచ్చెదన్,
ద్వేషము వెన్నడింప నని, దేవుని సాక్షిగ ధర్మజుం డనెన్.

(భవిష్యవాణి = జరుగబోయేది చెప్పే మాట, వ్యాకుల = కలత నొందిన, చిత్తము = మనసు, పాలు = వశము, ఉర్వీశుడు = రాజు, వైరము = విరోధము, పెరుగు = వృద్ధిచెందు, విచ్చుతి = నాశనము, మిష = కారణము, వాసరము = దినము, ఇక = ఇటు పిమ్మట, స్వ = తన, పర = అన్యము, చల్లు = వ్యాపింపజేయు, వెళ్ళబుచ్చు = గడుపు, ద్వేషము = శత్రుత్వము, వెన్నడించు = వెంబడించు)

నీ కారణంగా రాజుల మధ్య వైరము పెరుగుతుంది, నాశనము కలుగుతుంది అని వ్యాసుని భవిష్యవాణి అనడం నన్ను భయచిత్త వశుణ్ణి చేసింది, ఇటు పిమ్మట రోజులన్నీ స్వపర భేదభావము వ్యాపింప జేయకుండా గడుపుతాను, శత్రుత్వాన్ని వెంబడించను, అని దైవసాక్షిగా ధర్మరాజు అన్నాడు.

197.214 మ. శిశుపాలుండు గతింప శాంతి యిట రాశీభూతమై యుండునా,
కసి పృథ్వీశుల యాతుమన్ పెరుగుచున్ కయ్యంబు తెప్పించునా,
యెసకొల్పన్ యది చల్లఁ గాక పదమూడేండ్లుండునా, తెల్పు, తా
పస! వ్యాసా! యనె వెన్నడించి యనుకంపన్ ధర్మరా జధ్వరన్.

(గతించు = చచ్చు, ఇట = ఇక్కడ, రాశీభూతము = మూర్తిమంతము, కసి = ద్వేషము, పృథ్వీశుడు = రాజు, ఆతుమ = మనస్సు, కయ్యము = యుద్ధము, ఎసగొల్పు = పురికొల్పు, తాపస = తపస్సుచేయువాడు, వెన్నడించు = వెంబడించు, అనుకంప = కరుణ, అధ్వర = యజ్ఞము)

ధర్మరాజు యజ్ఞములో (రాజసూయము) కరుణ నిండిన మనస్సుతో వెంబడించి, ఓ మునీశ్వరా! వ్యాసా! శిశుపాలుడు మరణించడం వల్ల ఇక్కడ శాంతి మూర్తిమంతమై ఉంటుందా? రాజుల మనస్సులో ద్వేషము పెరుగుతూ యుద్ధం తెప్పిస్తుందా? ప్రేరేపించినా కూడా అది చల్లబడక పదమూడు ఏళ్ళు ఉంటుందా? చెప్పు అని అన్నాడు.

198. పాలు, పెరుగు, నేయి, నూనె - పదాలను వేరే అర్థాలలో వాడుతూ శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి చెప్పినట్లుగా

198.215 తే.గీ. వచ్చితిని కృష్ణుడ, నవనీపాలుడ! ధృత
రాష్ట్ర! పెచ్చపెరుగు యంతరములఁ బాప,
నాకు నేనుగనే యిట నాట శాంతి,
పాండవులకు నే నూనెద బాధ్య తనెను.

(అవనీపాలుడు = రాజు, పెచ్చపెరుగు = పెచ్చురేగు, అంతరము = పొరపొచ్చము, పాపు = తొలగించు, నాటు = పాదుకొను, ఊను = వహించు)

ఓ ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణుణ్ణి, పెచ్చురేగే పొరపొచ్చాలు తొలగించి, నాకు నేనుగా ఇక్కడ శాంతి స్థాపన చెయ్యడానికి వచ్చాను, పాండవులకు నేను బాధ్యత వహిస్తాను అని అన్నాడు.

199. పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలతో కురు పాండవుల ఆస్తి పంపకాలు

199.216 తే.గీ. వైరము పెరుగునని కురు పాండవులకు
ప్రవయు లనగనే, యిడె నిరు వర్గములకు
చెరి సగము పాలు రాజ్యము చీకురాజు,
వెన్నదొంగయు ద్రుపదుడు వేడ్కఁ జూడ.

(వైరము = విరోధము, పెరుగు = ఎక్కువ అగు, ప్రవయుడు = వృద్ధుడు, ఇడు = ఇచ్చు, ఇరు = రెండు, వర్గము = సమూహము, చెరి సగము = సరిగా సగం సగం, పాలు = భాగము, చీకురాజు = గ్రుడ్డిరాజైన ధృతరాష్ట్రుడు, వెన్నదొంగ = శ్రీకృష్ణుడు, వేడ్క = సంతోషము)

కురు పాండవులకి విరోధం ఎక్కువవుతుంది అని పెద్దలు చెప్పగానే, శ్రీకృష్ణుడు, ద్రుపదుడు సంతోషంతో చూడగా, ధృతరాష్ట్రుడు రెండు వర్గాలకి చెరి సగం రాజ్యభాగం ఇచ్చాడు.

200. పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

200.217 కం. చావెన్నకు దుర్యోధన!
యీవా పాండవుల పాలు యెప్పటికైనస్,

కావేషము పెరుగు నటుల
భావమునే యిట్లుఁ జెప్పె, వనమాలి సభన్.

(ఎన్ను = తలపోయు, పాలు = వంతు, కావేషము = విరోధము, భావము = అభిప్రాయము, వనమాలి = వనమాల ధరించినవాడైన శ్రీకృష్ణుడు)

దుర్యోధనా! చావుని తలపోయకు. పాండవుల వంతు ఎప్పటికైనా ఇవ్వవా? విరోధము పెరిగే విధంగా అభిప్రాయాన్ని ఈ ప్రకారం శ్రీకృష్ణుడు సభలో చెప్పాడు.

201. పాలు, పెరుగు, వెన్న, నేయి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ

201.218 కం. ఇక్కట్ల పాలుఁ జేయకఁ
గ్రక్కున వెన్నంటి వేగ కష్టముఁ దీర్చన్
మ్రొక్కగనే యితవరిపై
రక్కొను నీ గొప్పెరుగుదురా! శ్రీకృష్ణా!

(ఇక్కట్లు = ఆపద, పాలు = అధీనము, గ్రక్కున = శీఘ్రముగా, వెన్నంటు = వెంబడించు, వేగ = త్వరగా, తీర్చు = తొలగించు, మ్రొక్కు = నమస్కరించు, ఇతవరి = హితము చెప్పువాడు, రక్కొను = వచ్చు, ఎరుగు = తెలుసుకొను)

ఆపదల పాలు చేయకుండా, శీఘ్రముగా వెంబడించి త్వరగా కష్టము తొలగించడానికి నమస్కరించగానే హితము చెప్పువాడివిగా వచ్చే నీ ఘనత తెలియునురా, శ్రీకృష్ణా!

202. పిక్చరు, స్ట్రక్చరు, ఫ్రాక్చరు, లెక్చరు - పదాలతో పద్యం

202.219 ఉ. పిక్చరు గీసి, సౌధమిది పెద్దది, సౌఖ్యకరంబు, గట్టిదౌ
స్ట్రక్చరు, చెంత నన్నియును జక్కొను, వంద శకమ్ములైన యే
ఫ్రాక్చరు యుండ దంచు, పలు ప్రాపణికుల్ వినియోగదార్లకున్
లెక్చరు లిచ్చుటన్ వినిన, రేగును యాశలు సౌధమంతగన్.

(పిక్చరు [picture] = బొమ్మ, సౌధము = మేడ, స్ట్రక్చరు [structure] = నిర్మాణం, చెంత = దగ్గరలో, జక్కొను = లభించు, శకము = సంవత్సరము, ఫ్రాక్చరు [fracture] = పగులు, పలు = అనేక, ప్రాపణికుడు = వ్యాపారి, లెక్చరు [lecture] = ఉపన్యాసం, రేగు = పైకిలేచు)

బొమ్మ గీసి, మేడ ఇది, పెద్దది, సుఖాలని ఇస్తుంది, నిర్మాణం గట్టిది, దగ్గరలో అన్నీ దొరుకుతాయి, వంద యేళ్ళయినా పగులు ఉండదు అంటూ పలువురు వ్యాపారులు వినియోగదార్లకి ఉపన్యాసాలు ఇవ్వడం వింటే ఆశలు మేడంత ఎత్తు పైకి లేస్తాయి.

202.220 ఉ. పిక్చరు యెన్నికందు కనిపింపగఁ జేసెనుఁ గాదె మీకు, రీ
స్ట్రక్చరుఁ జేసి పార్టి పునరంకితమౌ నటు చేయకున్నచో,
ఫ్రాక్చరుడౌను మాండెటు, విభాగము లౌనులె పార్టి, యంచు తా
లెక్చరు లిచ్చు నేత లిక లేరని, కుందె డెమాక్రసీ కడుస్.

(పిక్చరు = దృశ్యము, రీస్ట్రక్చరు [restructure] = పునర్నిమాణము, అటు = ఆప్రకారము, ఫ్రాక్చరుడు [fractured] = ముక్కలైనది, మాండెటు [mandate] = ఎన్నికలలో మెజారిటీ ఎటువేపు ఉన్నది అన్న ఆదేశము, లెక్చరు = ఉపన్యాసము, కుందు = దుఃఖించు, డెమాక్రసీ = ప్రజాస్వామ్యము, కదు = మిక్కిలి)

ఎన్నికలో దృశ్యము మీకు కనిపించేటట్లు చేసింది కాదా, పునర్నిమాణము చేసి పార్టీని పునరంకితము అయ్యేటట్లు చేయకుండా ఉంటే ఫ్రాక్చరుడు మాండెటు అవుతుంది, పార్టీ ముక్క లవుతుంది అంటూ ఉపన్యాసాలిచ్చే నాయకులు లేరే అని ప్రజాస్వామ్యము మిక్కిలి దుఃఖించింది.

202.221 కం. పిక్చరు యస్పష్టము, రీ
స్ట్రక్చరు చేయవలె పార్టి ర్యాంకులు, వలదా?
ఫ్రాక్చర్డ్ మాన్డేటే యని
లెక్చరు లిచ్చుటకు, నేత లేడే మనకుస్.

(పిక్చరు = దృశ్యము, అస్పష్టము = అవ్యక్తము, రీస్ట్రక్చరు = పునర్నిర్మాణము, ర్యాంకు = నాయకత్వానికి సంబంధించిన స్థానము, ఫ్రాక్చర్డ్ = ముక్కలైన, మాన్డేటు = ఎన్నికలలో మెజారిటీ ఎటువేపు ఉన్నది అన్న ఆదేశము, లెక్చరు = ఉపన్యాసము)

దృశ్యము అస్పష్టంగా ఉంది, పార్టీ నాయకత్వాన్ని పునర్నిర్మాణము చేయాలి, వద్దంటే ఫ్రాక్చర్డ్ మాన్డేటే అని ఉపన్యాసం ఇచ్చే నాయకుడు మనకు లేడే.

203. పూరి, వడ, దోశ, అట్టు - పదాలను ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

203.222 తే.గీ. మోసపూరితమగు ద్యూతమున యవమతి
జరుగ కృష్ణ వడకుపడె, కురుకులమును
నాశనముఁ జేయ రానున్నదో శని బక
వైరిగ యని యట్టుడికె గాంధారి మనసు.

(పూరితము = నింపబడినది, ద్యూతము = జూదము, అవమతి = అవమానము, కృష్ణ = ద్రౌపది, వడకుపడు = భయపడు, ఘోర = భయంకరమైన, బకవైరి = భీముడు, అట్టుడుకు = క్షోభపడు)

మోసముతో నిండిన జూదంలో అవమానం జరుగగా ద్రౌపది భయపడింది. భయంకరంగా కురువంశ నాశనము చేయడానికి భీముని రూపంలో శని రానున్నదో యని గాంధారి మనసు క్షోభపడింది.

204. పూరీ, లారీ, గోరీ, మోరీ - పదాలతో గౌరీకల్యాణం

204.223 కం. మదన రిపూ రీకృతియో,
వదలక యుపవాస ముండి పరులా రీతిన్
మది గోరీశుని నిలిపిన
ముదమో, రీఢనుఁ గనక, సముద్వాహ మయెన్.

(మదన = మన్మథుడు, రిపు = శత్రువు, ఊరీకృతి = సమ్మతి, పరుల = పార్వతి, రీతి = విధము, మది = మనస్సు, కోరి = కావలెనని, ఈశుడు = శివుడు, నిలుపు = ప్రతిష్ఠించు, ముదము = సంతోషము, రీఢ = తిరస్కారము, కను = చూచు, సముద్వాహము = వివాహము)

మదనారియైన శివుని అంగీకారమో, వదలకుండా ఉపవాసం ఉండి పార్వతి ఆ విధంగా శివుణ్ణి కావాలనుకొని మనస్సులో నిలుపుకున్న సంతోషమో గానీ తిరస్కారము చూడకుండానే వివాహం అయ్యింది.

205. పెస్, గస్, డస్, రస్ - పదాలను ఉపయోగిస్తూ "నేటి సినిమాలు" విషయంగా

205.224 శా. మాపెస్ నాటకరంగ వృద్ధిని యసామాన్యంబుగా నంతటస్,
వ్యాపారంబె విధిత్సితమ్మని, యనాస్వాదమ్ముగస్ ద్వ్యర్థి స
ల్లాపంబుల్, పగ, లెల్లెడస్ లలనలస్ లక్షించు నశ్లీలముల్,
రాపస్ జీవన మందు, ప్రస్తుత సినీ రంగంబు గ్రమ్మెస్ ధరస్.

(మాపు = నాశనము చేయు, అసామాన్యము = అసాధారణము, వ్యాపారము = వర్తకము, విధిత్సితము = లక్ష్యము, అనాస్వాదము = రుచిలేనిది, ద్వ్యర్థి = రెండర్థములు గలది, సల్లాపము = పరస్పరసంభాషణము, పగ = విరోధము, ఎల్లెడ = అంతటా, లలన = స్త్రీ, లక్షించు = గుఱిచేయు, అశ్లీలము = అసభ్యవచనము, రాపు = రగులు, క్రమ్ము = వ్యాపించు, ధర = భూమి)

నాటక రంగము యొక్క అభివృద్ధిని అసాధారణంగా అంతటా నాశనం చేసింది. వ్యాపారమే లక్ష్యంగా ఆస్వాదించడానికి వీలులేని రెండర్థాల సంభాషణలు, ద్వేషాలు, సర్వత్రా స్త్రీలను ఉద్దేశించి అసభ్య వచనాలు, జీవితంలో రగుల్చడానికి నేటి సినీ రంగము లోకంలో వ్యాపించింది.

206. పేపరు, పెన్ను, టైపు, మెమో - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

206.225 కం. నెగపే పరుషత్వంబై,
తగవును రేపెన్ను విదను ద్రౌపదిని సభస్
తిగుచగ, భయమ్మె మోమున
వెగటై పురికొల్పె సఖిని, వెన్నుని వేడస్.

(నెగపు = గర్వము, పరుషత్వము = కాఠిన్యము, తగవు = కలహము, రేపు = రేగజేయు, ఉవిద = స్త్రీ, తిగుచు = ఈడ్చు, మోము = ముఖము, వెగటు = ఏవగింపు, పురికొల్పు = ప్రేరేపించు, సఖి = స్నేహితురాలు, వెన్నుడు = కృష్ణుడు, వేడు = ప్రార్థించు)

గర్వమే కాఠిన్య మవగా మగువయైన ద్రౌపదిని సభలో ఈడ్చడం కలహం రేగేటట్లు చేసింది. భయమే ముఖంలో ఏవగింపై కృష్ణుని ప్రార్థించమని సఖిని (కృష్ణుడు ద్రౌపదిని 'సఖీ' అని పిలిచేవాడు అని అంటారు) ప్రేరేపించింది.

207. పేపర్, బుక్, పెన్, ఇంక్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో

207.226 కం. బారిసము నరుని కింకువ,
చేరి డబుక్కుమన కూల్చె చేపఁ గల బిసన్
పాఱుడు పెన్నుద్ది యతని
దారగు నెగపే పరువని ద్రౌపది తలచెన్.

(బారిసము = వాలకము, నరుడు = అర్జునుడు, ఇంకువ = గుఱుతు, చేరు = సమీపించు, డబుక్కుమన = ఒక్కసారిగా, కూల్చు = పడగొట్టు, బిస = యంత్రము, పాఱుడు = బ్రాహ్మణుడు, పెన్నుద్ది = బలవంతుడైన యోధుడు, దార = భార్య, ఎగపు = గర్వము, పరువు = గౌరవము, తలచు = పరిగణించు)

వాలకం అర్జునునికి గుఱుతు, సమీపించి ఒక్కసారిగా చేప ఉన్న యంత్రాన్ని, అంటే మత్స్యయంత్రాన్ని, పడగొట్టాడు, బ్రాహ్మణుడు, బలశాలియైన యోధుడు, అతని భార్య అయ్యే గర్వమే గౌరవమని ద్రౌపది తలచింది.

208. పోతన అన్న పదం నాలుగు పాదాలలో అన్యార్థంలో పెట్టి పోతనపై పద్యం

208.227 తే.గీ. తేనె రంగరింపో! తన జ్ఞాన ధునియొ!
యందగింపో! తన ప్రతిభో! యనగ నిడెను
పో! తన సహజ పాండితీ కేతనమును
పోతనమగు భాగవతము, పోతరాజె.

(రంగరించు = చేర్చి కలుపు, ధుని = నది, అందగింపు = అలంకారం, ప్రతిభ = అప్పటప్పటికి వికసించెడు బుద్ధి, ఇడు = ఇచ్చు, పో = నిశ్చయమును తెలుపును, సహజ = స్వభావ సిద్ధమైన, పాండితి = పాండిత్యము, కేతనము = ధ్వజము, పోతనము = పావనము, పోతరాజు = బమ్మెర పోతన)

తేనెలో కలిపాడో, తన జ్ఞానవాహినియో, అలంకారమో, తన బుద్ధి కుశలతయో, అన్నట్లుగా నిశ్చయముగా తన సహజపాండిత్యమునకు ధ్వజమును పవిత్రమును ఐన భాగవతాన్ని బమ్మెర పోతరాజే ఇచ్చాడు.

209. ప్రవరుడు, వరూధిని, స్వరోచి, మనోరమ - పదాలతో రామాయణార్థంలో

209.228 చం. భువనమునన్ స్వరోచి కడు పోడిమి యున్న ప్రవీరుడౌ రఘు

ప్రవరుడు నచ్చ శూర్పణఖ, రాముడు కాదని నంత, వెంట దా
నవుల వరూధినిన్ గొని రణంబున నిల్వఁగ, జంపె నందరన్
నవల మనోరమన్ కుజను నర్మిలిఁ గావగ రాము డత్తరిన్.

(భువనము = జగము, స్వ = తన, రోచి = కాంతి, కడు = మిక్కిలి, పోడిమి = శౌర్యము, ప్రవీరుడు = ప్రసిద్ధమైన వీరుడు, ప్రవరుడు = శ్రేష్ఠుడు, నచ్చు = ఇష్టమగు, అంత = అనంతరము, వెంట = వెంబడి, దానవుడు = రాక్షసుడు, వరూధిని = సేన, కొను = తీసికొను, రణము = యుద్ధము, నిల్చు = నిలుచు, నవల = స్త్రీ, మనోరమ = మనస్సును రంజింప చేయునది, కుజ = సీత, నర్మిలి = ఆపేక్ష, కాచు = రక్షించు, అత్తరి = ఆ సమయము)

జగత్తులో స్వయంప్రకాశంతో వెలిగే మిక్కిలి శౌర్యము ఉన్న ప్రసిద్ధమైన వీరుడు రఘువంశ శ్రేష్ఠుడు తనకి నచ్చగా, శూర్పణఖ రాముడు కాదనంగానే తన వెంబడి రాక్షస సేన తీసుకొని యుద్ధంలో నిలువగా తన మనస్సును రంజింప చేసే మగువ సీతను ఆపేక్షతో రక్షించడానికి రాముడు ఆ సమయంలో అందరినీ చంపాడు.

210. బండి, రథము, ఓడ, విమానము - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఒక అదృష్టహీనుని దీనావస్థను వర్ణిస్తూ

210.229 తే.గీ. తెలివి మానము లన్నవి వెలితిఁ గాగ,
చెమట యోడ్చగ ఫలితము చిక్కదనుచు,
చెనటి తన మనోరథమునుఁ జెప్పె ననగ,
యారఁబండిన ఫలమును జారవిడిచె.

(తెలివి = వివేకము, మానము = గౌరవము, వెలితి = తక్కువ, చెమటయోడ్చు = మిక్కిలి శ్రమించు, చిక్కు = లభించు, చెనటి = దురదృష్టవంతుడు, మనోరథము = కోరిక, ఆరఁబండు = పరిపక్వస్థితికి వచ్చు, ఫలము = పండు)

వివేకము, గౌరవము అన్నవి తక్కువ అవడం వల్ల, ఎక్కువగా కష్టపడితే ఫలితం దక్కదంటూ, మందభాగ్యుడు తన కోరిక చెప్పాడు అనుకునేటట్లుగా మిగలముగ్గిన పండును జారవిడిచాడు.

211. బడి, ఒడి, గుడి, మడి - పదాలతో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ

211.230 తే.గీ. పాఠశాలలు యుమ్మడి భాగ్య మనగ,

రాబడికిఁ గాదు బోధనే లక్ష్య మవ్వ,
విద్య గుడిసెలను వసించు పేద లందు
యొడికము నెరిగి, పాలన యున్న మేలు.

(ఉమ్మడి = సమిష్టి, భాగ్యము = సంపద, రాబడి = ఆదాయము, బోధన = ఉపదేశము, లక్ష్యము = సంకల్పము, వసించు = నివసించు, అందు = గ్రహించు, ఒడికము = ఉపాయము, ఎరుగు = తెలిసికొను, పాలన = ఏలుబడి, మేలు = ఉపకారము)

విద్యాలయాలు సమిష్టి సంపద అనేటట్లుగా, ఆదాయం కోసం కాదు బోధనే సంకల్పంగా, గుడిసెలలో నివసించే పేదలు విద్యను అందుకొనే ఉపాయం తెలుసుకొని, ప్రభుత్వం ఉంటే మంచిది.

212. బల్లి, చెల్లి, పిల్లి, గిల్లి - పదాలతో రామాయణార్థంలో

212.231 ఉ. బల్లిదుడైన వాలి నొక బాణము తోడనె సంహరించె, నీ
చెల్లికి ముక్కు కర్ణములు ఛేదనఁ జేసెను, భీతి తోడ కం
పిల్లిన సౌరిఁ గాచి కపి విట్పతిఁ జేసె నటంచు, యాజి నీ
డ్గిల్లిన రావణుఁ గనిన గేహినిఁ బల్కెను, రాము మెచ్చుచున్.

(బల్లిదుడు = బలవంతుడు, సంహరించు = చంపు, కర్ణము = చెవి, ఛేదన = తెగగోయుట, భీతి = భయము, కంపిల్లు = వణకు, సౌరి = సుగ్రీవుడు, కాచు = రక్షించు, కపి = వానరుడు, విట్పతి = రాజు, ఆజి = యుద్ధము, ఈడ్గిల్లు = కూలఁబడు, కను = చూచు, గేహిని = ఇల్లాలు, పల్కు = మాటాడు, మెచ్చు = శ్లాఘించు)

బలవంతుడైన వాలిని ఒక బాణంతోనే చంపాడు, నీ చెల్లెలయిన శూర్పణఖకు ముక్కు చెవులు తెగగోశాడు, భయంతో వణికే సుగ్రీవుని రక్షించి వానర రాజుని చేశాడు, అని రాముణ్ణి మెచ్చుకుంటూ యుద్ధంలో కూలబడ్డ రావణుణ్ణి చూసి అతని భార్య మండోదరి అంది.

213. బహ్వ, గహ్వ, ప్రహ్వ, జిహ్వ - పదాలతో అమ్మవారిని స్తుతిస్తూ కంద పద్యం

213.232 కం. బహ్వక్కల సారం బతి
గహ్వర మగు నీదు మహిమ కల్కము లణచున్
ప్రహ్వంబగు మది మాతా!

జిహ్వపమున భవదీయ శిల్పముఁ గనగన్.

(బహ్వృక్క = ఋగ్వేదములో ఎక్కువ ఋక్కులు గల సూక్తము, సారము = నిగ్గు, అతి = మిక్కిలి, గహ్వరము = గాంభీర్యముకలది, కల్కము = పాపము, అణచు = నశింపజేయు, ప్రహ్వము = నమ్రము, మది = మనస్సు, మాత = పార్వతి, జిహ్వపము = పులి, భవదీయ = నీ యొక్క, శిల్పము = రూపము, కను = చూచు)

ఋగ్వేదములో ఎక్కువ ఋక్కుల సారము, మిక్కిలి లోతైనది యైన నీ యొక్క మహిమ పాపములు నశింపజేస్తుంది. ఓ, పార్వతీ మాతా! పులి వాహనం పైన నీ యొక్క రూపం చూడగా మనస్సు నమ్రమౌతుంది.

214. బాల్, రస్, వికెట్, విస్ - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో

214.233 కం. పలుకుచు డంబాల్ యుత్తరు
డొలయస్ సూతుని, వెడలెను యుత్తర కోరస్,
సులభముగ తన్వి కెట్టులు
వలదనును బృహన్న లంచు భావించి మదిన్.

(డంబము = బడాయి, ఒలయు = కోరు, సూతుడు = తేరు నడుపువాడు, వెడలు = వెళ్ళు, సులభము = సుఖముగా లభించునది, తన్వి = స్త్రీ, ఎట్టులు = ఏ ప్రకారముగా, భావించు = అనుకొను, మది = మనస్సు)

బడాయిలు చెబుతూ ఉత్తరుడు సారథిని కోరగా, తేలిగ్గా అమ్మాయికి ఎట్లా వద్దని చెబుతాడు బృహన్నల అని మనస్సులో అనుకొని, ఉత్తర అడగడానికి వెళ్ళింది.

215. బీర, బెండ, కాకర, దొండ - పదాలను పరార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

215.234 ఉ. పాండవ యగ్ర పూజ శిశుపాలుడు యడ్డుచు, బీరమాడుచున్
కొండెము లెన్నొఁ జెప్పిఁ బలు గోసుల, బెండగు యాగ మాప రా
రండనిఁ బిల్వ కాకఅపులన్ ధరణీశులఁ, గాంచి, శిక్ష లే
దొం డటువంటి వాని కనిఁ, ద్రుంచెను కృష్ణుడు మస్తకం బటన్.

(అగ్ర = మొదటి, అడ్డు = అడ్డగించు, బీరమాడు = శౌర్యోక్తులు పలుకు, కొండెము = చాడీ, పలు = అనేక, గోసు = దూషణము, బెండగు = బలహీనమగు, యాగము = రాజసూయ యజ్ఞము, ఆపు = నిలుపుదల, పిల్చు =

ఆహ్వానించు, కాకఅపులు = వ్యర్థ ప్రలాపములు, ధరణీశుడు = రాజు, కాంచు = చూచు, శిక్ష = దండనము, ఒండు = అన్యము, త్రుంచు = తెగగొట్టు, మస్తకము = శిరస్సు, అట = అక్కడ)

పాండవులు చేసే అగ్రపూజను శిశుపాలుడు అడ్డగిస్తూ, శౌర్యోక్తులు పలుకుతూ అనేకమైన తిట్లతో చాడీలు ఎన్నో చెప్పి, బలహీనమైన రాజసూయ యాగాన్ని ఆపడానికి వ్యర్థ ప్రలాపములతో రాజులను ఆహ్వానించగా చూచి అటువంటి వాడికి వేరే శిక్ష లేదని కృష్ణుడు అక్కడ వాని శిరస్సు ఖండించాడు.

216. భార, కార, ధీర, మార పదాలతో - ధర్మరాజు మనోవిచారము

216.235 ఉ. భారత యుద్ధమందు తన బంధువు లీల్గగ, ధర్మరాజనెన్,
కారణ మయ్యె దాచి మది కర్ణుడు పుత్రుడ టన్న సత్యమున్
పోరు సమాప్తమౌ వరకు పొక్కడ కోర్చి యధీర కుంతియే,
మారణహోమ మౌనుఁ గద మానిను లందు రహస్య ముండినన్.

(ఈల్గు = చచ్చు, పోరు = యుద్ధము, పొక్కడ = బాధ, అధీర = పిరికితనముగల స్త్రీ, మారణహోమము = మారణకాండ, మానిని = మానవతి)

ధర్మరాజు ఏమన్నాడంటే, కర్ణుడు తన కుమారుడన్న నిజాన్ని యుద్ధం సమాప్తము అయ్యే వరకు మనస్సులోనే దాచి ఆ బాధను ఓర్చుకొని పిరికిదైన మా తల్లి కుంతియే భారత యుద్ధంలో తన బంధువులందరూ మరణించడానికి కారణమయ్యింది, ఆడవాళ్ళలో రహస్యం ఉంటే మారణకాండ అవుతుంది కదా, అని.

217. భారము, తోరము, నీరము, ఘోరము - పాదాదిన వచ్చునట్లుగా భారతార్థముతో దత్తపది

217.236 ఉ. భారము కృష్ణుపై నునిచి, భానుడుఁ గ్రుంకక ముందెఁ ద్రుంచగన్
తోరముఁ గట్టి, యాలమున దుర్మతు లందరి మొండి ధైర్యమున్
నీరము పాలుఁ జేసి, కడు నేర్పుగ సైంధవుఁ జంపె పార్థుడే,
ఘోరముగా తనూజు ననిఁ గూల్చగ బాధ్యు డటంచు నెంచుచున్.

(ఉనుచు = ఉంచు, భానుడు = సూర్యుడు, క్రుంకు = అస్తమించు, త్రుంచు = చంపు, తోరము = కంకణము, ఆలము = యుద్ధము, దుర్మతి = దుర్బుద్ధికలవాడు, నీరము = నీరు, పాలు చేయు = అధీనము చేయు, కడు =

మిక్కిలి, నేర్పు = కౌశలము, ఘోరము = భయంకరము, తనూజుడు = కుమారుడు, అని = యుద్ధము, కూల్చు = చంపు, బాధ్యుడు = బాధ్యుడు, ఎంచు = తలచు)

భారము అంతా కృష్ణుడి మీద వేసి సూర్యుడు అస్తమించక ముందే చంపడానికి కంకణము కట్టి, యుద్ధంలో దుర్బుద్ధి కలవారి ధైర్యాన్ని నీళ్ళ పాలు చేసి, భయంకరంగా కుమారుడైన అభిమన్యుణ్ణి యుద్ధంలో చంపడానికి బాధ్యుడు అతడే అనుకుంటూ, అర్జునుడే మిక్కిలి కౌశలంతో సైంధవుణ్ణి చంపాడు.

218. మగ, పగ, వగ, పొగ - పదాలతో భారతార్థంలో

218.237 తే.గీ. వగదెగు సమస్య యనుచు ద్రోవది తలచుచు,
పొగడి భీముని కీచకు పొగరుమార్చ,
మగనిని యలంకరించెను మగువ వోలె,
తీర్చగ పగ నర్తనశాల తెర మరుగున.

(వగదెగు = పరిష్కృతమగు, ద్రోవది = ద్రౌపది, తలచు = భావించు, పొగడు = స్తుతించు, పొగరుమార్చు = చంపు, మగడు = భర్త, మగువ = స్త్రీ, వోలె = వలె, తెర = పరదా, మరుగున = చాటున)

సమస్య పరిష్కారం అవుతుంది అని ద్రౌపది అనుకుంటూ కీచకుణ్ణి చంపడానికి భీముణ్ణి స్తుతించి నర్తనశాల పరదా మాటున పగ తీర్చడానికి భర్తయైన భీముణ్ణి స్త్రీలాగా అలంకరించింది.

219. "మతము" అన్న పదాన్ని నాలుగు సార్లు వాడుతూ రాజ్యంగ గరిమను గురించి

219.238 తే.గీ. సర్వమతముల సామరస్యమును పెంచి
ప్రథమ హక్కు కవమతము ప్రబల నీక
పలువుర యభిమతము మేర ప్రభుత నడప
లిఖిత సంవిధాన మిడె వరిష్ఠ మతము.

(సామరస్యము = సమభావము, అవమతము = అనాదరము, ప్రబలు = వృద్ధిపొందు, ఈక = ఇవ్వక, పలువురు = పెక్కుమంది, అభిమతము = సమ్మతి, మేర = ప్రకారము, ప్రభుత = పరిపాలనా వ్యవస్థ, నడుపు = ప్రవర్తింప జేయు, లిఖిత సంవిధానము = రాజ్యాంగ వ్యవస్థ నిబంధన పూర్తిగ లిఖిత పూర్వము చేయుట, ఇడు = ఇచ్చు, వరిష్ఠ = శ్రేష్ఠమైన, మతము = విధానము)

అన్ని మతాల సమభావాన్ని (equality) పెంచి, ప్రాథమిక హక్కుకి (Fundamental right) అనాదరము పెరగనివ్వకుండా, పెక్కుమంది సమ్మతము ప్రకారము (majority view) పరిపాలనా వ్యవస్థ (government) నడపడానికి లిఖిత రాజ్యాంగము (written Constitution) శ్రేష్ఠమైన విధానము ఇచ్చింది.

220. మద, పద, ముద, నద - పదాలతో గజేంద్రమోక్షం

220.239 కం. మదగజమున కొచ్చెను యా
పద మకరము తననుఁ బట్ట, వారిశు వేడన్
ముదముఁ గలిగెను, యతడుఁ బూ
న దళనము జరుగగ హ్రదమున మొసలికి తృటిన్.

(మదగజము = మదించిన ఏనుగు, మకరము = మొసలి, వారిశుడు = విష్ణువు, వేడు = ప్రార్థించు, ముదము = సంతోషము, పూను = ఉద్యమించు, దళనము = ఖండించుట, హ్రదము = లోతైన మడుగు, తృటి = క్షణకాలం)

మొసలి తనని పట్టుకోవడం వల్ల మదించిన ఏనుగుకి ఆపద వచ్చింది. విష్ణువును ప్రార్థించగా, అతడు పూనుకొనగా క్షణకాలంలో మడుగులో మొసలికి ఖండన జరుగగా, సంతోషం కలిగింది.

221. మనము, ధనము, వనము, క్షణము - పదాలతో రామాయణార్థంలో

221.240 చం. గమనము మేఘమార్గమున, గమ్యమెటో తెలియంగ రాదు, చౌ
ర్యమునఁ దనన్ గ్రహించె, నని రావణు దూరుచు, స్త్రీధనమ్ము చి
ప్పమున బిగించిఁ బాయుట, ప్లవంగము లారయ, భావనమ్మునన్
శమనము దక్కె తత్క్షణము, జానకికిన్, బ్రతుకన్న యాశతో.

(గమనము = ప్రయాణము, మేఘమార్గము = ఆకాశము, చౌర్యము = దొంగతనము, గ్రహించు = పట్టుకొను, దూరు = నిందించు, స్త్రీధనము = పెండ్లి మున్నగు సమయములలో స్త్రీకిచ్చిన ధనము, చిప్పము = మూట, బిగించు = క్రుక్కు, పాయు = విడుచు, ప్లవంగము = వానరము, ఆరయు = చూచు, భావనము = ఊహ, శమనము = శాంతి, దక్కు = లభించు, తత్క్షణము = వెంటనే, జానకి = సీత)

ప్రయాణం ఆకాశంలో, గమ్యం ఎటో తెలియడానికి వీలు కాదు, దొంగతనంగా తనని తీసుకొని వెళ్తున్నాడని రావణుణ్ణి తిడుతూ, తన వద్ద ఉన్న స్త్రీధనము మూటగా కట్టి విడవడం వానరులు తెలిసికొనగా, ఆ క్షణంలో సీతకు బ్రతుకు మీద ఆశతో ఊహల్లో శాంతి లభించింది.

222. మనము, వినము, కనము, తినము - పదాలతో అయోధ్యనగర శోభ

222.241 తే.గీ. ఖచరు వంశజు రాము యాగమనముఁ గన,
సౌరశక్తిఁ గాకఁ కనము వేరు శక్తి,
వినము రామనామముఁ గాక వేరు పేరు,
కంగుతినము యది యయోధ్య ఘనతఁ గాన.

(ఖచరుడు = సూర్యుడు, వంశజు = వంశము నందు పుట్టిన వాడు, ఆగమనము = రాక, కను = చూచు, సౌర = సూర్యసంబంధమైన, వేరు = ఇతరము, కంగుతిను = నివ్వెఱపోవు, ఘనత = గొప్పదనము, కాన = కనుక)

సూర్యవంశము నందు పుట్టిన రాముని రాక చూడడానికి సౌరశక్తియే (solar energy) గానీ వేరే శక్తి కనిపించదు, రామ నామమే కానీ ఇతరమైన పేరు వినము. అది అయోధ్య గొప్పదనం కాబట్టి ఆశ్చర్యపడము.

223. మబ్బు, వాన, జల్లు, వరద - పదాలను ఉపయోగించి భారతార్థంలో

223.242 మ. బల మబ్బున్ రణ మందు నాకని, శివున్ బార్థుండు ధ్యానించుచున్
చలికొండన్, పసిగట్టి వేగముగ ముస్తాదంపు ధ్వానంబు, కో
లల ద్రుందించి, కిరాతు రూపమునఁ గొల్వన్ గట్టురాజల్లు, త
త్కలనన్ బాశుపతంబు దక్క, వరదత్తాప్యాయితుండయ్యెగా.

(బలము = శక్తి, అబ్బు = ప్రాప్తించు, రణము = యుద్ధము, పార్థుడు = అర్జునుడు, ధ్యానించు = ధ్యానము చేయు, చలికొండ = హిమాలయము, పసిగట్టు = సూచనగా తెలిసికొను, ముస్తాదము = పంది, ధ్వానము = చప్పుడు, కోల = బాణము, ద్రుందించు = చంపు, కిరాతుడు = బోయవాడు, కొల్చు = ఆరాధించు, గట్టురాజల్లుడు = శివుడు, తత్ = ఆ, కలన = జ్ఞానము, దక్కు = లభించు, వరదత్తము = వరదానము, ఆప్యాయితుడు = తృప్తిపొందినవాడు)

యుద్ధంలో నాకు శక్తి ప్రాపిస్తుందని అర్జునుడు హిమాలయాల్లో శివుణ్ణి ప్రార్థిస్తూ, వేగంగా పంది చేసే చప్పుడును పసిగట్టి దాన్ని బాణాలతో చంపి, బోయవాని రూపంలో ఉన్న శివుణ్ణి ఆరాధించగా ఆ జ్ఞానం వలన పాశుపతాస్త్రము లభించగా ఆ వరదానము చేత తృప్తిపొందిన వాడయ్యాడుగా.

223.243   తే.గీ. జల్లు మనె ధృతరాష్ట్రుని యుల్లము, విన
న్యాయ మధ్వాన్న మగుటకు సాయపడిన
పాపమబ్బు ననుచు శౌరిఁ బలుక, యట్టి
ద్రాబలకు శిక్ష దేవరదత్త మయ్యె..

(జల్లుమను = భయపడు, ఉల్లము = మనస్సు, అధ్వాన్న మగు = చెడిపోవు, అబ్బు = ప్రాప్తించు, శౌరి = కృష్ణుడు, ద్రాబ = అధముడు, శిక్ష = దండనము, దేవర = దేవుడు, దత్తము = ఇయ్యబడినది)

న్యాయం చెడిపోవడానికి సాయం చేస్తే పాపం చుట్టుకుంటుందనీ కృష్ణుడు చెప్పడం విన్న ధృతరాష్ట్రుని మనస్సు జల్లుమంది. అలాంటి నీచులకి దండనము భగవంతుడిచే ఇవ్వబడింది.

224.   మబ్బు, వాన, ముసురు, వరద - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఖాండవ దహన వృత్తాంతాన్ని

224.244   తే.గీ. పార్థు సామర్థ్య మబ్బురపాటుఁ గొలుప,
క్రమ్మ దావానలము వని ఖాండవమున,
సురవర! దహన మాపగ కురియు వృష్టి
దృశ్యము, సురుచిరమ్మనె దేవ గణము.

(పార్థుడు = అర్జునుడు, సామర్థ్యము = నేర్పు, అబ్బురపాటు = ఆశ్చర్యము, కొలుపు = పుట్టించు, క్రమ్ము = వ్యాపించు, దావానలము = అడవిచిచ్చు, వని = అడవి, ఖాండవము = ఇంద్రుని యొక్క ఒకానొక వనము, సురవరుడు = దేవతలలో శ్రేష్ఠుడైన ఇంద్రుడు, దహనము = కాల్చుట, ఆపు = నిరోధించు, వృష్టి = వర్షము, దృశ్యము = చూడదగినది, సురుచిరము = మిక్కిలి రమణీయమైనది, గణము = సమూహము)

ఓ, ఇంద్రా! అర్జునుని నేర్పు ఆశ్చర్యం గొలుపగా ఖాండవ వనంలో అడవిచిచ్చు వ్యాపించగా కాలుట నిరోధించడం కోసం కురిసే వాన దృశ్యము మిక్కిలి రమణీయమైనదని దేవతాసమూహం అంది.

225. మమత, సమత, నవత, ఘనత - పదాలతో దేశాభివృద్ధిలో మహిళ పాత్ర

225.245 కం. మమతకు నెలవై వనితలు
సమతకు ప్రతిరూపమైన శక్తిగ వెలయన్,
క్షమతయె ఘనతగ పుడమిని
ప్రమత నిలిచె మానవత్వ రక్షణ కొరకై.

(మమత = ప్రేమ, నెలవు = ఉనికిపట్టు, వనిత = స్త్రీ, సమత = సమత్వము, ప్రతిరూపము = మూర్తి, శక్తి = సామర్థ్యము, వెలయు = ప్రవర్తిల్లు, క్షమత = యోగ్యత, ఘనత = గొప్పదనము, పుడమి = భూమి, ప్రమత = ఆలోచనము, నిలుచు = ప్రతిష్ఠితమగు)

మమతకి ఉనికిపట్టై స్త్రీలు సమత్వానికి ప్రతిరూపమైన శక్తిగా ప్రవర్తిల్లగా, దేశంలో యోగ్యతయే గొప్పదనంగా మానవత్వాన్ని కాపాడటం కోసం ఆలోచన నిలిచింది.

226. మాత, పిత, తాత, దుహిత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ నీతిని బోధిస్తూ

226.246 తే.గీ. వలదు హితమనిఁ జెప్పి యావలకు నెట్టు
మనుజుఁ గని, యకృతాత్మ! నా మనవి వినుము
యనుచు, జ్ఞానంబుఁ గఱపి తగిన మెలకువ
నేర్పఁ బోకు, మాతని కది నిష్ఫలంబు.

(హితము = మంచి, ఆవల = అవతల, నెట్టు = త్రోయు, మనుజుడు = మనుష్యుడు, కను = చూచు, అకృతాత్ముడు = మూర్ఖుడు, మనవి = విన్నపము, జ్ఞానము = తెలివి, కఱపు = బోధించు, తగిన = యుక్తమైన, మెలకువ = జాగ్రత్త, పోవు = యత్నించు, నిష్ఫలము = వ్యర్థము)

ఏనుగు లక్ష్మణ కవి అనువదించిన భర్తృహరి సుభాషితం లోని ప్రసిద్ధ పద్య పాదం "చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్నది. అదే అర్థం వచ్చేటట్లుగా వ్రాయబడిన పద్యం ఇది. మంచి వద్దు అని అవతలకి నెట్టే మనిషిని చూసి, మూర్ఖుడా! నా విన్నపం విను అంటూ జ్ఞానము బోధించి సరియైన జాగ్రత్త నేర్పబోకుము, అతనికి అది వ్యర్థము.

227. మాద్రి, క్లైక, రాధ, రుద్రమ - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ దుర్గాదేవిని స్తుతిస్తూ

227.247 తే.గీ. ఇంద్రకీల ధరాధర మిరవుఁ గాగ,
జనుల కేకైక యారాధ్య! జనని! విజయ
వాడ నీది, హిమాద్రిజా! ప్రల్లదులకు
రుద్ర మగు నీదు రూపు కరుణకు నెలవు.

(ఇంద్రకీలము = విజయవాడ వద్ద కృష్ణాతీరమున నున్న అర్జునుడు తపస్సు చేసిన పర్వతము, ధరాధరము = పర్వతము, ఇరవు = స్థానము, ఏకైక = ఒకే ఒక, ఆరాధ్య = ఆరాధింపతగినది, జనని = తల్లి, విజయ = దుర్గ, వాడ = పేట, హిమాద్రిజ = హిమవత్పర్వత పుత్రియైన దుర్గ, ప్రల్లదుడు = దుష్టుడు, రుద్రము = భయంకరమైనది, రూపు = ఆకృతి, కరుణ = దయ, నెలవు = ఉనికిపట్టు)

ప్రజలకు ఏకైక ఆరాధ్యయైన దానా! తల్లీ! ఇంద్రకీల పర్వతం నివాసము కాగా, విజయవాడ నీది, హిమవత్పర్వత పుత్రియైన దుర్గా! దుష్టులకు భయంకరమైన నీ ఆకృతి దయకు ఉనికిపట్టు.

228. మామ, అత్త, బావ, వదిన - పదాలను స్వార్థంలో ఉపయోగించకుండా భారతార్థంలో

228.248 తే.గీ. మా మగలకు నీ పిత విద్య మంతిరించె,
యత్తమిల్లఁ జేయగ మాదు యనుగు సుతుల
నీకు సబబా? వచింపుము మాకు, యేమి
తర్క మని, ద్రోవది నవిసి ద్రౌణి నడిగె.

(మగడు = పురుషుడు, పిత = తండ్రి, మంతిరించు = బోధించు, అత్తమిల్లు = స్రుక్కు, మాదు = మా యొక్క, అనుగు = ప్రియమైన, సుతుడు = కుమారుడు, సబబు = యుక్తము, వచించు = చెప్పు, తర్కము = కారణము, ద్రోవది = ద్రౌపది, నవియు = శుష్కించు, ద్రౌణి = ద్రోణుని కుమారుడైన అశ్వత్థామ)

మా మగవారికి నీ తండ్రియైన ద్రోణుడు విద్య బోధించాడు, మా ప్రియమైన పుత్రులను స్రుక్కజేయడం నీకు ఉచితమా? మాకు చెప్పుము, ఏమి కారణము అని ద్రౌపది అశ్వత్థామని అడిగింది.

229. మాయాతి, నాయాతి, నయాతి, యాతి - అను పదములు నాల్గు చరణములలో నిమిడ్చి కృష్ణ పరముగా

229.249 తే.గీ. ఏమి? మాయా? తికమకా? కలిట్లుఁ గలద?
క్లేశమ? యశనాయా? తిలకింతు నన య
శోద, వినయాతిశయమున సుంత నోరు
తెరుచు కృష్ణునిలో ద్వయాతిగు డగుపడె.

(మాయ = ఇంద్రజాలాది విద్య, తికమక = తొట్రుపాటు, క్లేశము = దుఃఖము, అశనాయ = ఆకలి, తిలకించు = చూచు, వినయము = వినమ్రత, అతిశయము = ఆధిక్యము, సుంత = కొంచెము, ద్వయాతిగుడు = రజస్తమోగుణ రహితుడు, అగుపడు = కనబడు)

ఏమిటిది? మాయా? తొట్రుపాటా? కల ఈ విధంగా ఉందా? దుఃఖమా? ఆకలా? చూస్తాను అని యశోద అనగా వినయాధిక్యంతో నోరు తెరుచు కృష్ణునిలో రజస్తమోగుణ రహితుడు, అంటే, సాత్త్వికుడు కనబడ్డాడు.

230. మూడు, ఆరు, ఏడు, పది - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

230.250 తే.గీ. కొంపలారును జూదము కొనలుసాగ
చేటుమూడును ధృతరాష్ట్ర! జీవనులకు
ఏడుగడల కాయువుచెల్లు భండనమున
పదిల మనె విదురుండు దేవనము నాప.

(కొంప = ఇల్లు, ఆరు = నశించు, కొనలుసాగు = కొనసాగు, చేటుమూడు = ఆపద సంభవించు, జీవనుడు = కొడుకు, ఏడుగడ = రక్షకుడు, ఆయువుచెల్లు = మరణించు, భండనము = యుద్ధము, పదిలము = జాగరూకత, దేవనము = జూదము, ఆపు = ఆఁగునట్లు చేయు)

ఓ, ధృతరాష్ట్రా! జూదము కొనసాగితే గృహాలు నాశనం అవుతాయి, నీ పుత్రులకు ఆపద కలుగుతుంది, రక్షకులు యుద్ధంలో మరణిస్తారు, జాగ్రత్త! అని విదురుడు జూదము ఆపాలనే ఉద్దేశ్యంతో చెప్పాడు.

231. మూడు, ఆరు, ఏడు, పది - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

231.251 తే.గీ. చేటుమూడును రావణా! సీత వలన,

యేడుగడ యగు రాముడు యీడ కొచ్చు
ననుపదికుడు లక్ష్మణుఁ గూడి యనికి ననుచు,
యార్చుచు విభీషణుండనె యన్న తోడ.

(చేటుమూడు = ఆపద సంభవించు, ఏడుగడ = రక్షకుడు, ఈడ = ఈచోటు, అనుపదికుడు = అనుసరించువాడు, కూడు = చేరు, అని = యుద్ధము, ఆర్చు = అరచు)

రావణా! సీత వల్ల ఆపద సంభవిస్తుంది. రక్షకుడైన రాముడు ఇక్కడికి అనుచరుడైన లక్ష్మణుడితో కలిసి యుద్ధానికి వస్తాడు అంటూ అరుస్తూ విభీషణుడు అన్నతో చెప్పాడు.

232. మూర, బార, చేర, మేర - పదాలతో రామాయణార్థంలో

232.252 తే.గీ. మేఱమీఱగ సీతను చూఱపెట్టి,
చేరదీసి వానరసేన చెలిమి తోడ,
రావణుని సేనఁ బార పోరాడి గెలుచు
మూరత మొనరె, రాముడు చేర లంక.

(మేఱమీఱు = నియమ మతిక్రమించు, చూఱపెట్టు = దొంగిలించు, చేరదీయు = దగ్గరకు చేర్చి, వానరసేన = కపిసైన్యము, చెలిమి = స్నేహము, పారు = పారిపోవు, మూరతము = ముహూర్తము, ఒనరు = అనుకూలించు)

సీతను దొంగిలించి నియమ మతిక్రమించగా, కపి సైన్యాన్ని స్నేహంతో చేరదీసి, రావణుడి సైన్యం పారిపోయే విధంగా యుద్ధం చేసి గెలిచే ముహూర్తం శ్రీరాముడు లంకను చేరగానే అనుకూలించింది.

233. మేరీ, ఏసు, సిలువ, చర్చి పదాలను వేరే అర్థంలో వాడుతూ భారతార్థంలో

233.253 తే.గీ. విడువగ మమత్వ మే రీతి వీలు యగును,
మాకు నది పాడియే, సుగమముగఁ జెప్పు
మన్న, భాసిలు వరు పార్థు కపుడు, కృష్ణ
మూర్తి ధర్మ చర్చితమున, నార్తిఁ బాపె.

(మమత్వము = నాది నావాళ్ళు అన్న భావన, పాడి = ధర్మము, భాసిలు = ప్రకాశించు, వరుడు = శ్రేష్ఠుడు, సుగమము = సులభము, పార్థుని = అర్జునుని, చర్చితము = చర్చ, ఆర్తి = బాధ, పాపె = తొలగించె)

ఈ పద్యంలో, భగవద్గీతా బోధనను సందర్భంగా తీసుకున్నాను. సుమారుగా 700 శ్లోకాలు ఉన్న భగవద్గీతలో, మొదటి శ్లోకంలో మొదటి పదం 'ధర్మ'. ఆఖరి శ్లోకంలో ఆఖరి పదం 'మమ'. మమత్వం ఎలా వదిలి పెట్టాలో, స్వధర్మాన్ని ఎలా చేపట్టాలో కృష్ణ భగవానుడు అర్జునునికి బోధించాడు. పద్యంలో ఇదే భావం చెప్పబడింది.

తేజస్వంతుడు, శ్రేష్ఠుడు అయిన అర్జునుడు, మమత్వమన్నది మాకు ధర్మమా, కాకపోతే దాన్ని ఏ విధంగా వదిలి పెట్టడానికి వీలవుతుంది, సులభంగా చెప్పు అని అడగ్గా కృష్ణ భగవానుడు అతనితో ధర్మ చర్చ చేసి బాధను తొలగించాడు.

233.254 కం. చందన చర్చిత! కృష్ణా!
యిందఘమే రీఢ మగును, యిట కౌరవులే
దందడిఁ దారసిలు వడిస్
మ్రందగ, శాంతి కదియే సులభమనె నరుడే.

(చందన చర్చిత = శ్రీ గంధం పూయబడిన వాడా, అఘము = పాపము, రీఢమగు = తిరస్కరించబడు, దందడి = యుద్ధము, తారసిలు = ఎదురుపడు, వడి = త్వర, మ్రందు = చచ్చు, సులభము = తేలిక, నరుడు = అర్జునుడు)

ఓ చందన చర్చితుడవైన కృష్ణా! ఇక్కడ పాపమే తిరస్కరించబడుతుంది. ఇట, కౌరవులే తొందరగా మరణించడానికి యుద్ధములో ఎదురుపడతారు. శాంతికి అదియే తేలికని అర్జునుడే అన్నాడు.

233.255 కం. ఏ సుదతి నూర్గురు సుతుల
నాశముఁ గని, గాసిలు వదనము తోడ, యశో
దా సుతు, విను! మే రీతి గ
తాసు వవుదనె, యది చర్చితంబగు గాథే.

(గాసిలు = బాధపడు, గతాసువు = పీనుగు (చనిపోయినవాడు), చర్చితంబగు = పరీక్షించవలసిన)

వినుము, ఏ స్త్రీ (గాంధారి) తన నూరుగురు పుత్రుల నాశనం చూసి, విచార వదనంతో, యశోదా తనయుడైన కృష్ణుని గతాసువు అవుతావు అని అందో ఆ కథ లోతుగా పరీక్షించ వలసినదే.

234. యేసు, చర్చి, సిలువ, మేరీ - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ మతసామరస్యం గురించి

234.256 తే.గీ. భేద భావము చర్చించి బూదిఁ జేసి,
తారసిలు వంచకుల ప్రల్లదనము నణచి,
సంఘసేవయే సుమతు లాచరణఁ జేయ,
సామరస్యమే రీతిగ జగతి సాగు.

(బూది = బూడిద, తారసిలు = ఎదురుపడు, వంచకుడు = మోసగాడు, ప్రల్లదనము = గర్వము, అణచు = నశింపచేయు, సుమతి = మంచిబుద్ధి కలవాడు, ఆచరణ = ఆచరించుట, సామరస్యము = సమభావము, రీతి = విధానము, జగతి = లోకము, సాగు = నడచు)

తేడాలను చర్చలతో బూడిద చేసి, ఎదురుపడే మోసగాళ్ళ గర్వము అణచి, సంఘ సేవనే గుణవంతులు ఆచరిస్తే, సమభావమే విధానంగా ప్రపంచం నడుస్తుంది.

235. మేరీ, యేసు, సిలువ, చర్చి - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ

235.257 తే.గీ. త్యాగ మేరీతి యమృతత్వ దాత యగునొ,
యట్టి తత్త్వంబు చర్చించి యర్జునునకు,
యాత్మ విద్యయే సురుచిర మంచిత మను,
భాసిలు వనమాలి హితోక్తి, భక్తి పథము.

(త్యాగము = త్యజనము, రీతి = విధము, అమృతత్వము = చావులేమి, దాత = ఇచ్చునది, తత్త్వము = స్వభావము, చర్చించు = విమర్శించు, ఆత్మ విద్య = ఆత్మ గురించిన జ్ఞానము, సురుచిరము = మిక్కిలి రమణీయమైనది, అంచితము = సమ్మానితము, భాసిలు = ప్రకాశించు, వనమాలి = శ్రీకృష్ణుడు, హితోక్తి = ఉపదేశము, పథము = మార్గము)

త్యాగం ఏ విధంగా చావులేమి ఇచ్చే దాత అవుతుందో, అంటే మరణించిన తరువాత కూడా బ్రతికి ఉండటం, అటువంటి తత్వాన్ని చర్చించి, అర్జునుడికి ఆత్మ గురించిన జ్ఞానమే మిక్కిలి రమణీయమైనది సమ్మానితము అనే భాసమానమైన శ్రీకృష్ణుని ఉపదేశము భక్తి మార్గము.

236. మొల్ల, ఎల్ల, కల్ల, చల్ల - పదాలతో రామాయణార్థంలో

236.258 ఉ. మొల్లల తావి సీత కడ ముట్టగ రాముడు దండ కాటవిన్
యెల్లలు లేని ప్రేమ నిడ, యీర్ష్యనుఁ జూచిన చుప్పనాక, తా
కల్లలుఁ జెప్పి జానకిని కంఠము నొక్కుచు చంపు పూనికన్,
చల్లగ నడ్డె లక్ష్మణుడు, సంశ్రవణమ్ములు ముక్కుఁ గోయుచున్.

(మొల్ల = బొడ్డుమల్లె, తావి = పరిమళము, కడ = వద్ద, ముట్టు = దక్కు, అటవి = అరణ్యము, ఎల్ల = హద్దు, ఇడు = ఇచ్చు, ఈర్ష్య = ఓర్వలేనితనము, చుప్పనాక = శూర్పణఖ, తా = తాను, కల్ల = అబద్ధము, జానకి = సీత, పూనిక = ప్రయత్నము, చల్లగ = నెమ్మదిగా, అడ్డు = అడ్డగించు, సంశ్రవణము = చెవి)

సీత వద్ద బొడ్డుమల్లెల పరిమళం లభించగా, దండకారణ్యంలో హద్దులు లేని ప్రేమను రాముడు ఇవ్వడం, ఓర్వలేనితనంతో చూసిన శూర్పణఖ, తాను అబద్ధాలు చెప్పి సీతను గొంతు నొక్కి చంపే ప్రయత్నాన్ని, నెమ్మదిగా లక్ష్మణుడు ముక్కు చెవులు కోస్తూ అడ్డగించాడు.

237. మోది, రాహుల్, జగన్, చంద్ర - పదాలతో ప్రత్యేక హోదాపై

237.259 కం. జగను కదే జంజాటము,
దిగతుడు పది చంద్రబాబు ధిషణ కటంచున్,
తగవాడిరా? హులువు లటు
యొగి మోది యెదుట, విశిష్ట హోదా కొరకై.

(జంజాటము = తగులాటము, దిగతుడుపు = సరితూగనిది, ధిషణ = బుద్ధి, తగవాడు = దెబ్బలాడు, హులువు = పొట్టేలు, అటు = ఆలాగున, ఒగి = లెస్సగా, విశిష్ట = సామాన్యుల నుండి వేరైనది, హోదా = స్థాయి)

జగనుకి అదే తగులాటము, చంద్రబాబు ప్రజ్ఞకి అది సరితూగనిది అంటూ ప్రత్యేక హోదా కోసం పొట్టేళ్ళలాగా లెస్సగా మోది ఎదురుగా దెబ్బలాడుకున్నారా?

238. యతి చెడె, గతి చెడె, మతి చెడె, స్మృతి చెడె - చంపకమాల

238.260 చం. యతి చెడె మూషికంబు కుటి యందున గోచిని ముట్టినప్పుడే,

గతి చెడె కాపలా నిడను కచ్చకు పిల్లిని పెంచినప్పుడే,
మతి చెడె పిల్లి పాల కొక మాహయు, కాయగ యబ్బి రాకతో,
స్మృతి చెడె వీటి సాక సతి మేలని తాను వివాహమాడగన్.

(యతి = సన్న్యాసి, చెడు = చెడిపోవు, మూషికము = ఎలుక, కుటి = గుడిసె, ముట్టు = కొరుకు, గతి = త్రోవ, ఇడు = ఇచ్చు, కచ్చ = గోచీ = లంగోటి, మతి = బుద్ధి, మాహ = ఆవు, అబ్బి = కుర్రవాడు, స్మృతి = స్మరణము, సాకు = పోషించు, సతి = స్త్రీ)

"కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః" అని ఒక సాధువు కథ చెబుతూ ఉంటారు. దాని ఆధారంగా వ్రాసిన పద్యం ఇది. ఎలుక తన గుడిసెలో కౌపీనము, అంటే లంగోటి, కొరికినప్పుడే సన్న్యాసి చెడిపోయాడు. ఎలా అంటే, ఆ గోచీకి రక్షణ ఇవ్వడానికి పిల్లిని పెంచినప్పుడే దోవ తప్పాడు కాబట్టి, ఆ పిల్లి పాల కోసం ఒక ఆవు, దాని కాయడానికి ఒక కుర్రవాడు రావడంతో మతి చెడింది కాబట్టి, వీటన్నిటినీ సాకడానికి ఒక స్త్రీ ఉంటే మేలని తాను పెళ్ళి చేసుకోవడంతో దైవ స్మరణము చెడిపోయింది కాబట్టి.

239. రండ, ముండ, దండ, బండ - పాదాదిన వచ్చునట్లుగా వరకట్న సమస్యను గూర్చి దత్తపది

239.261 ఉ. రండని పిల్చి పిల్ల నిడ, రచ్చకుదీసి సుఖాన కాపుర
మ్ముండగ కట్నకానుకలు మోపుగఁ గావలె నంచు, తిట్లతో
దండక మప్పగించు ధనదాహము నోర్వక, నత్తమామలే
బండగు డైన యల్లునికి పాత్రత నేర్పిరి న్యాయపద్ధతిన్.

(ఇడు = ఇచ్చు, రచ్చకుదీయు = వాదునకీడ్చు, మోపు = అధికము, అప్పగించు = ఒప్పచెప్పు, ఓర్చు = సహించు, బండగుడు = దుష్టుడు, పాత్రత = యోగ్యత)

రమ్మని పిలిచి పిల్ల నివ్వగా, వాదులాట లోకి ఈడ్చి సుఖంగా కాపురం ఉండడానికి భారీగా కట్నకానుకలు కావాలని తిట్లతో దండకము ఒప్పగించే ధనదాహాన్ని సహించక అత్తామామలే దుష్టుడైన అల్లుడికి న్యాయమార్గంలో యోగ్యత నేర్పారు.

240. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ - పదాలను ప్రయోగిస్తూ ఉత్పలమాలలో దేవీమాహాత్మ్యాన్ని, బ్రహ్మచర్యం గూర్చి వర్ణించడం

240.262 ఉ. అంభము జీవకోటి కిడు యా గతిలోత్తమ గంగ వీవె, యా
రంభము సృష్టి కీవె, శిథిలమ్మొనరించున దీవె, మాతృకా!
దంభముఁ గాదు యూర్వశిని తక్కువఁ జేసెడి యంద మీవె, వి
స్రంభము మాట నారయక సాకెడి దీవెగ మేనకాత్మజా!

(అంభము = నీరు, జీవకోటి = జీవరాసులు, ఇడు = ఇచ్చు, గతిల = నది, ఉత్తమ = శ్రేష్ఠమైనది, ఈవు = నీవు, ఆరంభము = మొదలు, సృష్టి = ప్రపంచమును కల్పించుట, శిథిలము = నాశనము, ఒనరించు = చేయు, మాతృక = తల్లి, దంభము = డాంబికము, తక్కువచేయు = కించపఱచు, విస్రంభము = నమ్మకము, ఆరయు = విచారించు, సాకు = కాపాడు, మేనకాత్మజ = పార్వతి)

జీవరాసులకి నీళ్ళు ఇచ్చే ఆ నదీమతల్లి గంగవి నీవే. సృష్టికి ఆరంభము నీవే, నాశనం చేసేదీ నీవే, తల్లీ. ఊర్వశిని కించపఱచే అందం నీవే ననడంలో డాంబికం లేదు. నమ్మకం మాట విచారించకుండా, అంటే, నీ మీద నమ్మకం ఉన్నా లేకపోయినా, కాపాడేదీ నువ్వేగా, పార్వతీ మాతా!

240.263 తే.గీ. బ్రహ్మచర్యమే నకనకబడు నటంచు,
నాట్యముఁ గఱపు యూర్వశిన్ నరుడు జవిరె,
రహిని విద్య యందు నిలుప రంభ్య మగును,
భక్తిలోత్తమ ప్రహ్లాద బాలు వోలె.

(నకనకబడు = నిస్సారమగు, కఱపు = బోధించు, నరుడు = అర్జునుడు, జవురు = తిరస్కరించు, రహి = ఆసక్తి, నిలుపు = ప్రతిష్ఠించు, రంభ్యము = ఉల్లాసకరమైన, భక్తిల = భక్తుడు, ఉత్తమ = శ్రేష్ఠుడు, వోలె = వలె)

తన బ్రహ్మచర్యమే నిస్సారమవుతుందని నాట్యం నేర్పే ఊర్వశిని అర్జునుడు తిరస్కరించాడు. భక్తశ్రేష్ఠుడైన ప్రహ్లాదుని వలె విద్య మీద ఆసక్తి నిలిపితే ఉల్లాసకరమైనదౌతుంది.

241. రక్తి, శక్తి, భక్తి, ముక్తి - పదాలతో దేవీపరంగా, భారతార్థంలో

దేవీపరంగా:

241.264 కం. నీవే రక్తికి యూతము,
నీవే యాధారశక్తి, నీవే గురువౌ,
నీవే భక్తికి సేతువు,
నీవే ముక్తికి గమథము, నిజమిది దేవీ!

(రక్తి = అనురాగము, ఊతము = ఆశ్రయము, ఆధారశక్తి = మూలాధారం వద్ద ఉన్న కుండలినీ శక్తి, గురువు = విద్యాదాత, సేతువు = వంతెన, గమథము = మార్గము, దేవి = దుర్గా మాత)

ఓ దుర్గా మాతా! నీవే అనురాగము అనేదానికి ఆశ్రయమవు, నీవే మూలాధారం వద్ద ఉన్న కుండలినీ శక్తివి, నీవే విద్యాదాతవు, నీవే భక్తి అనే దానికి వంతెనవి, నీవే మోక్షమార్గానివి, ఇది నిజము.

భారతార్థంలో:

241.265 కం. భక్తిని జీవనముగ, భుజ
శక్తిని ధర్మము నెఱపగ సలుపు రణమునన్
రక్తిని విడ యా మనికే
ముక్తి నొసగు నర్జున! యని మురరిపు వనియెన్.

(భక్తి = సేవ, శక్తి = సామర్థ్యము, ధర్మము = విధి, నెఱపు = నెఱవేర్చు, సలుపు = చేయు, రణము = యుద్ధము, రక్తి = అపేక్ష, విడు = త్యజించు, మనికి = జీవనము, ముక్తి = మోక్షము, ఒసగు = ఇచ్చు, మురరిపువు = శ్రీకృష్ణుడు)

అర్జునా! భక్తిని జీవనంగా, భుజశక్తితో ధర్మాన్ని నెరవేర్చడం కోసం చేసే యుద్ధంలో అపేక్షను త్యజించగా, ఆ జీవనమే మోక్షం ఇస్తుంది అని శ్రీకృష్ణుడు అన్నాడు.

242. శరణము, చరణము, కరణము, తరణము - పదాలను పాదాదిని ఉపయోగిస్తూ శ్రీరాముని స్తుతిస్తూ

242.266 చం. శరణము! బ్రోవుమన్న తన శత్రువు నైనను కాచునట్టి సం
స్కరణము యున్నవాడు, కడు సాత్విక చిత్తుడు, భాషితమ్ము యా
చరణము, మానసమ్ములను సౌమ్యుడు, భీతులకున్ ధృతిప్రదా
త, రణము నందు బల్లిదుడు, దాశరథిన్ మది గొల్తు నెప్పుడున్.

(శరణము = ఆశ్రయము, బ్రోచు = రక్షించు, కాచు = రక్షించు, సంస్కరణము = సంస్కారము, కడు = మిక్కిలి, సాత్విక చిత్తుడు = సాత్విక లక్షణాలైన అహింస ఆస్తేయం సత్యం శౌచం బ్రహ్మచర్యం ఇంద్రియ నిగ్రహం అక్రోధం అనసూయ లందు మనస్సు కలవాడు, భాషితము = మాటాడినది, ఆచరణము = ప్రవర్తనము, మానసము = మనస్సు, సౌమ్యుడు = తిన్ననివాడు, భీతుడు = భయము కలవాడు, ధృతి = ధైర్యము, ప్రదాత = గొప్పదాత, రణము = యుద్ధము, బల్లిదుడు = మిక్కిలి బలము గలవాడు, దాశరథి = దశరథుని కుమారుడైన శ్రీరాముడు, మది = మనస్సు, కొల్చు = ఆరాధించు, ఎప్పుడు = ఎల్లప్పుడు)

శరణు, రక్షించమని అడిగిన శత్రువును కూడా రక్షించే సంస్కారం ఉన్న వాడు, సాత్విక లక్షణాలలో ఎక్కువగా మనస్సు కలవాడు, వాక్కు చేతలు మనోభావాలలో తిన్ననైన వాడు, భయపడే వారికి ధైర్య ప్రదాత, యుద్ధంలో మిక్కిలి బలము గలవాడు, అయిన శ్రీరాముణ్ణి ఎల్లప్పుడు మనస్సులో ఆరాధిస్తాను.

243. రయము, భయము, జయము, నయము - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో

243.267 చం. రయమున మానవాస్త్రమును రాఘవు డేయగ తాటకేయుడే
భయమున మున్గె నబ్ధిని, సుబాహుడు నన్య నిశాచరుల్ పరా
జయమును మూటఁ గట్టుకొనె జన్నపుగాపరి యస్త్ర ధాటికిన్,
నయమున కౌశికాధ్వరము నాంది యయెన్ యసురాళి ధ్వస్తికిన్.

(రయము = వేగము, రాఘవుడు = శ్రీరాముడు, ఏయు = ప్రయోగించు, తాటకేయుడు = మారీచుడు, మున్గు = మునుకవేయు, అబ్ధి = సముద్రము, అన్య = ఇతర, నిశాచరుడు = రాక్షసుడు, పరాజయము = ఓటమి, మూటగట్టుకొను = కూడ బెట్టుకొను, జన్నపుగాపరి = యజ్ఞానికి కాపలాగా ఉన్న శ్రీరాముడు, ధాటి = దాడి, నయము = మేలైనది, కౌశికుడు = విశ్వామిత్రుడు, అధ్వరము = యాగము, నాంది = ప్రారంభ సూచకము, అసుర = రాక్షసుడు, ఆళి = సమూహము, ధ్వస్తి = నాశనము)

శ్రీరాముడు వేగంగా మానవాస్త్రాన్ని ప్రయోగించగా మారీచుడే భయంతో సముద్రంలో మునిగాడు. యజ్ఞానికి కాపలాగా ఉన్న శ్రీరాముని అస్త్ర ధాటికి సుబాహుడు, ఇతర రాక్షసులు ఓటమి పాలయ్యారు. ఫలదాయకమైన విశ్వామిత్రుని యాగము రాక్షస సమూహాల నాశనానికి నాంది అయ్యింది.

244. రాకు, పోకు, తేకు, మేకు - పదాలను ఉపయోగించి భారతార్థంలో

244.268 తే.గీ. నీ సుతులఁ గనమే కులపాంసనులుగ,
నీ పరాకుఁ జేసెను యవి నీతిపరుల,
పరువు పోకుండునే రాజ! పాండవ సిరి
దోచ, యని తేకువ గల విదురుడుఁ జెప్పె.

(సుతుడు = కుమారుడు, కను = చూచు, కులపాంసనుడు = కీర్తి ప్రతిష్ఠలను చెడగొట్టువాడు, పరాకు = ఉదాసీనత, అవినీతి = అన్యాయము, పరువు = గౌరవము, సిరి = సంపద, దోచు = అపహరించు, తేకువ = యుక్తాయుక్త జ్ఞానము)

నీ కుమారులను కీర్తి ప్రతిష్ఠలను చెడగొట్టే వారిగా చూడమా, నీ ఉదాసీనత అవినీతిపరులను చేసింది, పాండవుల సంపద దోచుకుంటే పరువు పోకుండా ఉంటుందా, రాజా! అని యుక్తాయుక్త జ్ఞానము ఉన్న విదురుడు చెప్పాడు.

245. రాగము, రోగము, యోగము, భోగము - పదాలతో వేసవి ఎండల వర్ణనము

245.269 తే.గీ. ఎసకొలుపును విరాగము యెండ వాడి
పెక్కు రోగములకు వేసవి నెల వగుట
దైవయోగమునకుఁ గూడ తావు లేదు
భోగములు విస్మరింపగ పుడమి కబ్బె.

(ఎసకొలుపు = పురికొల్పు, విరాగము = విషయాల మీద అనాసక్తి, వాడి = తీక్ష్ణము, పెక్కు = అనేకము, రోగము = వ్యాధి, వేసవి = ఎండకాలము, నెలవు = ఉనికిపట్టు, దైవయోగము = అదృష్టము, తావు = చోటు, భోగము = సుఖము, విస్మరించు = మఱచిపోవు, పుడమి = భూమి, అబ్బు = లభించు)

ఎండ తీవ్రత విషయాల మీద అనాసక్తిని పురికొలుపుతుంది. అనేకమైన వ్యాధులకి ఎండకాలము ఉనికిపట్టుగా అదృష్టానికి కూడా చోటు లేకుండా, సుఖాలు మరచిపోవడానికి భూమికి లభించింది.

246. "రామ" శబ్దాన్ని అన్యార్థంలో నాలుగు సార్లు ప్రయోగిస్తూ రాధా శ్యామసుందరుల సంభాషణ మత్తకోకిల పద్యంలో

246.270 మత్తకోకిల. బాగు పెంచుటలో వరా! మనువాడు టన్నది వీడుటా,
రాగమే భవతార కమ్మజరామరమ్మను రాధకున్,
త్యాగమే యభిరామమై యమృతత్వమై విలసిల్లగన్,
యోగు దండనలో విరామము యుండ దంచనె కృష్ణుడే.

(బాగు = క్షేమము, వరుడు = ప్రియుడు, మనువు = వివాహము, వీడు = వదలు, రాగము = ప్రేమ, భవ = సంసారము, తారకము = తరింపజేయునది, అజరామరము = చావు లేకుండా స్థిరముగా నుండునది, త్యాగము = విడుపు, అభిరామము = మనోహరము, ఘన = గొప్ప, తత్వము = స్వభావము, విలసిల్లు = ప్రకాశించు, ఓగు = దుష్టుడు, దండన = శిక్షించుట, విరామము = విశ్రాంతి)

ప్రియా! మంచిని పెంచడంలో వివాహమాడటం వదలటమా, ప్రేమే సంసారాన్ని తరింప చేసేది, స్థిరంగా ఉండేది అని చెప్పే రాధకి, త్యాగమే సంతోషాన్ని కలిగించేదిగా అమృతత్వంగా (అంటే, మరణానంతరం కూడా బ్రతికి ఉండేటట్లు చేసేది) ప్రకాశించగా, దుష్టశిక్షణలో విశ్రాంతి ఉండదంటూ కృష్ణుడే అన్నాడు.

247. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న - పదాలతో భారతార్థంలో

247.271 తే.గీ. ఆతడు విరామ మెరుగక యాహవమునఁ
బోరు, వీర లక్ష్మణ మెట్టిదో రిపులకుఁ
జూపు, భరత వరీయు డర్జును సుతుండు,
ద్రోణుఁ దాకి శత్రుఘ్నుగ రాణ కెక్కె.

(విరామము = విశ్రాంతి, ఎరుగు = తెలియు, ఆహవము = యుద్ధము, పోరు = కలహించు, లక్ష్మణము = లక్షణము, రిపుడు = శత్రువు, వరీయుడు = శ్రేష్ఠుడు, సుతుడు = కుమారుడు, తాకు = ఎదిరించు, శత్రుఘ్న = శత్రువులను చంపువాడు, రాణ = ప్రసిద్ధి)

అతడు విశ్రాంతి తెలియకుండా యుద్ధం చేసేటటువంటి, శత్రువులకు వీరలక్షణం ఎటువంటిదో చూపించేటటువంటి, భరత వంశంలో శ్రేష్ఠుడైన అర్జునుని కుమారుడైన అభిమన్యుడు. ద్రోణుణ్ణి ఎదిరించి శత్రు మర్దనుడిగా ప్రసిద్ధి కెక్కాడు.

248. రామసేతు గురించి

248.272 కం. వారిధి ముప్వన్నెలలో
తీరంబునుఁ దాకి మరల, త్రిగుణాతీతుం
డా రాముని శక్తికి, సం
సారంబున "రామసేతు" సంకేత మయెన్.

(వారిధి = సముద్రము, ముప్వన్నెలు = మూఁడు రంగులు, తీరము = ఒడ్డు, మరలు = వెనుకకు తిరుగు, త్రిగుణాతీతుడు = సత్వరజస్తమములను దాటినవాడు, సంసారము = ప్రపంచము)

సముద్రము మూడు రంగులలో ఒడ్డును తాకి వెనకకు మరలగా, మూడు గుణాలైన సత్వరజస్తమో గుణాలకి అతీతుడైన శ్రీరాముని శక్తికి ప్రపంచంలో రామసేతు సంకేతంగా నిలిచింది.

249. రామా, రామా, రామా, రామా - పదాలు పాదాదిన వచ్చేటట్లుగా అన్యార్థంలో వాడుతూ రామ పరంగా

249.273 శా. రా! మాటిమ్ము! ధరాధిపా! దశరథా! రాజ్యాభిషేకంబు, మా
రామా, లేదను నట్లు నేడె భరతున్ రప్పించిఁ గావింప, బే
రామా, యేలని లేక జ్యేష్ఠ సుతు శ్రీరామున్ వనం బంపగా,
ప్రామాణ్యంబుగ సత్యనిష్ఠ నిలిచెన్, వాంఛింప కైకే యిటుల్.

(రా = రమ్ము, ఇమ్ము = ఇచ్చుము, ధరాధిపా = రాజా, మారాము = రహస్యము, నేడు = ఈ రోజు, కావించు = చేయు, బేరాము = వ్యవధి లేకుండ, ఏల = ఎందుకు, జ్యేష్ఠ సుతుడు = పెద్ద కుమారుడు, వనము = అడవి, అంపు = పంపు, ప్రామాణ్యము = నిదర్శనము, నిష్ఠ = నిర్వహణము, నిలుచు = ప్రతిష్ఠితమగు, వాంఛించు = కోరు, ఇటులు = ఈ ప్రకారము)

ఓ, దశరథ మహారాజా! రమ్ము, ఏ రహస్యం లేదు అనేటట్లుగా భరతుని రప్పించి రాజ్యాభిషేకము చేయడానికీ, వ్యవధి లేకుండా ఎందుకు అని లేకుండా (అంటే వెంటనే) శ్రీరాముణ్ణి అడవికి పంపడానికీ, మాట ఇమ్ము. ఈ విధంగా కైకేయి కోరడం వలన, సత్యనిష్ఠ నిదర్శనంగా నిలిచింది.

250. రామా - నాలుగు పాదాలలో విభిన్నార్థాలతో హరి ప్రార్థన

250.274 కం. రారా! మా వెతఁ దీర్చఁగ,
రారా! మా మదిని జ్ఞాన రశ్మిని నింపన్,
రారా! మామక హృదయ వి
హారా! మానిత ప్రభావ! హరి శ్రీకృష్ణా.

(వెత = బాధ, రశ్మి = కాంతి, మామక = నాది, మానిత ప్రభావ = పూజింపబడిన మాహాత్మ్యము కలవాడా)

పూజ్యమైన మాహాత్మ్యము కలవాడా! విష్ణుస్వరూపుడవైన శ్రీకృష్ణా! మా బాధ తీర్చుటకు రారా. మా మనస్సులో జ్ఞానమనే కాంతిని నింపడానికి రారా. నా మనస్సులో విహరించే వాడా రారా.

251. రామా, కామా, రోమా, కోమా చిన్న పిల్లలకు ఆశీర్వాదం

251.275 కం. రామాయణమును చదివిన,
కామాటము యబ్బి, జనులు కాంతురు ప్రగతిన్,
రోమాంచముగా, పిల్లల
కో, మాంద్యమ్మె నశించి, కురియును శుభముల్.

(కామాటము = సేద్యముగాని, ఇతరపనులు గాని పెద్దఎత్తున చేయుట, అబ్బు = ప్రాప్తించు, ప్రగతి = అభివృద్ధి, రోమాంచము = గగుర్పాటు, మాంద్యము = జడత్వము, నశించు = ధ్వంసమగు, కురియు = వర్షించు)

రామాయణం చదివితే కార్యసాధన ప్రాప్తించి ప్రజలు అభివృద్ధిని చూస్తారు. పిల్లలకైతే గగుర్పాటు కలిగించే విధంగా జడత్వము నశించి శుభములు వర్షిస్తాయి.

252. రారా, పోరా, తేరా, సారా - పదాలను అన్యార్థంలో ఉపయోగించి భారతార్థంలో

252.276 కం. రారాజు మొండిఘటమని,
పోరాటమె గాని పొందు పొసగదు, సంయ
త్తే రాజ్య మిడు ననుచు, కం
సారాతి తెలిపెను, పాకశాసని యడుగన్.

(రారాజు = దుర్యోధనుడు, మొండిఘటము = మొండివాడు, పోరాటము = యుద్ధము, పొందు = సంధి, పొసగు = లభించు, సంయత్తు = యుద్ధము, ఇడు = ఇచ్చు, కంసారాతి = కృష్ణుడు, పాకశాసని = అర్జునుడు)

దుర్యోధనుడు మొండివాడనీ, యుద్ధమే కానీ సంధి లభించదు, యుద్ధమే రాజ్యము ఇస్తుంది అనీ కృష్ణుడు అర్జునుడు అడుగగా తెలిపాడు.

253. లంగా, చీర, రవిక, పయట - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

253.277 తే.గీ. ద్వారకకు యలంగామీను వలె కిరీటిఁ
జేరి, యట సుభద్రఁ గొని, పేచీ రగులగ
తెరవి కనుల ముందరెఁ బోరి, తేరు నింద్ర
ప్రస్థమున డాప, యట పెండ్లి పండుగయ్యె.

(అలంగామీనుడు = బాటసారి, కిరీటి = అర్జునుడు, కొను = తీసికొను, పేచీ = వివాదం, రగులు = రాజుకొను, తెరవి = అతివ, పోరు = యుద్ధము చేయు, తేరు = రథము, డాపు = చేర్చు)

అర్జునుడు బాటసారి లాగా ద్వారకకు చేరి, అక్కడ సుభద్రను తీసికొని వివాదం రాజుకొనగా ఆమె ముందరే యుద్ధం చేసి రథాన్ని ఇంద్రప్రస్థ పురానికి చేర్చగా, అక్కడ పెళ్ళి పండుగ అయ్యింది.

254. లంగా, లుంగీ, చీర, దోవతి - పదాలను ఉపయోగిస్తూ భారతార్థంలో

254.278 శా. శ్రీలం గాంతుడు జూద మందు విడువన్, జేలంబు తోడన్ సతిన్
మేలం బాడుచు నీడ్చు దోవ, తిగుటన్ మీసంబులన్ దువ్వుచున్
మేలుం గీడను మాట లేక సభలో మ్లేచ్ఛుల్ బలెన్ కౌరవుల్

బ్రేలం, గృష్ణుడు చీర లిచ్చి యట కాపించెన్ వడిన్ ద్రౌపదిన్.

(శ్రీ = సంపద, కాంతుడు = భర్త, విడుచు = ధారపోయు, చేలము = వస్త్రము, తోడ = కూడ, సతి = భార్య, మేలము = పరిహాసము, దోవ = మార్గము; తిగుట = ఆసక్తి, మేలు = మంచి, కీడు = చెడు, మ్లేచ్ఛుడు = అనాగరకుడు, బలెన్ = వలె, ప్రేలు = వదరు, కాపించు = రక్షించు, వడి = వేగముగా)

భర్త సంపదలను జూదంలో ధారపోయగా, వస్త్రంతో సహా భార్యను పరిహాసం చేస్తూ ఈడ్చే మార్గములో ఆసక్తితో మీసాలు దువ్వుతూ మంచి చెడూ అన్న మాట లేకుండా సభలో అనాగరికుల్లాగా కౌరవులు వదరగా, త్వరగా ద్రౌపదిని కృష్ణుడు చీర లిచ్చి అక్కడ రక్షించాడు.

255. లండన్, అమెరికా, జపాన్, ఇటలీ - వీటితో వరూధినీ ప్రవరుల కథ

255.279 మ. ప్రజలండన్ యిలుఁ జేరగా ప్రవరు డారాటమ్ముననన్ జూడ, వా
రిజనేత్రంబుల మూయ నీయ, మెరికా! లేదంచు, నా యచ్చరే
భజియించెన్ త్రిజపానుకూలు సొబగున్, వానిన్, శమీగర్భత
ల్లజ! తృష్ణంది వరూధి నింట యిట లీలల్ యంద రారమ్మనెన్.

(అండ = సహాయము, ఇలు = ఇల్లు, ఆరాటము = సంతాపము, వారిజ = కమలము, ఈయ = కోరిక, మెరిక = సమర్థుడు, అచ్చర = అప్సరస, భజియించు = ఆరాధించు, త్రిజపము = వాచికము, ఉపాంశువు, మానసికము అని త్రివిధ జపములు, అనుకూలుడు = ఆనుకూల్యము గలవాఁడు, సొబగు = సౌందర్యము, శమీగర్భతల్లజ = బ్రాహ్మణ శ్రేష్ఠుడా, తృష్ణ = ఇచ్ఛ, అంది = గ్రహించి, లీల = శృంగారచేష్ట, అంద = అందుకొనుటకు)

ప్రజల అండతో ఇల్లు చేరడానికి ప్రవరుడు ఆరాట పడుతూ ఉంటే, కమలముల వంటి కళ్ళు మూయాలని కోరిక లేదు, సమర్థుడా! అంటూ, ఆ అప్సరస త్రివిధ జపము లందు ప్రీతి ఉన్న వాని సౌందర్యాన్ని ఆరాధిస్తూ, వానిని, ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! ఇచ్ఛతో ఇక్కడ వరూధిని ఇంటిలో శృంగార సౌఖ్యం అందుకోవడానికి రారమ్మని అంది.

256. లడ్డు, బూరె, అరిసె, కాజా - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ భారతార్థంలో

256.280 తే.గీ. అర్థపతి వన రక్షకు లడ్డుకొనగ,
భీముడు వడిఁ బూరెక్కలు విరిచి నట్లు
వారి నణచె, రాయరి సెలయేరునఁ గల

నన లనికి సాకు కాజాల వనిన వినక.

(అర్థపతి = కుబేరుడు, వనము = తోట, అడ్డుకొను = అడ్డగించు, వడి = వేగముగా, పూరెక్కలు = పూల రెక్కలు, విరుచు = త్రెంచు, అణచు = క్రుంగచేయు, రాయరి = ప్రభువు, సెలయేరు = కొండకాలువ, నన = పుష్పము, అని = యుద్ధము, సాకు = కారణము)

ప్రభువు సెలయేరులో ఉన్న పూలు యుద్ధానికి కారణం కాజాలవు అని చెప్పినా వినకుండా, కుబేరుని తోటలో రక్షకులు అడ్డగించగా, భీముడు వేగంగా పూల రెక్కలని విరిచినట్లుగా వారిని అణిచి వేశాడు.

257. లవరు, కవరు, పవరు, ఎవరు - పదాలతో దాంపత్య జీవనం

257.281 తే.గీ. అలవరుచు కున్న మర్యాద యందలముగ,
యలుక వరుని మరింతగా యలరచేయ,
బ్రతుకు గడుప వరునిఁ జేర వధువు, యింట
యెవరు యెవరికి సగమను యెఱుకఁ గలదె.

(అలవరుచు = వాడుకపడు, మర్యాద = గౌరవము, అందలము = పల్లకి, అలుక = కోపము, వరుడు = పెండ్లికొడుకు, మరింత = ఎక్కువ, అలరచేయు = సంతోషపెట్టు, బ్రతుకు = జీవనము, గడుపు = పెళ్ళబుచ్చు, వధువు = పెండ్లికూతురు, సగము = అర్ధము, ఎఱుక = తెలివి)

అలవాటు చేసుకున్న మర్యాద పల్లకీగా అలుక పెళ్ళికొడుకును మరింతగా సంతోషపెట్టగా పెళ్ళికూతురు జీవనం గడపడానికి పెళ్ళికొడుకును చేరుకోగా ఆ ఇంటిలో ఎవరు ఎవరికి అర్ధభాగము అన్న తెలివి ఉందా?

258. లాడెస్, ఊడెస్, వీడెస్, వాడెస్ - పదాలను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్థితిగతులపై

258.282 కం. ఓడస్ పీఠమ్మూడెస్,
కూడస్ గెలిచెస్, పదవినిఁ గొన తెర వీడెస్,
పాడికి పెంపర లాడెస్,
వాడెస్ తన తెలివి గెలుచువాడే యాంధ్రస్.

(ఓడు = పరాజయమందు, పీఠము = అధికార పీఠము, ఊడు = వదలు, కూడు = కలియు, కొను = చేపట్టు, తెర = అడ్డువల, వీడు = తొలగు, పాడి = న్యాయము, వెంపరలాడు = ప్రాకులాడు, వాడు = ఉపయోగించు)

ఓడిపోవడం వల్ల అధికార పీఠం ఊడిపోయింది. కలవడం వల్ల (కూటమిగా) గెలిచాడు. పదవిని చేపట్టగానే అడ్డుతెర తొలగింది. న్యాయం కోసం ప్రాకులాడాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గెలిచిన వాడే తన తెలివిని ఉపయోగించాడు.

258.283 కం. ఓడస్ పదవులు యూడెస్,
వీడెస్ తమ కున్న పూర్వ విభవము, యల్ల
ల్లాడెస్ పార్టీ భవితయె,
వాడెస్ యోడిన గణముల వ్యాపన మాంధ్రస్.

(ఓడు = పరాజయమందు, ఊడు = పోవు, వీడు = తొలగిపోవు, పూర్వ = మునుపటి, విభవము = ఉన్నతస్థితి, అల్లల్లాడు = చలించు, భవిత = జరుగవలసినది, వాడు = శోషించు, గణము = సమూహము, వ్యాపనము = వ్యాపించుట)

పరాజయ మందడం వల్ల పదవులు పోయాయి. తమ కున్న మునపటి ఉన్నతస్థితి తొలగిపోయింది. పార్టీ భవితవ్యము అల్లల్లాడింది. ఆంధ్రాలో ఓడిపోయిన శ్రేణుల వ్యాపనము శోషించింది.

259. వంక, జింక, లెంక, శంక - శంకరాచార్య వర్ణన

259.284 కం. నలువంకల నద్వైతము,
నలయక, తా జింకతాల్పు యవతారముగా
వెలసియు లెంకగఁ, జని ను
జ్వలముగఁ జేసినది, యాది శంకరుడేగా.

(నలువంకల = నాలుగు దిక్కుల, అద్వైతము = జీవేశ్వరుల కైక్యము చెప్పెడి మతము, అలయక = విసుగు చెందక, జింకతాల్పు = శివుడు, అవతారము = దేవతలు మనుష్యాదిరూపములలో పుట్టుట, వెలయు = ప్రసిద్ధికెక్కు, లెంక = సేవకుడు, చని = వెళ్ళి, ఉజ్జ్వలము = ప్రకాశించునది)

తాను శివుని అవతారముగా ప్రసిద్ధి కెక్కి కూడా సేవకునిగా నాలుగు దిక్కులకు విసుగు చెందకుండా వెళ్ళి అద్వైతాన్ని ప్రకాశింప జేసినది ఆది శంకరాచార్యులేగా.

260. వంద, వేయి, లక్ష, కోటి - పదాలను అన్యార్థంలో ఉపయోగించి భారతార్థంలో

260.285 తే.గీ. ధర్మజుడు వందనము జేసి తపను వేడ
యోగిరములు లేవే యిట నున్న జన ని
వహమున కని, విలక్షణ పాత్ర, యన్న
దాన మేలుకోటి కిడగ, దక్కె నపుడు.

(తపనుడు = సూర్యుడు, వేడు = ప్రార్థించు, ఓగిరము = భోజనము, నివహము = సమూహము, విలక్షణ = విశేషమైన లక్షణము కల, ఏలుకోటి = ఏలుబడికి లోపడిన జనము, ఇడు = ఇచ్చు, దక్కు = లభించు)

ధర్మరాజు, నమస్కారము చేసి ఇక్కడ ఉన్న జనసమూహానికి భోజనాలు లేవే యని సూర్యుని ప్రార్థించగా, అప్పుడు, ఏలుబడిలో ఉన్న జనానికి అన్నదానము చెయ్యడానికి విశేషమైన లక్షణము కల పాత్ర (అక్షయపాత్ర) లభించింది.

261. వన, జన, ధన, మన - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ రామాయణార్థంలో

261.286 కం. భావనలో శ్రీరాముడె
జీవనమై మను జనకజ సీతను లంకన్
బావని శోధనఁ జేయుచు
రావణు కామనఁ దెలియగ లంకనుఁ గాల్చెన్.

(భావన = తలపు, జీవనము = బ్రతుకు, మను = జీవించు, జనకజ = జనకుని కుమార్తె, పావని = హనుమంతుడు, శోధన = వెదకడము, కామన = కోరిక, కాల్చు = తగులబెట్టు)

తలపున శ్రీరాముడే జీవితముగా బ్రతికే జనకుని కుమార్తెయైన సీతను లంకలో హనుమంతుడు వెదుకుతూ రావణుని కోరిక తెలియగానే లంకని తగులబెట్టాడు.

262. వనిత, లలిత, అనిత, మమత - పదాలతో రామాయణార్థంలో

262.287 తే.గీ. ఇవ్వని తళుకుల మృగమా? రివ్వుమనుచు
పరుగిడఁ గన లలి తనికె, పట్టిఁ దెమ్మ
నుచు తన పతి నడుగు సీతనుఁ గని లక్ష్మ
ణుండు రామ! మతకరి యిట్లుండు ననియె.

(ఇవ్వని = ఈ అడవిలో, తళుకు = అధిక ప్రకాశము, మృగము = జింక, రివ్వుమను = రివ్వుమను ధ్వనిచేయు, కను = చూచు, లలి = ప్రేమ, తనుకు = కలుగు, పతి = భర్త, రామ = స్త్రీ, మతకరి = మాయావి)

ఈ అడవిలో తళుక్కుమనే జింకయా? అది రివ్వుమని పరుగెత్తడం చూస్తే ప్రేమ కలిగింది. దాన్ని పట్టి తీసుకొనిరమ్మని తన భర్తయైన శ్రీరాముణ్ణి కోరే సీతను చూసి, లక్ష్మణుడు, భామా! మాయావి ఇట్లా ఉంటుంది అని అన్నాడు.

263. వాన, ముసురు, జల్లు, జడి - పదాలతో వేసవిలో జనుల స్థితి

263.288 కం. వేసవి కాహ్వానంబా?
హాసము సురుగును జనులకు యాననమున, యా
వాసము లందలజడి మొద
లై, సుతపుండు పెదజల్లు రశ్మిని మండుస్.

(వేసవి = వేసవి కాలము, ఆహ్వానము = పిలుపు, హాసము = నవ్వు, సురుగు = అదృశ్యమగు, ఆననము = ముఖము, ఆవాసము = ఇల్లు, అలజడి = కలవరము, సుతపుడు = సూర్యుడు, పెదజల్లు = వ్యాపింప జేయు, రశ్మి = కిరణము, మండు = జ్వలించు)

వేసవి కాలానికి ఆహ్వానమా? ప్రజలకి ముఖంలో నవ్వు మాయమై, ఇళ్ళలో కలవరం మొదలై సూర్యుడు వ్యాపింపజేసే కిరణాలలో జ్వలిస్తాయి.

264. వారేవా, తూరేతూ, పీరేపీ, జారేజా - పదాలతో రామాయణార్థంలో

264.289 శా. వారే వానర యోధు లీ నడిమెకుస్ వైదేహికై వచ్చె, యూ

తూరే తూటరి నాశ్రయించితివి నీ దుత్తూరముల్ గ్రెమ్మ? రే
పీ రేపీడగ నున్న యీ వ్యసనముల్ విద్వేషముల్ రేప నం
జా? రేజామున రావణాసురు కిటుల్ జాగ్రత్త లందెస్ సభస్.

(వానర = కోతి, యోధుడు = యుద్ధము చేయువాడు, నడిమె = లంక, వైదేహి = సీత, తూరి = పర్యాయము, తూటరి = దుష్టుడు, ఆశ్రయించు = అండగొను, దుత్తూరము = కపటము, గ్రెమ్ము = సాగించు, రేపు = తరువాతి దినము, రే = రాత్రి, పీడ = బాధ, వ్యసనము = దురభ్యాసము, విద్వేషము = పగ, రేపు = పురికొలుపు, అంజు = సందేహించు, జాము = కాలము, అసురుడు = రాక్షసుడు, ఇటులు = ఈ ప్రకారము, జాగ్రత్త = భద్రము, అందు = లభించు)

వాళ్ళే వానర యోధులు. సీత కోసం ఈ లంకకి వచ్చారు. నీ మోసాలు సాగించడానికి ఈ సారి ఏ దుష్టుడి అండ తీసుకున్నావు (అంటే, అదివరకు మారీచుడి సహాయం తీసుకున్నావు కదా అని చెప్పడం)? రేపటి రోజున రేపీడగా ఉన్న ఈ నీ దురభ్యాసాలు పగలు పురికొలపడంలో సందేహమా? రాత్రి వేళ సభలో రావణాసురిడికి ఈ విధంగా జాగ్రత్తలు అందాయి.

265. వాలీబాలు, క్రికెట్, కోకో, కబాడీ - పదాలతో రామాయణార్థంలో

265.290 శా. వాలీ! బాలుని వంటి సోదరునితో వైరంబె నీ కిట్లు? దో
ర్లీలం జూపిన వక్రి కెట్టుఁ దెలియుస్ రీతుల్, రివాజుల్? యనిం
గూలస్ యంగదుఁ గూర్చి యెంత జళుకో కోడాడగస్? దమ్మునిస్
శైలూషుండను భూకబా? డిమమ? కీశా! యంచు రాముం డనెస్.

(బాలుడు = కుమారుడు, సోదరుడు = తమ్ముడు, వైరము = విరోధము, ఇట్లు = ఈ ప్రకారము, దోర్లీలస్ = భుజశక్తిని, వక్రి = వంకరగా ఆలోచించేవాడు, ఎట్టు = ఏ ప్రకారము, రీతి = పద్ధతి, రివాజు = మర్యాద, అని = యుద్ధము, కూలు = పడు, జళుకు = బెదరు, కోడాడు = బాధపడు, కను = చూడు, శైలూషుడు = మోసగాడు, భూకబు = సమయము, డిమము = చిన్న నాటకము, కీశుడు = వానరుడు)

వాలీ! కొడుకుతో సమానమైన తమ్ముడితో నీకు ఈ విధంగా విరోధమా? భుజశక్తిని చూపించిన వక్రబుద్ధికి పద్ధతులూ మర్యాదలూ ఎట్లా తెలుస్తాయి? యుద్ధంలో పడిపోగానే నీ కుమారుడైన అంగదుని గురించి బాధపడడానికి ఎంత బెదురో? తమ్ముడైన సుగ్రీవుని మోసగాడు అనే సమయమా? చిన్న నాటకమా? వానరా! అని రాముడు అన్నాడు.

266. విత్తి, హత్తి, మెత్తి, సత్తి - భారతార్థములో

266.291 తే. గీ. ఏకచక్రపురిని బిచ్చ మెత్తి లోక
కంటకు మదహత్తి బకుని కసిమసగిన
పాండవుల సత్తిఁ గనిన ద్రుపదుడు కృష్ణ
కపుడు సంవిత్తిఁ జేసె స్వయంవరమును.

(మదహత్తి = మదపుటేనుగు, కసిమసగు = చంపు, సత్తి = బలిమి, కృష్ణ = ద్రౌపది, సంవిత్తి = తెలివి)

ఏకచక్రపురంలో బిచ్చము ఎత్తి, లోక కంటకుడైన మదపుటేనుగు లాంటి బకాసురుణ్ణి చంపిన పాండవుల బలిమిని చూసిన ద్రుపద మహారాజు ద్రౌపదికి అప్పుడు తెలివిగా స్వయంవరం చేశాడు.

267. విల్లు, అమ్ము, కత్తి, గద - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ భారతార్థంలో

267.292 తే.గీ. ఉద్భవిల్లు విమోహము నోప లేక,
యందకత్తియ సైరంధ్రి పొందుఁ గోరి,
గదరుకొని సుధేష్ణను, తన సదనమునకు
యమ్ముదిత నంప, కీచకు డానతిచ్చె.

(ఉద్భవిల్లు = పుట్టు, విమోహము = మిక్కిలి మోహము, ఓపు = సహించు, అందకత్తియ = సౌందర్యవతి, సైరంధ్రి = ఆ వేషంలో ఉన్న ద్రౌపది, పొందు = కలయిక, గదరుకొను = గట్టిగా ఎదిరించి మాట్లాడు, సుధేష్ణ = విరాటరాజు భార్యయైన కీచకుని సహోదరి, సదనము = గృహము, ముదిత = స్త్రీ, అంపు = పంపు, ఆనతిచ్చు = ఆజ్ఞాపించు)

తనకు పుట్టిన అధికమైన మోహాన్ని సహింప లేక, సౌందర్యవతియైన సైరంధ్రి పొందు కోరి, సుధేష్ణను గట్టిగా ఎదిరించి మాట్లాడుతూ, తన గృహానికి ఆమెను పంపమని కీచకుడు ఆజ్ఞాపించాడు.

268. వీరమో, సారమో, భారమో, హారమో - పాదాదిన వచ్చునట్లుగా దత్తపది

268.293 తే.గీ. వీరమో, కరుణామూర్తి వేదన కను
సారమో, సంఘమున కిడ శరణు రాజ్య

భార మోసరించిన యర్కబంధువు యను
హారమో, యశోకు డహింస నాచరించె.

(వేదన = బాధ, అనుసారము = అనుసరించుట, సంఘము = సమాజము, ఇడు = ఇచ్చు, శరణు = శరణాగతి, ఓసరించు = త్యజించు, అర్కబంధువు = గౌతమ బుద్ధుడు, అనుహారము = పోలిక)

అది వీరత్వమో! దయ నిండిన మనిషి బాధని అనుసరించుటో! సమాజానికి శరణాగతి ఇవ్వడానికి రాజ్యభారాన్ని త్యజించిన గౌతమ బుద్ధుడికి సామ్యమో! అశోక చక్రవర్తి అహింసని ఆచరించాడు.

269. శంకర, ఈశ్వర, రుద్ర, కపాలి అను పదాలతో తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం మామూలు క్యూలో నిలబడ్డ ఒక వ్యక్తి వీ. ఐ. పీ. క్యూలో జనాలు తొందరగా దర్శనం చేసుకోవడం చూసి ఒక పక్క బాధగా ఉన్నా దాన్ని అనుకూలంగా తీసుకుని అది వారి పూర్వజన్మ పుణ్యం వల్ల, స్వామివారి సంకల్పం వల్ల అని అనుకోవడం

269.294 చం. తిరుపతి వేంకటేశ్వరుని దేవళ మందు నొకండు దర్శనం
బరయుచు నిల్వ పెద్దదయె బారు, ద్రవింపగ ఘర్మముల్, గడన్
శరగతి సాగు శ్రేణిఁ గని శంక రగుల్చ, ప్రతీతు లంద రీ
వరుసన రాక, పాలి నట భావనఁ జేసెను దైవ మంచనెన్.

(దేవళము = దేవాలయము, అరయు = నిరీక్షించు, బారు = వరుస, ద్రవించు = కారు, ఘర్మములు = చెమటలు, కడన్ = సమీపమున, శర = బాణము, గతి = గమనము, శ్రేణి = వరుస, కని = చూచి, శంక = సందేహము, రగుల్చు = రగిలేట్లు చేయు, ప్రతీతుఁడు = ప్రసిద్ధుఁడు, పాలి = చోటు, భావన = తలపు)

తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఒకడు దర్శనం కోసం నిలువగా ఆ వరుస పెద్దదయింది. చెమటలు కారుతుండగా, పక్కనే శరవేగంతో సాగే వరుసను చూడగానే సందేహం దహించివేయగా, ప్రసిద్ధులు ఈ వరుసను రాకుండా, చోటును అక్కడ భగవంతుడే సంకల్పము చేశాడు అని అన్నాడు.

270. శవము, పాడె, కాడు, చితి - పదాలతో జన్మదినోత్సవాన్ని వర్ణిస్తూ

270.295 తే.గీ. శైశవమున జన్మదినము జరిపి, పెక్కు
దీవన లిడి, పాటలు పాడె దేవళమున,

యంకెకాడుగ నెదుగునం చంద రనుచు,
సంచితిగ యా పలుకులు ఫలించె నేడు.

(శైశవము = బాల్యము, పెక్కు = అనేక, దీవన = ఆశీర్వాదము, ఇడు = ఇచ్చు, దేవళము = గుడి, అంకెకాడు = ముఖ్యుడు, ఎదుగు = వర్ధిల్లు, సంచితి = కుప్ప, ఫలించు = నెరవేరు)

బాల్యంలో పుట్టినరోజు జరిపి, చాలా దీవన లిచ్చి, ముఖ్యుడుగా వర్ధిల్లు గాక అంటూ, అందరూ గుడిలో పాటలు పాడారు. కుప్పగా ఆ మాటలన్నీ ఈ రోజు నెరవేరాయి.

271. శవము, పాడె, చితిమంట, తర్పణము - పదాలతో పెండ్లి వేడుక

271.296 తే.గీ. ఆశవమున తలంబ్రాల నాలుమగలు
పోసికొని గునిపాడె విబుధులు మెచ్చ,
మరచిపోని దీ పరిచితి మంటపమున,
ముదము సంతర్పణములతో మోసులెత్తె.

(ఆశవము = వడి, తలంబ్రాలు = పెండ్లిలో వధూవరుల తలలపై పోసుకొను అక్షతలు, ఆలుమగలు = భార్యాభర్తలు, గునిపాడు = ఆటలాడు, విబుధుడు = ప్రాజ్ఞుడు, మెచ్చు = శ్లాఘించు, పరిచితి = పరిచయము, ముదము = ఆనందము, సంతర్పణము = విందు, మోసులెత్తు = మెల్లగా పైకి వచ్చు)

ప్రాజ్ఞులు మెచ్చగా, భార్యాభర్తలు వేగముగా తలంబ్రాలను పోసుకొని ఆటలాడారు (వధూవరులు మాంగల్యధారణ తరువాత చేసే తంతు కాబట్టి వాళ్ళు భార్యాభర్తలే). పెళ్ళి మంటపంలో ఈ పరిచయం మరిచిపోలేనిది. పెళ్ళి విందులతో సంతోషం మెల్లగా పైకి వచ్చింది.

272. శివ, హర, భవ, రుద్ర - పదాలను ఉపయోగించి విష్ణువును స్తుతిస్తూ

272.297 తే.గీ. క్షీర వారాశి వడిఁ జిల్క క్షితిధరమ్ము
నెత్తి, యమృత హరణ నడ్డి, యెదను నిల్పి
జలధి సంభవను సతిగ వలచు చక్రి,
యండజేరు ద్రష్టలఁ గావ, నంజలింతు.

(క్షీర వారాశి = పాల సముద్రము, వడి = వడి, చిల్కు = మథించుం, క్షితిధరము = పర్వతము, హరణ = దొంగిలించుట, అడ్డు = నిరోధించు, ఎద = హృదయము, నిల్పు = ప్రతిష్ఠించు, జలధి సంభవ = సముద్రము నుండి పుట్టినదైన లక్ష్మీదేవి, సతి = భార్య, వలచు = ప్రేమించు, చక్రి = విష్ణువు, అండజేరు = ఆశ్రయించు, ద్రష్ట = సామాజికుడు, కాచు = రక్షించు, అంజలించు = నమస్కరించు)

పాల సముద్రాన్ని వేగంగా మథించడానికి పర్వతం (మందర) ఎత్తి, అమృతం ఎత్తుకుపోవడాన్ని అడ్డుకొని, లక్ష్మీదేవిని హృదయంలో ప్రతిష్ఠించుకొని భార్యగా ప్రేమించు విష్ణుమూర్తి, ఆశ్రయించు సామాజికులను రక్షించడానికి నమస్కరిస్తాను.

273. శివ, హర, భవ, రుద్ర - పదాలను ఉపయోగించి శ్రీకృష్ణుని స్తుతిస్తూ

273.298 కం. అపదేశి వంచు, రుక్మిణి
నపహరణముఁ జేసితి వని యత్త సుతు డనస్,
త్రప వీడి వదరు ద్రాబని,
కృపను భవాబ్ధి విడఁ జేయు, కృష్ణుకు ప్రణతుల్.

(అపదేశి = మోసగాడు, అపహరణము = బలవంతముగా పట్టుకొనిపోవుట, త్రప = సిగ్గు, వదలు = విడుచు, వదరు = ఉపయోగము లేని మాట లాడు, ద్రాబ = అధముడు, కృప = దయ, భవాబ్ధి = సంసారమనే సాగరము, విడు = వీడు, ప్రణతి = నమస్కారము)

మోసగాడివనీ, రుక్మిణిని బలవంతంగా ఎత్తుకుపోయావనీ, తన అత్త కుమారుడైన శిశుపాలుడు అనగా, సిగ్గు విడిచి ప్రేలే అధముడని, దయతో సంసార సాగరం వదిలేటట్లు చేసిన, శ్రీకృష్ణునికి నమస్కారాలు.

274. న్యస్తాక్షరి: 'శివరాత్రి' లోని నాలుగు అక్షరములు నాలుగు పాదములలో మొదటి అక్షరముగా వచ్చునటుల నచ్చిన ఛందస్సులో శివుని స్తుతిస్తూ

274.299 తే.గీ. శిఖరిని సురాసురులు ఖజఁ జేసి, క్షీర
వనధిఁ జిలుకగాఁ, దొల్లి సంజనితమై క
రాళ నృత్యముఁ జేయు గరళముఁ బట్టె
త్రినయనుడు గళమున, జగతికి సుధ నిడ.

(శిఖరి = పర్వతము, సుర = దేవతలు, అసురులు = రాక్షసులు, ఖజ = కవ్వము, క్షీరవనధి = పాల సముద్రము, తొల్లి = ముందు, సంజనితము = పుట్టిన, కరాళ = భయం పుట్టించే, గరళము = విషము, త్రినయనుడు = ముక్కంటియైన శివుడు, గళము = కంఠము)

దేవదానవులు పర్వతాన్ని (మందర) కవ్వంగా చేసి పాల సముద్రాన్ని చిలుకగా, మొదట పుట్టిన విషము భయం పుట్టించే విధంగా నృత్యం చేస్తూ వ్యాపిస్తూ ఉంటే శివుడు, లోకానికి అమృతం ఇవ్వడం కోసం, దాన్ని తన కంఠములో నిర్బంధించాడు.

274.300 తే.గీ. శిష్ట కార్యము సాధింప, కష్ట మోర్చ
వలెను ఫలము కొరకు, క్షీర జలధిఁ జిలుక
రాదె విషము తొలుత, త్రిపురారి మ్రింగె,
త్రిభువనమ్ములు త్యాగమూర్తి యని పొగడ.

(శిష్ట = విధించబడిన, ఓర్చు = భరించు, క్షీర జలధి = పాల సముద్రము, తొలుత = మొదట, త్రిపురారి = శివుడు)

విధించబడిన పని సాధించాలంటే, ఫలితం కోసం కష్టము భరించాలి. పాల సముద్రము చిలికేటప్పుడు మొదట విషం రాలేదా? మూడు లోకాలు త్యాగమూర్తి అని కీర్తించగా శివుడు దాన్ని మ్రింగాడు.

274.301 తే.గీ. శివు డొక సగముగ, శివాని శేషముగను
వరలుట, విడదీయగ రాని బంధ మనగ,
రాగ రంజితమగు వారి సంగమమున,
త్రిగుణ తత్త్వమయంబగు, జగతి వెలయు.

(శివాని = పార్వతి, శేషము = తతిమ్మా, వరలు = ప్రవర్తిల్లు, రాగ = అనురాగము, రంజితము = సంతోష పఱుపఁబడినది, సంగమము = కలయిక, త్రిగుణ = సత్త్వరజస్తమములు, మయము = దానితో నిండినది, జగతి = విశ్వము, వెలయు = ప్రసిద్ధికెక్కు)

శివుడు ఒక సగముగా, పార్వతి మిగిలిన సగముగా, ప్రవర్తిల్లే అర్ధనారీశ్వర తత్త్వము విడదీయరాని బంధము అనగా, అనురాగంతో ఆనందం నిండిన వారి కలయికలో సత్త్వ రజస్తమో గుణములతో ఏర్పడిన విశ్వం ప్రసిద్ధికెక్కుతుంది.

275. సంజీవకరణి, విశల్యకరణి, సంధానకరణి, సావర్ణ్యకరణి, వీటితో పద్యం

275.302 తే.గీ. జీవి చావును మలప సంజీవకరణి,
జతపరచ నెముకలను విశల్యకరణి,
ధ్వంస మగు యంగములకు సంధానకరణి,
గట్టి మూల్కెలై సావర్ణ్యకరణి మెరిసె.

(మలపు = మరలించు, సంజీవకరణి = చనిపోయినవానిని బ్రదికించు మందు, విశల్యకరణి = విరిగిన ఎముకల నతుకు ఓషధి, ధ్వంసము = నాశము, సంధానకరణి = చెడిన అవయవములను కూర్చు ఓషధి, గట్టి = దృఢము, మూల్కె = మూలిక, సావర్ణ్యకరణి = సూర్యుని వలె, మెరిసె = ప్రకాశించెను)

ప్రాణిని చావు నుండీ మళ్ళించడానికి సంజీవకరణి, ఎముకలను జతపరచడానికి విశల్యకరణి, ధ్వంసమయిన అవయవాలకు సంధానకరణి, దృఢమైన మూలికలుగా సూర్యుని వలె ప్రకాశించాయి.

276. సభ, బిల్లు, ప్రతినిధి, తగవు - పదాలను ఉపయోగిస్తూ కౌరవసభలో శ్రీకృష్ణుని హితబోధపై

276.303 తే.గీ. శాంతికి ప్రతినిధి మురారి, సంగర మన
యాఖరి యతిఘుము, తగవు యైదు యూళ్ళు
పాండవులకు గబిల్లునఁ బంచఁ గూడు
ననుచు, కురు సభను వచించె నంద రెదుట.

(ప్రతినిధి = ఒకరికి బదులుగా నుండువాడు, మురారి = శ్రీకృష్ణుడు, సంగరము = యుద్ధము, ఆఖరి = చివరి, అతిఘుము = ఆయుధము, తగవు = న్యాయము, గబిల్లు = వెంటనే, పంచు = విభజించు, కూడు = సాధ్యపడు, వచించు = చెప్పు)

శాంతికి ప్రతినిధియైన శ్రీకృష్ణుడు, యుద్ధం అంటే చివరి ఆయుధం, న్యాయం ఐదు ఊళ్ళు పాండవులకి వెంటనే పంచితే సాధ్యపడుతుంది అంటూ కురుసభలో అందరి ఎదురుగా చెప్పాడు.

277. సమంత, తమన్నా, ఇలియానా, ప్రియాంక - పదాలతో సరస్వతీదేవి స్తోత్రం

277.304 తే.గీ. వీస మంత తెలివి లేని వెంగళి యని,

చదువ నాయిత మన్నాడని దయఁ జూప,
కలిపి దోయిలి యా నాడు, కాళిదాసు
రసన వప్రి యాంకగొనె, భారతిని పొగడ.

(వీసము = కొంచెము, వెంగళి = మూఢుడు, ఆయితము = సిద్ధము, కలుపు = జోడించు, దోయిలి = అంజలి, రసన = నాలుక, వప్రి = క్షేత్రము, ఆంకగొను = ఆజ్ఞగొను, భారతి = సరస్వతి, పొగడు = స్తుతించు)

వీసమెత్తు, అంటే కొంచెం కూడ తెలివి లేని మూఢుడనీ, చదువుకోవడానికి సిద్ధము అన్నాడనీ దయ చూపించగా ఆ రోజున అంజలి ఘటించి సరస్వతిని స్తుతించడానికి, కాళిదాసు నాలుక అనే క్షేత్రము ఆజ్ఞ పొందింది.

278. సరి, గమ, పద, నిస - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో

278.305 తే.గీ. ముక్తసరిగ సామీరి రాము కథ పాడ,
సీత గమనించి యాతని చెట్టు పైన,
మరొక యాపద వచ్చెను మాయలేడి
వోలె నని సతమత మయ్యె, యులికి పడుచు.

(ముక్తసరిగ = క్లుప్తంగా, సామీరి = హనుమంతుడు, సతమతము = మిక్కిలి ఆయాసము, ఉలికిపడు = ఆకస్మికముగా కలిగిన భయాదులచే కంపించు)

హనుమంతుడు క్లుప్తంగా శ్రీరాముని కథను పాడగా, అతనిని చెట్టు పైన చూచి మాయ లేడి వంటిది మరో ఆపద వచ్చింది అని ఉలికి పడుతూ సీత సతమత మయ్యింది.

279. సరి, గమ, పద, నిస - యుద్ధ ఘట్టము - దత్తపది వర్ణన

279.306 కం. సరిఁ జేతు భీష్ము శౌర్యము,
శరముల గమనమున శ్యాలు సన్నిధి నంచుస్,
మురరిపు పదముల వ్రాలెను
నెరకాడగు పాకశాసని, సమర మందుస్.

(సరి = అంతము, శౌర్యము = పరాక్రమము, శరము = బాణము, గమనము = నడక, శ్యాలుడు = బావమరది (శిఖండి), సన్నిధి = సమీపము, మురరిపుడు = శ్రీకృష్ణుడు, నెరకాడు = ప్రియమైనవాడు, పాకశాసని = అర్జునుడు)

నా బావమరదియైన శిఖండి చెంత నుండగా బాణాలు నడిపించి భీష్ముని పరాక్రమాన్ని అంతము చేస్తాను, అని అంటూ చెలికాడైన అర్జునుడు యుద్ధంలో కృష్ణుని పాదాల మీద వ్రాలాడు.

280. సినిమా, నటి, తెర, రంగము - పదాలతో ప్రేయసి వర్ణన

280.307 ఉ. భావన లందు నా ముఖనివాసిని, మాతయె భోజనం బిడన్,
తీవియ వోలె యల్లుకొని తృప్తి నిడన్ యభిమాన టిప్పనై,
హావము లందు కాపుర రహస్యము వాతెర దాటనీక, తా
వావిని భార్యగా సలుపు, పాలన నా కవి తాంతరంగమున్.

(భావన = తలపు, ముఖనివాసిని = సరస్వతి, ఇడు = ఇచ్చు, తీవియ = తీగ, అభిమాన = ప్రేమకు, టిప్పని = వ్యాఖ్యానము, హావము = భ్రూనేత్రాది వికారములచేత కొంచెము తెలియదగిన మనోవికారము, కాపురము = కుటుంబము, వాతెర = పెదవి, వావి = బాంధవ్యము, సలుపు = చేయు, పాలన = శాసనము, అంతరంగము = హృదయము)

తలపులలో నా సరస్వతిగా, భోజనం పెట్టడంలో తల్లిగా, తీగలాగా అల్లుకుపోయి తృప్తిని ఇవ్వడంలో ప్రేమకే వ్యాఖ్యానమై, తన హావములలో కుటుంబ రహస్యము పెదవి దాటనీకుండా ఉంటూ, తాను భార్యాబంధంతో నా కవితా హృదయాన్ని శాసిస్తుంది.

281. సీత, కైక, సుమిత్ర, తార - పదాలను ఉపయోగిస్తూ మహాభారతార్థంలో

281.308 తే.గీ. ఒంటరిని, యిసీ! తరుణుని యోర్వఁ, జేసె
కౌరవులు యభిమన్యు నేకైక గుఱిగ,
యత్యయమె సుమి! త్రప వీడి యతనిఁ జంప,
తారకాభికు యంశావతార మతడు.

(ఒంటరి = అసహాయకుడు, ఇసీ = ఛీ, తరుణుడు = పడుచువాడు, ఓర్చు = జయించు, ఏకైక = ఒకే ఒక, గుఱి = లక్ష్యము, అత్యయము = అన్యాయము, సుమి = సుమా, త్రప = సిగ్గు, వీడు = వదలు, తారకాభికుడు = చంద్రుడు, అంశావతారము = దేవతల యొక్క అంశముతో భూమి పై ఉదయించుట)

ఛీ! అసహాయకుడైన పిన్న వయసు వాణ్ణి జయించడానికి, కౌరవులు అభిమన్యుని ఏకైక లక్ష్యముగా చేశారు. అన్యాయం సుమా! సిగ్గు వదిలి అతణ్ణి చంపడం. అతడు చంద్రుని అంశావతారము.

281.309 తే.గీ. కృష్ణు డవతార పురుషుడు, కేశవుండు,
యాతడే సుమి! త్రాతన, శాంతనవుడుౕ,
గని, యిసీ! తగదను పిన్ని తనయుడు శిశు
పాలు కైకాసమును, దూఱె పాండు సుతులు.

(అవతారపురుషుడు = మహాత్ముడు, కేశవుడు = విష్ణువు, సుమి = సుమా అను నిశ్చయార్థకము, త్రాత = రక్షకుడు, శాంతనవుడు = భీష్ముడు, కను = చూచు, ఇసీ = నిందార్థకము, తగు = యుక్తమగు, పిన్ని = చిన్నమ్మ, తనయుడు = కుమారుడు, కైకాసము = వేదన, దూఱు = నిందించు, సుతుడు = కుమారుడు)

శ్రీకృష్ణుడు అవతార పురుషుడు, విష్ణువు, ఆతడే సుమా! రక్షకుడని భీష్మ డనగా, చూచి రోతపడి తగదు అనే చిన్నమ్మ కుమారుడైన శిశుపాలుని వేదనను పాండు కుమారులు నిందించారు.

282. సుయోధనుఁడు, దుశ్శాసనుఁడు, కర్ణుఁడు, శకుని - పదాలను ఉపయోగిస్తూ రామాయణార్థంలో సీసపద్యం

282.310 సీ. దిగ్విజయముఁ జేసి దేవ గణములను
యోడించినట్టి సుయోధనుండు;
విష్ణుభక్తులఁ బట్టి పీడించు క్రమమున
దుశ్శాసనుడుగ ఖ్యాతుడగు నేత;
స్త్రీలౌల్యమున సాహసి; వలదను విభీష
ణుని కకర్ణుడు; సీతనుఁ చెరపట్టి
లంకలో నుంచగ రాముని కోపాగ్ని
కి యపదేశ మగుచు; కృష్ణశకుని

తే.గీ. సైన, సీతకు పరిలోప మన క్షమింప
నట్టి శ్రీరాముని కదన మందుఁ గవిసి
బమ్మయమ్మున వింశతిబాహు డీల్గె
భస్మసింహాసనముఁ గాగ స్వర్ణలంక.

(గణము = సేనలో ఒక భాగము, సుయోధనుడు = అనాయాసంగా యుద్ధం చేయువాడు, పట్టు = నిర్బంధముచేసి గ్రహించు, పీడించు = బాధించు, క్రమము = పైనము, దుశ్శాసనుడు = కఠినమైన శాసనములు చేయువాడు, ఖ్యాతుడు = ప్రసిద్ధుడు, నేత = ప్రభువు, లౌల్యము = చాపల్యము, సాహసి = సాహసికుడు, అకర్ణుడు = చెవిటివాడు, చెరపట్టు = నిర్బంధించు, అపదేశము = కారణము, కృష్ణశకుని = కాకి, పరిలోపము = అపకారము, కదనము = యుద్ధము, కవియు = ఎదిరించు, బమ్మయమ్ము = బ్రహ్మాస్త్రము, వింశతిబాహుడు = రావణుడు, ఈల్గు = చచ్చు, భస్మ = బూడిదె, స్వర్ణ = బంగారు)

దిగ్విజయము చేసి దేవతల సైన్యాలను ఓడించిన మహా వీరుడు, విష్ణు భక్తులని పట్టుకుని బాధించే క్రమంలో కఠినమైన శాసకుడుగా పేరు పొందిన రాజు, స్త్రీలంటే చాంచల్యంలో సాహసికుడు, వద్దని చెప్పిన తమ్ముడు విభీషణుడికి చెవిటివాడు, సీతను నిర్బంధించి లంకలో ఉంచడం వల్ల రాముని కోపమనే అగ్నికి కారణమైన రావణుడు, సీతకు కీడును చూస్తే కాకినైనా క్షమింపలేక తరిమికొట్టిన శ్రీరాముని యుద్ధంలో ఎదుర్కొని, బంగారు లంక భస్మీపీఠము కాగా, బ్రహ్మాస్త్రం చేత చచ్చాడు.

283. హంకార, నంధకార, శ్రీకార, సత్కార అనే పదాలు ఒక్కొక్క పాదంలో

283.311 కం. ఈసు నహంకారములకు
దాసులుగా, నంధకార దష్టులు కాకన్,
హాసముతో శ్రీకారముఁ
జేసిన, సత్కారముల విజేతలఁ జేయున్.

(ఈసు = ఈర్ష్య, అహంకారము = గర్వము, దాసులు = సేవకులు, దష్టులు = కఱవఁబడినవారు, కాకన్ = కాకుండగా, హాసము = నవ్వు, శ్రీకారము = ప్రారంభము, సత్కారము = సన్మానము, విజేత = విజయమును పొందినవాడు)

ఈర్ష్య, గర్వములకు బానిసలుగా చీకటితో బాధితులు కాకుండా, నవ్వులతో ప్రారంభం చేస్తే సన్మానాలతో విజేతలని చేస్తుంది.

284. హర, గణేశ, నంది, కుమార - పదాలతో విష్ణుస్తుతి

284.312 తే.గీ. అహరహ మనుభవము నిచ్చు యన్నిట నిను
చక్రి! గాంచి గణేశభూషణము తోడ
పూజ సలిపి నందించుటే పుణ్య మనెద,
కరుణ చిలుకుమా! రవినేత్ర! కైటభారి!

(అహరహము = ప్రతిదినము, అనుభవము = సుఖదుఃఖాదులను పొందుట, చక్రి = చక్రము ఆయుధముగా కలవాడైన విష్ణువు, కాంచు = చూచు, గణేశభూషణము = సిందూరము, నందించు = హర్షించు, కరుణ = దయ, చిలుకు = చల్లు, రవినేత్రుడు = సూర్యుని నేత్రముగా కలవాడైన విష్ణువు, కైటభారి = కైటభుడను రాక్షసునికి శత్రువైన విష్ణువు)

ఓ, విష్ణుదేవా! ప్రతిదినము సుఖదుఃఖాదులను ఇచ్చే అన్నిటిలోనూ నిన్ను చూసి సిందూరంతో పూజ చేసి సంతోషించడమే పుణ్యమని నేను అంటాను. ఓ, సూర్యనేత్రా! కైటభారీ! నీ దయని నాపై ప్రసరింపజేయమని వేడుకుంటున్నాను.

285. హర, శివ, భవ, కపాలి - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శ్రీకృష్ణుని స్తుతిస్తూ

285.313 తే.గీ. సంకటహర కృష్ణా! కక్కసముల నిన్నుఁ
దలతుము, యనాశి వని విభూతులఁ గొలుతుము,
నిను మరతుము విభవమున్నఁ, గనుక సతము
యంకపాలిపై మముఁ గావ యంకి లిడుము.

(సంకటహర = కష్టములు హరించువాడు, కక్కసము = బాధ, తలచు = ధ్యానించు, అనాశి = నాశము లేని పరమాత్మ, విభూతి = మహిమ, కొలుచు = ఆరాధించు, మరచు = మరిచిపోవు, విభవము = సంపద, సతము = ఎల్లప్పుడు, అంకపాలి = దాది, కాచు = రక్షించు, అంకిలి = ఆపద, ఇడు = ఇచ్చు)

కష్టములు హరించువాడివైన శ్రీకృష్ణా! బాధ లందు నిన్ను ధ్యానిస్తాము. నాశము లేని పరమాత్మవని మహిమలు ఆరాధిస్తాము. సంపద ఉన్నప్పుడు నిన్ను మరచిపోతాము. కనుక, ఎల్లప్పుడూ దాదివై మమ్మల్ని రక్షించడానికి ఆపద ఇవ్వు.

286. హరి, చక్రి, విష్ణు, రామ - పదాలను ఉపయోగించి శివస్తుతిని చేస్తూ

286.314 కం. తపమున విరామ మెరుగని
యపర్ణ ననురాగ లహరి యందుంచన్, కం
తు పదడు నీచక్రియ యను
యపోహ నడ్డు, ప్రభవిష్ణు వభవుకు ప్రణతుల్.

(విరామము = విశ్రాంతి, ఎరుగు = తెలియు, అపర్ణ = ఆకు లయినా భుజింపక అనేక వేల సంవత్సరములు రుద్రుని కూర్చి తపము ఆచరించిన పార్వతి, అనురాగము = ప్రేమ, లహరి = తరంగము, కంతుడు = మన్మథుడు, పదడు = భస్మము, నీచక్రియ = నీచమైన పని, అపోహ = తప్పుటూహ, అడ్డు = నిరోధించు, ప్రభవిష్ణువు = సమస్తాన్ని సృష్టించేవాడు, అభవుడు = శివుడు, ప్రణతి = నమస్కారము)

తపస్సులో విశ్రాంతి ఎరుగని పార్వతీదేవిని ప్రేమ తరంగంలో ఉంచడానికి మన్మథుని భస్మము నీచమైన పని అనే అపోహను నిరోధించే సమస్త సృష్టికర్తయైన శివునికి నమస్కారాలు.

287. హరి, మాధవ, కేశవ, అచ్యుత - పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ శివుని స్తుతిస్తూ

287.315 తే.గీ. విష్ణుపది లహరి వడిని విశ్వగంధ
యోపదని, యుమాధవ! జట నాఁపి, నిత్య
మచ్యుతమగు తరంగిణి నందఁజేయు,
యిందుమౌళి! గుడాకేశ! వందనమ్ము.

(విష్ణుపది = విష్ణుపాదమే పుట్టుకకు కారణముగా కలిగిన గంగా నది, లహరి = ప్రవాహము, వడి = వేగము, విశ్వగంధ = భూమి, ఓపు = సహించు, ఉమాధవుడు = పార్వతి భర్త, జట = జడ, ఆపు = ఆగునట్లు చేయు, నిత్యము = శాశ్వతము, అచ్యుతము = నాశములేనిది, తరంగిణి = నది, ఇందుమౌళి = చంద్రశేఖరుడైన శివుడు, గుడాకేశ = నిద్రను వశపరచుకొన్నవాడైన శివుడు, వందనము = నమస్కారము)

ఓ పార్వతీ నాథా! చంద్రశేఖరా! నిద్రను వశపరచుకొన్న శివా! విష్ణుపాదమే పుట్టుకకు కారణముగా కలిగిన అమరతటిని, గంగా నది ప్రవాహవేగాన్ని భూమి భరించలేదని నీ జటతో ఆగేటట్లు చేసి శాశ్వతము, నాశములేనిది యైన నదిని అందించిన నీకు నమస్కారము.

288. హరిహరి, గిరిగిరి, సరిసరి, సిరిసిరి - పదాలతో పద్యం

288.316 చం. హరి! హరి! యంచు నీ సుతు డహర్నిశ మర్చన నేర్పి నంత, యూ
గిరి గిరిఁ దప్పి శిష్యు లిటఁ గేరి గురూత్తములైన మమ్ములన్,
సరి! సరి! విద్య సాగదు, నిశాచర బాలురు భక్తి తోడ డా
సిరి సిరిగేస్తుఁ గానఁ, జన శిష్టిని యిమ్ము, హిరణ్య రాక్షసా!

(సుతుడు = పుత్రుడు, అహర్నిశము = ఎల్లప్పుడును, అర్చన = పూజ, అంత = అనంతరము, ఊగు = ఊగులాడు, గిరి = నియమము, కేరు = పరిహసించు, సరి = అంగీకారార్థము, సాగు = జరుగు, నిశాచరుడు = రాక్షసుడు, డాయు = సమీపించు, సిరిగేస్తు = విష్ణువు, కాన = కనుక, చన = వెళ్ళుటకు, శిష్టి = ఆజ్ఞ)

ఓ, హిరణ్యకశిపుడను రాక్షసా! హరీ హరీ అంటూ నీ పుత్రుడైన ప్రహ్లాదుడు నిత్య అర్చనని నేర్పగానే, ఇక్కడ శిష్యులు గొప్ప గురువులమైన మమ్మల్ని పరిహసించి నియమము తప్పి ఊగారు. సరే! సరే! చదువు ఇంకా సాగదు. రాక్షస బాలకులు భక్తితో విష్ణువుని సమీపించారు కావున మాకు వెళ్ళడానికి ఆజ్ఞ ఇవ్వు.

289. హస్త, చిత్త, స్వాతి, మూల - పదాలను అన్యార్థంలో ఉపయోగిస్తూ షడ్రసోపేత భోజనాన్ని వర్ణిస్తూ

289.317 తే.గీ. స్వస్థత కభయ హస్తము సర్వ ప్రజకు
షడ్రసోపేత భోజ నాస్వాద చిత్త
మనుచు స్వాతిశయము చెడ్డ దనుచు బుధులుఁ
జెప్పిన యమూల్య వాక్కులె సిరుల మూట.

(స్వస్థత = ఆరోగ్యము, అభయహస్తము = భయము లేదని సూచించు హస్తము, సర్వ = అందరు, ప్రజ = జనము, షడ్రసోపేత = ఆరు రసములతో (ఒగరు, తీపి, ఉప్పు, కారము, చేదు, పులుపు) కూడుకొన్న, ఆస్వాద = అనుభవించుట, చిత్తము = మనసు, స్వ = తన, అతిశయము = ఆధిక్యము, బుధుడు = విద్వాంసుడు, అమూల్య = వెల లేని, వాక్కు = మాట, సిరి = సంపద)

సర్వ జనులకు ఆరోగ్యానికి అభయహస్తము ఆరు రుచులతో కూడుకొన్న భోజనాన్ని ఆస్వాదించే మనసు అనీ, తనే గొప్ప అనుకోవడం మంచిది కాదనీ విద్వాంసులు చెప్పిన అమూల్యమైన మాటలే సంపదల మూట.

290. హాయ్, హలో, గుడ్, బై - పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో

290.318 తే.గీ. తెమ్ము! సౌగంధికము, హాయి నిమ్ము! యనుచు
వారిరుహలోచనగు కృష్ణఁ గోర, భీము
డరిగి, గుడ్డుకుడిచె నట హనుమఁ ద్రోవ
నడ్డ, తనదు బైజకు తానె యంగలార్చి.

(సౌగంధికము = చెంగలువ, హాయి = సుఖము, వారిరుహలోచన = స్త్రీ, కృష్ణ = ద్రౌపది, అరుగు = వెళ్లు, గుడ్డుకుడుచు = పొగరుబోతుతనము యొక్క ఫలితము ననుభవించు, అట = అక్కడ, అడ్డు = అడ్డగించు, బైజ = అజ్ఞానము, అంగలార్చు = భీతిచే అఱచు)

సౌగంధిక పుష్పము తీసుకొని రమ్ము, సుఖము నిమ్ము, అని స్త్రీయైన ద్రౌపది కోరగా, భీముడు వెళ్ళి, హనుమంతుడు తన మార్గాన్ని అడ్డగించగా, తన అజ్ఞానానికి తానే భయంతో అఱచి తన పొగరుబోతుతనానికి ఫలితము అనుభవించాడు.

291. హేమ, కాంచన, అపరంజి, స్వర్ణ - పదాలను బంగారం అనే అర్థంలో కాకుండా ప్రయోగిస్తూ సంక్రాంతి నాటి ఉషోదయంలో సూర్యకిరణ శోభ వర్ణన

291.319 మ. తపనుం డొచ్చుటఁ దెల్పె లోకమున కూతన్ స్వర్ణచూడంబు, గ్రా
మ పురంధ్రుల్ ఘన స్వాగతమ్ము! జయహే! మర్కా! యనెన్ ముగ్గులన్,
యుపరక్తుండయి కాంచ నందమును భావోద్దీప్త సంక్రాంతికిన్
యపరం జిచ్చరకంటిఁ జేరె, నుదయంబందున్ మయూఖద్యుతిన్.

(తపనుడు = సూర్యుడు, తెల్పు = తెలియజేయు, లోకము = ప్రపంచము, కూత = అరుపు, స్వర్ణచూడము = కోడి, గ్రామము = ఊరు, పురంధ్రి = కుటుంబమును పోషించు స్త్రీ, ఘన = గొప్ప, మర్కుడు = సూర్యుడు, ఉపరక్తుడు = వ్యసనార్తుడు, కాంచు = చూచు, భావ = భావము, ఉద్దీప్త = ప్రకాశింపబడ్డది, సంక్రాంతి = మకర సంక్రమణము, అపర = పార్వతి, చిచ్చరకంటి = శివుడు, చేరు = సమీపించు, ఉదయము = ప్రాతఃకాలము, మయూఖము = కిరణము, ద్యుతి = కాంతి)

కోడి తన కూత ద్వారా సూర్యుని రాకను ప్రపంచానికి చెప్పింది. ఊళ్ళో ఉన్న స్త్రీలు తమ ముగ్గులతో ఓ సూర్యుడా! నీకు జయము, ఘన స్వాగతము అని అన్నారు. భావోద్దీప్తమైన ఆ సంక్రాంతికి ప్రాతఃకాల కిరణాల కాంతిలో అందాన్ని చూడడానికి వ్యసనార్తుడైన శివుడు పార్వతిని కూడాడు.

291.320 తే.గీ. కాంచ నవలలు కైసేయు కాంచని పస,
స్వర్ణచూడపు కొక్కొరో క్వణముఁ దోడ,
ప్రత్యుష రుచులె విష్టప రంజితముగ,
మకర సంక్రమణము హేమమాలిఁ జేసె.

(కాంచు = చూచు, నవల = స్త్రీ, కైసేయు = అలంకరించు, కాంచని = పసుపు, పస = అందము, స్వర్ణచూడము = కోడి, క్వణము = ధ్వని, తోడ = వెంబడి, ప్రత్యుష = ప్రభాతము, రుచి = సూర్యకిరణము, విష్టప = లోకము, రంజితము = సంతోషము కలిగించునది, మకర = మకర రాశి, సంక్రమణము = సూర్యు డొక రాశి నుండి మరియొక రాశికి ప్రవేశించుట, హేమమాలి = సూర్యుడు)

కోడి చేసే "కొక్కోరో" అనే ధ్వనితో పాటు స్త్రీలు అలంకరించే పసుపు అందాన్ని చూడడానికి ప్రభాత సూర్య కిరణాలు ప్రపంచానికి సంతోషము కలిగించేటట్లుగా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించాడు.



పేరు :	మద్దాలి వేంకట సత్య రంగనాధం
పుట్టిన తేదీ :	25-09-1958
జన్మస్థలం :	చిరువోలు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
విద్యార్హతలు :	M.Sc; BL
విద్య నభ్యసించిన విద్యా సంస్థలు :	జిల్లా పరిషత్ హైస్కూలు, మోపిదేవి; శాతవాహన కళాశాల, విజయవాడ; ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
వృత్తి / అనుభవం వివరాలు :	భారతీయ సాంఖ్యక సేవ (Indian Statistical Service) సభ్యునిగా కేంద్ర ప్రభుత్వంలో 36 సంవత్సరాలకు పైగా అనుభవం; సెప్టెంబరు 2018లో డైరెక్టర్ జనరల్ గా సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీసులో (ఢిల్లీ) పదవీ విరమణ
ప్రస్తుత వ్యాసంగం :	తెలుగు సాహిత్యం చదవడం, వ్రాయడం; సమకాలీన సమస్యలు విశ్లేషించి ప్రభుత్వాలకు, అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం
కుటుంబ వివరాలు :	భార్య: కామేశ్వరి; కుమారుడు: భారత్; కుమార్తె: స్వాతి; కోడలు: కోమల్; మనుమరాలు: ఈరా
గత ప్రచురణలు :	శ్రీరాముని అంతరంగము (Paperback & E-book) in July 2025
బ్లాగు వివరాలు :	https://mvsranganadham.in/

ISBN 978-93-343-7490-2
9 789334 374902